జిల్లెళ్ళమూడి అమ్మ

నా అనుభూతులు - అనుభవాలు



- బెల్లకొండ దినకర్



రచయిత బెల్లంకొండ దినకర్, సరోజిని గార్ల వివాహసందర్భమున
రచయితకు కుడివైపున తల్లిదండ్రులు బెల్లంకొండ యశోదమ్మ, వెంకట రంగయ్య
రచయితకు ఎడమవైపున అత్తమామలు సూరిశెట్టి మీనాక్షమ్మ, వెంకటస్వామి గార్లు

అం ఆ

జిల్లెళ్ళమూడి అమ్మ

నా అనుభూతులు, అనుభవాలు



రచన

బెల్లంకొండ దినకర్

ఫోన్ : 27114255

సెల్ : 9441261626

ప్రథమ ముద్రణ : 2013

ప్రతులు : 1000

ప్రచురణ మరియు ప్రతులకు :

శ్రీ విశ్వజననీ పరిషత్,

జిల్లెల్లమూడి, బాపట్లమండలం,

గుంటూరు జిల్లా - 522 113.

వెల : అమూల్యం

ముద్రణ : శ్రీ లక్ష్మీ గణపతి ఆర్ట్ ప్రింటర్స్

2/4 బ్రాడీపేట, గుంటూరు-2.

ఫోన్ : 0863-2235036.

విషయసూచిక

ముందుమాట



అమ్మ విశ్వజనని. అంటే విశ్వానికే జననియని సామాన్యార్థంకానీ విశ్వమే తానైయున్న జనని యని విశేషార్థం. 'సృష్టినాది అనాది' అన్న అమ్మకు భిన్నమైనదేదీ యుండదు 'సర్వం ఖల్విదంబ్రహ్మ' చరాచర జగత్తంతా అమ్మ స్వరూపమై యున్నది. జడములోనూ చైతన్యాన్ని చూడగలిగిన అమ్మ, సర్వులనూ తన బిడ్డలుగా, అవయవాలుగా చూస్తున్న అమ్మ మానవిగా కనపడుతున్న మాధవియే. అమ్మ ఏమన్నదంటే - 'నేను మీలోదైవాన్ని చూస్తున్నాను, మీరు నాలో మానవత్వాన్ని చూస్తున్నారు', 'మీరుకానిది నేనేమీకాదు', 'మీరంతా నేనే, మీదంతానేనే', 'అన్ని నేనులు నేనైననేను', 'అమ్మ అంటే జిల్లెల్లమూడిలో ఉన్న నాలుగడుగుల శరీరాకృతి మాత్రమే కాదు'.

ఇలా అమ్మ నోటి నుండి వెలువడిన దివ్యవాక్యాలను బట్టి సర్వముతో అమ్మకుగల తాదాత్మ్యత మనకవగతము కాగలదు. అమ్మకు దేవుళ్ళూ, దేవతలు కూడా బిడ్డలే. 'తొలియేతల్లి' అని అమ్మే నిర్వచించింది. కనుక అనంత చైతన్యరూపమే అమ్మ, ఆది పరాశక్తియే అమ్మ. ఆద్యంతములు లేనిదీ, అన్నిటికీ ఆధారభూతమైనదే అమ్మ. అన్నీ తానేయై అన్నిటికీ అతీతంగా కూడా ఉండేదే అమ్మ. అదే 'అంఆ' అంటే .అమ్మను ఇది అది యని నిర్వచించలేము. తనకు తానుగా ఎవరెవరి కే యే విధంగా కనబడాలనిపిస్తే లేక అనుభూతినివ్వాలనిపిస్తే వారివారి కాయా విధంగా కనబడుతుంది లేక అనుభూతమవుతుంది. ఈ కనబడడం లేక అనుభూతం కావడమన్నది వారివారి సాధనవల్లగావచ్చు. వారి వారి సంస్కారంవల్లగావచ్చు, ఒక్కొక్కసారి

ఏకారణంలేకుండానే అమ్మ మనపై కురిపించే అపారకృపవల్ల గావచ్చు. ఇది కుల, మత, దేశ, కాలాల కతీతంగా ఉంటుంది. (ఇక్కడ 'మనము' అంటే కేవలం మానవులమేనని కాదు, సమస్త జీవజంతుజాలమూ సమాహితమై యుంటుంది).

అనంత చైతన్యస్వరూపమూ, కాలస్వరూపమూ, ఆదిపరాశక్తీ తనమాతృప్రేమను జగత్తుకు పంచి, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని వ్యావహారికంగా పరిఢవిల్లజేసి దివ్యపరిణామ క్రమంలో మానవుడు తన ధ్యేయాన్ని చేరే వేగాన్ని పెంచుకొనుటకై అమ్మగా దేహధారణజేసి ఒక మానవిగా మన మధ్యే ఒక కాలపరిమితిలో అంటే 1923 నుండి 1985 సం॥ వరకు సంచరించి భౌతికంగా తన దర్శన, స్పర్శన, సంభాషణల భాగ్యాన్ని కలిగించడమే గాక ఎన్నో ఆధ్యాత్మిక అనుభూతులను మనకు కలిగించడం మన అదృష్టం. అంతేగాక మనహృదయమందిరాల్లో స్థిరంగా ఉండి నిరంతరమూ మనల్ని ప్రేరేపిస్తూ, నడిపిస్తూ, రక్షిస్తూ ఉండడం అమ్మ విశేషకృపకు నిదర్శనం.

మన రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి, అలాగే మనదేశంలోని యితర రాష్ట్రాలనుండేగాక విదేశాలనుండి కూడా కేవలం అమ్మ కృపా కటాక్షాలవల్ల అమ్మ దర్శనార్థమై జిల్లెళ్ళమూడి వచ్చేవారు, ఇప్పుడూ వస్తున్నారు, ఇక ముందుకూడా వస్తూనే ఉంటారు. అలా అమ్మ దగ్గరకు వచ్చిన, వస్తున్న సోదరీ సోదరులందరి అనుభూతులకు, అనుభవాలకు అక్షర రూపమివ్వాలంటే సాధ్యంకాదు. ఎందుకంటే అలాచేయడానికి కొన్ని లక్షల గ్రంథాలైనా సరిపోవు.

అమ్మ చూపిన లేక చేసిన మహిమలు గానీ, మనకిచ్చిన అనుభూతులు గానీ అప్పటికవి మహిమలుగా అనిపించక సాధారణంగానే కనిపించినా మన హృదయపులోతుల్లోకి చేరి కాలక్రమేణా మనల్ని సంస్కరించేవిగా, మనకు దిశానిర్దేశం చేసేవిగా ఉండేవి. అమ్మ చెప్పిన మాటలు కూడా కేవలం ఆయా సందర్భాలకే పరిమితంగాక


వేదవాక్కులవలె నిత్య సత్యాలుగా నిరంతరమూ మనకు ఉపకరిస్తూ మార్గదర్శకంగా ఉంటాయి.

ఒక సందర్భంలో "మాటల్లో చెప్పాలంటే సత్యం మరుగున పడుతుంది''అని అమ్మ అన్నది. కనుక నా అనుభూతులను, అనుభవాలను అక్షర బద్ధం చేయడానికిప్పటివరకూ సాహసించలేదు. కానీ గోపాలన్నయ్య గారి "అమ్మసన్నిధిలో నా అనుభూతులు - జ్ఞాపకాలు" అన్న పుస్తకం పఠించిన తర్వాత నా అనుభూతులు, అనుభవాలను కూడా జిల్లెళ్ళమూడికి వచ్చే సోదరీసోదరులతో పంచుకోవాలనే ప్రేరణ కలగడం వల్ల, నా సాధనకు ఉపకరిస్తుందనే స్వార్థం వల్ల యీ పుస్తకం వ్రాయడానికి పూనుకుంటున్నాను. అన్నిటికీ ఆధారం అమ్మేగనుక, ప్రేరణకూడా అమ్మ యిచ్చిందే గనుక, అమ్మ చెప్పిన అన్ని 'నేనుల'లో నేనూ మీ సోదరులలో ఒకడిని గనుక నా ప్రయత్నాన్ని మీరంతా సమాదరిస్తారని భావిస్తున్నాను. నేను పండితుడను కానందున అక్షర, అభివ్యక్తి దోషములేవైనా ఉన్నయెడల సహృదయంతో మన్నింతురుగాక !

- బెల్లంకొండ దినకర్



అమ్మకే అంకితం



నన్నొక ఉపకరణంగా చేసుకొని తన దివ్యప్రేరణతో నన్ను నిరంతరమూ నడిపిస్తూ, నాకెన్నో దివ్యానుభూతులను, జీవితానుభవాలను ప్రసాదించిన అమ్మ దివ్య చరణాలకే యీ అక్షర సుమాలను సమర్పిస్తున్నాను.

బి. దినకర్

కృతజ్ఞతలు

ఈ గ్రంథరచనకు నన్ను ప్రోత్సహించడమేగాక దీని ప్రచురణకు నాకు ఆర్థిక సహాయ సహకారముల నందించిన సోదరీ సోదరులు, సాహితీప్రియులు

1) శ్రీమతి జె. గాయత్రి, హైదరాబాద్
2) శ్రీమతి పి. వనజ, హైదరాబాద్
3) శ్రీ కె. మహేశ్, హైదరాబాద్
4) శ్రీ వి. ధర్మసూరి, హైదరాబాద్
5) శ్రీ ఆర్. ఎమ్. మోహనరావు, గుంటూరు
6) శ్రీ వై. బలరామయ్య, గుంటూరు

గార్లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఈ గ్రంథాన్ని సుందరంగా ప్రచురించడానికి తోడ్పడిన సోదరులు శ్రీ పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్ గారికి, శ్రీ లక్ష్మీగణపతి ఆర్ట్ ప్రింటర్స్, గుంటూరు వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను.

వీరందరికి వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించ వలసిందిగా విశ్వజనని జిల్లెళ్ళమూడి అమ్మను ప్రార్థిస్తున్నాను.

బి. దినకర్

ఇది అనుభూతులతో కూడిన స్వీయచరిత్ర



పురుషోత్తమపుత్ర భార్గవ
శ్రీ పి.యస్.ఆర్ ఆంజనేయ ప్రసాద్
విశ్వజనని సంపాదకులు - శ్రీనాథపీఠ సంచాలకులు

సోదరుడు దినకర్ గుంటూరులో చాలా సంవత్సరాలు టెలికం డిపార్టుమెంట్‌లో పనిచేశాడు. 1974 చివరిలో జిల్లెళ్ళమూడి వెళ్లి అమ్మను దర్శించాడు. నేను 1958 నుండి జిల్లెళ్ళమూడి అమ్మవద్దకు వెళుతున్న వాడ్ని. దాదాపు రెండు దశాబ్దాలపైచిల్కు. దినకర్ గుంటూరులో ఉన్నా అతనితో నా అనుబంధం కించిన్మాత్రమే. అతడు నేనూ అమ్మ కుటుంబంలో సభ్యులుగా అప్పుడప్పుడు కలుసుకొనేవారమే. కాని అతడింత రచనా సామర్థ్యం కలవాడని నాకు తెలియదు.

ఆ అనుబంధంతో అతడు అరవింద సొసైటీలో సభ్యుడని ఆ సాహిత్యం అధ్యయనం చేశాడని తెలుసుకున్నాను. ఈ గ్రంథంలో కూడా దాని చాయలు కనిపించకపోలేదు. ఎందుకంటే, ఇతడు ఉపయోగించే అతిచేతన, ఋతుచేతన, సత్యచేతన, పరిపూర్ణమానవుడు, అతిమానవుడు(సూపర్‌మాన్), సకారాత్మకప్రేరణ, వ్యక్తిగత చేతన, విశ్వగతచేతన, విశ్వాతీతచేతన ,దివ్యజీవనము వంటి పదాలు ఈ రచనలో కూడా కనిపించాయి.

ఒకసారి 1968లో హైమ ఆలయంలో చేరినపుడు రవి మనస్సు బాగా ఆ ఆలోచనలలో పడి నలిగి క్లేశాన్ని అనుభవిస్తున్నప్పుడు అమ్మ నన్ను, గోపాలన్నయ్యను రవి వెంట సుందరరామిరెడ్డి గారితో నెల్లూరు పంపించింది. కొంత మనశ్శాంతి కలుగుతుందని రెడ్డిగారు మమ్మల్ని సూతాశ్రమం, రమణాశ్రమం, అరవిందాశ్రమం తీసుకెళ్ళారు. అరవిందా శ్రమంలోని ఆఫీసులో మేనేజరు ఒక రెడ్డిగారు అమ్మను గూర్చి అడిగారు. గోపాలన్నయ్య అతిమానవుడు,

దివ్య మానవుడు అనే శబ్దాలు లుపయోగించకుండా అమ్మ అంతా అదే(చైతన్యమే) అది తప్పవేరే లేదు. అసలు వాడే, అందరుగా వచ్చాడు. మానవుడు ఎప్పుడూ పరిపూర్ణుడే. అందరికీ సుగతే అని అమ్మ చెప్పిన సిద్ధాంతాలను చెప్పాడు. సరే ఆ సంభాషణ ఏదో అలా సాగి ఆగిపోయింది.

సామాన్యంగా తల్లిదండ్రుల ప్రభావం పిల్లల మీద పడుతుంది. రచయిత శ్రీదినకర్ నాన్నగారు బెల్లంకొండ వెంకట రంగయ్యగారు ప్రముఖ ఆచరణవాదియైన కమ్యూనిష్టు. నాస్తికవాదియైన శ్రీగోరా (గోపరాజు రామచంద్రరావు) గారి కూమారుడు లవణంతో కలిసి చదువుకున్నాడు. అటువంటి తండ్రికి తనయునిగా ఆయన ప్రభావం కుమారుని మీద పడాలి. కాని అలా కాలేదు. పైగా యం.ఎ. విశాఖలో చదువుతున్నపుడు గోరాగారు నాస్తిక వాదంపై ప్రసంగించింతర్వాత వారి వద్దకు వెల్లి ఏది సత్యమో ఏది నిత్యమో దానిని దేవుడు అంటే తప్పేమిటి? అని వాదించారు. అపుడు గోరాగారు దేవుడు అనే పేరుతో మోసం చేసేవాళ్లను నిరసిస్తాను. మూఢవిశ్వాసాలకు వ్యతిరేకిని. నీ ఆలోచనాతీరు సరియైనదే అన్నారుట. అలా ఆధ్యాత్మిక చింతన వైపు మళ్ళారు దినకర్‌గారు.

నిజానికి ఈ గ్రంధానికి "జిల్లెళ్ళమూడి అమ్మ నా అనుభూతులు, అనుభవాలు" అని ఎందుకు పేరు పెట్టాడా? అనిపించింది నాకు. ఎందుకంటే నిజానికి గ్రంథమంతా అతని స్వీయచరిత్ర. అతని జీవిత పరిణామాలు. ఒదుదుడుకులను తట్టుకొని తనలోని లోపాలను సర్దుకుంటూ అంతర్మథనంతో ఏలా పైకి వచ్చింది తెలియచేసే గ్రంథమిది. అయితే అంతర్లీనంగా ఆధ్యాత్మిక భావన అతనిని ఒక సన్మార్గంలో ఉంచింది. అది అమ్మ అనండి, అరవిందుడు అనండి, శ్రీమాత అనండి, సాయిబాబా అనండి, కాసిరెడ్డి నాయన అనండి, గొలగమూడి వెంకయ్యస్వామి అనండి, సత్యసాయిబాబా అనండి ఎవరైనా ఒకటే అనే భావం దినకర్‌లో బాగా నాటుకొని ఉన్నది అనిపిస్తుంది.

దినకర్ మంచి యోగాభ్యాసం చేసినవాడా? ధ్యానసిద్ధిని పొందినట్లు కొన్ని నిదర్శనాలు కనిపిస్తున్నాయి. "నేను నా శరీరాన్నుండి విడివడి నా శరీరానికి మూడు నాలుగడుగుల ఎత్తులో సూక్ష్మశరీరంతో గాలిలో తేలుతూ

ఉండడం గమనించాను" అని వ్రాశాడు. ఇది గొప్ప హఠయోగ సిద్ధులకు గాని సాధ్యం కాని విషయం. శ్రీ ప్రసాదరాయకులపతి తరుణవయస్సులో ఈ హఠయోగసాధన చేసి (రచయిత దినకర్ పొందిన) అనుభవాన్ని పొందినట్లు వారి రచనలో (కుర్తాళయోగులు) కనిపిస్తున్నది.

దినకర్ రచనలో అక్కడక్కడ సోదరులు ఎక్కిరాల భరద్వాజ, తంగిరాల కేశవశర్మ తొంగి చూచారా అనిపించింది. "అమ్మతో మౌనసంభాషణం" అనే శీర్షికలో మొదటి పేరా చదవండి. అచ్చం భరద్వాజదా అనిపిస్తుంది.

"నేను ధ్యాసపెట్టి అమ్మ యితరులతో మాట్లాడే మాటలు వినేవాడిని. వాటిలో నా సమస్యకు పరిష్కారం లభించేది. నా ఆధ్యాత్మిక సందేహాలకు అమ్మ చూపుల్లో మాటల్లో సమాధానాలు లభించేవి. ఒక్కొక్కసారి నాలోనే భావపరంపర మొదలై విశ్లేషణాత్మక సమాధానాలు లభించేవి. ఒక్కొక్కసారి అమ్మ తన చూపుల్తోనే అన్నపూర్ణాలయంలో భోజనం చేసి వస్తున్నావు కదా! యని నన్ను పలుకరించడం గానీ లేక భోజనం చేసి రమ్మని సూచించడం గానీ చేసేది. అమ్మ సన్నిధిలో నిశ్చల నీరవతాస్థితి చేకూరి ప్రశాంతమనస్కుడ నయ్యేవాడిని."

ఇలాగే దినకర్‌లో నిజాయితీని చూచి కేశవశర్మ జ్ఞాపకాని కొచ్చాడు. గాంధీగారు తన స్వీయచరిత్రలో సత్యకథనం వ్రాశాడని విన్నాను. అలాగే కేశవశర్మ కూడా తన లోపాలను అమ్మకు, లోకానికి కూడా విన్నవించిన సందర్భాలెన్నో ఉన్నాయి. దినకర్ యౌవనంలో క్రొత్తగా ఉద్యోగం చేస్తున్న రోజులలో బ్రహ్మచారిగా ఏదో ఒక గదిలో ఉన్నపుడు ప్రక్కింటి గృహిణికి కన్నుకొట్టుట చేశాడు. దానికి ఎంతో పశ్చాత్తాపపడ్డాడు మథనపడ్డాడు. అమ్మ దయతో దెబ్బలు తినకుండా బయటపడ్డాడు. కాని యీ విషయం చెప్పాలా? మనం ఎవరమైనా చెపుతామా? యౌవనంలో 99% మంది ఇలాంటి చేష్టలు చేసినవారే. అయితే బయటపడరు. ఎవరికీ చెప్పరు. తను చెప్పాడు నిజాయితీగా. ఇది అతని నిష్కల్మష వ్యక్తిత్వానికి నిదర్శనం. మచ్చుకి అతని రచనా విశేషానికి, వ్యక్తిత్వానికి సంబంధించిన ఈ రెండు సంఘటనలు చాలు.

విచిత్రమేమిటంటే రచయితకు స్వప్నానుభూతులు కోకొల్లలు. ఈ గ్రంథంలో అవి ఎన్నో చోట్ల కనిపిస్తవి. అతనికి మార్గదర్శనం చేస్తూ ఉంటవి. వాటి జోలికి నేను పోను. తరువాత అతడు ఏ పనిచేసినా, ఎక్కడకు వెళ్లినా, ఆఖరుకు ఇబ్బందికర పరిస్థితిలో రైలులో బెర్త్ దొరికినా అమ్మ ఏర్పాటు చేసిందే అని నమ్మే వ్యక్తి. ఇవన్నీ వ్యక్తిగత మైనవి. సార్వత్రికము, సార్వకాలికమైన విషయాలే. నలుగురికీ ఆదర్శనీయమైనవి అని వాదంచేసేవారున్నారు. కాని మహిమలకు లొంగినంతగా సిద్ధాంతానికీ తాత్వికతకు లొంగటం కష్టం. ప్రజల మానసికస్థితి అతి సామన్యమైనది. అందుకే చాలామంది తమ మహిమలు ప్రచారం చేసుకొని ప్రజలపై బ్రతుకుతున్నారు. అమ్మ మహిమల నంగీకరించదు. నీకు అది జరిగే సమయం వచ్చింది జరిగింది, నా ప్రమేయం ఏమీ లేదు అని నిర్ద్వంద్వంగా ఖండించేది. అయితే అవి వ్యక్తి యొక్క విశ్వాసం బలపడటానికి ఉపయోగపడతాయనేది సత్యం.

గ్రంథంలోకి పోయి చెప్పటం మొదలుపెట్టితే మళ్లీ అదే ఒక గ్రంథం ఔతుంది. రచయిత చివరలో "అమ్మ తత్త్వాన్ని" గూర్చి చెప్పటానికి ప్రయత్నించాడు. అలాగే "అమ్మకు నా ప్రార్థనలు" అని సుదీర్ఘమైన ఒక రచన చేశాడు. అది చూస్తే రచయితపై వివిధ మార్గాల ద్వారా లభ్యమైన భావ విశ్లేషణ, తాత్విక చింతన, ప్రధానంగా అరవిందుల ప్రభావం చాలా స్పష్టంగా కనిపిస్తుంది. "అమ్మా! విశ్వజననీ నీ ఒడిలో ఆనందంతో, కేరింతలతో క్రీడించే దివ్య శివువులమై ఉందుముగాక! మమ్ము మేము నీ దివ్యచరణాలకు అర్పించుకొను పర్యంతమూ మమ్ము కాపాడి రక్షించుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాము" అంటారు. రక్షణే అమ్మ. మనం ప్రార్థించేదేముంది? అమ్మ బాధ్యత అది.

ఇక ఇంకొక్కమాట కూడా చెప్పాలి. ఈ గ్రంథంలో ఈ స్వీయచరిత్రతో పాటు కొన్ని "వచన కవితల" పేరుతో ఉన్నాయి. అందులో ఒక ఆంగ్లరచన కూడా ఉన్నది. సంతోషం. రచనకు భావ వ్యక్తీకరణ ప్రధానంగాని నిర్దుష్టమైన భాషే ప్రధానం కాదు. ఇందులో భాషాదోషాలను ఎవరూ లెక్క చెయ్యరు. అందరం అందరింటి సోదరీ సోదరులమే, విశ్వకుటుంబ సభ్యులమే.

శ్రీదినకర్‌గారి ఈ రచన చూచింతర్వాత నా కనిపించింది. అమ్మ వద్దకు వచ్చిన సోదరీసోదరులంతా అమ్మతో తమ అనుభవాలు వివరిస్తే, అమ్మ తమ తమ జీవితాలను ఎలా తీర్చిదిద్దిందో తెలియజేస్తే కొన్ని వేల గ్రంధాలైనా అద్యతన భావిలో రాగలవనే విశ్వాసం బలపడింది.

మాతృశ్రీ పత్రికను 1966లో ప్రారంభిస్తున్నపుడు నాన్నగారు రామకృష్ణ అన్నయ్యతో ఒక వ్యక్తిని గూర్చి ప్రతినెలా ఏమి వ్రాస్తారురా? అన్నారు. అప్పుడు రామకృష్ణ "చూసే కన్ను - వ్రాసే పెన్ను ఉంటే ఎంతకాలమైన ఎన్నైనా వ్రాయవచ్చు "అన్నాడు. ఈనాడు చూస్తుంటే ఇప్పటికి చిన్నా పెద్ద గ్రంధాలు రెండు వందులకు పైగా చాలా భాషలలో వచ్చాయి. వస్తున్నాయి.

నాన్నగారి శతజయంతి సందర్భంగా అమ్మ కిష్టమైన నాన్నగారికి నా "శ్రీవిశ్వజననీ వీక్షణం" అంకితం చేశాను. దినకర్ నాన్నగారి శతజయంతిలో నాన్న గారికిష్టమైన అమ్మకు "జిల్లెళ్ళమూడి అమ్మ నా అనుభూతులు అనుభవాలు" అనే గ్రంధాన్ని అంకితం ఇచ్చాడు. రచయిత దినకర్‌ను అభినందిస్తూ ఇటువంటి రచనలకు ఇది స్ఫూర్తిగా నిలుచుగాక అని కోరుకుంటున్నాను.

(ఫోన్ : 9490643352)

0863- 2353654)

“విశ్వాసమే భగవంతుడు”



ఆర్షవిద్యానిధి, ప్రసన్న వ్యాస
- మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

దైవాన్ని గురించి ఎవరి ఆలోచనలు వారివి ఎవరి అభిప్రాయాలు వారివి. అసలు దేవుడే లేడనే వారు కొందరు. ఆ దేవుడు రాముడని కొందరు, కృష్ణుడని కొందరు, శివుడని కొందరు.... ఇలా రకరకాల నామ రూపాలను మనస్సులో భావించుకొని, దైవాన్ని గురించి అభిప్రాయపడుతూ ఉంటారు.

రక్షణ, శిక్షణ, ధర్మ సంస్థాపన లక్ష్యాలుగా ప్రతియుగంలోనూ తాను “దిగివస్తా”నని “గీత”లో శ్రీకృష్ణుడు వివరించాడు. కనుక, దేవుడి ముఖ్య లక్షణం రక్షణ, శిక్షణ అనిపిస్తుంది మనకు. అలాంటి రక్షణ, శిక్షణలు ఎవరు ప్రసాదిస్తారో, వారినే దైవంగా నమ్ముతూ ఉంటాం మనం. తమ తమ అభిరుచులు, అభీష్టాలకు అనుగుణంగా ఎక్కడి నుంచి తమకు రక్షణ లభిస్తుందో, అక్కడ నమ్మకం ఏర్పడుతుంది. ఆ వ్యక్తినే గురువుగా, దైవంగా మనస్సు నిర్ణయించుకుంటుంది.

మాన్య సోదరులు శ్రీ బి. దినకర్‌గారు తమ అనుభవాలు ఆధారంగా అమ్మనే దైవంగా ఎంచుకుని ఆరాధించారు. తమ జీవితంలో వేర్వేరు సంఘటనల్లో అమ్మనుండి అందుకున్న రక్షణ, శిక్షణలను, ఆ సన్నివేశాల కారణంగా తనలో కలిగిన అనుభూతులను అక్షరరూపంలో ప్రకటించారు. శ్రీ బెల్లంకొండ దినకర్‌గారి అనుభూతికి అక్షరాకృతి ఈ రచన.

మనం మాటలతో చెప్పకుండానే, మన మనస్సులో ఏమి ఉన్నదో తెలుసుకుని, మన అభీష్టానికి అనుగుణంగా ఆ సన్నివేశాన్ని నిర్వహించి, అమ్మ మనపై ఎనలేని వాత్సల్యాన్ని చూపించిన సన్నివేశాలు మనకు అందరికీ అనుభవంలో ఉన్నవే. అమ్మకు సమర్పించే పండ్లు అమ్మ అందరికీ పంచి పెట్టేస్తుంది కాని, అమ్మ స్వయంగా ఆరగిస్తే మనకు ఎంత సంతృప్తి కలుగుతుందో కదా! అని మనం తరచుగా అనుకుంటూ ఉంటాం. ఒక పర్యాయం అలాగే అనుకున్న శ్రీ దినకర్ దంపతుల అభిలాషకు తగినట్లుగా వారిచ్చిన కిస్‌మిస్ పండ్లు తానే స్వయంగా తింటూ “నీకిప్పుడు సంతృప్తిగా ఉందా!” అన్నట్లు తమ వంకచూచిన అమ్మ వాత్సల్యాన్ని, సర్వజ్ఞత్వాన్ని తలచుకుంటూ మురిసిపోయే రచయిత ఈ గ్రంథంలో కనిపిస్తారు.

అలాగే, పుత్రుడు కలగడంలో అమ్మ ఆశీస్సులు, తమ ఇద్దరి (దంపతుల) మనస్సులోని కోరికను అమ్మ ఎదుట వ్యక్తం చేయకపోయినా, ఇద్దరి కోరికలూ కలసి వచ్చేలా తమ కుమారునికి "ప్రేమచంద్" అని పేరుపెట్టిన అమ్మ ప్రేమకు పులకించిన దినకర్ ఆ ఘట్టాన్ని వివరించిన తీరు హృద్యంగా ఉంది.

పెరుగన్నంలో గాజుపెంకు వచ్చినా, తనకు ఏ ప్రమాదమూ కలుగకుండా, ముందుగానే తాను అసంకల్పితంగా ఆ గాజు పెంకును తీసివేసిన సంఘటనలో అమ్మ ఇచ్చిన "నిశ్శబ్దప్రేరణ", బస్సు ప్రయాణంలో పెద్ద ప్రమాదాన్ని తప్పించి అమ్మ ఇచ్చిన "రక్షణ", తేనెటీగల బారి నుండి రక్షణ మొ॥ సన్నివేశాలను శ్రీ దినకర్‌గారు నెమరు వేసుకున్న తీరు చూస్తే, ఆ సన్నివేశాలు ఎవరికివారికి తమ ప్రత్యక్ష అనుభవాలుగా అనిపిస్తాయి.

రక్షణ మాత్రమే కాదు, దారి తప్పిన తన మనస్సును అదుపుచేసి, పశ్చాత్తాపం కలిగించి, అమ్మ తనను సంస్కరించిన వైఖరి, ఆ వేళలో అమ్మ నుండి తాను పొందిన శిక్షణను కూడా దాపరికం లేకుండా నిజాయితీగా ఆవిష్కరించారు ఈ రచయిత.

నాస్తికులు, హేతువాదులు అయిన శ్రీ గోరాగారి కుమారులు శ్రీ లవణంగారు, వారి శ్రీమతి హేమలతగారు జిల్లెళ్ళమూడి వచ్చి, అన్నపూర్ణాలయాన్ని, సహపంక్తి భోజనాలను, సేవాకార్యక్రమాలను, వర్ణ, వర్గరహిత సమసమాజాన్ని అభినందించి ఆనందించిన సన్నివేశాన్ని చక్కగా విశదం చేశారు శ్రీ దినకర్ గారు.

అమ్మ సూక్తులు, వాక్యాలు, వివరణలు జీవితంలోని వివిధ సన్నివేశాల్లో తనకు ఎలా స్ఫురించాయో, వాటి మహనీయతను, సార్వకాలికతను, విశ్వజనీనతను తాను ఎలా గుర్తించ గలిగారో శ్రీ దినకర్‌గారు ఆసక్తి కరంగా వివరించారు.

తాను పొందిన అనుభవాలు తనలో విశ్వాసాన్ని బలపరచి, అమ్మను దైవంగా తాను గుర్తించి ఆరాధించి తరించిన తన అనుభూతులను పదిమందికీ పంచిపెట్టారు ఈ గ్రంథం ద్వారా శ్రీ దినకర్.

తమ అనుభవాలను గ్రంథరూపంలో ప్రకటించి "అందరింటి" సోదరులందరికీ స్ఫూర్తినిచ్చిన శ్రీ దినకర్ గారిని హృదయపూర్వకంగా అభినందిస్తూ వారిపై "అమ్మ" అమృతాశీస్సుమాలు వర్షించాలని ఆకాంక్షిస్తూ

సెలవు

1. అమ్మ ప్రథమ దర్శనం

1974 ఏప్రిల్ మాసంలో టెలికం డిపార్టుమెంటులో గుంటూరులో క్లర్కుగా ఉద్యోగంలోచేరి పనిచేస్తున్న రోజుల్లో కర్ణాకర్ణిగా ఎవరిద్వారానో జిల్లెళ్ళమూడిలో ఎవరో అమ్మ యున్నారని, ఆమె చాలా మహిమాన్వితయని విన్నాను. అప్పటికి నాకు జిల్లెళ్ళమూడి ఫలానాచోట ఉన్నదని గానీ, అక్కడికెలా చేరుకోవాలో దాని వివరాలేమీ తెలియవు. తెలుసు కోవాలన్న ప్రయత్నంకూడా చేయలేదు. కానీ 'అమ్మ' అన్న పేరు విన్ననాటినుండి నాకు తెలియకుండానే నా హృదయంలో ఏదోకదలిక, అమ్మను చూడాలన్న ఆకాంక్ష మొదలైనవి. కానీ జిల్లెళ్ళమూడి ఎక్కడ యున్నది ? ఎలా వెళ్ళాలి? అమ్మను గురించి వివరాలెవరైనా చెప్పగలరా ? అన్న ప్రశ్నలు లీలగా మొదలైనా నేను వాటిని గూర్చి పట్టించుకోలేదు. ఇదిలా ఉండగా అదే సంవత్సరం అక్టోబర్ మాసంలో కర్నూలు నుండి శ్రీ పి.ఎ. జానకీపతిగారనే హెడ్‌క్లర్క్ బదిలీపై మా కార్యాలయానికి వచ్చి జాయినయ్యారు. వారు మా కార్యాలయంలో చేరగానే వారుండటానికి అద్దెగది వెంటనే దొరకక నే నున్న అద్దెగదిలో వారుండటానికి నే నంగీకరించగా యిద్దరమూ ఒకే గదిలో వుండేవారము. వారు ఆధ్యాత్మిక పుస్తకాలు బాగా చదివేవారు. వారి ద్వారా మొదట శ్రీమాతారవిందులను గురించి, పుదుచ్చేరి యందలి శ్రీ అరవిందాశ్రమాన్ని గురించి తెలుసుకోవడం, చిన్నచిన్న ఆధ్యాత్మిక గ్రంధాలను కొన్నింటిని నేను కూడా చదవడం జరిగింది. వారి ద్వారానే గుంటూరు కన్నావారితోట యందుంటున్న ముక్కామల అమరేశ్వరరావుగారి అల్లుడైన శ్రీ బసవరాజు హరికిషన్ రావు గారితో పరిచయం కావడం, హరికిషన్‌రావు గారి ఆధ్వర్యంలో మరికొంతమందిమి కలిసి శ్రీఅరవిందాశ్రమ కేంద్రాన్ని గుంటూరులో స్థాపించడం జరిగింది. అది యిప్పుడు బాగా అభివృద్ధిచెంది పుదుచ్చేరి, శ్రీ అరవిందాశ్రమానికి అనుబంధమైన శాఖగా జిల్లాపరిషత్ ఆవరణలో ప్రభుత్వం కేటాయించిన 1200 చ.గ. స్థలంలో కట్టబడిన భవనంలో పనిచేస్తూ ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేంద్రంగా

విరాజిల్లు చున్నది. ఇదంతా ఎందుకు చెప్పాల్సొచ్చిందంటే నేను అమ్మను దర్శించడానికి ముందే అమ్మ నాలో ఆధ్యాత్మికబీజాలు నాటి తన పాదాల చెంతకు నన్ను చేర్చుకున్న దనిపిస్తుంది.

నా జీవితంలో 1974 డిసెంబరు 19 వ తేదీ అత్యంత ప్రధానమైనరోజు. ఆరోజు శ్రీ జానకీపతిగారు తాను జిల్లెళ్ళమూడి అమ్మదర్శనార్థమై వెళ్తున్నానీ, వీలైతే నన్ను కూడా రమ్మని ఆహ్వానించారు. వారి నోటివెంట జిల్లెళ్ళమూడి అమ్మపేరు వినగానే, అంతకు ముందే నాలో అమ్మను దర్శించుకోవాలన్న ఆకాంక్ష నిగూఢంగా ఉండడం చేత వెంటనే ఒప్పుకొన్నాను. డిసెంబరు 19వ తేదీ రానేవచ్చింది. ఆరోజు ఉదయం మేము గుంటూరులో బయలుదేరి బాపట్లవెళ్ళాము. బాపట్లలో పెదనందిపాడు వెళ్ళే బస్సునెక్కాము. బస్సులో ఎక్కడానికి ముందు జానకీపతిగారు నాతో 'నేనునిన్ను జిల్లెళ్ళమూడి తీసుకెళ్తున్నానని మొదట్లో అనుకున్నాను గానీ యిప్పుడు మాత్రం నేను కేవలం నిమిత్తమాత్రుడిననీ అమ్మే నిన్ను పిలిపించుకుంటున్నదనీ అనిపిస్తున్నది' అన్నాడు. అప్పుడు నాకు కూడా అది నిజమేననిపించింది. మేము నందిపాడు బస్సులో ప్రయాణించి ఏడవ మైలురాయి దగ్గర దిగి కాలినడకన జిల్లెళ్ళమూడి చేరుకొనేటప్పటికి దాదాపు మధ్యాహ్నం గం. 12-15 ని. లయినట్లు జ్ఞాపకం. మేము జిల్లెళ్ళమూడి చేరుకోగానే అమ్మదర్శనానికై మెట్లెక్కి పైకి వెళ్ళగా 'అన్నపూర్ణాలయంలో భోజనాలు చేసిరండి, మధ్యాహ్నం అమ్మ దర్శనమిస్తుంది' అని చెప్పారు. మేమలాగే అన్న పూర్ణాలయంలో ప్రసాదాన్ని గ్రహించి తిరిగి పైకి వెళ్ళి వాత్సల్యాలయం వరండాలో కూర్చున్నాము. మా కన్నముందు దాదాపు 20-25 మంది ఆసీనులైయున్నారు. దాదాపు గం॥ 2.45 ని॥లకు అమ్మ తన గదినుండి వెలుపలకు వచ్చి మాముందు అమర్చబడి యుండిన సింహాసనంలో (కుర్చీలో) కూర్చున్నది. అప్పుడు అమ్మ ముఖము దివ్య తేజస్సుతో వెలుగొందుచూ యుండినది. అమ్మ నుదుట నున్న పెద్ద కుంకుమ బొట్టు సూర్య బింబంవలె గోచరించినది. అమ్మ ప్రసన్న దృక్కులు ఎవరికివారికి తమనే పరికిస్తూ, పలుకరిస్తున్నట్లు గోచరించినవి. ఏదో తెలియని దివ్య ప్రశాంతత, ఆనందముతో కూడుకొన్న వాతావరణము నెలకొన్నది. అమ్మ నెంతజూచినా తనివి తీరక అమ్మ

ఒడిలో వ్రాలిపోవాలని పిస్తుండినది. అమ్మకు కుడివైపున క్రింద రామకృష్ణ అన్నయ్య కూర్చున్నారు. ముందు వరసలో కూర్చున్న సోదరీసోదరులు అమ్మకు పూలమాలవేసి పూజించి హారతి నిచ్చారు. తదుపరి వరుసగా ఒకరొకరుగా వెళ్ళి అమ్మ పాదాలకు నమస్కరించి రామకృష్ణ అన్నయ్య ద్వారా యివ్వబడిన ప్రసాదము (ఏదోయొక ఫలము మరియు కుంకుమ పొట్లాలు) గ్రహించి వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళుచున్నారు. వరుసలో జానకీపతిగారి తర్వాత నావంతు వచ్చినది. నా ఒళ్ళు పులకరించినట్లైంది. ఏదోమహదానందము, మాటలకందని స్థితి. యాంత్రికంగా అమ్మ పాదాలపై నానుదురు నానించి మొట్టమొదటిసారి అమ్మకు నమస్కరించాను. అమ్మ చల్లని, సున్నిత, దివ్యపాదాల స్పర్శతో నాలోనికేదో మాటలకందని దివ్యశక్తి ప్రవహించినట్లైనది. మౌనంగా యాంత్రికంగా వెనుదిరిగి వెళ్ళి వెనక కూర్చొని అమ్మ దివ్యమంగళ రూపాన్ని తిలకిస్తూ అమ్మ తిరిగి తనగదిలో కెళ్ళేవరకూ ఎదో తెలియని ఆనందంతో ఉండిపోయాను. ఎన్ని జన్మల తపః ఫలమో కాదు కాదు అమ్మ అపారకృపవల్ల నాకలా అమ్మ ప్రథమ దర్శనం ప్రాప్తించినది. అదేరోజు అమ్మను మరొకసారి దర్శించుకొని గుంటూరు తిరుగు ప్రయాణానికి సెలవుతీసుకుంటున్నప్పుడు 'వచ్చే ఆదివారం రానాన్నా!' అని ప్రేమపూర్వకంగా ఆదేశించింది. అప్పటి నుండి అమ్మ ధ్యాసలో గడపడం, దాదాపు ప్రతి ఆదివారం జిల్లెల్ల మూడికి వెళ్లి అమ్మను దర్శించుకొని రావడం, ప్రతీసారీ అమ్మదర్శంలో ఏదో కొత్త ఆనందం, మాధుర్యం అనుభవించడం జరిగేది. ఇలా నాకే కాదు జిల్లెళ్ళమూడికి వస్తూ యుండిన ప్రతి యొక్కరికీ అనుభవమే.

ఇక్కడ మరొక విషయమేమంటే ఒక్కొక్కసారి అమ్మదగ్గరకు వెళ్ళడానికెన్ని ప్రయత్నాలు చేసినా వెళ్ళలేకపోయేవారము. మరొకప్పుడు ఏ ప్రయత్నమూ చేయకుండానే, వెళ్ళాలని అనుకోకుండానే వెళ్ళగలిగేవారము. దీనిని బట్టి నాకనిపించిదేమిటంటే కేవలం అమ్మ సంకల్పిస్తేనే, అమ్మ ప్రేరణనిస్తేనే మనము జిల్లెళ్ళమూడి వెళ్ళగలమని.

2. సర్వజ్ఞ అమ్మ

1975, 1976 సంవత్సరాలలో మాకు వీలైనప్పుడల్లా అంటే శని, ఆదివారాల్లో నేను మరియు శ్రీ పి.ఎ. జానకీపతిగారు జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మను దర్శించి వచ్చేవారము. ఒకసారి ఒకశనివారం రోజు శ్రీ జానకీపతిగారు తనకేదో సమస్య యున్నదనీ జిల్లెల్లమూడి వెళ్ళి హైమాలయంలో పూజ చేయించుకొని, అమ్మను దర్శించుకొని తిరిగి ఆదివారం సాయంత్రానికి రాగలనని చెప్పి తానొక్కరే గుంటూరులో ఉదయం 5 గం॥లకే బయలుదేరి వెళ్ళారు. కాని వారదేరోజు మధ్యాహ్నం రెండు గంటలకే గుంటూరుకు తిరిగి వచ్చారు. అప్పుడే తిరిగి వచ్చారేమిటని నేను వారిని ప్రశ్నించగా వారు అమ్మ గుంటూరులోనే యున్నదనీ ఆవిషయం తనకు జిల్లెళ్ళమూడికి వెళ్ళిన తర్వాత తెలిసిందనీ, అందువల్ల తాను సంకల్పించుకొన్నట్లు హైమాలయంలో పూజచేయించుకొని అమ్మను గుంటూరులోనే దర్శించుకొనేందుకై వెంటనే తిరిగి వచ్చేశాననీ సమాధానమిచ్చారు. అమ్మ దర్శనార్థం తాను వెంటనే బయలుదేరబోతున్నానని చెప్పి నన్నుకూడా బయలుదేర మన్నారు. మేమప్పుడు గుంటూరు రామన్నపేటలో ఒక యింటిలో అద్దెకుండేవారము. మేమిద్దరము ఆరోజు మధ్యాహ్నం దాదాపు గం. 3.30 ని॥ల ప్రాంతంలో బయలుదేరి అరండల్‌పేట 1వ లైను 3వ అడ్డరోడ్డు నందు అమ్మ విడిది చేసి యున్న శ్రీ దత్తాత్రేయులు, అడ్వకేట్ (వీరు అమ్మకు బంధువేగాక అరండల్‌పేట 7వ లైను యందున్న శ్రీ శిరిడీ సాయిబాబా మందిర నిర్వహణ కర్తలు గూడా) గారి యింటికి దాదాపు 4 గం॥ల ప్రాంతంలో చేరుకున్నాము. ఆసమయానికి అమ్మ అందరికీ దర్శనాన్ననుగ్రహిస్తూ యుండినది. మేము వెళ్ళిన పదినిమిషాల్లోపే అమ్మను దర్శించి పాదనమస్కారము చేసుకోగలిగాము. మేము అమ్మకు నమస్కరించే సమయంలో అమ్మ జానకీపతిగారితో 'నాన్నా నీవు జిల్లెళ్ళమూడి వెళ్ళివచ్చావుగా, హైమాలయంలో


పూజ బాగా జరిగిందా ?' అని ప్రశ్నిస్తూ తన ప్రసన్న దృక్కులను నావైపు సారించింది. విశేషమేమిటంటే అమ్మ దర్శనానికి వెళ్ళే ముందు నేను 'జానకీపతిగారు జిల్లెళ్ళమూడి వెళ్ళి వచ్చిన విషయం అమ్మకు తెలిసియుంటుందా' అన్నప్రశ్న నా మనస్సులో మెదిలింది. నా ప్రశ్నకు సమాధానమే అమ్మ జానకీపతిగారికి సంధించిన ప్రశ్నలు. మేము అమ్మదగ్గర సెలవు తీసుకొని అక్కడి నుండి నిష్క్రమించాము.

మనమెప్పుడెప్పు డేమేమి మాట్లాడుకున్నా మన భావాలతో సహా అమ్మకు విదితమేనన్న దాని కెన్ని ఉదాహరణలైనా యివ్వవచ్చు. ఒకసారి నేనూ, మా ఆవిడా జిల్లెళ్ళ మూడికి వెళ్తూ మార్గమధ్యంలో బాపట్లలో అమ్మకు నివేదించడానికి పూలు, పండ్లు (కిస్‌మిస్) తీసుకున్నాము. పండ్లు తీసుకునే టప్పుడు మా ఆవిడ నాతో అమ్మకు పండ్లు సమర్పిస్తాను గానీ అమ్మ ఏమీ తినకుండానే అందరికీ పంచి పెడ్తుందిగదా అని నాతో అన్నది. తాను సమర్పించే పండ్లను అమ్మ తింటే తనకు తృప్తి కలుగుతుందన్న భావనను నాకు వ్యక్తీకరించింది. మేము జిల్లెళ్ళమూడి వెళ్ళిన తర్వాత దర్శన సమయంలో అమ్మకు పూలమాలవేసి పండ్లు సమర్పించాము. అప్పుడు అమ్మ వెంటనే వసుంధర అక్కయ్యను పిలిచి కిస్‌మిస్‌ను కడిగి తీసుకురమ్మన్నది. అవి కడిగి తీసుకువచ్చిన తర్వాత ఒక్కటొక్కటిగా కొన్ని పండ్లు అమ్మ తింటూ యిప్పుడు నీకు తృప్తికలిగిందా అన్నట్లు మా ఆవిడవైపు చూచింది. అమ్మ చూపులోని భావాన్ని గ్రహించిన మేమిరువురమూ ఆనందంతో మనస్సులోనే అమ్మకు కృతజ్ఞతలు చెప్పుకున్నాము.

మరొకసారి నేను గుంటూరు నుండి జిల్లెళ్ళమూడి వెళ్తూ మార్గ మధ్యంలో బాపట్లలో దిగాను. అప్పుడు రాత్రి 8 గం॥ అయింది. పెదనందిపాడు వెళ్ళే బస్సు రావడాని కింకా సమయం ఉండినది. నాకు బాగా ఆకలి వేస్తున్నది. సాధారణంగా జిల్లెళ్ళమూడి వెళ్ళి అన్నపూర్ణాలయంలో ప్రసాదాన్ని గ్రహించే నేను, అప్పుడు మాత్రం ఆకలి కారణంగా అమ్మను మనస్సులో తలంచుకొని హోటల్లో భోజనం చేశాను. తదుపరి నందిపాడు వెళ్ళే బస్సులో ప్రయాణించి

7వ మైలు రాయి దగ్గర దిగి, అచ్చటినుండి కాలినడకన జిల్లెళ్ళమూడి చేరాను. అప్పటికి రాత్రి 10 గం॥ల సమయమైంది. నేను పాదప్రక్షాళనం గావించుకొని అమ్మ దర్శనానికి వెళ్ళాను. దర్శన సమయంలో అమ్మ 'నాన్నా! ఎక్కడ భోజనం చేశావు?' అని ప్రశ్నించింది. నేను బాపట్లలోనని సమాధానమిచ్చాను. నేనెప్పుడు ఎక్కడ ఏమి చేస్తున్నానో నా భావాలతో సహా అమ్మకు తెలుస్తూనే యున్నదనడానికి యింతకన్నా నిదర్శనమేంకావాలి.

మన ఆలోచనలను, మాటలను, చేతలను అమ్మ సర్వత్రా గమనిస్తూనే యున్నదన్న సత్యాన్నెరిగి మనం మన ఆలోచనలను, మాటలను, చేతలను సర్వత్రా అదుపులో ఉంచుకొనే ప్రయత్నం చేయడం, వాటిని అమ్మకే సమర్పించడమన్నది మన సాధనలో భాగం కాగలదు.



3. సర్వ రక్షాకరి అమ్మ

అమ్మ తన బిడ్డలమైన మనల్ని కంటికి రెప్పలా సర్వదా ఎలా కాపాడుతుంటుందో మనలో చాలా మందికి అనుభవమే. అమ్మ కొన్ని దుర్ఘటనల నుండి నన్నెలా కాపాడిందో ఇక్కడ ఉదహరిస్తాను. గుంటూరు అరండల్‌పేట 7వ లైను మొదటి అడ్డరోడ్డులో ఒక డాబాపైయున్న ఒక గదిలో అద్దెకుంటున్న రోజులవి. అరండల్‌పేట 7వ లైనులో నేనొక మెస్ (కె.కె.మెస్, ఇప్పుడది లేదు) లో నెలవారీ మెస్‌కార్డు తీసుకొని భోజనం చేసేవాడిని. అది 1976వ సంవత్సరం మేనెల తేదీ జ్ఞాపకం లేదు గానీ నేనొక రోజు మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో మెస్‌లో భోజనం చేస్తున్నాను. పప్పు, కూరలు, సాంబారులతో అన్నం తిన్న తర్వాత చివర్లో కొద్దిగా మిగిలిన అన్నంలో నాకివ్వబడిన ఒక కప్పులోని పెరుగును కలుపుకొని ఆ పెరుగన్నం తినాలని ఒకముద్ద నోట్లో పెట్టుకున్నానో లేదో సడన్‌గా ఒక మెరుపు లాగా నా మెదడులోకి జిల్లెళ్ళమూడి అమ్మ జ్ఞాపకంవచ్చి నాలోని కేదోశక్తి ప్రవేశించినట్లై, అసంకల్పితంగా నా కుడిచేతి రెండు వ్రేళ్ళూ (బొటన వ్రేలు మరియు చూపుడు వ్రేలు) నానోట్లోకి వెళ్ళి అచ్చటినుండి పదునైన మొనదేలియున్న గాజుపెంకు నొకదానిని బయటకు తీసినై. అప్పుడు నేను మామూలు స్థితిలోకి వచ్చి ఆ గాజు పెంకును చూచి ఒళ్ళు జలదరించగా దిగ్భ్రాంతి చెందాను. అప్పుడు నేను కృతజ్ఞతాపూర్వకంగా అమ్మకు నా మనస్సునందే నమస్కరించగా నా రెండు కన్నులూ చెమర్చాయి. భోజనాన్ని ముగించుకొని నేను నాగదికి వెళ్ళాను. నేను తినబోయిన పెరుగులోకి లేక పెరుగన్నంలోకి ఆ గాజుపెంకెలా వచ్చిందో తెలియదుగాని నేను పెరుగన్నం కలుపుకునేటప్పుడు నా చేతికి తగలకుండా అంటే గాయం కాకుండా కాపాడబడటాని కేశక్తి అడ్డుపడిందో మీకు ప్రత్యేకంగా వివరించనవసరములేదు. ఆ గాజుపెంకు నా చేతికి తగిలియున్నా లేక దానిని పెరుగన్నంతోపాటు నేను నమిలియున్నా లేక లోనికి మ్రింగియున్నా ఎంత ప్రమాదం జరిగేదో నన్నది ఊహించుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది. సర్వ రక్షాకరి యైన అమ్మ 'సర్వదా మీవెన్నంటే నేనుంటాను' అన్నది గదా! మనకింక భయమేల.

4. గణనకందనిదే గండం

సందర్భానుసారంగా అమ్మనోటినుండి వెలువడిన సూక్తుల్లో 'గణన కందనిదే గండం' అన్న సూక్తి అక్షర సత్యం. ఎప్పు డెవరి కెలాంటి గండం పొంచి యుందో మానవ మాత్రులమైన మనం ఊహించలేము. గణన కందని అలాంటి గండాలనుండి విశ్వజనని అమ్మ మనల్నెలా కాపాడుతుందో నాకు జరిగిన రెండు మూడు సంఘటనలు లేక అనుభవాల వల్ల తేట తెల్లమౌతుంది.

అది 1983 వ సంవత్సరము, తేది జ్ఞాపకంలేదు. అప్పట్లో మా కుటుంబమంతా గుంటూరు కొరెటిపాడు పోస్టాఫీసు దగ్గర ఒక అద్దె యింట్లో ఉండేది. ఒకరోజు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో నేను మా ఆఫీసు నుండి యింటికి తిరిగి వస్తున్నాను. రింగురోడ్డులో కొరెటిపాడు గాంధీబొమ్మ దాటిన తర్వాత మా యింటికి వెళ్ళటానికి రింగురోడ్డు నుండి అమరావతి రోడ్డును కలిపే రోడ్డు మలుపులోకి తిరిగి రెండడుగులు వేశానోలేదో వెనక నుండి అంబాసిడర్ కారొకటి అతి వేగంగా దూసుకువచ్చి రెప్పపాటు కాలంలో నన్ను తాకుతూ (నేను రోడ్డు ఎడమ ప్రక్క మార్జిన్‌లో నడుస్తుండబట్టి నాకుడిచేతిని తాకుతూ) నావెనుక ఎవరో కారునాపమని అరుస్తున్నా పట్టించుకోకుండా వెళ్ళింది. ఆ సమయంలో నేను అమ్మ నామంచేసుకుంటూ పరధ్యానంగా వెళ్ళుచున్నాను. ఆ సంఘటన చూచిన వారంతా ఆశ్చర్యంగా నోటిమీద వ్రేళ్ళు వేసుకొని తిలకిస్తూ ఉండటాన్ని గమనించిన తర్వాతగానీ ఎంత ప్రమాదం తప్పిపోయిందో నా కర్థంకాలేదు. ఇలాంటి సంఘటనే ఢిల్లీలో 2000 సం॥లో నేను హిందీ అనువాందంలో ప్రత్యేకశిక్షణకై మా ఆఫీసు తరపున వెళ్ళి యున్న సందర్భంలో జరిగింది.

నాకు డైరీ వ్రాసే అలవాటు లేకపోవడం వల్ల తేది జ్ఞాపకంలేదుగానీ అది 1999 మేనెల మూడవ వారంలో ఒక రోజు ఉదయం విజయవాడ మాచవరంలో ఉండిన హిందీ అనువాద శిక్షణా కేంద్రంలో హిందీ అనువాదంలో డిప్లొమా పరీక్షకు ఫీజుకట్టడానికి వికాస్ నగర్, గుంటూరు

నందలి మా యింటి నుండి బయలుదేరి ఆర్.టి.సి. బస్ స్టాండుకు చేరుకున్నాను. అప్పుడు సమయం 11 గంటలైనది. ఆసమయంలో విజయవాడకు వెళ్లటానికి సిద్ధంగా యున్న ఒక ప్యాసింజరు బస్సులోకెక్కి డ్రైవర్ ప్రక్కగా యున్న ఇంజను ప్రక్కన, బస్సు ఎంట్రెన్సు దగ్గర మెట్లకు ముందున్న సింగిల్ సీటులో కూర్చున్నాను. నేనెక్కిన 10 నిమిషాలకు బస్సు బయలుదేరింది. బస్సు బయలుదేరినప్పటి నుండి నాలో ఏదో తెలియని ఆందోళన మొదలైంది. అది ఏదో అశుభమో, దుర్ఘటనో జరగబోతోందని హెచ్చరించే సిక్త్ సెన్స్ కావచ్చు లేక అమ్మ ప్రేరణకావచ్చు. ఆసీట్లో సౌకర్యంగా కూర్చున్నానే గాని మానసికంగా అసౌకర్యంగా ఉండినది. ఆందోళనకు కనిపించే కారణమేదీ లేనందున మనసుకు సర్దిచెప్పుకొని అమ్మను తలచుకొంటూ ఉండిపోయాను, బస్సు వెళ్తూనే యున్నది. బస్సు బయలుదేరిన దాదాపు 25 ని॥లకు నాగార్జున యూనివర్సిటీ దాటిన తర్వాత భారీకాయుడైన డ్రైవర్ తాను డ్రైవుచేస్తున్న సీట్లో మూర్ఛ వచ్చినవానివలె తన ముందున్న వీల్‌పై పడిపోయాడు. ప్రక్కనే ఉన్న నేనిది గమనించాను. అప్పుడు బస్సు అదుపులో లేనిస్థితి. ఈ విషయం ప్రయాణీకులకు తెలియజేస్తే వారు ఆందోళన చెంది పరిస్థితి భయంకరంగా మారుతుందని వెంటనే వారికి చెప్పకుండా నాకు డ్రయివింగ్ రాకపోయినా నేను బస్సుస్టీరింగును కంట్రోలు చేయడానికి ప్రయత్నించాను. అయితే బాగా బరువున్న డ్రయివరు వీల్‌పై పడిపోయి ఉన్నందున అది సాధ్యపడలేదు. బస్సు నేరుగా వెళ్తూనే యున్నది. ఎదురుగా విజయవాడనుండి వస్తున్న బస్సులు, లారీలు, ట్రక్కులు, కార్లు అన్ని రకాల వాహనాలు మేమున్న బస్సును తప్పుకుంటూ వెళ్తున్నవి. ఎదురుగా వచ్చే ఏ వాహనాన్నయినా మేమున్న బస్సు ఢీకొంటే జరిగే బీభత్సమును తలచుకోగానే నాలో భయాందోళనలు మొదలైనవి. అప్పుడు నేను డ్రయివరు సీటు దగ్గరనుండి కొద్దిగా వెనుకకు జరిగి, ఇంజను రక్షణకై వేర్వేరు ఎత్తుల్లో అమర్చబడియుండిన మూడు ఇనుప రాడ్లలో పైదానిని పట్టుకొని నిలుచున్నాను. ఇక మానవ ప్రయత్నంవల్ల ప్రయోజనం కలుగదని గ్రహించిన నేను తనను రక్షించుకటకై గజేంద్రడేవిధంగా విష్ణుమూర్తిని ప్రార్థించాడో ఆవిధంగా మమ్మల్నందరినీ

కాపాడమని పూర్తి భారాన్ని అమ్మమీదనే వేసి, అమ్మ నామం చేస్తూ అమ్మను ప్రార్థించడం మొదలుపెట్టాను (అలాంటి భయంకర సన్నివేశంలోకూడా అమ్మ జ్ఞాపకానికి రావడం అమ్మ కృపవల్లనే). ఐదారు నిమిషాల వ్యవదిలో బస్సు రోడ్డు ఎడమవైపు అంచువెంబడి వెళ్ళి వెళ్ళి ఒక చింతచెట్టు మొదలును ఢీకొట్టింది. అప్పుడు పెద్దకుదుపుతో బస్సు ఆగిపోయింది. ఆ ఢీకొట్టడమన్నది ఇంజనుకు ఎడమ వైపున బస్సు ముందు భాగము మాత్రమే ఢీకొని బస్సు అద్దాలు పగిలిపోయినవితప్ప ఇంజనుకు ఏమీ కాలేదు. డ్రయివరుకు కూడా ఎలాంటి దెబ్బలూ తగల్లేదు. బస్సులో ఉన్న ప్రయాణీకులకు బస్సు కుదుపువల్ల చిన్న చిన్న దెబ్బలు తగిలినవి గాని ప్రాణాపాయమెవరికీ కలుగలేదు. అమ్మ కృపవల్ల పెద్ద ప్రమాదము తప్పినది. ఐతే ఆ కుదుపుకు బస్సులో ఇంజను వెనుకవైపున్న రక్షణ రాడ్లు మూడూ వాటి వెనుకనేయున్న నన్ను తాకి కొద్దిగా గాయపరచినవి. ఆ మూడు రాడ్లూ నా కుడిపాదము, మోకాలు, తొడలపై బలంగా తాకినవి. ఆతాకిడికి నాతొడపై చిన్నగాయమై ప్యాంటు చినిగి రక్తము కారినది. మోకాలు చిప్ప క్రింది భాగంలో రాడ్డు బాగా బలంగా తగలడంవల్ల వాపు, నొప్పి కలిగి బాధించగా నేను నా కాలు విరిగిందనుకున్నాను. అమ్మను ప్రార్థించి నేను కాలు కదిపి అడుగు వేయగా నాకాలు విరుగలేదన్నది రూఢియైనది. నా కాలు విరగనందుకు అమ్మకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాను. పాదంపై గీరుకుపోయినట్లు చిన్నదెబ్బే తగిలింది. బస్సు కుదుపుకు నాచేతివాచీ, నా కళ్ళద్దాలు ఎగిరి ఎక్కడో పడిపోయాయి, తర్వాత అవి దొరికాయి. ఆ సంఘటనలో చింతచెట్టు రూపంలో బస్సును ఆపి బస్సులో ప్రయాణిస్తున్న అందరు ప్రయాణీకులనూ అమ్మ కాపాడింది. మూర్ఛతో పడిపోయి యుండిన డ్రైవర్ బస్సుకుదుపువల్ల మేల్కొన్నాడు. అతడు తాను మూర్ఛలో పడిపోయిన విషయం ఎవరికీ చెప్పవద్దని నన్ను బ్రతిమలాడాడు. ఈవిషయం నేను చెబితే తన ఉద్యోగం పోతుందని తన భయం. నన్నెవరైనా అడిగితే నిజము చెప్పవలసి వస్తుందని, నిజం దాయడం తప్పుగనుక నిర్ణయమేదైనా అమ్మకే వదిలిపెడుతూ అమ్మను ప్రార్థించాను. ఈలోగా దెబ్బలు తగిలిన మా అందరినీ విజయవాడ నుండి గుంటూరు వెళ్ళే బస్సులో ఎక్కించి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి చేర్చారు.

ప్రమాదమెలా జరిగిందని నన్నెవరూ ప్రశ్నించకపోవడంతో డ్రైవరు ప్రార్థనను కూడా అమ్మ విన్నదేమో ననిపించింది. ఆసుపత్రి నుండి ఆసుపత్రి స్టాఫ్ మాయింటికి ఫోను చేసి సమాచారాన్నందించడంతో నా శ్రీమతి ఆసుపత్రికి ఆటోలోవచ్చి మాయింటికి నన్ను తీసుకెళ్ళింది. 'నా ఒడి విడిచి ఎవరూ లేరు' అన్నది అమ్మ. అమ్మ ఒడే మనల్ని అన్ని ఆపదల నుండీ కాపాడుతుంది కదా !

1990 వ సం॥లో గుంటూరు జిల్లాపరిషత్ ఆవరణలోని సత్యసాయి మందిరం ప్రక్కన శ్రీ అరవిందకేంద్రము, గుంటూరునకు ప్రభుత్వంచే కేటాయించబడిన 1200 చ.గ. ల స్థలంలో శ్రీ అరవింద భవనాన్ని నిర్మించుటకై విరాళాలను సేకరిస్తూ, నిర్మాణ పనులను పర్యవేక్షించే రోజులవి. ముఖ్యంగా నేను, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ యుండిన, శ్రీమాతారవిందుల భక్తులు శ్రీ నర్రా నరసింహారావు గారు భగవత్ప్రేరణానుసారం విరాళాలకై గుంటూరు పట్టణమందుండిన ప్రముఖులతోపాటు మాకు తెలిసిన తెలియనివారిని సహితము కలిసి ప్రయత్నించేవారము. మామూలుగానే మే మొకరోజు సాయంత్రం విరాళాలకై ఒకరిద్దరు డాక్టర్లను కొత్తపేటలో కలిసి గుంటూరు వారితోట మీదుగా పద్మావతీ నర్సింగ్‌హోమ్ ప్రక్కన ఉన్న సందులో నా స్కూటర్‌పై వస్తున్నాము. పద్మావతీ నర్సింగ్‌హోమ్ దగ్గర మేము ఆ సందులో నుంచి ఆర్.టి.సి. బస్టాండుకు వెళ్ళే రోడ్డులోకి మలుపు తిరిగామో లేదో మావెనుకవైపు నుండి అతి వేగంగా మోటారు సైకిలొకటి మా స్కూటర్ కుడివైపున డ్యాష్ యిచ్చుకుంటూ వెళ్ళినది. అప్పుడు నేను స్కూటర్ నడుపుతండగా నర్సింహారావుగారు నావెనుక కూర్చొనియున్నారు. నా స్కూటర్ వెనుక చిన్న సొట్ట పడింది తప్ప మాకేమి కాలేదు. అమ్మ మావెంటే యుండి మమ్మ రక్షించిన అనుభూతి మాకు కలిగినది. ఇలా మరెన్నో సార్లు నేను, నాతో ఉన్నవారూ ఎన్నో గండాలనుండి, దుర్ఘటనల నుండి కాపాడబడటం కేవలం అమ్మ అపార కృపవల్లనేనన్నది అక్షరసత్యం.

5. మనం నిమిత్త మాత్రులం

అమ్మను దర్శించడానికి ఎవరైనా సంకల్పించిన మాత్రం చేతనో లేక ప్రయత్నించినంత మాత్రంచేతనో అమ్మ దర్శనం లభించదు. అమ్మ సంకల్పిస్తేనే ఎవరికైనా అమ్మ దర్శనం లభించేది. మనకు మనమే అమ్మ దగ్గరకు వెళ్తున్నట్లుగానో లేక మరెవరైనా మనల్ని అమ్మ దగ్గరకు తీసుకువెళ్తున్నట్లుగానో మొదట్లో మన కనిపించినా కేవలం అమ్మ సంకల్పంవల్ల, అమ్మకృపవల్ల మాత్రమే అదిసాధ్యమైనట్లు తర్వాత మనకు అనుభవ మవుతుంది, మనం నిమిత్తమాత్రులమని తెలుస్తుంది.

సాధారణంగా ఏదైనా మనమనుకున్నది అనుకున్నట్లు జరుగకపోతే, 'తానొకటితలిస్తే దైవమొకటి తలచాడు' అనుకుంటాము. కానీ అమ్మ ఏమంటుందంటే 'దైవం తలిస్తేనే తాను తలుస్తాడు'. ఆవిధంగా అన్ని సంకల్పాలూ దైవానివే. అన్ని సంకల్పాలూ (ప్రత్యేకించి ఏ ఒక్క సంకల్పమో కాకుండా) ఆయనవే గనుక ఆయన సంకల్ప రహితుడు. అన్ని నామాలూ ఆయనవే గనుక నామ రహితుడు. అన్ని రూపాలూ ఆయనవే గనుక రూపరహితుడు. ఇవన్నీ అమ్మ యిచ్చిన కొత్త నిర్వచనాలు. అవి పూర్ణ సత్యాలు, అక్షర దీపాలు. శ్రీ అరవింద మహర్షులు ఏ మన్నారంటే "Unless He remembers, we cann't remember Him". ఇదీ, అమ్మ చెప్పిన 'దైవం తెలిస్తేనే తాను తలుస్తాడు' అన్ని వాక్యమూ ఒకటేగదా. దీనిని బట్టి తేలేదేమంటే అమ్మ తలిస్తే లేక సంకల్పిస్తేనే మనము తలవడంగానీ లేక సంకల్పించడం గానీ జరుగగలదనీ, మనం కేవలం నిమిత్త మాత్రులమనీ.

మొదటి అధ్యాయంలో అమ్మ ప్రథమ దర్శనం నాకెలా కలిగిందో వ్రాసినప్పుడు జానకీ పతిగారు నన్ను అమ్మ దగ్గరకు తీసుకు వెళ్ళడమన్నది కేవలం అమ్మ సంకల్పమేనని మా యిరువురకూ అవగతమయింది. అలాగే నేను శ్రీ రాచపూడి మదన మోహనరావు గారిని జిల్లెళ్ళమూడికి తీసుకువెళ్ళడం కూడా అమ్మ సంకల్పంగానే మా యిరువురకూ అవగత మయింది. ఆ వివరాలిక్కడ వివరిస్తాను.

జిల్లెళ్ళమూడికి వచ్చే సోదరీ సోదరుల్లో చాలామంది గుంటూరుకు చెందిన శ్రీ ఆర్.ఎమ్. మోహనరావుగారి నెరిగే యుందురు. వీరు గుంటూరులో టెలికం డిపార్టుమెంటులో నాతోపాటు మా కార్యాలయము నందే పనిచేసేవారు. అది1977-78 నాటి విషయం. అప్పుడు వారికి దేవుడిపట్ల నమ్మకముండేదిగాదు. వారితో నాకున్న పరిచయం, చనువుతో నేను వారి నొకసారి జిల్లెళ్ళమూడి అమ్మను దర్శించి ఆ తర్వాత దేవుడున్నాడో లేడో యన్నదానిపై యొక నిర్ధారణకు రావలసిందిగా కోరాను. దానికి వారు సమ్మతించారు. తర్వాత ఒక ఆదివారంరోజు నాతోపాటు జిల్లెళ్ళమూడికి బయలుదేరారు. దారిలో అమ్మయిచ్చిన ప్రేరణతో నేను వారితో 'మీరు నాతోపాటు జిల్లెల్లమూడి రావడమన్నది కేవలం నా ప్రోద్బలం వల్లగాదనీ, నేను నిమిత్తమాత్రుడిననీ, అమ్మ సంకల్పంవల్లనేనని మీరు అమ్మను దర్శించిన తర్వాత తెలుసుకోగలరు' అని అన్నాను. వారు మౌనంగా ఉండి పోయారు. మేము మధ్యాహ్నం 12గం॥ల సమయంలో జిల్లెళ్ళమూడికి చేరుకున్నాము. కాళ్ళు, చేతులు కడుక్కొని క్రింద ఆఫీసుగదిలో విచారించగా వాత్సల్యాలయంలో అప్పుడు అమ్మ దర్శనమిస్తున్నట్లు తెలిసినది. మేము వెంటనే మెట్లెక్కి వాత్సల్యాలయానికి చేరుకొని అమ్మ కెదురుగా కూర్చొని యుండిన వారందరికి వెనుకగా కూర్చున్నాము. 'మీ యిద్దరూ వచ్చారా' అన్నట్లు 'మీకొరకే ఎదురు చూస్తున్నాన'న్నట్లు అమ్మ తన ప్రసన్న దృక్కులను మాపై ప్రసరించింది. నేను నా హృదయమందే అమ్మకు నమస్కరించాను. అమ్మకు ప్రక్కనే శ్రీ కొండముది రామకృష్ణ అన్నయ్య కూర్చొని యుండి అమ్మకు నమస్కరించి వెనుదిరిగే వారికి అమ్మకుంకుమ పొట్లాలను ప్రసాదంగా అనుగ్రహిస్తున్నారు. అమ్మపాదాలకు నమస్కరించి వచ్చిన వారిలో కొందరు నిష్క్రమిస్తుండగా కొందరు అమ్మనింకా చూడాలనే అభిలాషతో అందరికి వెనుకగా కూర్చుండి పోతున్నారు. నావంతు రాగానే నేను వెళ్ళి అమ్మ పాదాలకు నమస్కరించి వచ్చి ఒక ప్రక్కన కూర్చుండి పోయాను. నా తర్వాత ఆర్. ఎమ్. మోహన రావుగారి వంతు వచ్చినది. అమ్మ కరుణా కటాక్ష వీక్షణాలు వారిపై బడినవి. వారు అమ్మను చూడగానే

అవ్యక్తాను భూతినేదో చెంది అమ్మ పాదాలపైబడి వెక్కివెక్కి ఏడ్చారు. అమ్మ తన దివ్య హస్తాలతో వారిని లేపి వారి తల నిమిరినట్లు జ్ఞాపకం. ఆ దృశ్యం మరువలేనిది. ముఖ్యంగా మోహనరావుగారు అమ్మ ఒడిలో పునర్జన్మనెత్తి నట్లనిపించింది. వారు అమ్మ పాదాల దగ్గరే రెండు మూడు నిమిషాలున్న తర్వాత మిగతావారికి అవకాశము కల్పించుటకై ప్రక్కకు వచ్చి కూర్చుండి పోయారు. అమ్మ తన గదిలోకి వెళ్లిపోయిన తర్వాత మోహనరావుగారిని వారెందు కేడ్చారో చెప్పమని అడిగాను. దానికి వారు తానేదో తెలియని తన్మయత్వానికి గురియైనట్లు, తెలియని తన హృదయ భారమేరో తొలగిన్నట్లె తనకు తెలియకుండానే యొక పసిపిల్ల వానివలె ఏడ్చేశానని సమాధాన మిచ్చారు. అమ్మ ఎవరెవరిని తన దగ్గరకు పిలిపించు కుంటుందో ఎవరెవరిని ఎలా అనుగ్రహిస్తుందో, ఎవరెవరికి ఎలాంటి అనుభూతులను ప్రసాదిస్తుందో తెలుసుకోవడం కష్టం. ఆ అనుభూతి చెందిన వారైనా యధాతథంగా మాటల్లో వ్యక్తీకరించలేరనుకుంటాను. మొత్తానికి జిల్లెళ్ళమూడికి రాకముందు ఉండిన మోహనరావు, జిల్లెళ్ళమూడి వచ్చిన తర్వాత పరివర్తన జెందిన మోహనరావు భౌతికంగా ఒకరేయైనా భిన్నమని నా అభిప్రాయం.

చాలామంది‘ అమ్మను చూడడం వల్ల ఏమి పొందగలం?’ అని ప్రశ్నిస్తుంటారు. “అమ్మను చూడగలగడమే పొందగలగడం,” “జిల్లెల్లమూడి రావటమే పొందటం - రాక వృధా పోదు” అన్న అమ్మ వాక్యాలే పై ప్రశ్నకు సమాధానం.



6. ఇంటింటా క్యాలెండరు పథకం

ఏసంవత్సరమో జ్ఞాపకం లేదుగాని షుమారు 1982 డిసెంబరు నెలలో ఒక రోజు నేను, శ్రీ ఆర్. ఎమ్. మెహనరావుగారు యిరువురమూ జిల్లెళ్ళమూడికి అమ్మ దర్శనార్థమై వెళ్లి గుంటూరుకు తిరుగు ప్రయాణానికి సిద్ధమవుచుండగా అమ్మ మమ్మల్నిద్దరినీ రమ్మంటున్నదని ఒక సోదరుడొచ్చి చెప్పాడు. అమ్మయున్న గదికి వెళ్లడానికి మెట్లెక్కుచుండగా మాకు కబురు తెచ్చిన సోదరుడు మమ్మల్ని అమ్మ పిలవడానికి కారణం చెప్పాడు. అదేమిటంటే విశ్వజననీ పరిషత్ జిల్లెళ్ళమూడి వారు ప్రతియింటికీ కొత్త సంవత్సరం సందర్భంగా అమ్మ క్యాలెండరును పంపించడం ద్వారా అమ్మను గురించి, జిల్లెల్లమూడిలో జరిగే కార్యక్రమాలను గురించి అందరికీ తెలియజెప్పడంతో పాటు పరిషత్‌కు కొంత విరాళాన్ని సేకరించే ఉద్దేశంతో 'ఇంటింటా అమ్మ క్యాలెండరు' పథకాన్ని ప్రారంభించారనీ గుంటూరులో మాతృశ్రీ అధ్యయన పరిషత్ వారికి యిప్పటికే యీ కార్యాన్నప్పజెప్పి యున్నప్పటికీ ఎందువల్లనో ప్రత్యేకంగా మాయిరువురికీ ఈ కార్యాన్ని గురించి చెప్పి కొన్ని క్యాలెండర్లను మాకివ్వడానికి అమ్మ పిలిపించిందని చెప్పాడు. మేము నేరుగా అమ్మ గదికి వెళ్లి అమ్మకు నమస్కరించి కూర్చోగానే అమ్మ తన పాదాల చెంత ప్రక్కగా కూర్చొని యున్న సోదరుని ద్వారా మాకు 50 అమ్మ క్యాలెండర్లు రశీదు పుస్తకాల నిప్పించి మమ్మల్నాశీర్వదించింది. నేను రెండు నిమిషాలచ్చటయుండి అమ్మకు నమస్కరించి సెలవు తీసుకొనేటప్పుడు అమ్మ ప్రసన్న వదనయై నా చేతిలో ఐదుపైసల నాణెమొకటి పెట్టి నన్ను దీవించింది. గుంటూరులో ప్రత్యేకంగా మాయిరువురికీ యీ కార్యాన్నప్పజెప్పడం వెనుక ఏదో పరమార్థం దాగి యుంటుందని నాకనిపించింది. అలాగే నాకు ఐదుపైసల నాణెమివ్వడంలో గూడా ఏదో నిగూఢార్థం దాగి యుంటుందని పించింది.

మేము గుంటూరుకు తిరిగి వెళ్లిన మరునాడే మా ఆఫీసుకు దగ్గరగా ఉన్న చంద్రమౌళీనగర్‌లో క్యాలెండర్ల వితరణ కార్యక్రమాన్ని అమ్మను ప్రార్థించి మొదలు పెట్టాము. ప్రతి యింటికీ వెళ్ళి జిల్లెల్లమూడి అమ్మను గురించి,

జిల్లెల్లమూడిలో జరిగే పలు కార్యక్రమాలను గురించీ, ముఖ్యంగా అన్న, విద్యా వితరణల గురించి వివరించి చెప్పి యింటివారి కొక అమ్మ క్యాలెండరును ప్రసాదించి, వారికి తోచిన విరాళమివ్వవలసిందిగాను, వీలైనచో జిల్లెలమూడి అమ్మనొకసారి దర్శించుకోవలసిందిగాను అభ్యర్థించేవారము. వారు తాము స్పందించిన తీరును బట్టి అమ్మ ప్రేరణాను సారంగా రెండు రూపాయలు మొదలుకొని ఇరవై రూపాయల వరకు విరాళమిచ్చేవారు. విచిత్రంగా వారు సరాసరిన ఒక్కొక్కరు ఐదు రూపాయలిచ్చారు. అప్పుడు నాకు అమ్మయిచ్చిన ఐదు పైసల నాణెం యొక్క పరమార్థము అర్ధమయింది. వారిచ్చిన సరాసరి పైకము అమ్మ నాకిచ్చిన ఐదుపైసలకు వందరెట్లన్నమాట. దీనర్థం భగవంతునికి మనము చేసే నిస్వార్థ సేవకు వందరెట్ల ఫలితముంటుందని. విరాళాల సేకరణకై మేము ప్రతి యింటికీ తిరిగే క్రమంలో కొందరు సౌమ్యంగా స్వాగతిస్తే మరికొందరు తిరస్కార భావంతో చూశారు. ఇంకొందరు అమ్మలు, బాబాల మీద మాకు నమ్మకంలేదని దూషణగా మాట్లాడిన వారుకూడా లేకపోలేదు. ఇది అమ్మ కార్యం గాబట్టి నేను వారి ఆదరతిరస్కారాలను, దూషణభూషణలనూ సమదృష్టితో చూశాను. అమ్మ మాతోనేయుండి మమ్ము నడిపిస్తున్న, విభిన్న అనుభవాలను ప్రసాదిస్తున్న అనుభూతి చెందాను. అమ్మ క్యాలెండర్లను గ్రహించినవారిని అదృష్టవంతులుగా, అమ్మ క్యాలెండర్లను తిరస్కరించిన వారిని అమ్మను వారి యింటికి ఆహ్వానించే తరణమింకా రాలేదన్న భావనతో చూశాను. ఐతే నాతోపాటు యున్న మోహనరావుగారు మాత్రము ఎవరైనా క్యాలెండరును తిరస్కరిస్తే లేక దూషణగా మాట్లాడితే తట్టుకోలేక న్యూనతాభావంతో కలత చెందేవారు. అప్పుడు నేను వారితో అమ్మమనకు సమతా భావాన్ని నేర్పడానికే ప్రత్యేకించి మనకీ కార్యాన్నప్పజెప్పిందనీ, ప్రతిదానినీ అంటే ఆదరణ, తిరస్కారాలను రెండింటినీ అమ్మ పాదాలకే సమర్పించుకోవాలనీ ప్రశాంతంగా ఉండాలనీ చెప్పి వారి నూరడించాను. ఇలా వారిని ఊరడించిన తర్వాత కూడా రెండు మూడిళ్ళలో మాకు తిరస్కారమే ఎదురైంది. అప్పటికి భోజన సమయమయినందున తాత్కాలికంగా ఆ కార్యక్రమాన్ని ఆపి మా భోజనాలైన తర్వాత మొదలుపెట్టాము. రెండు మూడిళ్ళలో క్యాలెండర్ల వితరణ గావించిన

తర్వాత ఒకడాబాపై మేడలో ఉన్నపోర్షన్‌కు వెళ్లాము. ఆ యింటియజమానురాలికి మేము అమ్మ క్యాలెండరు నిచ్చి విషయము చెప్పగానే ఆమె అమ్మే వారింటికి వచ్చినంతగా సంబరపడి మమ్మల్నాదరించి తాను విరాళమివ్వడమే గాక తన యింటి చుట్టుప్రక్కల ఉన్న ఏడెనిమిది యిళ్ళకు ఆమె మాతో స్వయంగా వచ్చి విరాళాలు సేకరించి పెట్టారు. విషయమేమిటంటే ఆమె కూడా తరచుగా జిల్లెల్లమూడికి వచ్చే సోదరియని తర్వాత తెలిసినది. అప్పుడు మోహనరావుగారి ఆనందాని కవధులే లేకపోయాయి. ఎందుకంటే అమ్మ కృప ఎప్పుడెలా పనిచేస్తుందో వారికవగతమయింది. మా కివ్వబడిన అన్ని క్యాలెండర్లనూ వితరణగావించిన పిమ్మట మేము సేకరించిన విరాళాలకు చెందిన పైకాన్నీ, రశీదు పుస్తకాలనూ జిల్లెల్లమూడికి వెళ్ళి విశ్వజననీ పరిషత్ కార్యాలయములో అందజేసాను.

అమ్మ మనకు అప్పజెప్పే ప్రతీకార్యము వెనుక ఏదోఒక పరమార్థముంటుందన్న విషయం, తద్వారా మనము సంస్కరించబడడమో లేక ఉద్ధరించబడడమో జరుగుతుందన్న విషయం జిల్లెల్లమూడికి వచ్చే సోదరీ సోదరులందరకూ అనుభవమే.



7. అమ్మతో మౌన సంభాషణం

నే నెప్పుడు అమ్మ దగ్గరకు వెళ్ళినా అమ్మ దర్శన సమయంలో నేను ధ్యానమగ్నుంకావడానికి వీలుగా అమ్మ గదిలో అమ్మ కెదురుగా గోడవెంబడి ఎవరికీ యిబ్బంది కలుగని రీతిలో ఏదోయొకచోట కూర్చొని అమ్మను చూస్తూ అమ్మతో యితర సోదరీ సోదరులు జరిపే సంభాషణలను వింటూండేవాడిని. అమ్మ దగ్గర ఎంత సేపున్నా సమయమే తెలిసేదికాదు. శాంత్యానందములతో నా ఒళ్ళు పులకరించి పోయేది. నేను అమ్మతో సంభాషించిన సందర్భాలు చాలా తక్కువ. నాకు సమస్య లేవైనా వుంటే వాటికి పరిష్కారము అమ్మ యితరులతో చేసే సంభాషణల్లోనే లభించేది. ఒక్కొక్కసారి అమ్మ యితరులతో మాట్లాడుతూ మధ్యలో నావైపు చూచేది. అప్పుడు నేను ధ్యాసపెట్టి అమ్మవారితో మాట్లాడే మాటలను వినేవాడిని. వాటిలో నాకు నా సమస్యకు పరిష్కారము లభించేది. నాకొచ్చిన కొన్ని ఆధ్యాత్మిక సందేహాలకు కూడా నేను ప్రత్యేకించి అడక్కుండానే అమ్మ చూపుల్లో మాటల్లో సమాధానాలు లభించేవి. ఒక్కొక్కసారి నాలోనే భావపరంపరమొదలై. విశ్లేషణాత్మక సమాధానాలు నా మదిలోనే లభించేవి.అమ్మ భావనా ప్రదాత గదా! ఒక్కొక్కసారి అమ్మ తన చూపుల్తోనే అన్న పూర్ణాలయంలో భోజనంచేసి వస్తున్నావుగదా యని నన్ను పలుకరించడంగానీ లేక భోజనం చేసిరమ్మని సూచించడంగానీ చేసేది. అమ్మ సన్నిధిలో నిశ్చల నీరవతా స్థితి చేకూరి ప్రశాంత మనస్కుడ నయ్యేవాడిని.

1978లో నేను గుంటూరు కన్నావారితోటయందు శ్రీమాతారవిందుల కేంద్రంలో ఉంటూ శ్రీమాతారవిందుల గ్రంధాలను కొన్నింటిని చదువుతుండేవాడిని. శ్రీమాత ఫోటోదగ్గర రోజూ కొంతసేపు ధ్యానంలో గడిపేవాడిని. ధ్యానం చేసే సమయంలో నాకొకసారి శ్రీమాతరూపాన్ని ధ్యానం చేయాలా లేక జిల్లెల్లమూడి అమ్మ రూపాన్ని ధ్యానించాలా అన్న సందేహం

కలిగింది. ఎవరిని ప్రార్థించినా లేక ధ్యానించినా తనను ప్రార్థించినట్లే లేక ధ్యానించినట్లే నని అమ్మ చెప్పియుండి నప్పటికీ,

శ్రీమాత జిల్లెళ్ళమూడి అమ్మ యీ యిద్దరి రూపాలలో నేను దేనిని ధ్యానించినా ఆనందమయుడనగుచున్నప్పటికీ నామనస్సులో ఏదో కొంత అస్థిరత చోటు చేసుకున్నది. ఒకసారి నేనీ సందేహాన్ని జిల్లెళ్ళమూడిలో అమ్మ సమక్షంలో నామనస్సునందే అమ్మకు నివేదించాను. అప్పుడు వెంటనే అమ్మనాకు ప్రసాదించిన భావపరంపర యీ విధంగా ఉన్నది. అమ్మ నామం "జయహోమాతా శ్రీ అనసూయా రాజరాజేశ్వరి శ్రీపరాత్పరి" శ్రీమాత నామం "ఓం ఆనందమయి చైతన్యమయి సత్యమయి పరమే" ఈ రెండు నామాలకు సారూప్యతను నాకు స్ఫురింపజేసి నేనే నామాన్ని చేసినా, నేనే రూపాన్ని ధ్యానించినా ఒకటే ననీ, తనకే చెందగలవనీ తన ప్రసన్న దృక్కులతో నన్ను కరుణించిన తీరును నేనెన్నటికీ మరువలేను. అప్పుడు నా సందిగ్ధత తొలగి నామనసు ప్రశాంతత గాంచినది. రెండు నామాల సారూప్యత నాకు క్రింది విధంగా స్ఫురించింది.

'జయహోమాతా' అన్న అమ్మకు పిలుపు శ్రీమాత నామంలోని 'ఓం' కారమూ ఒకటే. అసూయలేనిది, ద్వంద్వాలకతీతమైనదే 'అనసూయ' తత్త్వము. అదే ఆనందకరము. కనుక 'శ్రీ అనసూయ' అన్న అమ్మ నామానికి 'ఆనందమయి' అన్న శ్రీమాత నామానికి పోలిక యున్నది. చైతన్యవంతమై సర్వాన్నీ అధివసించేదీ, సర్వాన్నీ పరిపాలించేదే 'రాజరాజేశ్వరి' కనుక రాజరాజేశ్వరి అన్నా చైతన్యమయి అన్నా ఒకటే. ఇక ఏది సత్యము, పరమో అదే పరమేశ్వరి.

ఇక్కడ తెలుసుకోవాల్సిందేమిటంటే అన్ని రూపాల్లోనూ యున్న మాతృశక్తి ఒకటేనని లేక అమ్మే అన్ని రూపాల్లోనూ ఉన్నదని.

8. అమ్మను దర్శించిన కొందరు శ్రీమాతారవిందుల భక్తులు

అమ్మను దర్శించిన వారిలో అన్ని మతాలవారూ, అన్ని కులాలవారూ, అన్ని దేశాలవారూ యున్నట్లే, విభిన్న దేవీదేవతల భక్తులూ, అనేక అవతార పురుషుల, గురువుల, మహాత్ముల అనుయాయులూ ఉండేవారు. శిరిడీసాయిబాబా భక్తులు, సత్యసాయి బాబాభక్తులు, కుసుమహరనాధుల భక్తులు, శ్రీరమణ మహర్షి భక్తులు మొదలైన వారుండేవారు. అలాగే నాకు తెలిసిన కొందరు శ్రీమాతారవిందుల అనయాయులు లేక భక్తులు కూడా ఉన్నారు.


మొట్టమొదటగా శ్రీ కే.ఎస్. భాస్కర రావు గారిని గురించి చెప్పుకోవాలి. వీరు ఆ జన్మ బ్రహ్మచారి. అమ్మకు దూరపు బంధువు. గుంటూరు బ్రాడీపేటలో యుంటున్న ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ శ్రీ కేతరాజు నరసింహారావుగారి దాయాది. శ్రీ భాస్కరరావు గారు తన బాల్యమునుండే మంచి సాధకులుగా ఆధ్యాత్మిక మార్గంలో పయినించేవారు. వారు శ్రీమాతారవిందుల వైపు ఆకర్షితులై వారి పూర్ణ యోగాన్ని అనుసరించడమే గాక వారి రచనల నెన్నింటినో తెలుగులోని కనువదించి ఆంధ్రులకు శ్రీ అరవిందుల వెలుగుల నందించారు. ఈ అనువాదాలే గాక వారి కొన్ని స్వంత రచనలు గూడా శ్రీ అరవిందాశ్రమం నుండి వెలువడే తెలుగు మాసపత్రికలు 'అర్క' 'అఖిల'ల్లోనూ, తెనాలి నుండి ప్రచురితమయ్యే త్రైమాస పత్రిక 'దివ్యదీపిక'లోనూ ప్రచురించబడ్డాయి. శ్రీభాస్కరరావుగారు తన సాధనను గురించి తరచుగా జిల్లెళ్ళమూడి అమ్మను సంప్రదించి తన యోగ మార్గంలో ఎంతో ఉన్నతిని పొందారు. వీరు జిల్లెళ్ళమూడి అమ్మ కెంతో ప్రీతి పాత్రులు. వీరు కొంతకాలం శ్రీ అరవిందాశ్రమం, పుదుచ్చేరిలో ఉండి తన సాధనను కొనసాగించారు. తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు సమీపంలో కీ.శే. డాక్టర్ వి. మధుసూదన్ రెడ్డిగారి ద్వారా స్థాపించ బడిన Institute of Human studies అనబడే పాఠశాలలో శ్రీమాతారవిందుల అవశేషాల నుంచిన ఒక గది నిర్వహణలో కొన్ని

సంవత్సరాలు గడిపారు. జిల్లెళ్ళమూడి అమ్మ మందిర ప్రవేశమైన తర్వాత అమ్మ వాత్సల్యాలయానికి ప్రక్కనే నిర్మించిన ధ్యానమందిర పర్యవేక్షకులుగా తన జీవిత పర్యంతమూ సేవ జేసిన ధన్యజీవి భాస్కరరావుగారు.

ఇక పుదుచ్చేరి శ్రీఅరవిందాశ్రమవాసియైన శ్రీ.వి. మన్‌మోహన్ రెడ్డిగారు.(శ్రీమాతారవిందుల భక్తులందరూ వీరిని ప్రేమగా 'దాదా' అని సంబోధిస్తారు). జిల్లెళ్ళమూడి అమ్మను గురించి విని ఆకర్షితులై వీరొక సారి జిల్లెళ్ళమూడికి వచ్చి అమ్మను దర్శించారు. అమ్మను దర్శించి నప్పుడు వీరు అమ్మ ప్రేమామృతంలో తడిసి ముద్దై ఒక పసిపిల్లవానివలె తన కన్నీటి వర్షాన్ని (ఆనంద భాష్పాలను) కురిపించారు. అమ్మ ప్రేమలో అందరూ శిశువులేగదా! మన్‌మోహన్ రెడ్డిగారు వినోబాభావేగారు ప్రారంభించిన భూదాన యజ్ఞానికి పోచంపల్లిలో మొట్టమొదటిగా వంద ఎకరాలను దానం చేసిన శ్రీ వి. రామ చంద్రారెడ్డిగారి ప్రథమ కుమారులు. వీరు కూడా తన తమ్ముడు మరియు పైపేరాలో చెప్పబడిన డా॥వి. మధుసూదన్ రెడ్డి గారి వలెనే హైదరాబాద్‌లో తన తమ్ముని పాఠశాల ప్రక్కనే"Mother's public school" యను పాఠశాలను స్థాపించి హైదరాబాద్ బాల బాలికలకు పూర్ణ విద్యనంద జేస్తున్నారు. ఈ అన్నదమ్ములిద్దరూ శ్రీమాతారవిందులను దర్శించి, సేవించిన అదృష్టవంతులు.

అమ్మ దగ్గరకు అనంతపురం నుండి జట్టి చలపతిరావు అనే సోదరుడు తరచుగా జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మను దర్శించి వెళ్తుండేవారు. వీరు కూడా శ్రీమాతారవిందుల అనుయాయులై అనంతపురంలో శ్రీఅరవింద కేంద్రాన్ని స్థాపించి సేవలందించిన వారే. వీరు జిల్లెళ్ళమూడి అమ్మదగ్గర ఎంత సన్నిహితంగా ఉండేవారంటే అమ్మ వీరి ప్రతికష్టాన్నీ, బాధనీ అడిగి తెలుసుకొని కొన్ని సూచనలను అనుగ్రహించేది. ఒకసారి కష్టాల్లో ఉన్న తన కూతురుకు ఏ సహాయమూ చేయలేకపోతు న్నానని చెప్పి అమ్మ కంట తడిపెట్టినట్లు నేను వారిని కలిసినప్పుడొకసారి వారే స్వయంగా నాతోచెప్పారు. ఇక్కడ అమ్మ చెప్పిన 'విధివ్రాతకు విధికూడ బద్ధుడే' అన్న వాక్యం గుర్తుకు వస్తుంది. చలపతిరావు గారొకసారి జిల్లెళ్ళమూడి అమ్మ యున్న గదిలోకి పోగా అమ్మ

తన మంచంపై కూర్చొని యుండి తన తలపై కొంగు కప్పుకొని ఎవరితోనో మాట్లాడుతున్నట్లు మాట్లాడుచుండినది. ఎవరితో మాట్లాడు చున్నావని వారు అమ్మనడుగగా పుదుచ్చేరిలోని శ్రీమాతతోయని సమాధానమిచ్చినట్లు వారు నాకొక సందర్భంలో చెప్పారు. అమ్మే చెప్పింది గదా 'ఆధ్యాత్మిక శక్తికి దూరదర్శన, శ్రవణాదులు అత్యల్పాల'ని గుంటూరు శ్రీఅరవింద సొసైటీ కేంద్రము ఫౌండరు సెక్రటరీ మరియు గుంటూరు కన్నావారితోటయందు ప్రముఖ వైద్యులుగా యుండిన ముక్కామల అమరేశ్వరరావు గారి అల్లుడూ యైన శ్రీబసవరాజు హరికిషన్‌రావుగారు కూడా జిల్లెళ్ళమూడి అమ్మను దర్శించిన వారిలో ఒకరు. నేను అమ్మదగ్గరకు రావడానికి ప్రేరణ నిచ్చిన కర్నూలు వాస్తవ్యులు శ్రీ పి.ఎ. జానకీ పతిగారు తరచుగా జిల్లెళ్ళమూడి వచ్చేవారు. ఇలా యింకెందరో శ్రీమాతారవిందుల భక్తులు జిల్లెళ్ళమూడి అమ్మను దర్శించి పునీతులైనారు.



9. ఇంద్రియ నిగ్రహం

మంచీ- చెడులను వివేచనచేయు శక్తిని అమ్మ మనకు ప్రసాదించింది. మంచి దారిలో నడచిన మంచి పలితములను, చెడుదారిలో నడచిన చెడు ఫలితములను అనివార్యముగా అనుభవింప వలసి వస్తుంది. కామక్రోధాది అరిషడ్వర్గములకు చెందిన ప్రవృత్తులు మనలో ప్రకోపించినప్పుడు చెడుగా ఆలోచించడంగానీ, చెడుగా ప్రవర్తించిడం గానీ జరుగుతుంటుంది. అయితే అలాంటి పరిస్థితుల్లో మనము పశ్చాత్తాప తప్తులమై నిష్కపటంగా అమ్మకు హృదయమందే తెలియజేసి మనల్ని అలాంటి ప్రవృత్తుల నుండి రక్షించమని అమ్మపాదాల నాశ్రయిస్తే మనలనెలా వాటి నుండి కాపాడుతుందో చెడు పరిణామాన్ని కూడా ఎలా తప్పిస్తుందో మనలనెలా సంస్కరిస్తుందో తెలియజెప్పే సంఘటన యిది.

అది 1977 వ సంవత్సరం మే నెల. అప్పటికి నాకు వివాహం కాలేదు. అప్పుడు నేను గుంటూరులో అరండల్‌పేట 16వ లైనులో ఒకడాబాపైన ఉండిన రెండు అద్దె గదుల్లో ఒక దానిలో నా స్నేహితుడొకరితో కలిసి అద్దెకుండేవాడిని. నేనున్న డాబాకు ప్రక్కనే యున్న డాబాపైన కూడా అద్దెకివ్వబడిన రెండు గదులుండినవి. ఇరు డాబాల అద్దెగదుల ముందు ఖాళీ ప్రదేశముండి ఒకడాబాపైనుండి ప్రక్కడాబాపైకి సులువుగా వెళ్ళిరావడానికి అనుకూలంగా యుండినది. ప్రక్కడాబాపై యున్నరెండు గదుల్లో ఒక దానిలో మా ఆఫీసులో పనిచేస్తున్న జానకీపతిగారు అద్దెకుండేవారు. మరొక గదిలో ఒక భార్యాభర్తల జంట వారి ఒక సంవత్సరం వయసున్నపాపతో యుండేవారు. నేను తరచుగా జానకీపతిగారి గదికి వెళ్ళివస్తుండేవాడిని. సాధారణంగా నా నిగ్రహాన్ని కోల్పోని నేను ఒకరోజు జానకీపతిగారి గదిలో ఒంటరిగా యున్నాను. నేను గది బయటికి వచ్చినప్పుడు ప్రక్కగదిలోయుంటున్న స్త్రీ కూడా బయటకు వచ్చి యున్నది. నేనాయెను చూడగా ఆకర్షితుడనై నాలో కామవాసనలు పెల్లుబుక సాగినవి. ఇంద్రియ ప్రకోపంవల్ల , బుద్ధి వక్రించడంవల్ల నా అంతరాత్మ నన్ను వారిస్తున్నా, అమ్మ నన్ను గమనిస్తూనే యున్నదని తోచినా నేను దురుద్దేశంతో ఆమెకు కనుపైగ చేశాను. అది ఆమె గమనించిందో లేదో

తెలియదు (ఎందుకంటే ఆమె నుండి ఎలాంటి ప్రతిక్రియాలేదు) గానీ నాలో ఏదో తెలియని దడ, భయం మొదలయినవి. ఆమె యీ విషయాన్ని తన భర్తకు చెప్పినచో ఎలాంటి ప్రమాదము వాటిల్లగలదో యన్న బెంగ మొదలయినది. నేను చేసేది తప్పని తెలిసీ ఎలా చేయగలిగానని నన్ను నేను నిందించు కున్నాను. నాకు ఇంద్రియ నిగ్రహాన్ని ప్రసాదించమనీ, చెడు తలంపులు రాకుండా నన్ను కాపాడమనీ, ఆరోజు జరిగిన పొరపాటుకు నన్ను మన్నించి నాకే ప్రమాదమూ రాకుండా కాపాడమనీ కన్నీళ్ళ పర్యంతమూ అమ్మను మనసులోనే వేడుకున్నాను. ఆరోజంతా పశ్చాత్తాపంతోనే గడిపాను. మరుసటిరోజు మాకు సెలవుదినం. ఆరోజున మధ్యాహ్నం నాలుగు గంటల వరకూ నేను నా గదిలోనే యున్నాను. ఆసమయంలో నన్నేదో భయమావహించింది. అమ్మను ప్రార్థించగా వెంటనే అరండల్‌పేట 7వలైనులోయున్న శిరిడీ సాయిబాబా మందిరానికి వెళ్లవలసిందిగా ప్రేరణను కలిగించింది. ఆలస్యం చేయకుండా నా గది నుండి బయలుదేరి కాలినడకన పది నిమిషాల్లో బాబా మందిరాన్ని చేరుకున్నాను. ఈ మందిరం ప్రత్యేకత ఏమిటంటే ఈ మందిర శంకుస్థాపనను అవతార్ మెహర్‌బాబాగారు చేశారు. ఎందరో అవతార పురుషులు, మహాత్ములు అడుగిడిన పవిత్ర మందిరమిది. జిల్లెళ్ళమూడి అమ్మకూడా ఈ మందిరానికి ఒకసారి వచ్చి వెళ్లారని తెలిసినది. నేను గుంటూరులో ఉన్నప్పుడు తరచుగా యీ మందిరానికి వెళ్లివచ్చే వాడిని. ఈ మందిరంలో అడుగిడిన వారెవరైనా ప్రశాంతతను, అవ్యక్త ఆధ్యాత్మిక తరంగాల తాకిడిని, తన్మయత్వాన్ని అనుభ వించగలరు. ఆరోజు అమ్మ ప్రేరణతో యీ మందిరాన్ని చేరుకున్న నేను శిరిడీ సాయి నాథునికి మూడు ప్రదక్షిణలు చేసి మందిర లోపలి భాగంలో ఈశాన్యమూలన కూర్చొని క్రితమురోజు నేను చేసిన, చేయాలనుకున్న తప్పిదాలకు చింతిస్తూ పశ్చాత్తాప హృదయంతో అమ్మపాదాల చెంత పూర్తి శరణాగతుడవై, నన్ను నేను అమ్మకు అర్పించుకుంటూ కన్నీరు మున్నీరయ్యాను. దాదాపు రెండు గంటలసేపు నేనా మందిరంలో గడుపగా నాలోని అలజడి, భయము దూరమై నాహృదయం తేలికపండింది. ఏమి జరిగినా జరుగుతున్నా అంతా అమ్మ సంకల్పమేననీ, అమ్మ నా వెంటే ఉన్నది గనుక నేను దేనికీ భయపడ నవసరము లేదనీ ధైర్యము కలిగింది.

అప్పుడు నేను మందిరాన్నుండి బయలుదేరి సాయంత్రం 7గం॥ల ప్రాంతంలో నాగదికి చేరుకున్నాను. అప్పుడు అచ్చట నాకొరకే ఎదురు చూస్తున్న జానకీపతిగారి ద్వారా నాకు తెలిసిందేమిటంటే నేను బాబా మందిరానికి వెళ్లిన కొద్దిసేపటికి జానకీపతిగారి ప్రక్కగదిలో యుంటున్న స్త్రీ భర్త నన్ను కొట్టించడానికని కొంతమంది మనుషులను తీసుకువచ్చాడట. ఆ సమయానికి నేను లేకపోవడం, వారేదో పొరబడి యుంటారనీ, నేను చాలా మంచివాడిననీ, నావల్ల వారికెలాంటి హానీ కలుగదనీ జానకీపతిగారు వారికి నచ్చజెప్పగా వారు శాంతించి వెళ్లిపోయారట. ఈ విషయం తెలుసుకున్న నేను ఆశ్చర్యచకితుడనై నాహృదయంలోని కల్మషాన్ని, భయాన్ని తొలగించి నన్ను కాపాడిన అమ్మకు నాహృదయమందే కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే పైకి మనమెంత మంచివారిగా ఉన్నా మన లోలోతుల్లో కొన్ని చెడు సంస్కారాలు దాగియుంటాయి. అవి వైదొలగాలంటే మనలోని చీకటి కోణాలపై దివ్యమైన వెలుగు ప్రసరింపబడాలి. అలా జరిగి మనముద్ధరించబడటానికి మనకు అవతారపురుషులు, మహాత్ముల సంస్పర్శ చాలా అవసరం. జిల్లెల్లమూడి అమ్మ పాదాల అండ నాకు లభించడం నా అదృష్టం.

పైన నేను పేర్కొన్న సంఘటనతో నాకు మూడు విషయాలు తెలిసినవి.

1. మనలో మనకు తెలియకుండానే దాగియున్న చెడు సంస్కారాలనూ, మన అహంకారాన్నీ సందర్భాను సారంగా పైకి రప్పించి వాటినెలా అమ్మ మననుండి దూరంచేస్తుందన్నది.
2. సర్వశక్తిమయి, పరాత్పరియైన అమ్మపైన పూర్ణ విశ్వాసముంచిన యెడల మనము సునాయాసంగా దివ్యపథాన నడవగలమనీ, మనకొచ్చే అన్ని ఆటంకాలను అమ్మరక్షణవల్ల సులభంగా ఎదుర్కోగలమని.
3. పై సంఘటన జరుగకముందు వివాహమన్నది ఆధ్యాత్మికమార్గానికి ఆటంకమవుతుందేమోనన్న సందేహం నన్ను పీడించేది.

అందువల్ల వివాహం విషయంలో ఒకదృఢ నిర్ణయానికి రాలేదు. కానీ పై సంఘటన నేను వివాహము చేసుకోవాలని దృఢంగా నిశ్చయించుకోవడానికి తోడ్పడింది.

10. అమ్మ కుదిర్చిన వివాహం.

వెనుకటి అధ్యాయంలో చెప్పబడిన సంఘటనకు ముందు వివాహం విషయంలో నేనొక దృఢనిర్ణయానికి రాకుండటచేతనేమో నా కొచ్చిన సంబంధాలన్నీ ఏదోయొక కారణంతో మధ్యలోనే ఆగిపోయేవి. కానీ ఆసంఘటన తర్వాత నాదృక్పథం మారడంవల్ల, అమ్మ చెప్పిన 'పెండ్లి యంటే పెద్దపులికాదు భయపడడానికి,' 'పెండ్లి చేసుకోవడం కోటలో యుండి యుద్ధం చేయడంలాంటిది. పెండ్లిచేసుకోక పోవడం కోట వెలుపల నుండి యుద్ధం చేయడంలాంటిది' మొదలైన వాక్యాల ప్రభావంవల్ల నేను పెండ్లి చేసుకోవడానికి దృఢంగా నిశ్చయించుకున్నాను. అయినాసరే అమ్మను స్వయంగా అడిగి వివవాహ ప్రయాత్నాలు మొదలు పెట్టాలను కున్నాను.

1978 మార్చి నెలలో ఒకరోజు నేను శ్రీజానకీపతిగారితో కలిసి జిల్లెళ్ళమూడి వెళ్లాను. అమ్మ దర్శన సమయంలో మేమిద్దరమూ అమ్మ గదికి వెళ్ళి అమ్మకు దగ్గరగా కూర్చున్నాము. కొంతసేపైన తర్వాత అమ్మనన్ను దగ్గరకు పిలిచి ఏమడగదలచుకున్నావని ప్రశ్నించింది. నేను కొద్దిగా సంకోచిస్తుంటే నా వివాహ ప్రయత్నాల విషయమై జానకీపతిగారు అమ్మకు చెప్పబోయారు. అప్పుడు అమ్మ వారితో 'ఏదైనా అడగాలనుకుంటే వాడినే అడుగనివ్వు, మధ్యలో నీవెందుకు' అన్నది. అప్పుడు నేను అమ్మతో నా వివాహము అమ్మ యిష్టాప్రకారమే జరగాలని కోరుకుంటున్నట్లు చెప్పాను అప్పుడు అమ్మ నాతో 'జరిగేది అమ్మ ఇచ్ఛప్రకారమేనని తెలుసుకో' అన్నది. అప్పుడు నేను అమ్మకృప నాకెల్లప్పుడూ ఉండాలని కోరుకున్నాను. అప్పుడు అమ్మ 'అమ్మ కృప ఎల్లప్పుడూ ఉన్నది' అన్నది. దీనితో నేను సంతృప్తిజెంది అమ్మ పాదాలకు నమస్కరించి అమ్మ దగ్గర సెలవు తీసుకొని గుంటూరుకు తిరుగు ప్రయాణమై వెళ్లాను. నేను జిల్లెళ్ళమూడికి అమ్మ దగ్గరకు వెళ్లివచ్చిన రెండు మూడు రోజుల తర్వాత నాకు మా స్వగ్రామమునుండి మానాన్నగారు వ్రాసిన ఉత్తరమొకటి వచ్చింది. అందులో నేను కోరిన గుణాలు కలిగిన అమ్మాయినొకరిని తాము చూశామనీ, వెంటనే వచ్చి ఆ అమ్మాయిని చూచి నా నిర్ణయాన్ని తెలియజేయాలని

మానాన్నగారు వ్రాశారు. ఆ ఉత్తరం చూడగానే అది అమ్మ సంకల్పంగా తోచింది. నేనామరురోజే ప్రకాశం జిల్లాలోని మా స్వగ్రామమైన తురిమెళ్లకు బయలుదేరి వెళ్లడం, మా గ్రామానికి సమీపగ్రామమైన రాచర్లకు వెళ్లి అమ్మాయిని చూచి నా ఆమోదాన్ని తెలియజేయడం, ఆ అమ్మాయితో నా వివాహం నిశ్చయమై 1978 మే నెల 28వ తేదీన ఆ అమ్మాయి అంటే సరోజినీదేవి తో నా వివాహం జరగడం వెంటవెంటనే జరిగిపోయాయి.

నా వివాహాన్ని ఎప్పటికప్పుడు ఏదోయొక కారణం చూపి వాయిదాలు వేస్తూవస్తూయుండిన నాకు వివాహమౌతుందో కాదో యని సంశయిస్తూ యుండిన మాతల్లిదండ్రులు నాకు వివాహమైనందుల కెంతో సంతోషించారు.

'అమ్మ కృప ఎల్లప్పుడూ ఉన్నది' అన్న అమ్మ వాక్యం అక్షర సత్యం, నిత్య నూతనం.



11. నాకు పుత్ర సంతాన ప్రాప్తి

1979 అక్టోబరులో మాకు చక్కటి పుత్రుడు జన్మించాడు. మేమెంతో సంతోషించాము. కానీ పుట్టినప్పటి నుండీ తరచుగా అనారోగ్యానికి గురయ్యేవాడు. 1980 జనవరిలో అతి విరోచనాలవల్ల డీహైడ్రేషన్‌కు గురవగా సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పించాము. సెలైన్, మందులు యిస్తున్నప్పటికీ నెమ్మదించక రోజురోజుకూ పరిస్థితి దిగజారు చుండినది. అప్పుడు నేను రోజూ అమ్మను ప్రార్థించేవాడిని. అమ్మను ప్రార్థించిన ప్రతిసారీ హృదయంలోని అలజడి కొంత తగ్గినప్పటికీ సకారాత్మక సమాధానమేదీ నా కందేది గాదు. ఏమి జరిగినా ఎదుర్కోవాలన్న సందేశమేదో అమ్మ నాకిచ్చినట్లనిపించేది. ఆఖరుకు పిల్లవాడు మాకు దక్కలేదు.

1980 డిసెంబరు. 16వ తేదిన మాకు పుత్రిక జన్మించింది. అప్పటినుండి మూడు సంవత్సరాలు గడచిన తర్వాత మాకు పుత్రసంతానంకూడా వుంటే బాగుండుననే కోరిక కలిగింది. ఐతే మా కోరికను అమ్మకు నివేదించడంగానీ, అమ్మను ప్రార్థించడంగానీ మేము చేయలేదు. అమ్మ సర్వజ్ఞకదా! 1984 మార్చినెల మొదటి వారంలో మేము జిల్లెళ్ళమూడికి అమ్మదగ్గరకు వెళ్లినప్పుడు అమ్మ మాపాపను దగ్గరకు తీసుకుని 'నిన్నెవరైనా అడిగితే తమ్ముడు కావాలని చెప్పాలి' అని తనకు చెప్పింది. విషయమేమిటంటే అంతకుముందు మా పాపతో ఎవరైనా తమ్ముడుకావాలాయని అడిగితే వద్దని సమాధాన మిచ్చేది. ఇక మేము అమ్మ దగ్గర సెలవు తీసుకొని గుంటూరుకు బయలుదేరేటప్పుడు అమ్మ నా భార్యకు తెల్లచీరను ఒకదానిని ప్రసాదించి నీకీసారి కుమారుడు కలుగుతాడని చెప్పి బొట్టుపెట్టి దీవించి కుంకుమ పొట్లాలను గూడా అనుగ్రహించింది. మేము గుంటూరుకు తిరిగి వచ్చిన పది రోజుల్లోనే నా భార్య గర్భము దాల్చినది. అప్పటి నుండి మూడు నెలలు గడచిన తర్వాత ఒకరోజు నా భార్యకొక సందేహమొచ్చింది. అమ్మ చెప్పినట్లుగా మాకు పుత్రుడే జన్మించగలడా? యన్నదే ఆ సందేహం. అప్పుడు నేను అమ్మ చెప్పిన వాక్యమైన 'ఇది తోలునోరుగాదు తాలుమాట రావడానికి' అన్నదానిని గుర్తుచేసి ఎలాంటి సందేహమూ పెట్టుకోవద్దని చెప్పాను. ఇది జరిగిన నాలుగైదు రోజుల తర్వాత ఒకరోజు సాయంత్రం నేను అరండల్‌పేట

7వ లైనులో ఉన్న శిరిడీసాయి బాబా మందిరానికి వెళ్ళి అచ్చట లోపల గోడవెంబడి ఒక మూలగా కూర్చొని కాసేపు ధ్యానము చేసుకున్నాను. తర్వాత బాబాకు మ్రొక్కి ఇంటికి తిరిగి వెళ్లడానికి బయలుదేరే సమయంలో నన్నొక పెద్దాయన తన దగ్గరకు పిలిచి 'జిల్లెళ్ళమూడి అమ్మ మీకీ సారి అబ్బాయే కలుగుతాడని నన్ను మీకు చెప్పమంటున్నది' అన్నారు. ఆయనెవరో నాకు తెలియదు, నేనెవరో ఆయనకు తెలియదు గాబట్టి నేనాశ్చర్యపోయి ఆయనెవరన్నది అడిగి తెలుసుకున్నాను. భారీకాయుడూ, స్ఫురద్రూపీ, శాంతస్వభావులూ, చూడగానే నమస్కరించాలనిపించే ఆయన పేరు కాకొల్లు వెంకటస్వామి. నెల్లూరుకు దగ్గర్లో కాకొల్లు అనే ఒక కుగ్రామం వారి స్వస్థలం. ఇదివరలో గుంటూరు అరండల్‌పేటలో యొక లాడ్జీ నిర్వహించేవారట. కానీ కొంతకాలానికది మూతపడిందట. ఆయన శిరిడీ సాయిబాబా భక్తులేగాక తరచుగా జిల్లెళ్ళమూడి అమ్మను దర్శించేవారట. ఈ వివరాలన్నీ తెలుసుకున్న తర్వాత నేను మాయింటికి రావలసిందిగా వారి నాహ్వానించగా వారప్పుడు రాలేననీ తర్వాత ఎప్పుడైనా రాగలననీ నాతోచెప్పి మాయింటి చిరునామా తీసుకున్నారు. నేను వారి నుండి సెలవు తీసుకొని మాయింటికి వెళ్లగానే సాయిబాబా మందిరంలో జరిగిన వృత్తాంతాన్నంతా నాభార్యకు వివరించిచెప్పి తన సందేహాన్ని పూర్తిగా తొలగించ గలిగాను.


కాకొల్లు వెంకటస్వామిగారు తాను చెప్పినట్లుగానే ఒక వారంరోజుల తర్వాత ఒకరోజు మధ్యాహ్నం వేళ మాయింటికి వచ్చారు. వారొచ్చిన సమయానికి నేను మా ఆఫీసులో యుండడంచేత మాయింట్లో భోజనం చేసి విశ్రమించారు. వారొచ్చిన విషయం నాభార్యద్వారా తెలుసుకున్న నేను వెంటనే మాఆఫీసునుండి బయలుదేరి యిల్లుచేరుకున్నాను. నేను యింటికి చేరుకున్న తర్వాత వారు మాతో కాసేపు గడిపి వెళ్లిపోయారు. ఇక అంతే అటు తర్వాత మేమిద్దరమూ ఎప్పుడూ, ఎక్కడా కలువలేకపోయాము. వారు మాతో గడిపిన ఆ కొద్ది సమయంలోనే వారు జిల్లెళ్ళమూడి అమ్మను గురించి ఎన్నో ఆసక్తికర ఆధ్యాత్మిక విషయాలు చెప్పి మా అన్ని సందేహాలనూ తీర్చి వెళ్లారు.

అమ్మ ఆశీస్సులతో అమ్మ చెప్పినట్లుగానే, కాకొల్లు వెంకటస్వామిగారు నిర్ధారించి నట్లుగానే **1984** డిసెంబరు **21**వ తేదీన మాకు పుత్ర సంతానం కలిగింది. అప్పుడు మేము గుంటూరులో కొరెటిపాడునందు నివసించేవారము.

12. మా అబ్బాయికి నామకరణం

అది 1985వ సంవత్సరం మార్చినెల రెండోవారం. తేదీ జ్ఞాపకం లేదు గానీ ఆరోజు ఆదివారం. మా అబ్బాయి అమ్మ ఆశీస్సులతో పుట్టినందువల్ల అమ్మతోనే వాడికి పేరు పెట్టిస్తే బాగుంటుందనుకొని ఆరోజు నేను, నాభార్య, మాపాప, హైదరాబాద్‌నుండి గుంటూరుకు మాదగ్గరకు వచ్చియుండిన మా అత్తయ్య మీనాక్షమ్మగారు జిలెళ్ళమూడికి బయలుదేరాము. వెళ్లేదారిలో బాపట్లలో నాకేమని పించిందంటే మా నాన్నగారు హిందీ పండితునిగా ఉన్నప్పు డెందరికో శిక్షణనిచ్చి వారిని పండితులను గావించిన వారైనందున, నేను కూడా హిందీభాషాభిమాని నైనందువల్ల హిందీ సాహిత్యకారుల పేర్లలో ఏదైనా పేరు పెడితే బాగుంటుందని.ఐతే అమ్మతో పేరుపెట్టించాలనుకొని బయలుదేరి మధ్యలో యిలా భావించడం తగదనుకొని నా ఆలోచనలను అణచివేశాను. అదే సమయంలో నాభార్య ఏమనుకుందంటే మాఅబ్బాయి అమావాస్యరోజు పుట్టాడు గనుక ఏదైనా వెలుగుతో ముడిపడిన పేరైతే బాగుంటుందని.ఐతే తనుకూడా అమ్మదగ్గరకు తీసుకువెళుతూ మధ్యలో తా నీవిధంగా ఆలోచించడం తగదనుకొని తన ఆలోచనల నణచివేసింది. బాపట్లనుండి మేము జిల్లెళ్ళమూడి వెళ్ళగానే అన్నపూర్ణాలయంలో ప్రసాదం స్వీకరించి అమ్మదర్శనానికై వాత్సల్యాలయానికి వెళ్లాము. అప్పుడు అమ్మగదిలో ఎక్కువమంది లేరు. మేము అమ్మకు దగ్గరగా కూర్చున్నాము. అమ్మ మమ్మల్నందర్నీ చూసి నాభార్యతో ఎండాకాలం గనుక, యిబ్బంది కలుగజేస్తుంది గనుక మా అబ్బాయికి నల్లచొక్కాలు వేయవద్దని సూచించింది. ఎందుకంటే మా అబ్బాయికా సమయంలో నల్ల చొక్కా వేయబడియున్నది.తర్వాత అమ్మ నావైపుచూడగా నేను మాఅబ్బాయికి అమ్మ ఏదో యొక పేరు పెట్టాలని తీసుకువచ్చిన విషయాన్ని తెలియజేయగా అమ్మ 'నీవే పెట్టవచ్చునుగదా?' యన్నది. అప్పుడునేను అమ్మనే పేరు పెట్టవలసిందిగా అర్థించాను. అప్పుడమ్మ వెంటనే నీవు సూర్యుడివి(దినకర్),

వాడు చంద్రుడు 'ప్రేమ్‌చంద్' అన్నది. అమ్మ నేనడిగిన మరుక్షణమే ఈపేరు సూచించింది. అమ్మ నాభార్యతో 'వీడు అమావాస్యరోజున పుట్టాడని ఎందుకు బాధపడతావు, చీకటిని తొలగించడానికి పుట్టిన చంద్రుడనుకో' మన్నది.'ప్రేమ్‌చంద్' అన్నపేరు నాఅభిలాష కనుగుణంగా హిందీసాహితీ జగత్తులో ప్రముఖ కధా మరియు నవలా రచయితగా పేరుగాంచిన మున్షీ ప్రేమ్‌చంద్ గారి పేరైయుండడం అలాగే నాభార్య అభిలాష కనుగుణంగా వెలుగునిచ్చే చంద్రుని పేరైయుండండం మాకు ఆశ్చర్య ఆనందాలను కలుగజేసింది. మా కందరకూ కుంకుమ బొట్లు పెట్టి దీవించగా మేము అమ్మకు నమస్కరించి గుంటూరుకు తిరుగు ప్రయాణ మయ్యాము. అమ్మదగ్గర సెలవు తీసుకునే ముందు అమ్మతో మా అబ్బాయిని జూన్‌మాసంలో అన్నప్రాశనకై అమ్మదగ్గరకు తీసుకురావాలను కుంటున్నట్లు మేము కోరితే అమ్మ ఏ సమాధానమూ యివ్వక మౌనంగా ఉండిపోయింది. సాధారణంగా ఎవరైనా తమ పిల్లల్ని అన్నప్రాశనకు అమ్మ దగ్గరకు తీసుకు వస్తామంటే అమ్మ వెంటనే ఆనందంగా అంగీకరిస్తుంది. కానీ మేమడిగినప్పుడు అమ్మ ఎందుకలా మౌనంగా ఉండిపోయిందో అప్పుడు మాకర్థంకాలేదు. జూన్‌నెలలో అమ్మ ఆలయ ప్రవేశమైన తర్వాతగానీ అప్పటి ఆమె మౌనాని కర్థం మాకు బోధపడలేదు.



13. అమ్మ ఆలయ ప్రవేశమైన రోజు

అది జూన్ 12, 1985. ఆలయ ప్రవేశం చేయడానికి అమ్మ తన పాంచభౌతిక శరీరాన్ని వదిలిన రోజు. దీనికి సరిగ్గా వారం రోజులముందు రాత్రి నిద్రలో స్వప్నంలో అమ్మ ఎంతో నీరసంగా ఉన్నట్లు పాలిపోయిన ముఖంతో దర్శనమిచ్చింది. అయితే అమ్మ కృపాదృష్టిలో ప్రశాంతతలో ఏమీ తేడాలేదు. మరుసటిరోజు ఉదయము 'అమ్మ ఎందుకిలా కనబడింది? అమ్మ శారీరకంగా అస్వస్థులై యుంటుందా? అనుకున్నానే గానీ అమ్మ త్వరలోనే తన శరీరాన్నొదలి ఆలయప్రవేశం చేస్తుందని గ్రహించలేకపోయాను. అందుకే వెంటనే జిల్లెల్లమూడికి వెళ్ళి సశరీరంగా మరొకమారు అమ్మను దర్శించుకొనే భాగ్యాన్ని కోల్పోయాను. అమ్మ నాకిచ్చిన సూచనను గ్రహించలేక పోయినందుకు ఎంతో చింతించాను.

అదే జూన్ 12న అమ్మ ఆశీస్సులతో మాకు జన్మించిన మా అబ్బాయి ప్రేమ్‌చంద్‌కు డిసెంట్రీవల్ల విపరీతంగా విరోచనాలగుచుండుటచే గుంటూరు అరండల్‌పేట 3వ లైనులో ఉన్న నూతలపాటి నాగేశ్వరరావుగారి పిల్లల ఆసుపత్రిలో చేర్పించగా వాడికి సెలైన్, మందుల నెక్కిస్తూ యుండిరి. 13వతేదీ ఉదయానికి కూడా ఏమాత్రమూ తగ్గలేదు.13వతేదీ ఉదయం వార్తాపత్రికల్లో, రెడియోలోనూ జిల్లెళ్ళమూడి అమ్మ తన శరీరాన్ని త్యజించిందన్న వార్తను ప్రకటించడంతో నాకు తెలియగా నేనెంతో ఖిన్నుడ నయ్యాను. వారంరోజుల క్రితమే అమ్మ నాకిచ్చిన సంకేతాన్ని నేనర్థంచేసుకోలేక పోయినందుకు, అమ్మను నేను దర్శించుకొని రాలేక పోయినందుకు ఎంతో బాధపడ్డాను. ఇకనైనా వెంటనే బయలుదేరి జిల్లెల్లమూడి వెళ్లి అమ్మ భౌతిక దేహాన్ని అఖరుసారిగా దర్శించుకొని రావాలన్న తపన నాలో మొదలైంది. ఆసుపత్రిలో మా అబ్బాయి పరిస్థితేమీ మెరుగుపడలేదు. అలాంటి పరిస్థితిలో నా భార్య నొక్కదానినే ఆసుపత్రిలో వదలి వెళ్ళలేను. మరెలా యని వేదన చెందుచుండగా నా భార్య

తనంతటతానే మా అబ్బాయిని తానే చూసుకోగలననీ నన్ను వెంటనే జిల్లెళ్ళమూడికి బయలుదేరి వెళ్ళమనీ ఉదయం గం॥7.30ని. ల సమయంలో అమ్మ యిచ్చిన ప్రేరణతో నాతో చెప్పింది. అప్పుడు యింకేమాత్రము ఆలస్యం చేయకుండా బయలుదేరి జిల్లెల్లమూడికి గం॥10.30ని. సమయమవ్వటికి చేరుకున్నాను. నేను వెళ్ళేటవ్వటికి రాష్ట్రం నలుమూలలనుండి దాదాపు వెయ్యిమందికిపైగా సోదరీ సోదరులచ్చటకి చేరుకొని అమ్మ పార్థివదేహాన్ని దర్శిస్తున్నారు. అమ్మ అనసూయేశ్వరాలయ ప్రవేశానికి అన్ని ఏర్పాట్లూగావించారు. ఆలయ ప్రవేశానికి ముందు అచ్చట ఉన్న సోదరీ సోదరులందరి చేతా అమ్మ దేహానికి క్షీరాభిషేకం చేయించారు. నేను కూడా అమ్మ దేహానికి నమస్కరించి క్షీరాభిషేకం చేశాను. అమ్మ ఆలయ ప్రవేశ కార్యక్రమం మధ్యాహ్నం దాదాపు గం॥1.30ని.లకు పూర్తియింది.అమ్మ ఆలయ ప్రవేశానికి నెలరోజుల ముందు అమ్మ అందరినీ పురమాయించి అనసూయేశ్వరాలయంలో మిగిలిపోయిన గోపుర నిర్మాణాన్ని పూర్తి గావించినట్లు నాకు తెలిసింది.

అమ్మ ఆలయ ప్రవేశమైన తర్వాత అన్నపూర్ణాలయంలో అన్నవితరణ కార్యక్రమం యథావిధిగానే జరిగింది.

అమ్మ భౌతిక రూపాన్ని సజీవంగా యింతకు ముందులాగా దర్శించి, స్పృశించలేము గదా! అని నాహృదయము బరువెక్కింది. అయితే అమ్మ సూక్ష్మ రూపంలో ఉండి అన్ని కార్యక్రమాలూ ఎప్పటిలాగే నిర్వహింపజేస్తున్నదా యనిపించింది. జిల్లెళ్ళమూడిని వదలి రావడానికి మనస్కరించక పోయినా గుంటూరులో మా అబ్బాయి పరిస్థితిని బట్టి నేను తప్పక బయలుదేరాలి గాబట్టి మధ్యాహ్నము 4గంటల సమయంలో జిలెళ్ళమూడిలో బయలుదేరి సాయంత్రం ఏడుగంటల సమయంలో గుంటూరుకు చేరుకున్నాను. గుంటూరు బస్టాండు నుండి నేను నేరుగా అరండల్‌పేటలోని ఆసుపత్రికి వెళ్లాను. విచిత్ర మేమిటంటే నేను జిలెళ్ళమూడికి బయలుదేరి వెళ్లినది మొదలు నేను తిరిగి ఆసుపత్రికి చేరుకునేంతవరకూ మా అబ్బాయికి

మంత్రించినట్లు విరోచనాలు ఆగిపోయినవి. ఐతే నేను ఆసుపత్రిలో అడుగుపెట్టగానే మా అబ్బాయికి విరోచనాలు మళ్ళీ మొదలయినవి. అమ్మలీలలు విచిత్రం. ఆరోజు రాత్రంతా విరోచనాలవుతూనే యుండినవి. తగ్గలేదు. 14వతేదీ ఉదయాన పూర్తిగా అమ్మమీద భారంవేసి ఆసుపత్రినుండి మాఅబ్బాయిని డిశ్చార్జిచేయించి బ్రాడీపేట 2వలైను 9వ అడ్డరోడ్డులో యుంటున్న హోమియోడాక్టర్ చలపతిరావుగారి దగ్గరకు తీసుకువెళ్లి హోమియో వైద్యం చేయించగా విరోచనాలు తగ్గి రెండు మూడు రోజుల్లోనే మా అబ్బాయి కోలుకున్నాడు. అప్పటినుండీ మాపిల్లలిద్దరికీ వైద్యపరమైన ఏ అవసరమొచ్చినా హోమియోవైద్యమే చేయించేవారము.

అనసూయేశ్వరాలయంలోకి అమ్మ ప్రవేశించిన తర్వాత అమ్మ విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు జరుగుచున్న సమయంలో అమ్మ విగ్రహం కూడా హైమవిగ్రహంలాగే పాలరాతిదై యుంటుందనుకున్నాను. విగ్రహ ప్రతిష్ఠకు 15రోజుల ముందు నాకు స్వప్నంలో అనసూయేశ్వరాలయములో అమ్మ విగ్రహము కనిపించింది. కానీ అది నేననుకున్నట్లు పాలరాతి విగ్రహము గాక కృష్ణ శిలతో చేయబడి కాంతులీనుచూ కనపడినది. అమ్మ విగ్రహ ప్రతిష్ఠ రోజున నేను జిల్లెల్లమూడికి వెళ్లలేక పోవుటచే తర్వాత పదిహేను రోజులకు నేను జిల్లెళ్ళమూడి వెళ్లి అనసూయేశ్వరాలయాన్ని దర్శించగా అప్పుడచ్చుట నాకు దర్శన మిచ్చిన అమ్మ విగ్రహం అచ్చం నాకు స్వప్నంలో దర్శనమైన విగ్రహంలాగానే అదికూడా కృష్ణవిగ్రహమైయుండడం నాకు ఆశ్చర్యానందాలను కలుగజేసింది. ఆలయ ప్రవేశానంతరం గూడా అమ్మ తాను శరీరాన్ని ధరించియున్నప్పటివలెనే మనల్ని సర్వత్రా కంటున్నదని, మన వెన్నంటి యున్నదనడానికి ఇదొక నిదర్శనమని నేను భావిస్తాను.




14. ఒక సాధకునికి అమ్మయిచ్చిన సలహా

ఇది 1976 నాటి సంగతి. పేరు జ్ఞాపకంలేదు గానీ ఒకరోజు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇరవై సంవత్సరాల యువకుడొకడు అమ్మను చూడడానికి జిల్లెళ్ళమూడి వచ్చాడు. అతడు అమ్మ దర్శనానికి ముందు వాత్సల్యాలయం ముందున్న వరండాలో నా ప్రక్కనే కూర్చున్నాడు. యదాలాపంగా అతడు నాతో తన ఊరూ, పేరూ, ఏమి చేస్తున్నదీ వివరాలు చెప్పిన తర్వాత తాను యోగా మరియు ఆధ్యాత్మిక సాధన చేస్తున్నాననీ, ఇంద్రియ నిగ్రహాన్ని గలిగి క్రమం తప్పకుండా ధ్యానం కూడా చేస్తున్నాననీ, అయితే అప్పుడప్పుడూ స్వప్నంలో స్కలనమగు చుండుటవల్ల తనకు మనోవికారం గలిగి ఏకాగ్రత దెబ్బతింటున్నదనీ, దానివల్ల తన సాధనకు భంగము వాటిల్లుచున్నదనీ బాధపడతూ చెప్పాడు. నేను తనను ఊరడల్ల జేయుటకై కొన్ని మాటలతనికి చెప్పబోయేంతలో దర్శనమిచ్చుటకై అమ్మ తన గదిలోకి రాగా మేమిరువురమూ వెళ్లి అమ్మకు ఎదురుగా కూర్చున్నాము. ఒకరిద్దరు అమ్మకు పాదవందనం చేసి నిష్క్రమించగానే తర్వాత నా ప్రక్కనే కూర్చొని యున్న ఆ యువకుని అమ్మ తన దగ్గర కూర్చోమన్నది. అతడు అమ్మ దగ్గర కూర్చున్న తర్వాత అమ్మ అతనిని తన సాధనను గురించి కొన్ని సాధారణ ప్రశ్నలడుగగా అతడు సమాధాన మిచ్చాడు. కానీ అతడు నాతో ముచ్చటించిన, తాను బాధపడుచున్న విషయాన్ని అమ్మకు చెప్పడానికి జంకుతున్నాడు. అప్పుడు అమ్మే అతనితో 'నాన్నా! ఒక గిన్నెలో నీరు పోశావనుకో అది నిండుతుంది. అది నిండిన తర్వాత గూడా పోస్తే ఏమవుతుంది? ఒలికి క్రింద పడిపోతుంది. స్కలనము కూడా యిలాంటిదే. కనుక ఆందోళన చెందవద్దు. నీవు నీ సాధన మీదే దృష్టిపెట్టు' అని చెప్పినది. తను అడగకుండానే తన మనసులోని కలతను పోగొట్టే విధంగా అమ్మ చెప్పిన సలహాకు అతనెంతో ఊరడిల్లి సంతృప్తితో అమ్మ దగ్గర సెలవు తీసుకొని వెళ్లిపోయాడు.

15. అమ్మ సేవ

సంవత్సరం జ్ఞాపకంలేదు గాని, అవి వేసవి రోజులు. అమ్మ తన గదిలో అచ్చటికి వచ్చిన వారందరికీ దర్శనం ప్రసాదిస్తున్నది. కరెంటు లేకపోవడం వల్ల చాలా ఉక్కపోతగా ఉండడంతో ఒక సోదరుడు అమ్మకు విసనకర్రతో విసురుచున్నాడు. అప్పుడు నాకు కూడా అమ్మకు విసనకర్రతో విసిరి సేవ చేయాలనిపించింది. నేనలా అనుకున్న రెండు నిమిషాల తర్వాత నేను విసనకర్ర వీస్తున్న సోదరునికి విసనకర్రను నాకివ్వమన్నసంజ్ఞను చేయగా అతడు విసనకర్రను నాచేతి కందించాడు. నేను దాదాపు పదిహేను నిమిషాలు విసనకర్రతో అమ్మకు విసిరిన తర్వాత కొద్దిగా చేయి పట్టినట్లనిపించి మనసులో మరెవరైనా అమ్మకు విసరడానికొస్తే బాగుంటుందనుకున్నాను. వెంటనే అమ్మ మరొక సోదరునికి ఆ అవకాశమిచ్చింది. ఆరోజు అమ్మ నాలా తోపింపజేసి, కొద్ది సేపైనా భౌతికంగా అమ్మకు సేవజేసే అవకాశాన్ని కల్పించడం నా అదృష్టంగా నేను భావిస్తున్నాను.




16. రైలు బెర్త్ రిజర్వేషన్

1980వ సంవత్సరం మే నెలలో ఒకరోజు నేను గుంటూరు నుండి ఒక ముఖ్యమైన పనిమీద అర్జంటుగా మా స్వగ్రామము (ప్రకాశం జిల్లా కంభం మండలం తురిమెళ్ల) వెళ్లవలసి వచ్చింది. ఆ రోజు నేను జ్వరము, ఒళ్ళునొప్పులతో బాధపడు చున్నాను. తప్పనిసరిగా బయలు దేరవలసివచ్చుటచే రాత్రి గం॥9.30ని.ల ప్రాంతంలో గుంటూరు రైల్వే స్టేషనుకు చేరుకొని రాత్రి గం॥10.30 ని.లకు బయలుదేరబోయే గదగ్ ప్యాసింజరు రైలుకు కంభం వరకు టికెట్ తీసుకున్నాను. తర్వాత ఏదైనా సీటుగానీ, బెర్తుగానీ రిజర్వేషన్ దొరుకుతుందేమోనని టికెట్ కలెక్టర్ దగ్గరకు వెళ్ళి ప్రయత్నించినప్పటికీ ఫలితము లేకపోయింది. అది ఎండాకాలం, పెండ్లిండ్ల సీజన్,పైగా వారాంతమైన శనివారం రోజు, ప్లాటుఫారమంతా జనంతో క్రిక్కిరిసి యుండినది. ఏ రైలు పెట్టెలోనూ ఖాళీలేదు. నా శరీరం సహకరించకున్నా, లేని ఓపిక దెచ్చుకొని జనరల్ కంపార్టుమెంటులతో సహా అన్ని కంపార్ట్మెంట్లూ తిరిగినా కూర్చోడానకి కాదుగదా నిల్చొని వెళ్లడానికి కూడా స్థలము లేదు. ఏదో యొక పెట్టెలోకి దూరడానికి ప్రయత్నించినా నావల్ల కాలేదు. అప్పటికే జనం ఒకరినొకరు త్రోసుకుంటూ కుస్తీపడుతున్నారు. అప్పటికే నేను ప్లాటుఫారం ఒక చివరనుండి మరోచివరవరకూ రెండుసార్లు తిరిగి యుండడంవల్ల నిస్త్రాణ లేక నిస్సత్తువ నన్నావరించింది. ప్రయాణం మానుకోలేను, అలాగని రైలెక్కే పరిస్థితిలేదు. ఆ స్థితిలో అమ్మ జ్ఞాపకం వచ్చి మనసులో 'అమ్మా! నీవే అద్భుతం జేస్తావోగానీ నేను మాత్రము ఈరైల్లో పడుకొనే ప్రయాణించాలి' అని పూర్తి భారాన్ని అమ్మ పై వేశాను. అలా అనుకున్నానో లేదో ఎవరో నా భుజము తట్టగా నేను వెనుదిరిగి చూశాను. నాభుజము తట్టినది నాబాల్య స్నేహితుడూ, నాక్లాసుమేటూ, మాగ్రామస్థుడు, ఆసమయంలో మిలిటరీలో పనిజేస్తూ మాగ్రామానికి తిరిగి వస్తూ యుండిన యేలెం లక్ష్మీనారాయణ యనునతడు. అతనారోజు అదే రైల్లో మిలటరీ కంపార్టుమెంటులో మాగ్రామానికే బయలుదేరివస్తున్నాడు.

అతనికీ, నాకూ బావా - బావమరదుల అనుబంధం యుండుటచే నేను వెనుదిరిగి అతనిని చూడగానే'ఏమోయ్' నీవు కూడా మన వూరొస్తునావా? అని ప్రశ్నించి, నేను ఔననగానే నేనేమీ చెప్పకుండానే నన్ను తన కంపార్టుమెంటుకు తీసుకువెళ్ళి నాకు తన బెర్తను చూపించి 'ముందు నువ్వు బెర్త్ పైకెక్కి పడుకో'యని నన్నాదేశించాడు. అప్పుడు నేను 'నీవు పడుకోవా?' యని ప్రశ్నించగా తానప్పటి వరకూ పడుకొనే ప్రయాణించాననీ, అన్ని విషయాలూ వూరెళ్ళిన తర్వాత మాట్లాడుకోవచ్చునీ నాతో చెప్పి నన్ను బెర్త్ పై బలవంతంగా పరుండజేసాడు. అప్పుడు నేనది కలా లేక నిజమా?' అన్న విభ్రాంతికి లోనయ్యాను. అప్పుడు అమ్మ తన సూక్ష్మభౌతిక రూపంతో నాతోనే ఉన్నదన్న అనుభూతి గలిగింది. అప్పుడు అమ్మకు నేను నాకృతజ్ఞతలు తెలియ జేస్తుండగా కన్నీటి పర్యంతమయినాను. అమ్మను తలచుకుంటూ పడుకున్నాను. అలసిన శరీరంతో పడుకోవడంవల్లనేమో నాకు వెంటనే నిద్రపట్టి నాగమ్యస్థానమైన కంభం వచ్చేవరకూ గాఢ నిద్రలోయున్నాను. కంభంలో నా స్నేహితుడు నన్ను నిద్రలేపేవరకూ గుంటూరులో రైలెప్పుడు బయలుదేరిందీ, కంభంలో రైలెప్పుడాగిందీ తెలియలేదు, నాకు మెలకువ రాలేదు. దిగిన మే మిరువురమూ మా స్వగ్రామమైన తురిమెళ్లకు బస్సులో కలిసే ప్రయాణించాము.

గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్లాటుఫారం మీద ఇటునుండి అటు, అటునుండి యిటు రెండుసార్లు నేను తిరిగి నప్పటికీ తటస్థపడని నా స్నేహితుడు నేను అమ్మపై భారం వేయగానే నావెనుకనుండి నన్ను తట్టి నన్ను కలువడం, నేనడక్కుండానే తన కంపార్టుమెంటుకు తీసుకువెళ్ళి తన బెర్తను నాకిచ్చి నన్ను పరుండజేయడమన్నది అమ్మ మహిమదప్ప మరొకటి గాదు.



17. శ్రీ అరవిందుల గదిలో ధ్యానం

1974వ సంవత్సరం నుండీ తరచుగా జిల్లెళ్ళమూడి అమ్మ దగ్గరకు వెళ్ళి వస్తున్నట్లుగానే వీలైనప్పుడల్లా శ్రీ అరవిందాశ్రమం, పాండిచ్చేరికి వెళ్ళి వస్తుండేవాడిని. 1978 ఫిబ్రవరి 21వతేదీ శ్రీమాత శతజయంతి కావున శ్రీఅరవిందాశ్రమంలో శ్రీమాత శతజయంతి ఉత్సవాలు చేస్తుండడంవల్ల నాకు కూడా అక్కడకు వెళ్ళి రావాలనే సంకల్పం కలిగింది. అచ్చటికి వెళ్ళేముందు జిల్లెల్లమూడి అమ్మకు నా సంకల్పాన్ని నివేదించగా అమ్మ నన్ను ఆశీర్వదించి పంపించింది. నేను మా ఆఫీసుకు ఫిబ్రవరి 19వ తేదీనుండి మార్చి 1వ తేదీ వరకు సెలవు పెట్టి 18వ తేదీ రాత్రి గుంటూరులో బయలుదేరి మరుసటి రోజు అంటే 19వతేదీ ఉదయం గం॥10.30లకు పాండిచ్చేరి చేరుకున్నాను. నేను పాండిచ్చేరిలో దిగగానే నాకో విచిత్రమైన ప్రేరణ కలిగింది. అదేమిటంటే అందరూ తిరుమలలో తమ తల నీలాలనర్పించినట్లుగా నేను నా వెనుకటి సంస్కారలనూ, మానసిక దౌర్బల్యాలనూ నాతల నీలాల రూపంలో సమర్పించాలని. నేను వెంటనే శ్రీమాతను స్మరించుకొని నాతల నీలాల నర్పించాను. తదుపరి శ్రీఅరవిందాశ్రమానికి దర్శనానికి వెళ్లాను. ఆరోజు నేను శ్రీమాతారవిందుల సమాధి దగ్గర కూర్చున్నప్పుడు నేను ధ్యానమగ్నుడనుకాగా నన్నేదోశాంతి ఆవహించినట్లైనది. నాహృదయము తేలికపడినట్లైనది. నేను పాండిచ్చేరిలో ఉన్న అన్నిరోజులూ వీలైనంత ఎక్కువ సమయాన్ని శ్రీఅరవిందాశ్రమంలోనే గడిపేవాడివి. ఆశ్రమంలో ప్రతిరోజూ ఉదయం పదిగంటల నుండి ఒక అరగంట సేపు శ్రీఅరవిందుల గదిలో ధ్యానం చేసుకోవడానికి ముందుగా అనుమతి తీసుకున్నవారి ననుమతించేవారు. నాకిది తెలియక నేనక్కడయున్న అన్నిరోజులూ శ్రీఅరవిందుల గదిలో నేను ధ్యానము చేసుకోగలిగేటట్లు చూడవలసిందిగా అమ్మను ప్రార్థించాను. నేను ఫిబ్రవరి 20వ తేదీ నుండి శ్రీఅరవిందుల గదిలో ధ్యానానికి వెళ్లడం మొదలుపెట్టాను. 21వ తేదీ శ్రీమాత శతజయంతి

గాబట్టి కొన్ని వేలమంది భక్తులు శ్రీఅరవిందాశ్రమాన్ని దర్శించారు. ఆరోజు 10గలటలనుండి 10.30వరకూ సామూహికధ్యానం నిర్వహించారు. శ్రీమాత జన్మదినమైన ఫిబ్రవరి 21వతేదీ మరియు శ్రీమాత సమాధిచెందిన నవంబరు17వ తేదీ సంవత్సరంలో యీరెండు రోజులు మాత్రమే శ్రీ అరవిందుల గదితోపాటు శ్రీమాతగదిని కూడా దర్శించడానికి అనుమతిస్తారు. ఆరోజు తెల్లవారుజామున 4 గంటలకు మొదలైన సందర్శనాకార్యక్రమం రాత్రి 8గంటలవరకూ కొనసాగింది. మరెన్నో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలనన్నింటినీ అదృశ్యశక్తియేదో నడిపిస్తున్నట్లు ప్రణాళికాబద్ధంగా దివ్యంగా వైభవంగా జరిగినవి.

ఫిబ్రవరి 22వ తేదీనుండి ప్రతిరోజూ క్రమం తప్పకుండా నేను అందరితోపాటు ఉదయం 10గం॥ల నుండి10.30వరకూ శ్రీఅరవిందులగదిలో ధ్యానం చేసుకోవడానికి వెళ్ళేవాడిని. నన్నెవరూ ఆటంకపరిచేవారుకారు. నిర్విఘ్నంగా నేను శ్రీఅరవిందుల గదిలో ధ్యానం చేసుకోగలిగేవాడిని. అక్కడ అప్రయత్నంగానే నామనసు నిలకడ పొందేది. శ్రీమాతారవిందులపై ఏకాగ్రమమయ్యేది. అంతర్ముఖుడనైన నాకు శాంత్యానందములతోపాటు నూతన చైతన్యమేదో, నూతన వెలుగేదో నాలోనికి ప్రవేశించిన అనుభూతి కలిగేది. రోజురోజుకూ నా శరీరం తేలికపడి శరీరముందా లేదా యన్న భావనకు లోనయ్యేవాడిని అక్కడి నుండి వెనుదిరిగి రావాలంటే బలవంతంగా రావలసి వచ్చేది. అరగంట ధ్యానసమయం ఐదారు నిమిషాల్లో గడిచిపోయినట్లనిపించేది.

నాకు సెలవులు ముగుస్తుండడంవల్ల నేను ఫిబ్రవరి 27వతేదీ మధ్యాహ్నం వరకూ పాండిచ్చేరిలో ఉండి తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాను. 27వతేదీ శివరాత్రి గావడంతో అరుణాచలేశ్వరుని దర్శించుకోవాలనే ఉద్దేశంతో మధ్యాహ్నం పాండిలో బయలుదేరి సాయంత్రం ఏడు గంటల సమయంలో తిరువన్నామలై చేరుకున్నాను. ఆరోజు రాత్రి నేనచ్చటి అరుణాచలం కొండకు శివభక్తులతో కలసి ప్రదక్షిణం గావించాను. 28వ తేదీ వేకువజామున

అరుణాచలేశ్వరుని దర్శించుకొని తదుపరి శ్రీరమణాశ్రమం చేరుకున్నాను. శ్రీరమణాశ్రమంలో మధ్యాహ్నం వరకూ గడిపి ప్రసాదాన్ని గ్రహించి, తర్వాత మద్రాసుకు ప్రయాణమయ్యాను. మద్రాసుకు వెళ్లేదారిలో మద్రాసుకు సమీపంలోగల శ్రీశుద్ధానంద భారతీస్వామి ఆశ్రమానికి దగ్గర్లో దిగి వారి ఆశ్రమానికి వెళ్ళి స్వామివారిని దర్శించి కొంతసేపచ్చట గడిపిన పిమ్మట వారి ఆశీస్సులను తీసుకుని మద్రాసు సెంట్రల్ రైలు స్టేషన్ చేరుకున్నాను. అప్పటికి రాత్రి ఏడుగంటల సమయమయింది. ఆ రోజు రాత్రి పదిగంటలకు బయలుదేరబోయే మద్రాసు -హైదాబ్రాద్ ఎక్స్‌ప్రెస్‌కు ముందుగానే రిజర్వేషన్ చేయించుకొని యుండుటచే అదే ట్రయిన్‌లో బయలుదేరి మార్చి 1వతేదీ ఉదయం 5గం॥లకు గుంటూరుకు క్షేమంగా చేరుకోగలిగాను.మొత్తానికి అమ్మ ఆశీస్సులతో నా పాండిచ్చేరి ప్రయాణం ఎంతో ఆనందప్రదంగానూ, ఆధ్యాత్మికపరంగా లాభదాయకంగానూ కొనసాగింది.

నేను తర్వాత జిల్లెళ్ళమూడికి వెళ్లినప్పుడు అమ్మ నాపాండిచ్చేరి ప్రయాణమెలా సాగిందని అడిగి తెలుసుకున్నది. అప్పుడు అమ్మే నావెంటయుండి నన్ను నడిపించి ఆప్రయాణాన్ని సఫలమొనర్చినట్లు తెలుసుకోగలిగాను.



18. శిరిడీసాయిబాబా ప్రత్యక్షదర్శనం

నేను మాకుటుంబ సభ్యులతో గుంటూరులో కొరెటిపాడు నందు నివాసముంటున్నప్పుడు స్టేట్‌రీజనల్ లైబ్రరీలో పనిచేస్తూ యుండిన శ్రీఆదిపూడి మోహనరావు గారితో పరిచయ మేర్పడింది. వారు శిరిడీసాయిబాబా భక్తులు. భక్తుల యిండ్లలో 'ఓంశ్రీసాయిరాం' నామజప యజ్ఞాలు నిర్వహిస్తూ వారిని భక్తిమార్గంలోకి నడిపిస్తూ 'ఓంశ్రీసాయిరాం' నామాన్ని, అచ్చుయిన 'ఓంశ్రీసాయిరాం' కోటి పుస్తకాలలో లిఖింపజేస్తుండేవారు. వారి ఆహ్వానం, ప్రోద్బలంచే నేనప్పుడప్పుడూ 'ఓంశ్రీసాయిరాం' నామజప యజ్ఞాలలో పాల్గొనేవాడిని. వారు ప్రతి సంవత్సరం వేసవికాలంలో అంటే విద్యాసంస్థలకు సెలవు రోజులుండే మే మాసంలో శిరిడీకి, దత్తక్షేత్రాలైన గాణగాపూర్, మాణిక్యనగర్, అక్కల్ కోట మొదలైన క్షేత్రాలకు శిరిడీసాయి భక్తుల కోరికమేరకు స్వలాభాపేక్ష లేకుండా బస్సు యాత్రలు నిర్వహించేవారు. నాకుకూడా ఒకసారి శిరిడీ వెళ్లిరావాలనే సంకల్పం కలిగి 1987 మే నెలలో వారేర్పాటు గావించిన బస్సుయాత్రలో మాకుంటుంబ సభ్యులమంతా పాల్గొన్నాము. ఆయాత్రలో గాణగాపూర్, మాణిక్యనగర్, శిరిడీలతో పాటు నాసిక్, త్ర్యంబకం క్షేత్రాలను గూడా దర్శించాము. అది మాకందరికీ ఎన్నటికీ మరపురాని యాత్ర. మేము ప్రయాణించిన బస్సులోని సాయి భక్తులంతా ఒకే కుటుంబంగా కలిసి బస్సులోనూ, అన్నిక్షేత్రాల్లోనూ సాయినామజపాన్ని, భజనలు చేస్తూ తమ్ముతాము మరచిపోయేవారు. మాకు ప్రయాణపు బడలికే తెలిసేది కాదు. ఒక్కొక్కసారి కొందరికి కొన్ని అద్భుతాలు, మహిమలు కూడా అనుభూతమయ్యేవి.

మా కుటుంబం మొట్టమొదటిసారిగా శిరిడీ వెళ్లుచున్నాము. పైన చెప్పబడిన బస్సులో గాణగాపూర్, మాణిక్యనగర్‌లను దర్శించుకొని తదుపరి శిరిడీకి వెళ్ళేదారిలో కోపర్‌గాం చేరుకున్నాము. అప్పుడు రాత్రి8 గంటల సమయమయింది. మరొక గంట ప్రయాణిస్తే శిరిడీ చేరుకోగలము. అయితే

మేము శిరిడీ వెళ్లేమార్గంలో కోపక్‌గాంలో శ్రీదత్తమందిరాన్ని దర్శించుకొని వెళ్లాలనే ఉద్దేశంతో మందిరానికి దగ్గరగా బస్సునాపారు. ఆరోజు అమావాస్య యనుకుంటాను. చిమ్మచీకటిగా యుండినది. బస్సుకు ముందు సీట్లలో నేను, నాభార్య, నాకుమార్తె, నాకుమారుడు కూర్చొని యుండినందువల్ల ముందు మేము దిగాము. నేను బస్సుముందు వైపుగా రెండు మూడడుగులు వేయగానే సడన్‌గా శిరిడీసాయిబాబావలెనేయున్న, కాషాయబట్టలతోయున్న ఒకఫకీరు నా కెదురొచ్చాడు. అప్పుడు వెంటనే నా హృదయంలో వారు శిరిడీసాయిబాబాయేననీ, వారికి పాదనమస్కారము చేయుమనీ ప్రేరణకలిగినది. వెంటనే నేను ఆలస్యము చేయకుండా వారి పాదాలకు నమస్కరించి ఒక రూపాయ నాణేన్ని ఆయనకు దక్షిణగా నిచ్చాను. నా వెనుకనే యున్న నాకుమారుని చేతగూడా ఆయనకు నమస్కరింపజేసి వాడి చేతగూడా ఒకరూపాయ దక్షిణగా యిప్పించాను. తర్వాత నాభార్య, నాకూతురు కూడా ఆయునకు నమస్కరించారు. ఆయన తన అభయహస్తంతో మమ్మల్ని ఆశీర్వదించారు. తర్వాత బస్సునుండి దిగుచున్న మిగతావారికి కూడా యీ విషయాన్ని చెబుదామని వారి దగ్గరకు అంటే రెండు మూడడుగులు వెనుకకు వెళ్ళి చెప్పాము. అలా వారికి చెప్పి మేము వెనుదిరిగి చూస్తే ఆయన మాకు కనిపించలేదు. అప్పటికి ఒక నిమిషము గూడా గడువలేదు. మే మా ప్రాంతమంతా వెదకినా మా కాయన తిరిగి కనిపించలేదు. నా ఒళ్ళు గగుర్పొడిచినది. సాక్షాత్తు శిరిడీసాయిబాబాయే ఆ ఫకీరు రూపంలో దర్శనమిచ్చాడని అర్థమై ఆనందంతో పులకించిపోయాము. ఆయన మాకు దర్శనమిచ్చినప్పటి కరుణాకటాక్ష వీక్షణాలను, వారి అభయ హస్తాన్ని ఎన్నటికీ మరచిపోలేము. తర్వాత మా శిరిడీ యాత్ర విజయవంతంగా ముగిసి ఎంతో సంతృప్తి నిచ్చింది. నే నెక్కడికి వెళ్లినా, ఏ యాత్రకు బయలుదేరినా అమ్మకు నమస్కరించి, అమ్మ కుంకుమబొట్టుధరించి బయలుదేరతాను. నాకు తారసవడే ప్రతియొక్కరియందూ అమ్మనే చూడడానికి ప్రయత్నిస్తాను, అలాగే నాకు తారసపడే ప్రతి అనుభవమూ, అనుభూతీ అమ్మ ప్రసాదించినవిగానే భావిస్తాను.

ఆదిపూడి మోహనరావుగారు వేసిన బస్సులోనే 1989 మే నెలలో రెండవసారి శిరిడీవెళ్లాము. ఈసారి శిరిడీలో నాభార్య తన పర్సు పోగొట్టుకున్నది. శిరిడీలో బాబా సన్నిధిలో పర్సు పోగొట్టుకోవడమన్నది మంచి సూచనగాదేమోనని నా భార్య యెంతో కలతజెందినది. పర్సులో బీదలకు పంచడానికని రెండురూపాయల నోట్లకట్టయొకటి పెట్టుకొనియుండినది. ఆదిపూడి మోహనరావుగారు పర్సుపోయినందులకు బాధపడవలదనీ, ఇదికూడా బాబా సంకల్పమైయుంటుందనీ, దీనికి పరమార్ధమేదో వుంటుందనీ నా భార్యను ఊరడించడానికి ప్రయత్నించినా నా భార్యమనసు శాంతించలేదు. కానీ మాతోటి ప్రయాణీకు డొకరు వచ్చి ఎవరో ఒక ఫకీరు భిక్షకులకు, బీదలకు రెండు రూపాయల కొత్తనోట్లను పంచడం చూశానని చెప్పడంతో ఇది బాబా సంకల్పమేనని శాంతించింది. అదేరోజు సాయంత్రం బాబా సమాధిమందిరం దగ్గర దర్శన సమయంలో మా కుమారుడు తప్పి పోయాడు. మేము బాబాను ప్రార్థించగా సెక్యూరిటీ గార్డుల్లో యొకరు మా అబ్బాయిని తెచ్చి మా కప్పగించాడు. మరుసటి రోజు ఉదయమే మేమంతా నాసిక్‌కు బయలుదేరాము. 'నాసిక్‌ను దర్శించుకొని అచ్చటినుండి త్ర్యంబకేశ్వరానికి వెళ్లాలి. బస్ నాసిక్‌కు వెళ్లేదారిలో బస్సులో ప్రయాణిస్తున్న నాభార్య 'నాసిక్‌లో గోదావరి నదిలో స్నానము చేయాలంటే నా బట్టలన్నీ తాళము వేయబడిన సూట్‌కేస్‌లోయున్నవి. దాని తాళపు చెవులు పోయిన నా పర్సులో యుండిపోయినవి. ఇప్పుడేమి చేయాలి' అనుకుంటూ బాబాను తలుచుకుంటూ కూర్చున్నది. ఇంతలో మేము కూర్చున్న సీట్లకు పైభాగాన సామానులనుంచిన అరలోయుండిన మాసూట్‌కేసు టప్ మన్న పెద్దశబ్దంతో దానంతట అదే తెరచుకొన్నది. ఇది చూచిన మేమందరమూ ఆశ్చర్య చకితులమయ్యాము. ఇక మా ప్రయాణంలో మరే యిబ్బందీ కలుగలేదు.త్ర్యంబకేశ్వరం తర్వాత మేము తిరుగు ప్రయాణమై గుంటూరులో మాయిల్లు చేరేవరకూ మేమా సూట్‌కేసును తెరువవలసిన అవసరం లేకపోయింది. ఇంటికి చేరిన తర్వాత మేము మా సూట్‌కేస్ తెరువగా అందులో

నుండి దివ్య పరిమళమేదో వెలువడుచుండినది. సూట్‌కేస్ అడుగున కొన్ని గులాబీరేకులూ, కొన్ని బాబావిభూతి పొట్లాలూ యుండడంతో మాకు ఆశ్చర్యానందాలు కలిగినవి. ఆసూట్‌కేసు నుండి చాలారోజుల వరకూ ఆ పరిమళము వస్తూయుండినది. ఇదంతా అమ్మకృపయో, బాబా మహిమయో లేక రెండూనో చెప్పలేను.

మరొకసారి శిరిడీయాత్రలో నాసిక్‌లో గట్టుపై మాపిల్లలనుంచి వారి నచ్చటనే యుండమని నేను, నాభార్య గోదావరిలో స్నానమాచరించే టప్పుడు మాకు తెలియకుండా మాఅబ్బాయి మేమంతా నీళ్ళలో మునుగుతున్నాముగదా తనకు కూడా ఏమీ కాద నుకొని నీళ్ళలోకి దుమికాడు. మేము గమనించే లోపేవాడు నీటిలో మునిగిపోతుండం గాంచిన మేము నిశ్చేష్టులమయ్యాము. నేను అమ్మను, నాభార్య శిరిడీసాయిబాబాను తలచుకొనేలోగానే పైనుండి గమనించిన సెక్యూరిటీగార్డు మాఅబ్బాయిని రక్షించాడు. అక్కడ నాదృష్టిలో సెక్యూరిటీగార్డే అమ్మ, సెక్యూరిటీగార్డే నాభార్య దృష్టిలో శిరిడీసాయిబాబా. అమ్మఆశీస్సులతో పుట్టిన మాఅబ్బాయిని అమ్మే ఆ విధంగా రక్షించింది.




19. అర్ధనారీశ్వర సాక్షాత్కారం

అది 1983 మార్చినెల. తేదీజ్ఞాపకం లేదుగానీ ఆ రోజు పౌర్ణమిరోజు. ఆరోజు నేను అమ్మ దర్శనార్థమై జిల్లెళ్ళమూడి వెళ్లాను. సాయంత్రం వాత్సల్యాలయం ముందు వరండా భాగంలో సోదరీసోదరులు అమ్మకు సంధ్యావందనం గావించిన పిమ్మట నే నచ్చటనే కూర్చొని అమ్మనే తలచుకుంటూ ఉన్నాను. దాదాపు రాత్రి 8గం॥ల ప్రాంతంలో అమ్మ స్నానమైన తర్వాత వాత్సల్యాలయం దక్షిణభాగాన ఉన్న ఖాళీ ప్రదేశంలోకి వచ్చి పశ్చిమం వైపుయున్న పిట్టగోడకు రెండడుగుల ముందు వేయబడి యుండిన మంచంపై కూర్చొని యుండినది. ఈ విషయం తెలిసి అమ్మగది ముందు భాగం వరండాలో కూర్చొని యున్న నేను, యింకా నలుగురైదుగురు సోదరీసోదరులూ అమ్మకూర్చునియున్న దక్షిణ భాగం ఖాళీప్రదేశానికి చేరుకొని అమ్మకు నమస్కరించి అమ్మకు ముందున్న స్థలంలో కూర్చున్నాము. అమ్మ తన మంచంపై తూర్పుముఖంగా కూర్చొని యుండగా మేము పశ్చిమ ముఖంగా కూర్చొని అమ్మను తిలకిస్తున్నాము. అమ్మ ఆ రోజు తెల్లని చీరలో మెరిసిపోతూ యుండినది. అమ్మచుట్టూ కాంతివలయమేదో అవరించినట్లుండినది. అది పౌర్ణమిరోజుగావడంవల్ల పండువెన్నెల అమ్మను స్పృశిస్తూ తానే తరిస్తున్నదా యన్నట్లుండినది. నిశ్శబ్దవాతావరణం. అందరూ మౌనులైయుండగా చల్లని పిల్లగాలులు వీస్తుండినవి. నేను అమ్మ మంచానికి ఐదారడుగుల దూరంలో కూర్చొని అమ్మను పరికిస్తున్నాను. అమ్మతన ప్రసన్న వదనంతో దివ్యతేజస్సుతో మమ్మల్ని వీక్షిస్తున్నది. వసుంధర అక్కయ్య అమ్మ మంచానికి ఎడమవైపు రెండడుగుల దూరంలో నిలుచొని యుండినది. అమ్మను అచ్చట యుండిన వారంతా తన్మయత్వంతో తదేకంగా విగ్రహాలవలె చుస్తుండిపోయారు. అలా అమ్మను చూస్తున్నప్పుడు ఉన్నట్లుండినాకు నామనోఫలకంపై హిమాలయాలు గోచరించి అచ్చటి చల్లని వాతావరణం అనుభూతమయింది. తర్వాత కైలాసగిరి పర్వతం, ఆ పర్వతంపై వీస్తున్న తెల్లని మంచు గాలుల మధ్య

అమ్మ అర్ధనారీశ్వరునిగా గోచరించసాగింది. ఒకసారి అమ్మ ప్రసన్నవదనం కనిపిస్తే మరొకసారి గంగాధరునివలె కనిపించసాగింది. అమ్మ సన్నిధిలో కూర్చొనియున్న వారంతా అమ్మ అనుంగు బిడ్డలుగానే గాక దేవతామూర్తులుగా గోచరమగుచుండిరి. అమ్మ పాదాలచెంత నామనస్సు ఏకాగ్రతను పొంది ఆనందపరవశుడనై యుండగా కాలము స్థంభించినట్లైనది. అలా దాదాపొక గంట సమయము గడిచి యుంటుంది. అమ్మ అందర్నీ అన్నపూర్ణాలయంలో భోజనానికి వెళ్లమని ఆదేశించేవరకూ అక్కడున్న వారందరికీ సమయమే తెలియలేదు. నేనైతే ఆనందడోలికల్లో తేలియాడుచున్నాను.

ఆరోజు నాకు కలిగిన ఆ అనుభూతి నామనోఫలకంపై శాశ్వతముద్ర వేసినది. నాకు కలిగిన ఆ మధురానుభూతి అక్కడున్న అందరికీ కలిగిందో లేదో తెలియదు గానీ నాకు మాత్రము వారుకూడా ఆనంద పరవశులైనట్లు గోచరించారు. తేలికైన దేహంతో, సంతృప్త హృదయంతో అమ్మకు మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకొని, నమస్కరించి అన్నపూర్ణాలయానికి నిష్క్రమించాను.



20. కృష్ణుడు

ఒకసారి అమ్మదగ్గర మురళీగానలోలుడూ, గోపికావల్లభుడూ ఆనందస్వరూపుడూయైన శ్రీకృష్ణుని ప్రస్తావనవచ్చినప్పుడు 'కృష్ణుడంటే నల్లనివాడని కాకుండా గృష్ణుడంటే బాగుంటుంది. ఎందుకంటే గుణాలకతీతుడు గనుక' అని అమ్మఅన్నది. దివ్యమూ, మధురమూ నైన తన వేణునాదంతో సర్వాన్నీమైమరపింపజేసే శ్రీకృష్ణునిపై సత్యభామ, రుక్మిణి మరియు రాధల ప్రేమను గురించి అమ్మ యిలా వివరణ నిచ్చింది. కృష్ణుడు నా వాడు అనుకొనేది సత్యభామ. ఇక్కడ Posessiveness అంటే అహంకార మింకా పోలేదన్నమాట. ఇది మొదటిదశ. ఇక రుక్మిణి విషయానికొస్తే తను శ్రీకృష్ణుని భార్యను లేక శ్రీకృష్ణునికి చెందిన దాననను కొనేది. అంటే యిక్కడ మనకు అహంకారరహితమైన సమర్పణాభావం, భక్తి భావం మనకు గోచరిస్తాయి. ఇదిరెండోదశ. ఇక రాధ విషయానికొస్తే తను లేకుండా కృష్ణుడు లేడు కృష్ణుడులేకుండా తను లేననే ఏకాత్మభావన మనకు కనిపిస్తుంది. అంటే వారిద్దరినీ మనము విడదీసి చూడలేము. ఇది మూడవదశ, అత్యుత్తమదశ.

అమ్మ యిచ్చి పైవివరణను బట్టి భగవంతునిపై లేక అమ్మపై మన భక్తి ఏస్థాయిలో ఉందో మనము తెలుసుకోగలము.

మనము పరిపూర్ణులమైనప్పుడు మాత్రమే మనకు అమ్మతో ఏకాత్మభావన సిద్ధిస్తుంది. దీనికి అమ్మ పూర్ణకటాక్షం మనకు సిద్ధించునుగాక!



21. అమ్మకు దేవుళ్ళూ, దేవతలూ బిడ్డలే

అమ్మ అనగా 'తొలి'యని, 'సృష్టినాది అనాది' యని అమ్మ చెప్పిన విషయం అందరికీ తెలిసిందే. అమ్మకు భూత, వర్తమాన, భవిష్యత్కాలాలు మూడూ కరతలామలకములేనన్న విషయం మనలో చాలా మందికి అనుభవమే. అమ్మకు దూరదర్శన శ్రవణాదులు కూడా అత్యల్పమేనన్న విషయమూ అందరూ ఎరిగినదే. అమ్మ ఎప్పుడో మన తాత ముత్తాతల కాలంనాటి సంఘటనలను సందర్భానుసారంగా ఉటంకించడం మనకు తెలుసు. భవిష్యత్తులో ఏమి జరుగబోతోందో తెలిసి మనకు ప్రత్యక్షంగాగానీ పరోక్షంగాగానీ కొన్ని సూచనలిచ్చి జాగరూకులను గావించడంకూడా మనకు తెలుసు. ఉదాహరణకు హైమ అక్కయ్య వివాహ విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు అక్కయ్యకు 25సం॥ల వయసొచ్చేవరకూ ఎలాంటి ప్రయత్నాలూ చేయొద్దని చెప్పడానికి కారణం హైమ అక్కయ్య సమాధి చెందగలదని తనకు తెలిసియుండడమే. ఇక్కడ నా స్వీయానుభవమొకటి వివరిస్తాను. 1978-79 సంవత్సరాల్లో నా ఆర్థిక పరిస్థితి సరిగా లేక నాభార్యకు కూడా ఏదైనా ఉద్యోగము వస్తే బాగుంటుందని అనుకొనే వాడిని. నేనుఅమ్మ దగ్గరకు వెళ్ళినప్పుడు ఒకటి -రెండు సార్లు నీకు 'బ్యాంకులో ఉద్యోగంగదా' అని అడిగింది. నేను 1974నుండీ అమ్మ దగ్గరకు వెళ్తున్నా, నేను టెలికం డిపార్టుమెంటులో పని చేస్తున్న విషయం అమ్మకు అంతకుముందే తెలిసియుండినా నాతో అమ్మ ఎందుకలా అడిగిందోనని అనుకున్నాను. అమ్మ అలా అడిగిన కొన్నాళ్ళకే నాభార్యకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైద్రాబాద్‌లో ఉద్యోగం వచ్చింది. అంటే నాభార్యకు బ్యాంకులో రాబోయే ఉద్యోగాన్ని అమ్మ నాకు తన ప్రశ్నలద్వారా సూచించిందన్నమాట. నాభార్యకు బ్యాంకులో ఉద్యోగమెచ్చిన తర్వాత మాకుంటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.

అమ్మకు దేవుళ్ళు, దేవతలుకూడా బిడ్డలే. ఒకసారి ఒకతను తిరుపతిలో వెంకటేశ్వరస్వామి దగ్గర తన మ్రొక్కుబడిని తీర్చుకొనుటకై తిరుపతి

బయలుదేరి మార్గమధ్యంలో అమ్మను దర్శించడానికి జిల్లెల్లమూడి వచ్చాడు. అమ్మ అతని కెలాంటి ప్రేరణ నిచ్చిందో, ఎలాంటి దర్శన మిచ్చిందోగాని అతడు తన తల నీలాలను జిల్లెళ్ళమూడిలో అమ్మదగ్గర సమర్పించుకొని మ్రొక్కుబడి తీర్చుకోవాలని యున్నదని అమ్మతో అడిగితే అమ్మ అతనితో నీ మ్రొక్కుబడిని నా బిడ్డ (వెంకటేశ్వరస్వామి) దగ్గర తీర్చుకున్నా లేక నా దగ్గర తీర్చుకున్నా ఒకటే నన్నది. అతను తిరుపతి వెళ్ళకుండా జిల్లెల్లమూడిలోనే తన మ్రొక్కుబడిని తీర్చుకొని వెళ్లిపోయాడు. మరొకసారి ఒక మిత్రుడు అమ్మతో 'సత్య సాయిబాబా గురించి నీ అభిప్రాయమేమిటమ్మా?' అని అమ్మను ప్రశ్నించాడు. అప్పుడమ్మ'వాడూ నాబిడ్డే' నని సమాధానమిచ్చింది.

ఒకసారి అమ్మ నెల్లూరు వెళ్లినప్పుడు అచ్చటి ప్రముఖ రంగనాయకస్వామి గుడికి వెళ్లి తనపాదరక్షలతోనే నేరుగా గర్భగుడిలోకెళ్ళి స్వామిని చూసివచ్చారు. అప్పుడెవరో అమ్మా నీవెందుకు లోపలికి పాదరక్షలతోనే వెళ్లానని ప్రశ్నించగా అమ్మ 'నాబిడ్డ దగ్గరకు వెళ్లేతొందరలో నాపాదరక్షలపై నాధ్యాస లేకుండినది ' అని సమాధాన మిచ్చింది.

అమ్మ తన పాదాలవ్రేళ్ళకు ధరించే రింగులపై దేవతా మూర్తుల ప్రతిమలుంటాయి. దీనిని గురించి ఎవరో ప్రశ్నించినప్పుడు అమ్మ ఆ దేవతామూర్తులు కూడా తనబిడ్డలేననీ, వారు మీసోదరులేననీ, ఆవిషయం మీకు తెలియజేయ డానికే వాటిని ధరిస్తున్నాననీ చెప్పింది.

ఇవన్నీ కొన్ని ఉదాహరణలు మాత్రమే. వారివారి ఇష్టదైవాలను అమ్మలో దర్శించుకున్నవారు చాలా మందేయున్నారు. అమ్మే కొన్ని సందర్భాల్లో తనను దర్శించడానికి వచ్చిన వారితో మీరేనామము చేసినా మీరెవరికి పూజలుచేసినా తనకే చెదంగలవని వక్కాణించారు, నిరూపించారు.

సర్వదేవతా స్వరూపిణి, సర్వదేవతలకూ మూలమైన అమ్మకు శతకోటి ప్రణామములు.

22. సమసమాజ స్థాపనకు పునాదిరాళ్ళు

శుక్లశోణితాలకేది కులమో అదే నా కులమన్న అమ్మ, మన క్షుద్బాధను తీర్చడమే తన మతమూ అభిమతమూ అన్న అమ్మ, ప్రపంచంలో ఏ ఒక్కరూ ఆకలిబాధ ననుభవించకూడదని ఆకాంక్షించిన అమ్మ, అందరింటి నేర్పాటు గావించి దానినే యొక ప్రయోగశాలగా తీర్చిదిద్దిన అమ్మ, తన సంకల్పంతో ఒకేసారి లక్షన్నర మందికి పైగా ఏక పంక్తినభోజనము చేయగా సంతృప్తియైన అమ్మ, మానవతను మించిన మాధవత యేమున్నదని నిరూపించిన అమ్మ, శిష్టులనూ -దుష్టులనూ, ఆస్తికులనూ- నాస్తికులనూ అందరినీ తన బిడ్డలు గానే సమాదరించిన అమ్మకు మించిన సమసమాజవేత్త యింతకుముందెవరూలేరు, యిక ముందు ఉండబోరు. అమ్మ దగ్గర కొచ్చిన ప్రతియొక్కరికీ అమ్మ ఏదోయొక దివ్యానుభూతిని ప్రసాదించియుండినప్పటికీ, వారిని సంస్కరించి యుండినప్పటికీ అమ్మ మాత్రము 'మీరుకానిది నేనేమీ కాదు' అనేది. అలాగే మీరంతా నేనే, మీదంతా నేనే నని అనేది. అట్లాగే 'అన్ని నేనులు నేనైననేను' అని విడమర్చిచేప్పేది. మహిమలగురించి అడిగినప్పుడు సృష్టికిమించిన మహిమ ఏమున్నదనీ, 'సృష్టినాది అనాది'యనీ చెప్పేది. ఇలా అమ్మ ఏమి చెప్పినా తాను సర్వసృష్టితో తాదాత్మ్యతనొంది అందరినీ అన్నిటినీ తన బిడ్డలు గానో లేక అవయవాలు గానో చూచేది అందుకే అమ్మ విశ్వజనని, సాక్షాత్తూ అనంతశక్తి స్వరూపిణియై గూడా నివురుగప్పిన నిప్పువలె పైకి సాధారణంగానే కనిపించేది.

విశ్వకుటుంబానికి నాందియే అందరిల్లు. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు, సమతా మమతలకు కేంద్రస్థానమే జిల్లెల్లమూడి. ప్రజాస్వామ్యంలోని స్వేచ్ఛ, కమ్యూనిజంలోని సమత కలగలిసిన ఆధ్యాత్మిక కమ్యూనిజమే కనబడుతుందిక్కడ. ఎవరికెవరూ అన్నంపెట్టడంలేదిక్కడ. ఎవరిదివారు అంటే మనది మనమే ఉమ్మడి కుటుంబంలాగా అందరమూ కలసికట్టుగా తింటున్న భావన ఉంటుందిక్కడ. అందరమూ సోదరీసోదరులమే, సంతృప్తులమే. మనమంతా విశ్వకుటుంబ మన్న భావన. విశ్వసౌభ్రాతృత్వాన్ని గురించి ఎవ్వరూ ఉపన్యాసాలివ్వరిక్కడ. ఐతే విశ్వసౌభ్రాతృత్వంతో జీవిస్తారిక్కడ.

ఇదే ముక్తికి మార్గమనుకుంటాను. తృప్తేముక్తి యని అమ్మే అన్నదిగదా! కులమత భేదాలూ, వర్గభేదాలూ, ధనికులూ పేదవారూ, పెద్దలూ చిన్నవారూ అన్న భేదాలు లేవిక్కడ. 'వర్గంలేనిదే స్వర్గం' అని అమ్మ అన్నదిగదా! మనమెంత కాలం యిక్కడ ఉండాలను కుంటే, అంతకాలం వుండవచ్చు.అందుకే యిది వసుధైక కుటుంబకమ్ అన్నారు.


జిల్లెమూడికి వచ్చేవారందరిపై వారికి తెలిసిగాని తెలియకుండానే గానీ అమ్మ తన ప్రభావాన్ని చూపి వారిని సంస్కారవంతులను గావించి, వారి వారి జీవితాలనుద్ధరించి వారంతా పురిపూర్ణమానవులుగా తయారవడానికి దోహదపడేది. అమ్మకు మనం దగ్గరగా ఉన్నా లేక ఎంతదూరాన ఉన్నా తన బిడ్డలమైన మన మనసుల్లో ఏముందో తెలిసేది. వక్రమార్గాన నడవకుండా సక్రమమార్గాన్నే అనుసరించేటట్లు, సంస్కరించబడేటట్లు పరిస్థితులను కలుగజేసేది. తన దర్శనం ఎవరికవసరమనుకుంటే వారిని అమ్మ తన ప్రేరణతో తన దగ్గరకు పిలిపించుకొనేది, తన అనుగ్రహాన్ని ప్రసాదించేది. అమ్మదగ్గరకు రాలేని సుదూరప్రాంతాల్లో లేక విదేశాల్లో యున్న వారికి తన కృపచే తన దర్శనాన్ని ప్రసాదించేది. నాకేమనిపిస్తుందంటే శ్రీఅరవిందమహర్షులవారు దర్శించిన పూర్ణమానవుడు లేక దివ్యమానవుడు రూపొందడానికి, ఒక దివ్యసమాజము, సమసమాజము స్థాపించబడడానికి దివ్య ప్రణాలికలో భాగంగా జిల్లెల్లమూడిలో అమ్మపునాది రాళ్ళు వేసిందాయని. ఆపునాదిరాళ్ళ ఆధారంగా దివ్యత్వం అనేకరూపాల్లో వికసించి విశ్వమానవసౌభ్రాతృత్యం పరిఢవిల్లే ఒక దివ్య పట్టణంగా జిల్లెలమూడి రూపాంతరంచెందబోతున్నదాయని (ప్రాండిచ్చేరిలో శ్రీమాత అంతర్జాతీయ పట్టణంగా రూపుదిద్దుకోవడానికి అరోవిల్‌కు 1968లో శంకు స్థాపన చేసినట్లుగా). ఎందుకంటే ఏదో ఒక సందర్భంలో అమ్మ ఒకసోదరునితో భవిష్యత్తులో జిల్లెళ్ళమూడి యొక పట్టణంగా రూపాంతరం చెందుతుందని చెప్పింది గనుక, అమ్మ నోటినుండి తాలుమాట యేదీ రాదుగనుక.

1966 జూన్ నెలలో ప్రీయూనివర్సిటీ కోర్సు(PUC)లో లయోలాకాలేజీలో చేరడానికని విజయవాడకు వెళ్లినప్పుడు నేను మా నాన్న గారితో ప్రముఖ నాస్తికవాదియైన గోపరాజు రామచంద్రరావు (గోరా) గారిని కలవడం జరిగింది. మా నాన్నగారు కమ్యూనిష్టు. మూఢాచారాలను,

మూఢభక్తిని, మూఢవిశ్వాసాలను నిరసించేవ్యక్తియైన మానాన్నగారు, గోరాగారి కుమారులైన లవణంగారు సహవిద్యార్థులుగా ఒకప్పుడు కడపలో హిందీ విశారద చదివినవారు. కాబట్టి లవణం గారిని కలుద్దామని వెళ్లి గోరాగారిని కూడా కలిశాము. నన్ను లయోలా కాలేజీలో పీ.యూసీ లో చేరుస్తున్నానని మా నాన్నగారు గోరాగారితో చెప్పగా క్రైస్తవ సంస్థకు చెందిన ఆ కాలేజీలో ఎందుకు చేర్పిస్తున్నావని మానాన్న గారిని ప్రశ్నించారు. అప్పుడు మా నాన్నగారు అక్కడ చదువుబాగా వుంటుందని చేర్పిస్తున్నామే తప్ప క్రైస్తవ మతముతోగానీ, వారి మతప్రచారముతోగానీ మా కెలాంటి సబంధమూ లేదు, వుండబోదని సమాధానమిచ్చారు. గోరాగారిని నిజాయితీగల నాస్తికవాది యంటారు. మరొక సందర్భంలో 1971లోనేను ఆంధ్రా విశ్వవిద్యాలయంలో విశాఖపట్టణంలో యమ్.ఎ. మొదటి సంవత్సరం చదువుచున్నప్పుడు గోరాగారు మాకు నాస్తికవాదాన్ని గురించి ప్రసంగాన్నివ్వడానికి వచ్చారు. అప్పుడు వారి ప్రసంగమయిన తర్వాత నన్నునేను పరిచయం చేసుకొని దేవుడు లేడనివాదించిన తనతో ఏదిసత్యమో, ఏదినిత్యమో దానిని దేవుడనుకుంటే తప్పేమిటని? ఎవరైనా దేనినైనా తన స్వీయానుభవాన్ని బట్టి, విచక్షణను బట్టి, తన అంతరంగాన్ని బట్టి నమ్మితే యితరులకొచ్చే నష్టమేమిటని ప్రశ్నించాను. రీసర్చి చేసేవారుకూడా తమ పరిశోధనలను ఏవైనా సాధించగలమనే విశ్వాసంతోనే చేస్తారు. అంతేగాక ఎవరికైనా తమమీద తమకు విశ్వాసముంటేనే పురోగమించగలుగుతారు. ఆ విశ్వాసాన్నే దేవుడనుకుంటే తప్పేమిటని ? ప్రశ్నించాను. దానికాయన నేను ఆలోచించిన తీరు సరియైనదేననీ కేవలం తాను మూఢవిశ్వాసాలకు వ్యతిరేకిననీ, దేవుడున్నాడనేవారికన్నా దేవుడున్నాడని చెప్పి ప్రజలను వక్రమార్గం పట్టించి వంచించే వారికి వ్యతిరేకిననీ చెప్పారు. అప్పుడు నేను సమాధానపడ్డాను. గోరాగారి కుమారుడు లవణంగారు, ఆయన భార్య హేమలతగారు యిరువురూ అమ్మను గురించి విని నిజమెంతో తేల్చుకోవాలని జిల్లెల్లమూడికి ఒకసారి వచ్చారనీ, అక్కడ జరిగే కార్యక్రమాలను, ముఖ్యంగా అన్నపూర్ణాలయాన్ని, నిరతాన్న వితరణనూ, కుల మత వర్ణ వర్గ రహిత ఏకపింక్తి భోజనాలను చూసిన తర్వాత ముగ్ధులై సంతృప్తి చెందారనీ విన్నాను. నేనేమనుకున్నానంటే సమసమాజ నిర్మాణంలో అమ్మ అందరికంటే ముందున్నదన్న సత్యాన్ని వారు గ్రహించి యుంటారని.

23. ఎవరీ అమ్మ ?

ఒకసారి నేను అమ్మ సమక్షంలో కూర్చున్నప్పుడు ఎవరీ అమ్మ? ఎవరికి అమ్మ? అన్న ప్రశ్న ఉదయించింది. అమ్మ 'అమ్మ అంటే జిల్లెళ్ళమూడిలో యున్న నాలుగున్నర అడుగుల ఎత్తున్న అనసూయ యని పిలువబడే యీ శరీరమే కాదు' అని అన్నది. శరీరమేగాక శక్తి స్వరూపమా? ఆదిశక్తియా? రాజరాజేశ్వరియా? లలితానామ సహస్రంలోని ప్రతినామమూ అమ్మకు వర్తిస్తుందా? యిలా ఎన్నో ప్రశ్నలుదయించాయి. అన్ని నామాలూ, అన్ని రూపాలూ తానేయై అన్నిటికీ అతీతంగానూ యుండే ఆది పరాశక్తియేమోననిపించింది. లలితా సహస్రనామాల్లోని ప్రతినామమూ అమ్మకు వర్తిస్తుందనిపించింది. అన్ని నామాలూ అమ్మవేయై నామ రహితగా కూడా అలాగే అన్ని రూపాలూ తనవేయై రూప రహితగా కూడా ఉన్నదనిపించింది. ప్రత్యక్షంగా మన ఎదుట అనసూయ అనబడే భౌతిక రూపంగా, మానవిగా కనిపిస్తున్నప్పటికీ దాని కతీతమైన పరాశక్తి రూపంగా గోచరించింది. మాటల్లో చెప్పలేని అవ్యక్తానందం, తన్మయత్వం కలిగాయి. నేనప్పుడు నాకందిన మాటల్లోనే అమ్మ ఎవరన్నదాన్ని 'ఎవరీ అమ్మ?' అన్న శీర్షికతో కాగితంపై వ్రాసి అమ్మచేతికందించాను. ఆ వ్రాసినదాని క్రింద "అనసూయ తనయ" (తనయుడు అనకుండా తనయ అనే) వ్రాశాను. అది యధాతథంగా ఆగస్టు 1982 'మాతృశ్రీ' పత్రికలో ప్రచురితమైంది. "ఎవరీ అమ్మ?" అన్న ఆ వచన కవితను ఆఖరు అధ్యాయంలో యధాతథంగా పొందుపరుస్తున్నాను.



24. అమ్మపోసిన భోగి పండ్లు

ప్రతి సంవత్సరం మకర సంక్రాంతికి ముందు రోజైన భోగి పండుగ రోజున జిల్లెళ్ళమూడి అమ్మ తన సన్నిధిలోని వారందరికీ భోగిపండ్లు పోసేది. చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా (పండు ముసలివారు కూడా అమ్మకు పసిపాపలే) అందరూ వరుసగా కూర్చుంటే అమ్మ భోగిపండ్లు పోసే వేడుక చూచినవారు, పాల్గొన్న వారందరూ అదృష్టవంతులే. తరతమ భేదాల్లేకుండా, వయసుతో నిమిత్తం లేకుండా మనల్నందర్నీ తన ఒడిలోని బిడ్డలుగా జేసి మనకు ఉత్సాహంగా అమ్మ భోగి పండ్లు పోయడమన్నది అమ్మకెంత ఆనందాన్నిచ్చేదో మనకూ అంతే ఆనందాన్నిచ్చేది. ఊయలలోని పసిబిడ్డలను ఊపుతున్నా, ఆడిస్తున్నా, లాలిస్తున్నా తల్లి ఎలా ఆనందడోలికల్లో తేలిపోతుందో భోగిపండ్లు పోసేటప్పుడు అమ్మ అంతకు మరెన్నో రెట్లు ఆనందించేదన్న విషయం ఆ వేడుక చూసిన వారందరికీ అనుభవమే. భోగిపండుగ అన్నది ధాన్యలక్ష్మి యింటికి వచ్చి అన్ని భోగాలనూ, ఐశ్వర్యాలనూ మానవులకందించే సుదినంగా ప్రతీతి చెందింది. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయనంలోకి సంక్రమించే సంక్రాంతి పండుగకు ముందు రోజు కావడం అదే రోజు అమ్మ మనకు భోగి పండ్లు పోయడమన్నది అంటే రేగిపండ్లు, పూలు, నాణాలను మన తలలపై పోయడమన్నది అమ్మ మనకు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించి మన జీవితాలకొక నూతనోత్సాహాన్నీ, నూతనకాంతినీ ప్రసాదిస్తున్నట్లనిపించకమానదు. అమ్మ భోగిపండ్లు పోసే ఈ వేడుకలో ఎలాగైనా పాల్గొనాలని రెండు మూడు సంవత్సరాలు ప్రయత్నించినా ఏదో యొక కారణం వల్ల అది సాధ్యపడలేదు. చివరకొక సంవత్సరము (సంవత్సరము నాకు జ్ఞాపకం లేదు) నేనా వేడుకలో పాలుపంచుకొనే భాగ్యము కలిగినది. అమ్మ నాకారోజు పోసిన భోగిపండ్లు, పూలతోపాటు విచిత్రంగా 1 పైసా నాణెమొకటి, 2 పైసల నాణెములు రెండు, 3 పైసల నాణెములు మూడు, 5 పైసల నాణెములు ఐదు, 10 పైసల నాణెములు పది రావడమన్నది నాకాశ్చర్యానందాలను కలుగుజేసింది. నా జీవితంలో నాకు తెలిసి భోగిపండ్లు పోయించుకున్న సందర్భమిదొక్కటే, అది కూడా అమ్మ దివ్య హస్తాలతో. ఆ నాణేలను నే నిప్పటికీ దాచుకున్నాను.

25. రొమ్మునొప్పికి చికిత్స

నాకు 1975, 1976 సంవత్సరాల్లో నా కుడిరొమ్ము భాగంలో ఊపిరితిత్తుల్లో ఒక స్పాట్(బిందువు)లో గాలి పీల్చినప్పుడల్లా నొప్పి వస్తుండేది. ఎన్ని టెస్టులు చేయించినా లోపమేమీ లేదన్నారు. నొప్పికి ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. అంత సీరియస్ విషయం కాకపోయినప్పటికీ నాకు యిబ్బందిని, చికాకును కలిగించేది. నేను జిల్లెళ్ళమూడికి వెళ్ళినప్పుడొకసారి నా కేమనిపించిదంటే యీ నొప్పి తగ్గడానికి నేను మందులను నమ్ముతున్నానా లేక అమ్మనా? ఈ ప్రశ్న నా మనసులో ఉదయించగానే అన్న పూర్ణాలయం గంట మ్రోగింది. అప్పుడు కడుపులో అల్సర్ యుండి కడుపు నొప్పితో బాధపడుచుండిన యొక సోదరుడొకసారి అమ్మ అన్నపూర్ణాలయంలో భోజనం చేసి రమ్మన్నది కదా యని తన కడుపులోని బాధను లెక్కచేయక పూర్తిగా అమ్మ పై భారం వేసి అన్నపూర్ణాలయంలో భోజనం చేయగానే తనకడుపు నొప్పి పూర్తిగా తగ్గిపోయి ఆనందంతో అమ్మను దర్శించుకొని వెళ్ళిన విషయం నా మనోఫలకం పై మెదిలింది. 'నేను నిజంగా అమ్మను నమ్మియుంటే నాకు మాత్రము నా రొమ్ము నొప్పి ఎందుకు తగ్గదు?' అనుకొని పూర్ణ విశ్వాసంతో అమ్మపై భారం వేసి అన్నపూర్ణాలయంలో ప్రసాదాన్ని గ్రహించాను. అంతే నాకు నా రొమ్ము నొప్పిని గురించి జ్ఞాపకం లేదు. నేను గుంటూరుకు తిరిగి వచ్చిన నాలుగైదు రోజుల తరువాతగాని రొమ్మునొప్పి తగ్గిందన్న విషయం నాకు తెలియలేదు. అప్పుడు నేను ఆశ్చర్యపోయాను. ఆ రొమ్ము నొప్పి మరింకెప్పుడు తిరిగి రాలేదు. అమ్మపై నాకుండిన విశ్వాసమో, అన్నపూర్ణాలయ ప్రసాద మహిమో తెలియదుగానీ ఎన్ని మందులు వాడినా తగ్గని నా రొమ్మునొప్పి అమ్మ కృపవల్ల తగ్గింది. 'విశ్వాసమే భగవంతుడు' అని అమ్మే అన్నది గదా! ఇలాంటి అద్భుతాలు జిల్లెళ్ళమూడిలో సర్వసాధారణం. అమ్మను అడిగితే నీ విశ్వాసమే నిన్ను రక్షించి యుంటుందని మనకొక అడ్డు తెరవేస్తుంది.

26. నెమలిగుండ్ల రంగస్వామి దర్శనం

వెనుకటి అధ్యాయాల్లో ఒక దానిలో అమ్మ ఆశీస్సులతో మాకు అబ్బాయి పుట్టినట్లు తెలిపియున్నాను. 1989 మార్చి నెల అంటే మా అబ్బాయికి 5వ సంవత్సరము రాగానే పుట్టువెంట్రుకలు సమర్పించడానికి ప్రకాశం జిల్లా, కంభం మండలంలోని మా స్వగ్రామమైన తురిమెళ్ల గ్రామానికి దాదాపు పది మైళ్ళ దూరంలో నల్లమల కొండల్లో గుండ్లకమ్మ నదిని ఆనుకొని యున్న చిన్న కొండపై వెలసియున్న మా కుల దైవమైన నెమలి గుండ్ల రంగస్వామి మందిరానికి మా కుటుంబ సభ్యులమంతా అంటే నేను, నా భార్య పిల్లలు, మా అమ్మ, నా సోదరులిద్దరితో సహా వెళ్ళాము. అప్పట్లో యిప్పటివలె బస్సు సౌకర్యం ఉండేది కాదు. బండ్లు కట్టుకొని మేళతాళాలతో, తప్పెటవాయిద్యాలతో వెళ్లేవారు. కర్నూలు, నంద్యాల, ఒంగోలు, నర్సరావుపేట, మార్కాపురం మొదలగు సుదూర ప్రాంతాల నుండి అచ్చటికి ప్రతి శనివారం వందల సంఖ్యలో స్వామి దర్శనానికి వస్తారు. స్వామి దగ్గరకు వెళ్లే సమయంలో దారిపొడవునా 'రంగా శ్రీరంగా' 'నెమలి గుండ్ల రంగయ్యా' లేక 'గోవిందా' అంటూ స్వామి నామాలు ముక్తకంఠంగా పలుకుతూ ఎంతో భక్తిగా వెళ్తారు. ఎంతో మహిమ గల స్వామిగా పేరొందారు. స్వామి ఆలయమున్న కొండ దిగువన ఒక పెద్ద నీటి గుండమున్నది. దీనినే నెమలి గుండం అంటారు. దీనిలోకి ఎత్తైన కొండ పై భాగాన్నుండి నీరు జలపాతంగా నిరంతరమూ ప్రవహిస్తూ యుంటుంది. ఈ కొండల్లో సుదూర ప్రాంతన యున్న గుండ్ల బ్రహ్మేశ్వరం దగ్గర పుట్టిన గుండ్లకమ్మ యిచ్చట నెమలి గుండంలో కలిసి అచ్చటి నుండి ముందుకు సాగుతుంది. ఈ నెమలి గుండం దగ్గరయున్న జలపాతాన్ని ఎంత జూచినా తనివి తీరదు.

నెమలిగుండ్ల రంగస్వామిని దర్శించడానికి వెళ్లేవారు ఈ స్వామి మందిరానికి 2 ఫర్లాంగుల దూరంలో యున్న లక్ష్మక్క పేటయను కొంత సమతల మైదాన ప్రదేశములో ముందుగా విడిది చేసి అక్కడఉన్న లక్ష్మమ్మ

(లక్ష్మీదేవి) గుడిని దర్శించి నెమలిగుండం దగ్గరకు చేరుకుంటారు. ఇచ్చట తలనీలాలిచ్చేవారు తలనీలాలనిచ్చి నెమలిగుండంలో అభ్యంగన స్నానమాచరించి మెట్లమీదుగా కొండపైకి స్వామి వారి దర్శనానికి వెళ్తారు.

ఇక్కడ విశేషమేమిటంటే ఎవరైనా శుచిగా లేకపోయినా, బహిష్టు అయిన స్త్రీ లెవరైనా వచ్చినా అచ్చటి కొండల పేట్లపైయున్న పెద్దపెద్ద తెట్టెల నుండి తేనెటీగలు (చాలా పెద్దవి) వచ్చికుడుతవి. మరొక విశేష మేమిటంటే ఈ తేనెటీగలు గుడికి వెళ్ళే మెట్లపైన యున్న వారిని, గుడి దరిదాపుల్లో యున్న వారినీ ఎట్టి పరిస్థితుల్లోనూ కుట్టవు, బాధించవు. నెమలి గుండంలో స్నానమాచరించి కొండపైకి ఎక్కి అందరూ తమ ముడుపులను చెల్లించి స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు గైకొని తిరుగు ప్రయాణమై తిరిగి లక్ష్మక్క పేటకు చేరుకొంటారు. అక్కడికి చేరుకొనేటప్పటికి అక్కడ ఎవరికి వారి వారి వంట ఏర్పాట్లన్నీ ముగిసి యుండడంతో భోజనాలు చేసి తిరుగు ప్రయాణమౌతారు. అక్కడ వంట యేర్పాట్లు చేసుకోనివారి కొరకై అన్నదాన సత్రములో అందరికీ మంచి భోజనమును పెడ్తారు.

మేము వెళ్లిన రోజు విశేషమేమిటంటే నెమలి గుండం దగ్గర చాలా మంది భక్తులతోపాటు మా కుటుంబసభ్యులూ, కొంతమంది మా బంధువులూ స్నానము చేయుచుండగా (నే నప్పటికే స్నానము ముగించుకొని తెల్లని వస్త్రాలు ధరించి గట్టుపై నిలబడి యున్నాను) ఎవరు అశుచిగా వచ్చారో ఏమోగానీ తేనెటీగలు ఉన్నట్లుండి అందరిపై దాడిచేసి కుట్టడం మొదలు పెట్టినవి. ఒడ్డున ఉన్నవారు పరుగులు పెడుచుండగా నీటిలో వున్న వారుకూడా చెల్లాచెదరై భీతిల్లారు. అప్పుడు నేను జిల్లెళ్ళమూడి అమ్మను మమ్మల్ని రక్షించమని వేడుకున్నాను. అమ్మ నామాన్ని, స్వామి నామాన్ని మార్చి మార్చి చేస్తూ నేను కదిలితే అవి కుడతాయోమోనని కదలకుండా అలాగే యుండిపోయాను. ఎందుకంటే తెల్లటి వస్త్రాలు తేనెటీగల నెక్కువ ఆకర్షిస్తాయని వినియున్నాను. తేనెటీగలు మమ్మల్నందరినీ చుట్టుముట్టి మిగతా కొందరిని, మా బంధువుల్లో కూడా కొందరిని కుడుతున్నా అవి

నన్ను గానీ, మా కుటుంబ సభ్యులను గానీ కుట్టకుండా వదలి పెట్టడం అక్కడున్న అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. కాసేపటికి అవి వెను దిరిగిపోయాయి. అప్పుడు మేమంతా స్నానాదికాలైన తర్వాత కొండపైన స్వామి సన్నిధికి వెళ్లి మ్రొక్కులు దీర్చుకొని స్వామి దర్శనమైన తర్వాత తీర్థ ప్రసాదాలను గైకొని ఆనందంగా బయలుదేరాము. అమ్మ నామమే మమ్మల్నందరినీ రక్షణ కవచంలా కాపాడింది. మేము లక్ష్మక్క పేటకు వెళ్లి అచ్చట భోజనాలు చేసి తిరుగు ప్రయాణమై మా గ్రామం చేరుకున్నాము.

కంటికి రెప్పవలె అమ్మ తన బిడ్డలమైన మనల్ని నిరంతరం కాపాడుకుంటుందనడానికి యింతకంటె మరే ఉదాహరణ అవసరం లేదనుకుంటాను.



27. కాశిరెడ్డి నాయన దర్శనం

1980-81 ప్రాంతంలో నేను గుంటూరు కొరిటెపాడు గాంధి బొమ్మ సెంటరుకు దగ్గరగా నివసించేటప్పుడు మా యింటికి దగ్గర్లోనే యుండిన నా సోదర సమానులు, శిరిడీ సాయిబాబా భక్తులు 'ఓం శ్రీ సాయిరాం ఆధ్యాత్మిక చైతన్య కేంద్రము, గుంటూరు' వ్యవస్థాపకులైన శ్రీ ఆదిపూడి మోహనరావు గారింటికి సత్సంగము నిమిత్తమై అప్పుడప్పుడూ వెళ్లుచుండేవాడిని. వారిది సొంత యిల్లు. ఆ యింటి ఒక భాగంలో కర్నూలు జిల్లా, నంద్యాల వాస్తవ్యు లొకరు తన కుటుంబంతో అద్దెకుండేవారు. మాటల సందర్భంలో నేను మొట్టమొదటిసారి వారి ద్వారా కాశిరెడ్డి నాయనను గురించి విన్నాను. ఆళ్ళగడ్డ, నంద్యాల, కర్నూలు ప్రాంతాల్లో ప్రసిద్ధిగాంచిన కాశిరెడ్డి నాయన అహోబిలం కొండల్లో దాదాపు 20 సం॥ల పాటు తపస్సు గావించి ఎన్నో సిద్ధులు పొందిన సిద్ధులనీ, ఏ ఆర్భాటాలు లేకుండా సాధారణ వ్యక్తి వలె సామాన్య జనంతో కలిసి తిరుగుతుంటారనీ, ఆయనకు దిగువ అహోబిలం దగ్గర ఆశ్రమమున్నదనీ, కర్నూలు జిల్లాలోని పలుచోట్ల ఆయన పేరు మీదుగా కట్టిన సత్రాల్లో నిత్యాన్నదానం జరుగుతుంటుందనీ తెలుసుకున్న నాకు ఆయన నొకసారి దర్శించుకోవాలనే ఆకాంక్ష కలిగింది. నేను విన్నదాన్నిబట్టి ఆయన తను స్థాపించిన ఆశ్రమంలో స్థిరంగా ఉండరనీ, కర్నూలు, కడపజిల్లాల్లోని అనేక ప్రాంతాలు తిరుగుతుంటారనీ, ఆయన సంకల్పిస్తేనే దప్ప ఆయన దర్శనము కలుగదనీ, అప్పుడప్పుడూ నంద్యాల టౌన్‌లో తెలుగు గంగ ప్రాజెక్టు ఆఫీసుకు దగ్గర్లో నాగేశ్వరరావుగారనే కాంట్రాక్టర్‌గారింటికి అప్పుడప్పుడూ రాత్రిపూట వచ్చి ఆ రాత్రికచ్చట విశ్రమించి తెల్లవారుజాముననే లేచి వెళ్లిపోతుంటారని తెలుసుకున్నాను. నేనాయనను దర్శించుకోవాలనే నా ఆకాంక్షను నేను నా హృదయమందే అమ్మకు నివేదించుకున్నాను. తత్కాలిక ప్రయత్నమేదీ చేయకుండా వాయిదా వేస్తూ చివరి కావిషయమే మరచిపోయాను.

1982వ సంవత్సరం జనవరి మొదటి వారంలో మా ఆఫీసుకు మూడు రోజులు సెలవు దినములై యుండినందువల్ల ప్రకాశంజిల్లా కంభం మండలమందలి మా స్వగ్రామమైన తురిమెళ్ల గ్రామానికి మా తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లాను. అక్కడ రెండు రోజులున్న తర్వాత అచ్చటి నుండి నంద్యాలకు 3-4 గం॥ల ప్రయాణమే గనుక నంద్యాలకు వెళ్లి కాశిరెడ్డి నాయనను చూడాలనే ప్రేరణ గలిగింది. ఆ రోజు జనవరి 6వ తేదీ. నేనొక ముఖ్యమైన పనిమీద వెంటనే బయలుదేరి వెళ్లవలసియున్నదని యింట్లో తల్లిదండ్రులకు చెప్పి మధ్యాహ్నము 3 గం॥ల ప్రాంతంలో బయలుదేరి మా గ్రామానికి 10 మైళ్ళ దూరంలో యున్న గిద్దలూరుకు బస్సులో చేరుకొని అచ్చటి నుండి 50 మైళ్ళ దూరంలో యున్న నంద్యాలను చేరుకొని అచ్చట కాంట్రాక్టరు నాగేశ్వరరావుగారింటి అడ్రసు తెలుసుకొని వెళ్లేటప్పటికి రాత్రి 8 గం॥ల సమయమయింది. అప్పుడు నాగేశ్వరరావుగారు కాశిరెడ్డినాయన ఆ రోజు మధ్యాహ్నమే వారింటికి వచ్చి విశ్రాంతి తీసుకొని నేనచ్చటికి చేరుకోక మునుపే భోజనము చేసి ఎక్కడికో బయలుదేరి వెళ్లారనీ, ఆ రోజు రాత్రికి వారు తిరిగి వస్తారన్న నమ్మకము లేదనీ, మరెప్పుడు వారింటికి వస్తారో కూడా చెప్పలేననీ తెలియజేసారు. అప్పుడు నాకు నిరాశ కలుగక వారి ఆశ్రమానికి అంటే దిగువ అహోబిలానికి వెళ్లాలనే ప్రేరణ కలిగింది. నేను నాగేశ్వరరావుగారి దగ్గర సెలవు తీసుకొని నంద్యాల బస్‌స్టాండుకు చేరుకున్నాను. అప్పుడు అహోబిలానికి బస్సులేదు. అప్పుడు నాకు వెంటనే శ్రీ అరవిందాశ్రమం, పాండిచ్చేరిలో ఆశ్రమవాసిగా యుండి తిరిగి వచ్చి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటగా శ్రీ అరవిందుల అవశేషాలు స్థాపించబడిన గ్రామమైన యాళ్ళూరులో ఆశ్రమ పద్ధతిలో ఒక స్కూలును నిర్వహిస్తున్న వెంకట రమణమ్మగారు జ్ఞప్తికి వచ్చారు. ఆమెతో నాకు అంతకుముందే పరిచయం ఉండటంవల్ల, ఆమె తన ఆశ్రమానికొకసారి వచ్చి కొన్ని రోజులు గడుపవలసిందిగా నన్నంతకు క్రితమే ఆహ్వానించి యుండడం వల్ల, అప్పుడు రాత్రి 9 గం॥లై యాళ్ళూరుకు వెళ్లడానికి బస్సు సిద్ధంగా యుండడం వల్ల నేనా బస్సెక్కి కూర్చున్నాను. నన్నా బస్సు రాత్రి 10 గం॥లకు యాళ్ళూరు

గ్రామం చేర్చింది. నేను వెంకటరమణమ్మగారి ఆశ్రమానికి వెళ్ళగానే ఆమె ఎంతో సంతోషించి అప్పటికప్పుడు అరగంటలో నా భోజనానికి ఏర్పాటు చేశారు. నా భోజనానంతరం శ్రీ అరవిందాశ్రమాన్ని గురించి, గుంటూరులోయున్న శ్రీ అరవిందకేంద్రాన్ని గురించి, యాళ్ళూరులో వారి స్కూలు ఇలా చాలా విషయాలు మాట్లాడుకున్న తర్వాత నేను కాశిరెడ్డి నాయనను చూడ్డానికి నంద్యాల వచ్చి ఉదయమే అహోబిలానికి బయలుదేరే ఉద్దేశ్యంతో రాత్రికి వారి దగ్గరకు యాళ్ళూరు వచ్చిన విషయం చెప్పాను. అప్పుడామె తాను కూడా వారిని చూడలేదనీ కాబట్టి ఉదయాన్నే స్నానాదికాలైన తర్వాత నాతో తను కూడా బయలుదేరతాననీ చెప్పారు. ఆమె కూడా బయలుదేరబోతున్నందుకు నాకు చాలా ఆనందం కలిగింది. ఆ రోజు రాత్రి గం. 12.30ని వరకూ మేము సత్సంగములోనే గడిపాము.

ఇక్కడ వెంకట రమణమ్మగారిని గురించి కొంత వివరణ యిస్తే బాగుంటుంది. ఆమె శ్రీ అరవిందుల పూర్ణయోగ మార్గమందు పయనించిన ఒక యోగిని. ఆమె తన చిన్నతనం నుండే భవద్భక్తి గలిగి భక్తి గీతాల నాలపిస్తూ యుండేది. యుక్త వయసులో పెండ్లిపై ధ్యాస పెట్టక భాగవతం, భగవద్గీత మొదలైన ఆధ్యాత్మిక గ్రంథాలను పఠించి, సత్సంగములను నిర్వహించి యువతీ యువకులను సన్మార్గ వర్తకులను గావించేది. ప్రజల్లో చైతన్యాన్ని కలిగించడానికి సద్భావనాయాత్రలు నిర్వహించేది. భగవద్ధ్యానములో ఎక్కువ సమయాన్ని గడుపుతుండేది. తర్వాత యోగివర్యులు, స్వాతంత్ర్య సమరయోధులు, పూర్ణావతారులైన శ్రీ మాతారవిందుల వైపు ఆకర్షితులై శ్రీమతార విందులను దర్శించడమేగాక వారి కృపకు పాత్రులై శ్రీ అరవిందాశ్రమంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పొందగలిగారు. వారు శ్రీ అరవిందులను దర్శించిన మొదటిసారే శ్రీ అరవిందులపై అశువుగా పాడిన పాటల నిప్పటికీ ఆశ్రమంలో మన తెలుగువారు పాడుకుంటుంటారు. వీరు తమ బంధువుల ప్రోద్బలంతో పెండ్లి చేసుకోవలసి వచ్చినప్పుడు కేవలం ఒక సంవత్సరము మాత్రమే సాంసారిక జీవితాన్ని గడిపి ఆ తర్వాత తిరిగి శ్రీ అరవిందాశ్రమానికి అంకితమవుతాననీ, అందుకు సిద్ధపడిన వ్యక్తినే

వివాహమాడగలననీ పట్టుబట్టి చివరికలాంటి వ్యక్తినే యొకరిని వివాహమాడారు (వారి భర్త కూడా మంచి భక్తుడు, శ్రీ మాతారవిందుల అనుయాయులు). ఒక సంవత్సరము వైవాహిక జీవితాన్ని గడిపిన వారి కొక పుత్రుడు కలిగాడు. ఆ అబ్బాయి తన కడుపులో యుండగా పిల్లవాడికి అన్నీ దైవగుణాలబ్బాలని యోగమందు గడిపేవారు. వారబ్బాయిపేరు శ్రీ మాత ప్రేరణతో 'దినకర్' అని పెట్టారు. ఈ అబ్బాయి కొరకై శ్రీమాత శ్రీఅరవిందాశ్రమంలో నర్సరీస్కూలు నేర్పాటు గావించి అందులో బర్మా (మయన్మార్) కాందిశీకుల పిల్లలకు కూడా ఆశ్రయం కల్పించారు. ఈ అబ్బాయి అతి పిన్న వయసునందే బహు ప్రజ్ఞాశాలిగా, బహు భాషావేత్తగా పేరుగాంచారు. ఈ అబ్బాయి తనకు 21 సం॥ల వయసప్పుడు తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో రెలెక్కే సమయంలో తనకు మూర్ఛరోగముండుటచే రైలు కిందకు జారిపడి చనిపోయాడు. అప్పుడు తనే మాత్రమూ కంటతడి పెట్టకుండా అమ్మ యిచ్చిన పిల్లవాడు అమ్మలోనే కలిసి పోయాడు. బాధపడవలదని ఎంతగానో చింతిస్తున్న తన భర్తను ఊరడిల్లజేయడానికి ప్రయత్నించిన ధీశాలి. తన కుమారుని దేహానికి గూడా శ్రీ అరవిందుల అవశేషాలనుంచిన మందిరానికి దగ్గరగానే మందిరాన్ని నిర్మించింది. కుమారుడు పోయాడన్న దిగులుతో ఆమె భర్తకూడా ఒక సంవత్సరంలోనే స్వర్గస్థులైనారు. తర్వాత ఆమె శ్రీ అరవిందాశ్రమం పాండిచ్చేరి వెళ్లకుండా యాళ్ళూరులోనే ఆశ్రమాన్ని పాఠశాలను నిర్వహిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా శ్రీమతారవిందుల పూర్ణయోగాన్ని గురించి ప్రచారం గావించి ఎందరిలోనో ఆధ్యాత్మిక బీజాలు నాటిన ధన్యజీవి వెంకటరమణమ్మగారు. వీరు కూడా నాలుగు సంవత్సరాల క్రితము సమాధి చెందారు.

జనవరి 7వ తేదీన ఉదయాన్నే 6 గం॥లకు లేచి కాలకృత్యాలు, స్నానాదికాలు ముగిసిన పిమ్మట బయలుదేరి 9 గం॥లకు ఆళ్ళగడ్డ చేరుకున్నాము. అక్కడ నుండి అహోబిలం వెళ్లే బస్సు గం 9.45 ని.లకు దొరకడం వల్ల దిగువ అహోబిలానికి దాదాపు 11 గం॥ల సమయంలో చేరుకున్నాము. అక్కడ దిగువ అహోబిల నరసింహస్వామి గుడి మూసే

సమయమవుతున్నదని ఎవరో చెప్పగా విని వెంటనే మందిరానికి వెళ్లి స్వామిని దర్శించి వెలుపలికి వచ్చాము. అక్కడ మేము కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి వెళ్లడానికి దారి కనుగొని కాలినడకన బయలుదేరాము. మేము బయలు దేరిన చోటు నుండి ఆశ్రమం దాదాపు 2 కి.మీ దూరంలో యున్నది. మేము వెళ్లేదారిలో మాకు ఆశ్రమానికి చెందిన ట్రాక్టరొకటి ఎదురైనది. దానిలో కూర్చున్నవారు కాశిరెడ్డినాయన యిప్పుడు ఆశ్రమంలో లేరనీ, మేము వచ్చే దారిలోనే మాకు కారులో ఎదురై యుంటారనీ చెప్పారు. అప్పుడు మేమిరువురమూ ఎలాగూ బయలుదేరి వెళ్లుచున్నాము గనుక ఆశ్రమానికి వెళ్లి దానిని దర్శించిరావలెననే ఉద్దేశ్యంతో ఆశ్రమానికి వెళ్లాము. అప్పటికి మధ్యాహ్నం 12 గం॥ల సమయమైనది. ఆ సమయం ఆశ్రమంలో భోజనవేళ. అందరితోపాటు మేము కూడా భోజనాన్ని కాశిరెడ్డి నాయన ప్రసాదంగా తీసుకొని దాదాపొక గంటసేపక్కడ గడిపాము. అక్కడ మాకు వేరే వారి మాటల ద్వారా తెలిసిందేమిటంటే మాకెదురైన ట్రాక్టరును మాజీ ముఖ్యమంత్రి కీ.శే. శ్రీ కోట్ల విజయభాస్కరరెడ్డిగారు ఆశ్రమానికి యిచ్చారనీ, వారు మొదటిసారి రాష్ట్ర ముఖ్యమంత్రి కాకముందు కాశిరెడ్డి నాయనను దర్శించగా ముఖ్యమంత్రి కాగలరని ఆశీర్వదించారనీ, అలాగే అయ్యారనీ, అయితే తర్వాత వచ్చిన ఎలక్షన్లలో అంటే రెండోసారి వారు ముఖ్యమంత్రి కాలేరని చెప్పారని, అలాగే జరిగిందనీ, కాశిరెడ్డి నాయనపై ఉన్న భక్తితో ఆశ్రమ వ్యవసాయ పనులకు ఉపయోగపడ గలదని ట్రాక్టరును కొని పెట్టారనీ అలాగే ఆశ్రమం వరకు తారు రోడ్డు వేయించారనీ తెలిసింది. ఆశ్రమంలో చాలా ఆవులను పెంచుతున్నారు. ఆశ్రమవాసులే కొంత భూమిని వ్యవసాయం చేసి ఆశ్రమానికి కావలసిన ధాన్యాన్ని పండిస్తున్నారు. అచ్చటి ప్రశాంత వాతావరణం మాకెంతో ఆనందాన్ని కలుగజేసింది. అచ్చట మేము గైకొన్న ప్రసాదం మాకెంతో తృప్తినిచ్చింది. కాశిరెడ్డినాయన ఫోటోను మేము ఆయన ఆశ్రమంలో మొట్టమొదటిసారి చూడగలిగాము. ప్రత్యక్షంగా యింకా వారిని చూడలేకపోయామన్న వెలితి మా హృదయాల్లో ఉండినప్పటికీ ఆయన ఆశీస్సులు మాపై యున్నట్లు అనుభూతి చెందాము. అప్పుడు మేము తిరిగి

దిగువ అహోబిళం మేము బస్సు దిగినచోటుకు బయలుదేరాము. బాగా ఎండగా యుండినది. మధ్యాహ్నం గం. 1.30ని పై బడిన సమయం. దాదాపు 2 కి.మీ దూరం ఎండకు నడవాలంటే వెంకట రమణమ్మగారు యిబ్బంది పడతారేమోననుకుంటూ అమ్మను తలుచుకున్నాను. అప్పుడు విచిత్రంగా మా వెనుక నుంచి ఆశ్రమానికి చెందిన ట్రాక్టరొకటి వచ్చి మమ్మల్ని ఎక్కించుకొని దిగువ అహోబిళంలో మమ్మల్ని దించారు. అప్పటికి మధ్యాహ్నము 2 గం॥ల సమయమైంది. మేమక్కడ ఒక అరగంట ఎదురు చూడగా ఎగువ అహోబిళానికి వెళ్లే బస్సు రాగా ఆ బస్సెక్కాము. 20-25 నిమిషాల్లో అది ఎగువ అహోబిళం నృసింహ్వామి ఆలయానికి దాదాపు 1 ఫర్లాంగు దూరంలో ఆగింది. మేము బస్సు దిగి ఆలయానికి వెళ్తుంటే మమ్మల్ని చూచి ఒకావె ఎదురొచ్చి ఎంతో ఆప్యాయంగా వెంకటరమణమ్మగారిని పలుకరించి, ఆలింగనం చేసుకొని తానక్కడ నిర్వహిస్తున్న చిన్న టీ కొట్టుకు తీసుకువెళ్ళి మాకు టీ యిచ్చి ఆదరించింది. ఆ ఎండలో అక్కడి కొండల్లో మేమూహించని విధంగా మాకు సమయానికి భోజనం, టీ, అప్యాయతాదరణలు-యివన్నీ మాకు దైవమే ప్రసాదిస్తున్న అనుభూతి కలిగింది. ఆమె మాకు కొబ్బరికాయలు, పూలు యిప్పించి నేరుగా గుహలో యున్న నృసింహ్వామి సన్నిధికి గొనిపోయింది. మేము వెళ్ళిన సమయంలో ఎక్కువ మంది లేరు (శనివారమైనా). స్వామిని దర్శించి పరవశులమై అక్కడ కూర్చొని పది నిమిషాలు ధ్యానమగ్నులమై గడిపాము. ఆలయం వెలుపలికి వచ్చిన తర్వాత టీకొట్టు నిర్వహించే ఆ మహిళకు మేమిరువుమూ కృతజ్ఞతలు చెప్పి తిరుగు ప్రయాణమైనాము. అచ్చటి నుండి బస్సులో ఆళ్ళగడ్డ చేరుకున్నాము. ఆళ్ళగడ్డ నుండి నంద్యాలకు వెళ్లే బస్సులో మేమిద్దరమూ ఎక్కి మార్గ మధ్యంలో యాళ్ళూరుకు వెళ్ళే అడ్డురోడ్డులో వెంకటరమణమ్మగారు దిగాలి, నేను నేరుగా నంద్యాలకు వెళ్లి అచ్చటి నుండి గుంటూరుకు రైల్లో ప్రయాణించాలని మా ప్లాను. కానీ మేము నంద్యాలకు వెళ్లే బస్సు ఎక్కేసమయంలో ఆరోజు సాయంత్రం తప్పక కాశిరెడ్డి నాయన దర్శనమౌతుందనీ, నంద్యాలలో కంట్రాక్టరు నాగేశ్వరరావు గారింటికి


వెళ్ళవలసిందనీ నా హృదయాన్నుండి నాకు సందేశమందినది. ఈ విషయాన్ని వెంకటరమణమ్మగారికి చెప్పగా ఆమె కూడా నాతోపాటు నంద్యాల వస్తానన్నారు. మేమిరువురమూ బస్సులో ప్రయాణించి నంద్యాలలో దిగిన వెంటనే నాకు దారి తెలుసును గనుక ఆలస్యము చేయకుండా కాంట్రాక్టరు నాగేశ్వరరావుగారింటికి వెళ్లాము. అప్పటికి సమయము రాత్రి 8 గంIIలు అంటే క్రితమురోజు నేను వారింటికి వెళ్లియుండిన సమయమేనన్నమాట. ముందు నేను వారింట్లో విచారించగా కాశిరెడ్డి నాయన ఆరోజు సాయంత్రం వారింటికి వచ్చారనీ ఒక అరగంట క్రితమే భోజనముచేసి పడుకున్నారనీ చెప్పారు. నేను వెంటనే రెండు మూడు యిండ్ల అవతల యున్న ఒక కిళ్ళీ కొట్టు దగ్గరకు వెళ్ళి కాశిరెడ్డి నాయనకు సమర్పించడానికి నాకు, వెంకటరమణమ్మగారికి యిరువురికీ అరటిపండ్లు తెచ్చాను. అప్పుడు మేమిరువురమూ కాళ్ళు కడుక్కొని నాగేశ్వరరావు గారింట్లోకి ప్రవేశించాము. అప్పుడు కాశిరెడ్డి నాయనగారు మంచంపై విశ్రమించియుండగా వారికి నాగేశ్వరరావుగారు వారి ధర్మపత్ని కాళ్ళు పట్టుచుండిరి. కాశిరెడ్డినాయన సాధారణంగా పడుకున్నతర్వాత మధ్యలో లేవరనీ, ఎప్పుడో తెల్లవారుజామునగానీ లేవరనీ నాగేశ్వరరావుగారన్నారు. మేము వెళ్ళిన తర్వాత ఒక ఐదు నిమిషములు గడచిన పిమ్మట మాకు కూడా వారికి సేవ చేసే అవకాశమివ్వమని అడుగగా వారు అనుమతించారు. వారికి మేము కాసేపు సేవ చేసిన తర్వాత సేవను తిరిగి ఆ దంపతుల కొసగి కొద్దిగా వెనుకకు జరిగి వెనుక ఉన్న గోడకు ఆనుకొని కూర్చొని యిద్దరమూ ఒకేసారి మనసులో 'యోగులు యోగ నిద్రలో ఉంటారంటారు గదా? కాశిరెడ్డి నాయనకు మేమొచ్చిన విషయము తప్పక తెలిసి యుంటుందిగనుక ఒకసారి కళ్ళువిప్పి మమ్మల్ని అనుగ్రహిస్తే బాగుంటుంది' అనుకున్నాము. (మేమిద్దరమూ యిలా ఒకేలా ఒకేసారి అనుకోవడమన్నది తర్వాత మేము మాట్లాడుకున్నప్పుడు తెలిసింది). మేమిలా అనుకున్నామో లేదో వారు కళ్ళువిప్పి మావైపు చూశారు. అప్పుడు మా హృదయం ఆనందంతో పులకించింది. వెంటనే వారు లేచి కూర్చొని, 'మీరొస్తున్నట్లు, మీరొచ్చి యున్నట్లు' తనకు తెలుసునన్న భావాన్ని

తన చూపుల్తో తెలియబరుస్తున్నట్లు మా వైపు చూసి బాత్‌రూమ్‌కు వెళ్ళి వచ్చి కూర్చున్నారు. ఆశ్రమానికి వెళ్ళి వచ్చారుగదా అని ప్రశ్నించారు. మేము ఔనని సమాధానం చెప్పాము. ఇంటావిడతో మా యిరువురికీ భోజనాలేర్పాటు గావించమని ఆదేశించారు. వెంకటరమణమ్మగారు వారితో నేను గుంటూరులో శ్రీ అరవింద కేంద్రాన్ని చూస్తుంటానని చెప్పగా వారు నాతో 'కుండలు వేరైనా మట్టి ఒకటేలే' అన్నారు. గురువులు వేరైనా తత్వమొకటేనన్న అర్థము నాకు స్ఫురించింది. వెంకటరమణమ్మ గారిని గురించి నేను వారికి చెబుదామనుకొనేలోపు వారే ఆమెతో తన ఆశ్రమము మరియు పాఠశాల నిర్వహణలో కొన్ని యిబ్బందుల నెదుర్కొంటున్నారనీ, ఆ యిబ్బందులన్నీ త్వరలోనే తొలగి పోగలవనీ చెప్పారు. తా నడగదలచుకొన్న విషయాన్ని వారే చెప్పడం మా కాశ్చరానందాలను కలుగజేసింది. తాత్విక విషయాలు కొన్ని చెప్పిన తర్వాత మమ్మల్ని భోజనం చేయమన్నారు. మేము భోజనము చేసేటప్పటికి 9.00 గం॥ల సమయమయింది. 'మీ రీ రాత్రికి యిక్కడే వుంటారా లేక వెళ్తారా' అని అడిగితే మేము వెళ్తామని సమాధానమిచ్చాము. అప్పుడు నాతో 'నీవు వెంటనే బయలుదేరకపోతే బస్సు మిస్సవుతుంది' అన్నారు. మా యిద్దరికీ యింకా కొద్ది సేపు అక్కడే ఉండాలనిపించి ఉన్నాము. ఒకసారి తమ ఆశ్రమానికి యాళ్ళూరు వచ్చి వెళ్లాల్సిందిగా వారిని వెంకటరమణమ్మగారు కోరగా తానొస్తే ఆమె భరించలేరని (వచ్చే జనాన్ని దృష్టిలో పెట్టుకొని) సమాధానమిచ్చారు. కొద్దిసేపు అక్కడే ఆయన సన్నిధిలో గడిపి మేమాయన పాదాలకు నమస్కరించి నాగేశ్వరరావు దంపతులకు ధన్యవాదాలు చెప్పి సెలవుతీసుకొని వెళ్లడానికని యింటి బాహ్యాగుమ్మం వరకు వెళ్ళాము. బయటకు వెళ్ళబోయే సమయంలో మమ్మల్నిద్దరినీ వెనుకకు పిలిచి మాకు చెరియొక రూపాయ నాణేన్ని ప్రసాదించారు. ఏ కొద్దిమందికో తన పూర్ణాను గ్రహమున్నవారికి అలా రూపాయనాణేల్ని ప్రసాదిస్తారనీ, అదెంతో శుభప్రదమనీ, ఆ రూపాయ నాణేల్ని గ్రహించిన వారు వాటిని తమ తమ పూజా మందిరంలో పెట్టుకుంటారనీ నాగేశ్వరరావు గారు మాకు వివరించి చెప్పారు. కాశిరెడ్డి నాయన నాకిచ్చిన రూపాయనాణెమిప్పటికీ

నాదగ్గర భద్రంగా యున్నది. మేము ఆటోలో నంద్యాల బస్‌స్టాండ్‌కు వెళ్లేటప్పటికి (7వ తేదీ) రాత్రి గం. 10.20 ని.లయినది. కాశిరెడ్డి నాయనగారు చెప్పినట్లు గుంటూరు మీదుగా విజయవాడ వెళ్లే బస్సు 10 గం॥లకే వెళ్లిపోయి యుండడం చేత అంటే మిస్ కావడం చేత రాత్రి 12 గం॥ల వరకూ తర్వాతి బస్సు వచ్చేవరకూ నేను వేచి యుండాల్సివచ్చింది. వెంకటరమణమ్మ గారికి గం. 10.30ని.లకే బస్ అందడం చేత వారు యాళ్ళూరు వెళ్లిపోయారు. నేను రాత్రి 12 గం॥ల బస్సుకు బయలుదేరి 8వ తేదీ ఉదయం 8 గం॥లకు గానీ గుంటూరుకు చేరుకోలేకపోయాను.

కాశిరెడ్డి నాయన సాదా బట్టల్లో అతి సామాన్య వ్యక్తిగా కనిపించేవారు. అవధూత లేవిధంగా తమ శరీరానికంత ప్రాధాన్యతనివ్వక భగవత్ చైతన్యంలో మునిగి తెలుతుంటారో ఆ విధంగా వారు కూడా నివురు గప్పిన నిప్పువలె తన చైతన్యమయ, ఆనందమయ స్వరూపాన్ని వెలుపలికి కనబడనిచ్చేవారు కారు. అయితే ఆళ్ళగడ్డ, నంద్యాల మొదలైన ప్రాంతాల్లో వారెక్కడికి వెళ్లినా తండోపతండాలుగా జనం మూగేవారు. ఆ ప్రాంతంలో ఫాక్షనిజం ఉన్నా అన్ని వర్గాల వారికీ కాశిరెడ్డి నాయన ఆరాధ్యులే, కావలసినవారే. ఆయన వాక్కును వేదవాక్కుగా పాటించేవారు. ఆయన పేరుతోనే అన్నదాన సత్రాలను నిర్వహిస్తుంటారు. అన్నదాన వితరణలో ముఖ్యంగా వారికీ, జిల్లెళ్ళమూడి అమ్మకూ సారూప్యత కనిపించింది.

ఈ విధంగా నేనాకాంక్షించిన ఎన్నో రోజులతర్వాత అమ్మ కృపచే కాశిరెడ్డినాయునను దర్శించుకోగలిగాను. ఇలాగే మరికొంత మంది మహానుభావులను, అవతార పురుషులను అమ్మకృపచే దర్శించుకోగలగటం నా అదృష్టంగా భావిస్తున్నాను.



28. గొలగమూడి వెంకయ్యస్వామి దర్శనం


జిల్లెళ్ళమూడిలో అమ్మదగ్గర కొంత కాలం గడిపి, తర్వాత కాలంలో ఒంగోలులో శ్రీ శిరిడీసాయి బాబా మందిర నిర్మాణానికి కారణభూతులై, ఎందరో జిజ్ఞాసువులు, భక్తులకు మార్గదర్శకులై వారిని సాయినాథుని పాదపద్మాల చెంతకు చేర్చిన శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారుగారు ఎంతో శ్రమించి దేశమంతా పర్యటించి ఎందరో అవతార పురుషుల, అవధూతల మరియు మహాత్ముల జీవితచరిత్రలను గ్రంథస్తం చేయడం మన తెలుగువారు చేసుకున్న అదృష్టం. నేనొకసారి వారు గ్రంథస్తంచేసిన 'గొలగమూడి వెంకయ్యస్వామి చరిత్ర'ను చదవడం జరిగింది. అప్పటి నుండి వెంకయ్య స్వామి వారి పట్ల నాకు భక్తి ప్రపత్తులేర్పడినవి. గొలగమూడి వెంకయ్యస్వామి అతి సామాన్యునివలె జనం మధ్యలో తిరుగుచుండినా ఆయన అనుగ్రహం వల్ల కొందరికాయన మహిమలు వెల్లడవుతుండేవి. అమ్మవలె లేక శిరిడీ సాయినాథుని వలెనే లౌకికమైన చదువేదీ చదువకుండినా ఎందరి జీవితాలనో ప్రభావితం చేసి, సన్మార్గ వర్తములను గావించి దిశా నిర్దేశం గావించి వారినుద్ధరించారు, యిప్పటికీ ఉద్ధరిస్తున్నారు. సందర్భానుసారం నిదర్శనం కోసం మహిమలనెన్నింటినో ప్రదర్శించినా నివురుగప్పిన నిప్పువలె సామాన్యుడిగానే యుండేవారు. పంచభూతాలూ ఆయన ఆధీనమందేయున్న అనుభవాలనెన్నిటినో తన భక్తుల కనుగ్రహించేవారు. వారు సమాధి చెందిన తర్వాత కూడా భక్తుల ననుగ్రహిస్తూనే యున్నారు. వారి సమాధి మందిరం నెల్లూరుకు సమీప గ్రామమైన గొలగమూడియందున్నది. వారి దివ్యమందిరాన్నొకసారి దర్శించాలని సంకల్పించుకున్నాను గానీ అదే పనిగా ప్రయత్నించలేదు. నేను నా ఉద్యోగ ధర్మాన్ని నిర్వహించడానికి నేను రెండుసార్లు నెల్లూరుకు వెళ్లవలసి వచ్చి వెళ్లినప్పుడు నేను గొలగమూడికి వెళ్ళి స్వామివారి మందిరాన్ని దర్శించి ఎంతో దివ్యానుభూతినీ, శాంత్యానందాలనూ పొందాను.

నేను గొలగమూడికి వెళ్ళకముందు ఒకసారి వెంకయ్యస్వామి నా కిచ్చిన స్వప్న దర్శనాన్నిక్కడ వివరిస్తాను. ఒక రోజు తెల్లవారుజామున స్వప్నంలో నేనొక రోడ్డులో నడచి వెళ్ళుచున్నాను. ఆ రోడ్డులో నేను, తూర్పు వైపు నుండి పడమర వైపు వెళ్తుండగా నా ఎదురుగా దాదాపు 100 గజముల దూరంలో ఏదో శివాలయం (శ్రీశైలం వలె యుండినది) దాని ముందరి గాలి గోపురం కనిపిస్తున్నవి. నేను దానిని సమీపించే ముందు నాలుగు రోడ్ల కూడలిలో నాకు ఎడమ వైపున రోడ్డు ప్రక్కన ఒక ముసలాయన ఒక గోనెపట్టాపై ఉత్తరాభిముఖంగా కూర్చొని ఉండడాన్ని గమనించాను. పాదచారులెవరూ ఆయనను గమనించడంగానీ, పట్టించుకోవడం గానీ చేయక నిర్లక్ష్యంగా వెళ్ళుచున్నారు. నేనాయనను చూచిన తర్వాత ఎందువల్లనో నా అడుగులు ముందుకు పడక ఆగిపోయాను. ఆయన సాధారణ బట్టల్లో గోనె పట్టాపై కూర్చొని యున్న బిక్షగానివలె యితరులకు కనిపిస్తున్నప్పటికీ నాకు మాత్రము ఆయనొక అవధూతయై యుంటారనిపించి, ఆయన దగ్గరకు వెళ్ళి ఆయనపాదాలకు నమస్కరించుకోమన్న ప్రేరణ నా హృదయంలో కలిగింది. వెంటనే నేను ఆలస్యం చేయకుండా ఆయన దగ్గరకు వెళ్ళగా ఆయన గొలగమూడి వెంకయ్యస్వామిగా కనబడగా నేను ఆయన పాదాలపై నా నుదురు నుంచి నమస్కరించాను. అప్పుడాయన తన హస్తాన్ని నా శిరస్సు పై ఉంచారు. ఈ హస్తమస్తక సంయోగం వల్ల నా శిరస్సునందేదో మెరుపు మెరిసినట్లై యొక దివ్యానుభూతిని, అద్వైతానుభూతిని చెందాను. ఎంతో తన్మయుడనయ్యాను. అయితే నేనా స్థితిలో గూడా నాకు వారు ప్రసాదించిన యీ దివ్యానుభూతితోపాటు శ్రీ అరవిందుల పూర్ణయోగం సిద్ధించేటట్లు ఆశీస్సుల నొసగవలసిందిగా వేడుకున్నాను.

పై స్వప్నమంతటితో ఆగిపోయి నాకు మెలకువ వచ్చింది. అది నాకు స్వప్నము వలె గాక నిజముగా జరిగినట్లుగా యుండి దాని ప్రభావమా రోజంతా యుండినది. ఈ స్వప్నమొచ్చిన తర్వాత గొలగమూడిని దర్శించాలన్న ఆకాంక్ష రోజురోజుకూ పెరగడం, పైన చెప్పిన విధంగా నేను

నెల్లూరుకు వెళ్లిన రెండు సార్లు గొలగమూడి వెళ్ళి వెంకయ్యస్వామి మందిరాన్ని దర్శించుకొని రావడం జరిగింది.

గొలగమూడి వెంకయ్య స్వామిని దర్శించినట్లుగానే భరద్వాజ మాస్టరుగారు వ్రాసిన 'గజానన మహరాజ్ చరిత్ర' గ్రంథాన్ని చదివిన తర్వాత నేను శిరిడీకి వెళ్ళినప్పు డెప్పుడైనా అక్కడి నుండి శేగాం వెళ్లి గజానన మహారాజ్ సమాధిని దర్శించుకొని రావాలనే కోరిక గలిగి రోజురోజుకూ అది బలపడసాగింది. సాయి భక్తులు శ్రీ ఆదిపూడి మోహనరావుగా రొకసారి గుంటూరు నుండి తాను వేసిన టూరులో భాగంగా శిరిడీతోపాటు శేగాంను కూడా చేర్చారు. అప్పుడు నేను సకుటుంబంగా శిరిడీతోపాటు శేగాంకు వెళ్లి గజానన మహరాజ్ సమాధి మందిరాన్ని దర్శించి దివ్యానుభూతికి లోనైనాను.



29. సత్యసాయిబాబా స్వప్న దర్శనం

1993వ సంవత్సరంలో నేను ప్రతిరోజూ గుంటూరు జిల్లాపరిషత్ ఆవరణలో ఉన్న శ్రీ అరవింద కేంద్రానికి క్రమం తప్పకుండా వెళ్ళేవాడిని. శ్రీ అరవింద కేంద్రానికి ప్రక్కనే సత్యసాయిబాబా మందిరం యుండడం వల్ల అందులో ప్రతిగురు, ఆదివారాల్లో సత్యసాయిబాబా భజన కార్యక్రమాలు జరుగుచుండడంవల్ల, గుంటూరు శ్రీ అరవింద సొసైటీ కేంద్రమునకు అప్పుడు అధ్యక్షులుగా యుండిన శ్రీ కనిగొళ్ళ ప్రకాశరావు (ఏలూరు) గారు సత్యసాయి భక్తులై యుండి వారి ప్రభావము కొంత నాపై పడియుండుటచే అప్పుడప్పుడూ నేను సత్యసాయి బాబా మందిరంలోకి వెళ్ళి భజన కార్యక్రమంలో పాల్గొనేవాడిని. భక్తి పారవశ్యంతో వారు చేసే భజనలు నాకు ప్రశాంతతను ఆనందాన్ని చేకూర్చేవి. అయితే నేను నా మనసు నందు సత్యసాయిబాబా స్థానములో జిల్లెల్లమూడి అమ్మను తలంచుకొని ధ్యానస్థుడనై కొంతసేపు గడుపుతుండే వాడిని. అంతేగానీ విడిగా నేను సత్యసాయిబాబాను తలచుకోవడంగానీ, వారికి పూజలు చేయడం గానీ చేయలేదు. అయినప్పటికీ నాకొకరోజు తెల్లవారుజామున స్వప్నంలో సత్యసాయిబాబాగారు కనిపించడమేగాక తన పాద నమస్కారాన్ని అనుగ్రహించిన తీరును క్రింద వివరిస్తాను.

అదొక బహిరంగ ప్రదేశము. ఎగ్జిబిషన్ గ్రౌండ్ వలె విశాలమైన ప్రదేశము. ఆ ప్రదేశమెక్కడిదో తెలియదుగానీ అక్కడ వేలకొలదీ జనం క్రిక్కిరిసి యున్నారు. అక్కడ ఒక పెద్ద వేదిక నేర్పాటు గావించి సత్యసాయిబాబాగారి దర్శనానికి, వారి ఉపన్యాసమునకు ఏర్పాట్లు గావించి యున్నారు. వేదికపై గుమిగూడియున్న జనంలో నేను కూడా యున్నాను. నేను వేదిక వెనుక వైపున వేదిక ఎక్కడానికి ఏర్పాటుగావించిన మెట్లకు సమీపంలో వేదికపై నిలుచొని యున్నాను. అందరూ ఎదురుచూస్తుండగా సత్యసాయిబాబా వేదికపైకి రానేవచ్చారు. వేదికపై యున్న జనంలో నుంచి

నా ప్రక్కగా సత్యసాయిబాబాగారు వెళ్తున్నప్పుడు నాకు వారి పాద పద్మాలకు నమస్కరించుకోవాలనే కోరిక గలిగి వారు నాకా అవకాశము కలిగిస్తే బాగుండును గదాయని తలపోస్తుండగానే వారు నన్ను దాటి రెండు మూడడుగులు వేశారు. అయ్యో! వారు నన్ను దాటిపోయారే? ఎలా? అని నిరాశజెందుచుండగా బాబా వెను దిరిగి నాదగ్గరకు వచ్చి నేను వారి పాదాలకు నమస్కరించుకొనే అవకాశాన్ని కలుగజేశారు. అప్పుడు నేను క్రింద కూర్చొని నా.నుదుటిని వారి పాదాలపై యుంచి నమస్కరించాను. వారి పాదస్పర్శవల్ల నాకు దివ్యమైన శాంతి, పరమానందము కలిగి ఒళ్ళు పులకరించినది.

పై స్వప్నమంతటితో ఆగి వెంటనే నాకు మెలకువ వచ్చినది. కానీ అది నాకు స్వప్నము లాగా అనిపించక అప్పుడే భౌతికంగా జరిగిన సంఘటనగానే యుండినది. ఎందుకంటే వారి పాద స్పర్శ యొక్క అనుభూతి, నేను పొందిన శాంత్యానందాలు తాజాగానే యుండినవి. అంతేగాక నేనున్న గదిలో బాబా విభూదికి చెందిన పరిమళం వ్యాపించి యుండి నన్నాశ్చర్యానందాలకు గురిచేసింది. ఆరోజు గురువారమై యుండినందున నేను సత్యసాయిబాబా మందిరానికి వెళ్లినప్పుడు ఒక సత్యసాయి భక్తుడైన సోదరునికి వివరించగా వారు యీ సంఘటనను స్వప్నంగా తలచవద్దనీ, నిజంగానే సత్యసాయిబాబాగారు తన పాద నమస్కారాన్ని నాకు అనుగ్రహించినట్లుగా భావించమనీ నాకు చెప్పారు.

అమ్మ నొక సోదరుడొకసారి సత్యసాయిబాబా ఎవరమ్మా అని అడుగగా అమ్మ 'వాడూ' నా బిడ్డేనని సమాధానమిచ్చింది. అందరు దేవీ దేవతలకూ తల్లి (తొలి)యైన అమ్మ, అవతారమూర్తులకు కూడా మాతయైన అమ్మ ఎప్పుడు, ఎలా, ఏ రూపంలో మనల్ని అనుగ్రహిస్తుందో తెలియదు గదా!



30. సత్యసాయిబాబాగా దర్శనమిచ్చిన అమ్మ

సంవత్సరమేదో నాకు తెలియదుగానీ అమ్మ తన అనుగ్రహయాత్ర సందర్భంగా మద్రాసు వెళ్లినప్పుడు జిల్లెళ్ళ మూడికి రాలేని వారి ఎందరిండ్లకో వెళ్లి వారికి తన దర్శన భాగ్యాన్ని కలుగజేయడమేగాక, ఆయా యిండ్ల చుట్ట ప్రక్కల వారందరికీ అయాచింతంగానే తన దర్శన స్పర్శన భాగ్యాన్ని కలుగజేసింది. ఆ సందర్భంలో తరచూ జిల్లెళ్ళ మూడివచ్చి అమ్మను దర్శిస్తూ యుండిన, తర్వాతి కాలంలో అమ్మనే సర్వేశ్వరునిగా పురుషునిగా భావించి తననొక స్త్రీగా భావించుకొని తన మెడలో అమ్మతో తాళి కట్టించుకొన్న సౌభాగ్యశీలియైన పార్థసారధిఅయ్యంగార్ (వీరిని గూర్చి జిల్లెళ్ళమూడి తరచుగా వచ్చే సోదరీసోదరులందరికీ తెలుసు. జిల్లెళ్ళమూడిలో మద్రాస్ గెస్ట్‌హౌస్ వీరి ఆధ్వర్యంలో కట్టబడినదే) గారి యింట్లో జరిగిన సంఘటన గూర్చి యిక్కడ వివరిస్తున్నాను.

పార్థసారధి అయ్యంగార్ గారు పోస్టల్‌డిపార్ట్‌మెంట్‌లో యుండేవారు. అమ్మ మద్రాస్‌లో కొందరు సినీతారలకు కూడా తన దర్శన భాగ్యాన్ని కలుగజేసింది. అమ్మ తన అనుయాయులతో పార్థసారధి గారింటికి వెళ్ళినప్పుడు నేరుగా వారు తమ యింటిలో సత్యసాయిబాబాను పూజించుట కొరకై ఏర్పరచుకొని యుండిన మందిరము గది దగ్గరకు వెళ్లి దానికి తాళము వేసి యుండుటను గమనించి తాళమును తెరిపించినది. పార్థసారధి అయ్యంగారుగారి భార్య సత్యసాయిబాబా భక్తురాలు. ఆమె కేవలము తమ కుటుంబ సభ్యులకొరకు ఆ మందిరాన్ని ఏర్పాటు చేసుకొని యుండుటచే వేరెవరినీ లోనికి ప్రవేశింప నిచ్చేదికాదు. కానీ అమ్మ ఆ మందిరం తెరిపించి అందులోకి ప్రవేశించగా అమ్మతో పాటే అమ్మతో వచ్చిన వారందరూ ఆ మందిరం గదిలోకి ప్రవేశించారు. పార్థసారధిగారి భార్యకది యిబ్బందికరంగా యుండినది. దీనికి తోడు అమ్మ నేరుగా వెళ్లి సత్యసాయిబాబా సింహాసనం పై ఆసీనురాలైంది. దీనితో ఆమె కృద్ధురాలైంది. ఆమె కెంతో బాధ కలిగినది. సర్వజ్ఞ అయిన అమ్మకు తెలియనిదేమున్నది. అమ్మ తన ప్రసన్న దృక్కులతో

ఆమెను చూసి ఆమెకు సత్యసాయిబాబాగా దర్శనమిచ్చింది. అప్పుడామె ఆశ్చర్య చకితురాలై ఆనందపరశంలో అమ్మ పాదాలపై బడింది. అంతేగాక సత్యసాయిబాబాను అర్చించుకొనే విధంగానే అమ్మకు పూజాదికాలు చేశారు.

పై సంఘటన జరిగినప్పుడు మరికొన్ని స్నాప్స్‌తో పాటు అమ్మ బాబా సింహాసనములో యుండగా సినీ ఫోటోగ్రాఫర్లు ఫోటోలు తీశారు. కానీ ఆ ఫోటోలేవీ సరిగా రాలేదు. కానీ అమ్మతోపాటు అమ్మ ఆదేశం ప్రకారం వెళ్లియున్న శేషగిరిరావుగారు (చిలకలూరి పేటలో డ్రాయింగ్ మాస్టర్‌గా ఒక స్కూల్‌లో పని చేసేవారు) తీసిన ఫోటోలు మాత్రము చక్కగా వచ్చినవి.

నేనొకసారి జిల్లెళ్ళమూడికి వెళ్లినప్పుడు శేషగిరిరావు గారు అమ్మ బాబా సింహాసనంలో కూర్చొని యున్న ఫోటో చూపించి నాకు పై వివరాలన్నీ చెప్పారు. అప్పుడు నేను ఆ ఫోటోను నాకిమ్మని అడుగగా తన దగ్గర అదొక్కటే కాపీ యున్నదనీ, కాపీలు వేయించిన తర్వాత ఒకకాపీ యివ్వగలననీ చెప్పి వాత్సల్యాలయానికి అమ్మ దర్శనార్థమై మేడ మెట్లెక్కి వెళ్లారు. నేను క్రింద విశ్వజననీపరిషత్ కార్యాలయము దగ్గర ఉన్నాను. వారు అమ్మ దర్శనార్థమై వెళ్ళగానే మనస్సులో మళ్లీ మేమిద్దరమూ ఒకేసారి జిల్లెల్లమూడి రావడమన్నది ఎప్పటికి తటస్థపడగలదో తెలియదు గనుక శేషగిరిరావు గారి దగ్గర యున్న ఆ ఫోటోను నాకా రోజే యిస్తే బాగుంటుందనుకొని అమ్మను ప్రార్థించాను. ఇలా ప్రార్థించిన కొద్దిసేపటి తర్వాత శేషగిరిరావుగారు అమ్మను దర్శించుకొని క్రిందికి వచ్చారు. అప్పుడు వారు నేను తిరిగి అడుగకుండానే తనంటతానే ఆ ఫోటోను నాకిస్తూ తన దగ్గర నెగిటివ్ వున్నది గనుక కాపీలు వేయించుకోగలనని చెప్పారు. అమ్మ నా ప్రార్థనను ఆలకించి వెంటనే శేషగిరిరావుగారికి ప్రేరణనిచ్చి ఆ ఫోటోను నాకిప్పించినందుకు అమ్మకు నా మనసునందే కృతజ్ఞతలు తెలుపుకున్నాను. అలాగే శేషగిరిరావు గారికి కూడా కృతజ్ఞతలు తెలియజేసాను. నాకేమనిపిస్తుందంటే అన్ని రూపాల్లోనూయుండి మనకు మార్గనిర్దేశం చేసి మనల్ని నడిపించేది అమ్మేనని.

31. అమ్మ పంపించిన కాఫీ

నేను జిల్లెళ్ళమూడికి అమ్మ దగ్గరకు వెళ్తున్న తొలి రోజుల్లో ఒకరోజు సాయంత్రం గం. 4.30 ని. ప్రాంతంలో వాత్సల్యాలయం అమ్మ గది కెదురుగా యున్న వరండాలో తలుపుకు ప్రక్కనే తూర్పు ముఖంగా గోడనానుకొని కూర్చొని అమ్మ చింతనలో గడుపుతున్నాను. అప్పుడు వరండాలో మరెవరూ లేరు. నాకు కొద్దిగా చలిగా ఉండినది. మనసెప్పుడెలా పరుగిడుతుందో తెలియదు. నాకప్పుడు కాఫీ త్రాగాలనిపించి యిప్పుడు అమ్మ నాకు కాఫీ పంపిస్తే బాగుండు ననుకున్నాను. వెనువెంటనే పరాత్పరియైన అమ్మను రాజరాజేశ్వరియైన అమ్మను కోరుకొనే కోరిక యిదా? అని నన్ను నేను నిందించుకొని అమ్మను ధ్యానిస్తూ కూర్చున్నాను. 5 నిమిషాలు గడిచిన తర్వాత అమ్మ గది లోపల ఉన్న గడియ తీసి తలుపు తెరచి వసుంధర అక్కయ్య వెలుపలికి వచ్చి ఒక పింగాణీకప్పులో నాకు కాఫీ యిస్తూ 'నీకు అమ్మ కాఫీ యివ్వమని చెప్పింది' అని చెప్పింది. అప్పుడు నేను అమ్మ సర్వజ్ఞత్వానికి ఆశ్చర్యపోతూ కాఫీ సేవిస్తూ అమ్మకు నా మనసునందే కృతజ్ఞతలు తెలుపుకున్నాను.



32. మా ఆర్థికపరిస్థితిని మెరుగుపరచిన అమ్మ

మాది చాలా పెద్ద కుటుంబము. మా తల్లిదండ్రులకు నాతో సహా ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. నేను వారికి జ్యేష్ఠ కుమారుడను. 1979-80ల్లో మా కుటుంబ ఆర్థిక పరిస్థితి చాలా దయనీయంగా ఉండేది. మా నాన్నకు ఖర్చులు పెరిగి ఆదాయం చాలా తక్కువగా యుండినది. అంతకు ముందు దాదాపు 30॥లు సర్పంచిగా ఉండిన ఆయన అప్పుడు జరిగిన ఎలక్షన్లలో మా పెదనాన్న కుమారుడే పోటీగా నిలబడటం, ఎలక్షన్లలో తక్కువ వ్యత్యాసంతో మానాన్నగారు ఓడటం వల్ల మానసికంగా యిబ్బంది పడుచున్న రోజులు. మా తమ్ముళ్ళిద్దరి చదువులు పూర్తిగాక పోవడం, చదువు పూర్తయిన యిద్దరికి ఉద్యోగాలు రాకపోవడం గూడా మరొక కారణం.

ఇక నాకు ఉద్యోగమున్నా నా జీతం తక్కువగా ఉండడం చేత జ్యేష్ఠ కుమారునిగా మానాన్నగారికి నేను సరియైన ఆర్థిక సహకారాన్నందించలేకపోయే వాడిని. మా కుండిన పొలాల్లో ఆ సంవత్సరం పంటలు కూడా సరిగా పండలేదు. ఏమైతేనేమి ఆర్థిక యిబ్బందులన్నీ ఒకేసారి చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరౌచున్న మా నాన్నగారు తన స్థితిని నాకు చెప్పకపోయినా నా కర్థమగుచూనే యుండినది. ఎందుకిలా జరుగుతున్నదో, దానికి నివారణోపాయ మేమిటో దిక్కుతోచని పరిస్థితుల్లో నేను నా మనసునందే మార్గమేదైనా చూపమని అమ్మను ప్రార్థించాను. అప్పుడు నా మనోఫలకంపై మా నాన్నగారి ఆర్థిక దుస్థితికి కారణం గోచరించింది. అదేమిటంటే నాకు పదేండ్ల వయసున్నప్పుడు మా నాన్నగారు మా కుండిన రెండు ఆవుల్లో ఒకదానిని అది గొడ్డుదన్న కారణంతో ఒక మాదిగ వానికివ్వగా వాడు దానిని తర్వాత వధించినట్లు, ఆ గోహత్యాపాతకం వల్లే యిప్పుడిన్ని యిబ్బందులెదుర్కోవలసి వచ్చిందన్న సత్యం నాకు గోచరించింది. అప్పుడు నేను తిరిగి దానికి నివారణోపాయమేమిటని ప్రార్థించగా శుచిగా ఒక గోవుకు

మూడు ప్రదక్షిణలు గావించి నమస్కరించి 'గోహత్యా నివారణార్థం, భగవత్ప్రీత్యర్థం సమర్పయామి' అనుకుంటూ దానికి అన్నంగానీ లేక అరటిపండ్లను గానీ తిపించమన్న ఆదేశమొచ్చింది. నేను అమ్మ యిచ్చిన ప్రేరణ లేక ఆదేశానుసారంగా ఒక శుక్రవారం రోజున ఉదయాన్నే స్నానమాచరించి ముందుగా అమ్మను ప్రార్థించి తర్వాత ఒక ఆవుకు ప్రదక్షిణ గావించి అమ్మ చెప్పినట్లే మనసులో తలచుకుంటూ దానికి అరటి పండ్లను తినిపించి వచ్చాను. ఇది జరిగిన తర్వాత నెమ్మది నెమ్మదిగా రోజులు గడిచేకొద్దీ మా నాన్నగారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతూ వచ్చినది. ముందుగా నా భార్యకు, తర్వాత నా మొదటి తమ్మునికి బ్యాంకుల్లో ఉద్యోగాలొచ్చినవి.




33. అమ్మ పాదాల నొదలవద్దని మానాన్నగారు నాకిచ్చిన సందేశం

మా స్వగ్రామము ప్రకాశం జిల్లా కంభం మండలంలోని తురిమెళ్ళ గ్రామం. మా నాన్నగారి పేరు బెల్లం కొండ వెంకట రంగయ్య. ఆయన స్వాతంత్ర్య సమరయోధులు, హిందీ ప్రచారోద్యమంలో పాల్గొన్నవారు, దేశ స్వాతంత్ర్యానంతరం కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొన్నవారు. మొదట్లో మా గ్రామం గిద్దలూరు తాలూకా (అప్పట్లో కర్నూలు జిల్లా) లో యుండేది. గిద్దలూరులో హైస్కూలులో మొట్టమొదటి హిందీ ఉపాధ్యాయునిగా పని చేసినా తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి మా గ్రామ సర్పంచిగా దాదాపు 30 సం॥లు సేవచేసి ప్రజల హృదయాలను చూరగొన్న వ్యక్తి. వారు మంచి తత్త్వవేత్త. తర్కంలో వారి నెదుర్కోవడం సామాన్యులకు కష్టతరమయ్యేది. ఏదైనా తనకు అనుభవమైతేనే గానీ నమ్మేవారుగారు. మూఢాచారాలను, మూఢ నమ్మకాలను వ్యతిరేకించేవారు. అమ్మలన్నా, బాబాలన్నా నమ్మేవారు కాదు. నేను జిల్లెళ్ళమూడి అమ్మ దగ్గరకు వెళ్ళి రావడాన్ని కూడా నన్ను ప్రశ్నిస్తే నేనాయనతో నేను గ్రుడ్డిగా దేనినీ నమ్మననీ, అనుసరించననీ, నా అనుభవమే, నా అనుభూతులే అమ్మపై భక్తి విశ్వాసాలను పెంచినవనీ వివరించి చెప్పాను. ఇక వారు నన్నేమీ ప్రశ్నించకపోయినా వారిలో మాత్రము ఏమార్పూ రాలేదు.

మా నాన్నగారి స్నేహితులూ, గిద్దలూరు వాస్తవ్యులూ అయిన గరుడాద్రి శేషయ్యగారు కొంతకాలం జిల్లెళ్ళమూడిలో ఉండిన విషయం చాలా మందికి తెలుసు. వారు జిల్లెళ్ళమూడి అందరింటిలో నాన్నగారి ప్రక్క గదిలో అప్పట్లో యుండేవారు. వారు మా నాన్ననొకసారైనా జిల్లెళ్ళమూడికి తీసుకురమ్మని నాతో చాలా సార్లు చెప్పారు. నేను మానాన్న గారిని జిల్లెళ్ళమూడికి తీసుకురావడానికి మొదట్లో విఫలుడనైనా చివరకు ఒప్పించగలిగాను. వారిని తీసుకు రావడానికి ప్రయత్నించే లోపే 1985 జూన్‌లో అమ్మ మందిర ప్రవేశం

చేయడం అటు పిమ్మట 1988 డిసెంబరులో మానాన్నగారు పరమపదించడం జరిగిపోయాయి. మా నాన్నగారు స్వర్గస్థులైన నెలరోజుల తర్వాత ఒకరోజు నాకు స్వప్నంలో ధవళ వస్త్రములతో మెరిసిపోతూ కనిపించి మాకెదురుగా ఒక గోడపై యుండిన జిల్లెళ్ళమూడి అమ్మ క్యాలెండరు ఫోటోనాక దానిని నాకు చూపిస్తూ నేను నడిచే మార్గము సరియైనదేననీ, అమ్మ పాదాలనెన్నటికీ వదలొద్దన్న సంకేతాన్నిచ్చి అంతర్ధానమయ్యారు. అయితే నాకు జన్మనిచ్చిన మా అమ్మ (యశోదమ్మ)ను ఒకసారి జిల్లెళ్ళమూడికి అమ్మ యున్నప్పుడే తీసుకొని వచ్చి అమ్మను దర్శింపజేసాను.

పై విధంగా మా నాన్నగారు నాకు సందేశమిచ్చిన తర్వాత అమ్మపై నాకున్న భక్తి విశ్వాసాలింకా బలపడినవి. మా నాన్నగారికీ, మా పితరులందరికీ సుగతి కలుగజేయమని అమ్మను ప్రార్థించాను.



34. ఆత్మోద్ధరణం

మా గ్రామంలో సాతాని బుచ్చయ్యగారనే ఒకాయన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎలిమెంటరీ స్కూల్)లో ఉపాధ్యాయునిగా పనిచేసేవారు. వారు చాలా సాత్త్వికులు, మితభాషి. శాకాహారి, మితాహారి, ప్రాణాయామాన్ని ఆధ్యాత్మిక సాధనను చేసేవారు. వారు హోమియో వైద్యం కూడా చేస్తుండేవారు. మా కుటుంబ డాక్టరుగా మా కవసరమైనప్పుడల్లా హోమియో వైద్యం చేసేవారు. 1974 నుండీ నేను జిల్లెళ్ళమూడికి వెళ్లి వస్తున్నప్పటి నుండీ, నేను మా గ్రామ మెళ్లినప్పుడల్లా ఎక్కువగా కలుస్తుండేవారము. ఆయన వయసులో నాకంటే 10 సంవత్సరాలు పెద్దవారైనప్పటికీ నన్ను బాగా యిష్టపడుతూ యుండడం వల్ల మంచి స్నేహితులమయ్యాము. మా గ్రామంలో నేనున్న అన్ని రోజులూ ప్రతిరోజూ సాయంత్రం ఐదు గంటలకు మా గ్రామం వెలుపలకు వెళ్లి రోడ్డు వెంట వాకింగ్‌కని దాదాపు 2 మైళ్ళు వెళ్లి తిరిగి వస్తుండేవారము. ఒక్కొక్కసారి మార్గమధ్యంలో ఏదోయొక చెట్టు క్రింద కూర్చొని ఆధ్యాత్మిక విషయాలను గురించి మాట్లాడుకొనేవారము. జిల్లెళ్ళమూడి అమ్మను గురించీ, శ్రీమాతారవిందుల పూర్ణయోగాన్ని గురించీ నాకు తెలిసిన విషయాలను నేను చెప్పుచుండేవాడిని. వారు తన ప్రాణాయామాన్ని గురించీ, తన సాధనను గురించీ, తన హఠయోగాన్ని గురించీ, తన అనుభవాలను గురించీ వివరిస్తుండేవారు. ఆయన తన గదిలో పద్మాసనంలో కూర్చొని ప్రాణాయామం చేసేటప్పుడు తన శరీరం తేలికపడి నేలపై నుండి నాలుగైదు అడుగుల ఎత్తు వరకూ పైకి లేచేదన్న విషయాన్ని కూడా చెప్పేవారు. 1981లో నేనొకసారి జిల్లెళ్ళమూడి అమ్మ యిచ్చిన ప్రేరణతో వారితో హఠయోగం చేయడం మంచిదికాదనీ, దానిని మానుకొని భగవద్గీతలో చెప్పబడి భక్తి, జ్ఞాన, కర్మయోగాలను మూడింటిని సమన్వయం చేసుకుంటూ దైవ మార్గంలో పయనిస్తే మంచిదనీ, విశ్వాసము, నిరాకరణ, సమర్పణమనే త్రివిధ ప్రయత్నాలను సర్వత్రా కొనసాగిస్తూఉంటే యోగంలో ముందుకు వెళ్ళగలమనీ చెప్పాను. నాకన్నా పెద్దవాడైనా నా మాటకు విలువ

నిచ్చేవారు. నన్ను అభిమానించే వారు. నేను చెప్పిన దాని నంగీకరించి పాటించడానికి ప్రయత్నిస్తానన్నారు. అయితే ఆ తర్వాత మేము కలువలేకపోయాము. **1983**లో వారొకసారి హైద్రాబాద్ వెళ్లినప్పుడు, అక్కడెక్కడో ప్రాణాయామ కేంద్రంలో తన ప్రాణాయామంలో భాగంగా తానొక గాజు పెట్టెలో కూర్చొని ఆ కేంద్ర నిర్వాహకులతో ఆ గాజు పెట్టెను మూసి మరుసటి రోజు ఉదయం తెరువమని చెప్పారట. అ మరుసటి రోజున గాజు పెట్టెతెరచి చూడగా వారు ప్రాణాలు కోల్పోయి యున్నారట. అప్పుడు వారి శవాన్ని మా గ్రామానికి చేర్చి అంత్యక్రియలు జరిపారట. ఇది జరిగిన కొద్ది రోజులకు నేను మా గ్రామానికి వెళ్లినప్పుడు తెలిసి చాలా బాధపడ్డాను. అప్పటినుండీ తరచుగా నాకు వారు స్వప్నంలో కనిపించి 'ఇంతకు క్రితం నేను చెప్పినట్లు తను వినకపోవడం వల్ల, తన తొందరపాటు వల్ల హఠయోగం / ప్రాణాయామంలో తను ప్రాణాలు కోల్పోయానని, తన ఆత్మనుద్ధరించడానికై నేను ప్రార్థించుట కొరకై తను అర్థిస్తున్నట్లు నాకు గోచరమైనది. అప్పుడు నేను జిల్లెళ్ళమూడికి వెళ్లినప్పుడు వారి ఆత్మనుద్ధరించమని అమ్మను ప్రార్థించాను. అప్పటి నుండీ ఆయన నాకు స్వప్నంలో కనపడడం ఆగిపోయింది.



35. నీటి గుండం నుండి రక్షించిన అమ్మ

1960 అంటే నాకు పది సంవత్సరముల వయసప్పటి విషయం. మా గ్రామంలో మా నాన్నగారి స్నేహితులు, కమ్యూనిస్టు నాయకులు, కర్నూలు జిల్లా వెలుగొండకు చెందిన శ్రీ గుర్రం వెంకటరెడ్డిగారు తన కుటుంబంతో మా యింటికి దగ్గర్లోనే ఒక అద్దె యింటిలో కాపురముండేవారు. 12 సం॥ల వయసున్న వారి అబ్బాయి ప్రతాపరెడ్డి నాతో స్నేహంగా యుండేవాడు. అప్పుడు మే నెల వేసవికాలం స్కూళ్ళకు సెలవు రోజులు కాబట్టి ఒకరోజు ప్రతాపరెడ్డి ప్రోద్బలంతో తనతో కలిసి నేను, మా చిన్న మేనమామ విజయకుమార్ (11 సం॥ల వయసు) యింకా నలుగురైదుగురు స్నేహితులతో మా గ్రామ సమీపమందున్న గుండ్లకమ్మ నదికి ఆవల ఉండిన మామిడి తోటల్లో మామిడికాయలు కోసుకోవడానికి ఉదయం 10 గంటల ప్రాంతంలో బయలుదేరాము. మేమందరమూ పిల్లలమే. మా కెవరికీ ఈతరాదు. మేము మా హైస్కూలుకు వెళ్ళి అచ్చటినుండి ఒక ఫర్లాంగు దూరంలో యున్న గుండ్ల కమ్మ ఒడ్డుకు చేరుకున్నాము. అంతకు ముందురోజు నల్లమల కొండల్లో వర్షం పడడం వల్ల గుండ్ల కమ్మ కొద్దిగా పొంగి ప్రవహిస్తుండినది. సాధారణంగానైతే దాటి అవతల యున్న మామిడి తోటలకు వెళ్లగలిగే వారము. కానీ నదిలో 3,4 అడుగుల లోతు నీటితో నీరు ఉధృతిగా అంటే వేగంగా ప్రహించు చుండుటచే మేము నదిని దాటలేక ఎవరైనా పెద్దవారు వస్తే వారి సహాయంతో దాటవచ్చునుకొని ఎదురు చూడసాగాము. కొంతసేపటికి తాౖరెన్న అని పిలువబడే పుట్టా సుబ్బయ్య యను మా గ్రామస్తు డొకరు నది కవతల ఉన్న తమలపాకుల తోటకు వెళ్ళుటకై వచ్చాడు. అతనిని మేమడుగగా నదిని దాటిస్తానని నాచేతి నొకదానిని పట్టుకొని నీటిలోకి దిగాడు. నా రెండో చేతిని ప్రతాపరెడ్డి పట్టుకోగా అతని రెండో చేతిని మా మామ విజయకుమార్ పట్టుకున్నాడు. ఇలా వరుసగా అందరూ ఒకరిచేతి నొకరము పట్టుకొని నీటిలో నదిని దాటుటకై ముందుకు వెళ్తున్నాము. సరిగ్గా నది మధ్యలో కెళ్ళిన తర్వాత నాచేయి పట్టుకొనియుండిన తాౖరెన్న

నిర్దాక్షిణ్యంగా నాచేయినొదలిపెట్టి, నేను పిలుస్తున్నా పట్టించుకోకుండా, వెనుదిరిగి చూడకుండా ముందుకెళ్ళిపోయాడు. నే నుండినచోట నీటి ఉధృతి ఎక్కువగా యుండడం చేత ప్రతాపరెడ్డి కూడా నన్ను పట్టించుకోకుండా నన్నొదిలి పెట్టి వెను దిరిగి నది ఒడ్డుకు మిగతా వారితో చేరుకున్నాడు. నేను నీటి వేగానికి నీటిలో పడి ఆ ప్రవాహంలో ముందుకు కొట్టుకొని పోతున్నాను. నేను నీటిలో కొట్టుకొనిపోతుంటే (సహాయం చేయగల పెద్దవారెవరూ అక్కడ లేనందువల్ల) అందరూ భయవిహ్వాలులై ఒడ్డున నిస్సహాయంగా నిలుచుండిపోయారు. అప్పుడు నేను కొట్టుకొనిపోతున్న తావు నుండి 50 గజముల దూరంలో కాకిగుండమను పేరుగల నీటి గుండమొకటి యున్నది. అదెంతో ప్రమాదకరమైన చోటు. అక్కడ నీరు సుడులు తిరుగుతూ 20 అడుగుల లోతుకు పైగా ఉంటుందక్కడ. దానిని తలచుకోగానే నాలో భయమధికమైంది. నేను నీటిలో మునుగుతూ తేలుతూ నీటి ప్రవాహంతోపాటు ముందుకు వెళ్తున్నాను. కొద్దిగా నీరు ఊపిరితిత్తుల్లోకి చేరి ఉక్కిరిబిక్కిరగుచున్నాను. అప్పుడు మా గ్రామంలో మా గృహానికి దగ్గరగా యున్న మందిరంలోని మాధవస్వామి గుర్తుకు వచ్చి నన్ను రక్షించమని ఆయనను వేడుకుంటూ ఒడ్డుకు చేరడానికి నా ప్రయత్నము నేను చేయుచున్నాను. నేను ప్రవాహంతో పాటు కొద్దిగా మందుకు వెళ్లిన తర్వాత ఏటి మలుపులో ఒడ్డును ఆనుకొని యున్న తాటి చెట్టు ఊడ నొకదానిని నా కుడిచేత్తో దొరకబుచ్చుకున్నాను. నా ఎడమ చేతితో మరికొన్ని ఊడలను దొరకబుచ్చుకునే సరికి కుడి చేతితో పట్టుకున్న ఊడతెగినది. అయితే వెంటనే కుడిచేత్తో కూడా మరికొన్ని ఊడలను పట్టుకొని నెమ్మదిగా నది ఒడ్డు యొక్క వాలు వెంట పైకి ఒడ్డుకు చేరుకో గలిగాను. నా ఊపిరితిత్తుల్లోకి కొద్దిగా నీరు చేరి యుండుటచే దగ్గు వచ్చి నేను కోలుకోవడానికి దాదాపు 10 నిమిషాల సమయము పట్టినది. అప్పుడు నాతో ఉన్న స్నేహితులంతా సంతోషంతో ఊరడిల్లారు. నా రెండో చేయిని వదలి పెట్టి స్నేహ ధర్మాన్ని మరచి కేవలం తన రక్షణకై మిగతా వారితో ఒడ్డుకు చేరిన ప్రతాపరెడ్డిపై కోపంగా యుండినా నేను బయటపడలేదు. కాని అప్పటి నుండి అతనితో స్నేహంగా యుండడం తగ్గించాను.

ఆ రోజు నా కుడి చేతికి ఆ తాటి ఊడ ఎలా దొరికిందో, నా రెండో చేత్తో మరికొన్ని తాటి ఊడలను పట్టుకొనేంతవరకు తెగకుండా ఎలా నిలిచియున్నదో తలచుకుంటే చాలా ఆశ్చర్యము కలుగుతుంది. ఏదో అద్భుత శక్తి నన్ను కాపాడిందన్న అనుభూతి నాకు కలిగింది. నా జీవితంలో తర్వాత యిప్పటి వరకూ జరిగిన సంఘటనలను బట్టి చూస్తే ఆరోజు నన్నా నీటి గుండాన్నుండి కాపాడిన శక్తి మరేదో కాదు, అమ్మేననిపిస్తుంది. అమ్మను గురించి నేను తెలుసుకునే దానికి ముందు నుండి, బహుశా నా పుట్టుక నుండే అమ్మ నన్ను కంటున్నదనీ, అడుగడుగునా నన్ను రక్షించి కాపాడుతున్నదనీ అనిపిస్తుంది. ఇలా అనుకుంటున్నప్పుడు నా ఒళ్ళు పులకరించి కృతజ్ఞతాభావంతో అశ్రుధారలు పెల్లుబికి వస్తున్నవి.



36. ఆత్మహత్యా ప్రయత్నం నుండి ఒక యువకుని కాపాడిన అమ్మ

1977వ సంవత్సరం మే నెలలో నేను జిల్లెళ్ళమూడి వెళ్లినప్పుడు ఒకరోజు అన్నపూర్ణాలయానికి ఎదురుగా నాకో యువకుడు తారసపడ్డాడు. అప్పుడతని వయసు దాదాపు 20-21 సం॥లు ఉంటుంది. అత నెందువల్లనో చింతాక్రాంతుడై యున్నట్లు, తన హృదయ భారాన్నెలా దించుకోవాలో తెలియని అయోమయావస్థలో జీవితంపై విరక్తి గలిగిన వానివలె అతని ముఖం చూడగానే నాకనిపించినది. అతనిని పలుకరించి ఊరడిల్ల జేయమన్నట్లు అమ్మ నా హృదయమందు ప్రేరణను కలిగించింది. అప్పుడు నేనా అబ్బాయిని నా దగ్గరకు పిలిచి కూర్చుండ బెట్టి అతనెందుకలా దిగులుగా యున్నాడో విషయాన్ని నాతో చెప్పమనీ, అతన్నలా అడుగడానికి అమ్మే ప్రేరణనిచ్చిందనీ చెప్పాను. అప్పుడా యువకుడు దాదాపు కన్నీళ్ళ పర్యంతమై తన వివరాలిలా చెప్పాడు. తను గుంటూరుకు చెందిన వాడిననీ, తనకు వివాహమై ఒక కుమారుడు కూడా కలిగాడనీ, పెద్దగా చదువులేక పోవడం వల్ల ఉద్యోగమేదీ రాలేదనీ, మరే ఆధారమూ లేక కుటుంబాన్ని పోషించుకోలేని దీనావస్థలో యున్నాననీ, తన మేనమామ యొకరు మంచి స్థితిలో బాపట్లలో ఉన్నా తను మొరపెట్టుకున్నప్పటికీ తనను పట్టించుకోవడం లేదనీ, ఏదారీ లేక జీవితంపై విరక్తి గలిగి తిరుపతి వెళ్లి అఖరుసారిగా శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని ఆత్మహత్య చేసుకుందామనుకొని గుంటూరులో తిరుపతికి వెళ్లే రైలెక్కాననీ, అయితే తెనాలి దాటిన తర్వాత రైల్లో ఎవరో జిల్లెళ్ళమూడి అమ్మను గురించీ, అమ్మ మహత్తును గురించీ మాట్లాడుకుంటుంటే విన్నాననీ, రైలు బాపట్లకు చేరుకోగానే తిరుపతి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడే ముందు అమ్మను కూడా చూడాలన్న కోరిక గలిగి బాపట్లలో దిగి క్రితము రోజే జిల్లెళ్ళమూడి వచ్చాననీ, అమ్మను దర్శించుకొని మనసునందే తన పరిస్థితిని గురించి అమ్మకు విన్నవించుకున్నాననీ, తిరుపతి వెళ్లడానికి సెలవు తీసుకుందామని అడిగితే అమ్మ ఉండమన్నదనీ, ఈ రోజు ఉదయం కూడా సెలవు తీసుకుందామని అడిగితే అనుమతి నివ్వకుండా, ఏ సమాధానమూ చెప్పకుండా మౌనంగా ఉండిపోయిందనీ, ఏమి చేయాలో

తోచని స్థితిలో ప్రస్తుతము తానున్నాననీ నాకు తెలియజేసాడు. అప్పుడు నేనతనితో "నీవు జిల్లెళ్ళమూడి రావాలనుకొని రాలేదు. కేవలం అమ్మ సంకల్పం వల్ల, అమ్మ యిచ్చిన ప్రేరణ వల్ల తిరుపతి వెళ్లే మార్గమధ్యంలో బాపట్లలో దిగి జిల్లెళ్ళమూడి వచ్చావు" అని చెప్పి, 'ఇచ్చటికివస్తే పొందినట్లే', 'ఇచ్చటి మెతుకు కొరుకు బ్రతుకుదెరువు దొరుకు' అన్న అమ్మ ఆశ్వాసన పూర్వక వాక్యాలను కూడా అతనికి జెప్పి, అమ్మ అనుగ్రహముండబట్టే జిల్లెళ్ళమూడి రాగలిగావనీ, నీకింక దిగులువలదనీ, నీకు తప్పక అమ్మ ఏదో యొక మార్గము చూపించగలదనీ, తర్వాత నీవే నాకా విషయాన్ని తెలియజేయగలవనీ, ఆత్మహత్యా ప్రయత్నమిక మానుకొని నిశ్చింగా అమ్మపై భారం వేసి యుండుమని చెప్పి అతనిని ఊరడిల్ల జేసాను. అప్పుడతని ముఖ కవళికలను బట్టి అతనిలో మంచి మార్పు వచ్చినట్లు గ్రహించాను. అమ్మ నా కప్పజెప్పిన పని పూర్తయిందనిపించింది. ఇది జరిగిన మరుసటి రోజు అతను అమ్మదగ్గర సెలవు తీసుకొని బయలుదేరి వెళ్లిపోయాడు. నేనతనితో మాట్లాడినప్పుడు మా ఆఫీసు అడ్రసును అతనికి చెప్పాను గానీ అతని చిరునామాను అడిగి తెలుసుకోలేదు.

ఒక నెల రోజులు గడచిన తర్వాత ఒకరోజు నేను గుంటూరులో ఏదో పనిమీద పాత బస్టాండు లీలా మహల్ సెంటర్లో రోడ్డుపై వెళ్లుచుండగా 'సార్ సార్?' అంటూ పిలుస్తూ ఒకబ్బాయి నన్ను సమీపించాడు. అప్పుడు నెల క్రితము జిల్లెళ్ళమూడిలో నేను కలిసిన అబ్బాయిగా అతడిని గుర్తుపట్టాను. అప్పుడతడు 'అమ్మ ఆశీస్సులతో జిల్లెళ్ళమూడి నుండి బయలుదేరిన తను బాపట్ల చేరుకొని తన మేనమామ యింటికి వెళ్లాననీ, ఎన్నడూలేనిది ఆరోజు తన మేనమామ ఎంతో ఆప్యాయంగా పలుకరించాడనీ, తన బాగోగులను విచారించి గుంటూరులో పొగాకు కంపెనీలో ఉద్యోగంలో పెట్టాడనీ, తన కిప్పు డేలోటూ లేదనీ, అమ్మే తనను రక్షించిందనీ, ఉద్యోగం రావడం గూడా అమ్మ దయేననీ" చెప్పాడు. ఏదో అర్జంటు పని యున్నది, త్వరగా వెళ్లాలని నాకు కూడా కృతజ్ఞతలు చెప్పి వెంటనే వెళ్ళిపోయాడు. అతని పేరు, అడ్రసు అడిగేలోపే కనుమరుగయ్యాడు. నెల రోజుల క్రితము అతనితో నాతో అమ్మ పలికించిన 'అమ్మ నీకేదైనా మార్గము చూపించిందన్నమాట నీవే నాకు తర్వాత తెలియజేస్తావు' అన్న విషయ మీరోజు నిజమయినది. అమ్మ లీలా వినోదిని గదా! నాకు తన లీల నీవిధంగా చూపించింది.


37. శ్రీ శేషగిరిరావుగారికి మానసిక క్లేశోపశమనం

అప్పట్లో చిలకలూరిపేటలో ఒక పాఠశాలలో డ్రాయింగు మాస్టారుగా పనిచేస్తూ యుండిన సత్తిరాజు శేషగిరిరావు గారు అమ్మ దర్శనార్థమై తరచుగా జిల్లెళ్ళమూడి వస్తూ యుండేవారు. జిల్లెళ్ళమూడిలోకి వచ్చే సోదరీ సోదరులందరికీ వీరు సుపరిచితులే. ఎందుకంటే జిల్లెళ్ళమూడిలో ఏ కార్యక్రమం జరిగినా వచ్చి అమ్మకు ఫోటోలు తీస్తుండేవారు. ఒక్కొక్కసారి అమ్మే ఫోటోలు తీయడానికని వారిని పిలిపించేది. వారెంతో సౌశీల్యత కలిగినవారు, మితభాషి, హితభాషి సున్నిత మనస్కులు. ఎంతో రిజర్వుడుగా వుండేవారు. ఏ కొద్దిమందితో మాత్రమే మాట్లాడేవారు. వారు నాకెంతో సన్నిహితంగా ఉండేవారు. తన కుటుంబ విషయాలను కూడా నాతో పంచుకునేవారు. ఆయనకున్న ఏడుగురు సంతానంలో ఆరుగురు ఆడపిల్లలే. అమ్మవారినీ వారి కుటుంబ సభ్యులనూ ఎంతో ఆదరంగా, ఆప్యాయంగా చూచేది. వారు అమ్మను కలిసినప్పుడల్లా ఒకరిద్దరు పిల్లల్ని తన దగ్గరే ఉంచమని చెబుతుండేది. ఇందులో అమ్మకు వారిపట్ల ఉన్న అవ్యాజ ప్రేమతో బాటు శేషగిరిరావుగారికి ఆర్థిక భారాన్ని తగ్గించాలనేది కూడా మరొక కారణము. కానీ వారట్లు చేయలేదు. అమ్మను దర్శించి తిరిగి వెళ్లేటప్పుడు అమ్మ వారికి కుంకుమ పొట్లాలతోపాటు పండ్లను ప్రసాదంగా యిచ్చి పంపిస్తుండేది. పండ్లను కాస్త ఎక్కువగానే యిచ్చి పంపిస్తుండేది. 1985 జూన్‌లో అమ్మ ఆలయ ప్రవేశమైన తర్వాత శేషగిరిరావు గారెంతో మానసిక క్లేశాన్ననుభవించారు. వారు అమ్మ భౌతికంగా లేకపోవడాన్ని జీర్ణించుకోలేక మధనపడేవారు. అయితే వారి మానసిక క్లేశాన్ని అమ్మ నా ద్వారా ఎలా ఉపశమింపజేసిందో క్రింద వివరిస్తున్నాను.

అమ్మ ఆలయ ప్రవేశమైన తర్వాత దాదాపు ఐదారు వారాలు గడచిన పిమ్మట నేనొకరోజు ఆదివారం కావడంచే గుంటూరు, కొరెటిపాడు నందలి

మే మద్దెకుంటున్న యింటిలో విశ్రాంతి తీసుకుంటున్నాను. అప్పుడు సాయంత్రం 4 గంటల సమయం. అప్పుడు యింటి నుండి బయటకు వెళ్లి కాలినడకన శంకర్‌విలాస్ వైపు వెళ్లమన్న ప్రేరణ నాలో మొదలయింది. హృదయం లోపలినుంచి వచ్చేప్రేరణ యేదైనా తర్వాత ఏమి జరుగనున్నదో నాకు తెలియకపోయినప్పటికీ దాని నాచరించడానికి ప్రయత్నిస్తాను. అప్పుడొచ్చిన ప్రేరణానుసారం శంకర్ విలాస్ వైపు రింగురోడ్డు వెంబడి నడచి వెళ్లుచున్నాను. నేను లాడ్జి సెంటరు దాటి తాలూకా ఆఫీసు దగ్గరకొచ్చేటప్పటికి శేషగిరిరావుగారు నా కెదురొచ్చారు. మే మిద్దరమూ ఆనందంతో కరచాలనం చేసుకున్నాము. అయితే వారి ముఖంలో ఏదో దిగులు, వ్యాకులత వ్యక్తమవుతుండడం చేత ఎందుకలా ఉన్నారని ప్రశ్నించాను. దానికి వారు తన మాటల్లో జవాబిచ్చే స్థితిలోలేరు. ఆయనకు దుఃఖమేదో పొంగుకొస్తున్నది. మాట పెగలకుండినది. అప్పుడు నేను వారిని తాలూకా ఆఫీసు కెదురుగా అరండల్‌పేట 7వ లైను మొదట్లో అప్పట్లో యుండిన స్వాతి కాఫీహోటల్ (అది ప్రస్తుతము లేదు) కు తీసుకువెళ్లి ఒక టేబుల్ దగ్గర నేనొక కుర్చీలో కూర్చొని, వారిని నా కెదురుగా ఉండిన కుర్చీలో కూర్చుండబెట్టాను. నేను మా యిరువురికీ టీ ఆర్డరిచ్చాను. వారిని ముందు మంచి నీటిని సేవించమనగా సేవించి కొంత సేదదీరారు. అప్పుడు నేను వారిని తన దిగులుకు కారణమేమిటో చెప్పమన్నాను. అప్పుడు వారు అమ్మ మందిర ప్రవేశమై భౌతికంగా దూరమవడం తను జీర్ణించుకోలేక పోతున్నావనీ, తన బాధల నెవరితో చెప్పుకోవాలో లేక పంచుకోవాలో తెలియడం లేదనీ, అశాంతిగా ఉన్నదనీ, తన కుమార్తెల కెలా వివాహాలు చేయాలో దిక్కుతోచడం లేదనీ తన బాధనంతా నాకు వ్యక్తం చేశారు. అప్పుడు నేను అమ్మ నాకిచ్చిన ప్రేరణానుసారంగా వారినిలా సముదాయించాను. “అన్నయ్యా! మీరిలా ఖిన్నులవడం మంచిదిగాదు. అమ్మ ఎక్కడికీ పోలేదు. అమ్మ మనతోనే యుండి, మనలోనూ యుండి మనల్ని కనిపెడుతూ ఉన్నది. అమ్మ భౌతికంగా మనమధ్య ఉన్నప్పటి కంటే అమ్మ శక్తి యిప్పుడు కొన్ని వందల రెట్లు జిల్లెళ్ళమూడిలోనూ, సర్వత్రా పనిచేస్తున్నది.

అమ్మ లేదనుకోవడం భ్రమ. మన విశ్వాసాన్ని కాపాడుకొని యిప్పుడు గూడా అమ్మపై మనము ఆధారపడి యుండడమే మనము చేయాల్సినపని. మీరు చూస్తూ ఉండండి, మీ కుమార్తెలందరి వివాహాలూ అమ్మే ఎలా చేయిస్తుందో! అమ్మ ప్రేరణతోనే యిప్పుడీ మాటలు మీతో చెప్పడానికే అమ్మ నన్ను మాయింటి నుండి తన ప్రేరణో బయలుదేరదీసింది'' అన్నాను. అప్పటికి ఆర్డరిచ్చిన టీ రావడంతో వేడి వేడి టీ త్రాగాము. ఈ మాటలన్నీ అమ్మే నాచే మాట్లాడించడం చేత శేషగిరిరావుగారెంతో స్వాంతన చెందారు. వారి హృదయమెంతో తేలికపడింది. ఏదో తెలియనిశక్తి, ధైర్యము వారిలో ప్రవేశించినట్లైంది. మేము హోటలు బయటకొచ్చిన తర్వాత వారు నా దగ్గర సెలవు తీసుకొని బయలుదేరి చిలకలూరి పేట వెళ్లిపోయారు. ఈ సంఘటన జరిగిన తర్వాత 4 లేక 5 సంవత్సరాలకు మేము తిరిగి జిల్లెళ్ళమూడిలో కలసినప్పుడు తమ కుమార్తెలలో ముగ్గురికి వివాహమైనట్లు నాతో సంతోషంగా చెప్తూ మిగతావారికి కూడా అమ్మే వివాహం చేయగలదన్న అమ్మపై తనకు గల పూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఆ తర్వాత మిగతా వారికి కూడా వివాహాలయ్యాయి. శేషగిరిరావుగారి మొదటి అమ్మాయియైన శారదను అమ్మ బంధువయిన ముతుకుమల్లి రాముకిచ్చి వివాహం చేయడం ఆ దంపతులిరువురూ జిల్లెళ్ళమూడిలోనే అమ్మ సేవలో యుండడం అందరికీ తెలసిందే.



COURTESY VISWAJANANI TRUST

38. మా గృహాన్ని పావనం చేసిన అమ్మ

ముగ్గురమ్మలకూ మూలమైన అమ్మ, అన్నిటికీ మూలమూ తొలియైన ఆదిపరాశక్తియే యైన అమ్మ తాను తన మూలంలో ఉంటూనే మనల్నను(గ్రహించడానికి అమ్మగా మన్నవ యనే కు(గ్రామంలో తనువును దాల్చి జిల్లెళ్ళమూడి అమ్మగా (ప్రసిద్ధమైనది. అట్టి అమ్మ నాకీ లోకంలో ముగ్గురమ్మలను (ప్రసాదించినది. నాకు జన్మనిచ్చిన తల్లి యొకరైతే, నన్ను ఆధ్యాత్మిక మార్గంలోకి మళ్ళించి నన్ననుగ్రహించిన పాండిచ్చేరి శ్రీ అరవిందా(శ్రమంలో యుండిన 'శ్రీమాత' మరొక అమ్మ. ఈ అమ్మను నేను భౌతికంగా చూడకపోయినా తన చి(త్రపటం ద్వారానే నాకు మార్గదర్శకంగా సందేశాలనిచ్చేది. నే నప్పుడు అంటే 1976-77లో శ్రీ అరవింద కేం(ద్రములో గుంటూరు కన్నావారితోట యందు ఒంటరిగా నివసించేవాడిని. శ్రీమాత ఫోటో ఎదురుగా కూర్చొని ధ్యానించుకొనే వాడిని. శ్రీమాత కన్నుల్లోకి ఏకా(గ్రంగా చూస్తున్నప్పుడు ఆమె కన్నుల నుండి దివ్య (ప్రేమ నాపై జాలువారేది. నన్ను నేను మైమరచిపోయి ఏవో దివ్య లోకాల్లో తేలిపోయేవాడిని. అప్పుడప్పుడూ శ్రీమాతను భౌతికంగా చూడలేకపోయాను గదా అనుకున్నప్పుడు జిల్లెళ్ళమూడి అమ్మ నా మనోఫలకం పై కనపడి ఆ వెలితిని పూడ్చేది. నాకు జిల్లెళ్ళమూడి అమ్మ తాను, శ్రీమాత శరీరాలు వేరైనా ఒక్కటేనన్న అనుభూతిని కలిగించిన సన్నివేశాన్ని యింతకు ముందే వివరించియున్నాను. ఇలా నా జీవితంలో నాకు ముగ్గురమ్మలున్నారు. నన్నెక్కువ (ప్రభావితం చేసిందీ, ఎన్నో ఆధ్యాత్మిక అనుభూతులు కలిగించి జీవితపు అన్ని మలుపుల్లో నా చేయి పట్టుకొని నడిపిస్తున్నదీ ముగ్గురమ్మలూ తానైన జిల్లెళ్ళమూడి అమ్మయే. అమ్మ చెప్పిన 'అన్ని నేనులూ నేనైన నేను' అన్న వాక్యము అక్షరసత్యము.

నేను కన్నావారితోట, గుంటూరులో శ్రీ అరవింద కేం(ద్రమందు శ్రీమాత చి(త్రపటము ఎదురుగా కూర్చొని ధ్యానించే వాడినని పైన చెప్పాను.

1977 నవంబరు 19వ తేదీన వచ్చిన తుఫాను కోస్తాలో, ముఖ్యంగా గుంటూరు జిల్లాలో ఎంత బీభత్సము సృష్టించిందో ఎంతమందిని పొట్టన బెట్టుకుందో అందరికీ జ్ఞాపకముండే యుంటుంది. ఆ రోజు మధ్యాహ్నము 2 గం॥ల నుండి గాలి, వానా మొదలుకాగా చంద్రమౌళీనగర్‌లోని మా ఆఫీసు నుండి సాయంత్రం 5 గంటలకు బయలుదేరి గాలీ, వర్షంలోనే ఎలాగో తంటాలుపడి కన్నావారితోటలోని ముక్కామల అమరేశ్వరరావుగారి ఆసుపత్రి భవనానికి 6 గం॥లకు చేరుకోగలిగాను. ఆ భవనం పైన ఒక చిన్నగదిలో ఏర్పాటు గావించిన శ్రీ అరవింద కేంద్రంలో నేను ఉండేవాడిని. అంతకంతకూ గాలి, వర్షముల ఉధృతి హెచ్చుటచే నేను పైన ఉన్న ఆ గదికి వెళ్లలేకపోయాను. క్రిందనే ఆసుపత్రికి చెందిన ఒక గదిలో ఉండిపోయాను. పైన ఉన్న గది రేకులతో కప్పబడినది. గాలి వేగానికి గది రేకులన్నీ ఎగిరిపోయి ఎక్కడో పడినవి. పైనఉన్న పుస్తకాలను, ముఖ్యంగా శ్రీమాతారవిందుల ఫోటోల నెలాగైనా క్రిందకు తీసుకురావడానికి ప్రయత్నించబోతే నే నున్న గదిలోనివారు ప్రమాదకరమని నన్ను పైకి వెళ్ళనివ్వలేదు. కనీసము ఫోటోలకేమీ కాకుండా ఉండాలని అమ్మను ప్రార్థించాను. 20 వ తేదీ తెల్లవారుజాము వరకూ గాలీ వర్షమూ యుండి 5 గం॥ల ప్రాంతానికి తగ్గిపోయినవి. రాత్రంతా నాకు నిద్రలేదు. తెల్లవారి చూస్తే రోడ్లన్నీ బీభత్సంగా ఉండినవి. చెట్లూ, పాకలూ, పాత యిండ్లూ అన్నీ పడిపోయి ఏదైనా అడవిలో ఉన్నామా అన్నట్లు తోచినది. కరెంటు, టెలిఫోను స్తంభాలు కూడా అన్నీ పడిపోయి యుండినవి. తెల్లవారగానే అంటే ఉదయం ఆరు గంటలకు నేను డాబాపై యున్న గదికి వెళ్ళి చూడగా పుస్తకాలు, వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడిపోయి అన్నీ తడిసిపోయి యున్నవి. అన్నీ పాడైపోయినవి. కానీ నేను రోజూ ధ్యానించే శ్రీమాత ఫోటో మాత్రము టేబులు క్రిందపడి పూర్తిగా తడవకుండా సురక్షితంగా ఉండినది. నేనా ఫోటోను తడిసిన కొద్ది భాగాన్ని తీసివేయించి మరలా ఫ్రేము కట్టించి నా దగ్గరే భద్రంగా ఉంచుకున్నాను. శ్రీ అరవింద కేంద్రానికి పాండిచ్చేరి ఆశ్రమంవారు శ్రీ మాతారవిందుల కొత్త చిత్రపటాలను పంపించారు. అన్ని వస్తువులు పాడైనా నేను రోజూ పూజించే, ధ్యానించే

ఫోటో కాపాడబడినందులకు నాకు తృప్తి గలిగి అమ్మకు కృతజ్ఞతలు సమర్పించుకున్నాను.

నేను జిల్లెళ్ళమూడికి వెళ్తున్న తొలిరోజుల్లో అమ్మ ఎప్పుడైనా గుంటూరుకు వచ్చినప్పుడు మా యింటికి కూడా వస్తే మా యిల్లు పావనమవుతుంది గదా యని ఒకటి రెండుసార్లు తలపోశాను. అమ్మ గుంటూరుకు వచ్చిన రెండుసార్లు మేము అద్దెకుంటూ యుండిన యింటి వాతావరణం, చుట్టుప్రక్కల వాతావరణం అనుకూలంగా లేకపోవడం వల్ల అమ్మకు అమ్మతో ఉన్న సోదరీ సోదరులకు అసౌకర్యం కలిగించడం యిష్టం లేక నేను అమ్మను మా యింటికి ఆహ్వానించలేదు. అయితే చిత్రపటాల రూపంలో అమ్మ మాయింట్లో ఉండనే ఉన్నది. అమ్మ ఫోటోలు కేవలం ఫోటోలు కావనీ, అమ్మ వాటిల్లో సజీవంగా ఉండి మనల్ని గమనిస్తుంటుందన్న సత్యము చాలా మందికి అనుభవమే. అంతేగాక నాప్రకృతిననుసరించి భౌతిక పూజలకన్నా మానసిక పూజలకే నేను అధిక ప్రాధాన్యత నిచ్చేవాడిని. నేను అమ్మను నా హృదయమందుండి ఎల్లప్పుడూ నన్ను నడిపించవలసిందిగా ప్రార్థిస్తుంటాను.

అమ్మ మా యింటికి వస్తే బాగుండునని నే ననుకున్నప్పు డొకసారి అమ్మ పెద్ద కుమారుడైన సుబ్బారావు అన్నయ్య తనకుతానే నన్ను పలుకరించి తాను గుంటూరుకు వచ్చినప్పుడు మా యింటికి రావాలని యున్నదని చెప్పి నా అడ్రసు తీసుకున్నారు. అప్పుడు నేను గుంటూరులో కొరిటిపాడు పోస్టాఫీసు దగ్గర ఒక అద్దె యింట్లో సకుటుంబంగా ఉండేవాడిని. నాకు చెప్పిన కొన్ని రోజుల తర్వాత ఒక రోజు సుబ్బారావు అన్నయ్య ఆకస్మికంగా మా యింటికి వచ్చారు. మా క్షేమ సమాచారములను తెలుసుకొని దాదాపొక అరగంట మాతో గడిపి మేమిచ్చిన కాఫీని సేవించి సెలవు తీసుకొని వెళ్లారు. ఆ రోజు అమ్మే స్వయంగా సుబ్బారావు అన్నయ్య రూపంలో మాయింటికి వచ్చిందనిపించింది. ఇది మాకెంతో తృప్తిని, ఆనందాన్ని కలుగజేసింది.

నేను జిల్లెళ్ళమూడి వెళ్లినప్పుడు నాన్నగారున్న రోజుల్లో నాన్నగారి దగ్గర కొంతసేపు గడపటం, నాన్నగారు యితరులతో మాట్లాడే సంభాషణలను విని ఆనందించడం జరిగేది. వారి పాదాలకు నేను నా మనసునందే నమస్కరించేవాడిని.

అమ్మ మనకు ప్రసాదించే అనుభూతులూ, అనుభవాలూ లేక సంఘటన వల్ల ఆధ్యాత్మికతకూ లౌకికతకూ మధ్యనఉన్న తెరను అమ్మ తొలగించిందేమోననిపిస్తుంది. అందుకే యితరులకు మహిమలుగా అనిపించవచ్చేమో గానీ అమ్మ దగ్గరకు వచ్చేవారి కవి సర్వ సాధారణంగా అనిపించేవి, జీవితంలో ఒక భాగంగా అనిపించేవి.

ఇచ్చుట మా గృహాన్ని పావనం చేసిందనడం కంటే నా హృదయమనే గృహాన్ని పావనం చేసిందంటేనే బాగుంటుందని పిస్తున్నది.

COURTESY VISWAJANANI TRUST



39. అతి మానవుడు

శ్రీ అరవింద మహర్షుల వారు దర్శించిన దానిని యథాతథంగా మాటల్లో పెట్టడమెవరి వల్లా కాదు. కానీ దాని సారాంశము నాకర్థమయినంత వరకూ సంక్షిప్తంగా ఏమిటంటే సృష్టి పరిణామ క్రమంలో వృక్షాలూ జంతువులూ (జల మరియు భూచరాలు), వానరాలూ, మానవులూ ఉద్భవించారు. ఇప్పటి వరకూ మానవుడే జీవులన్నింటిలోనూ అత్యుత్తమ జీవి. అయితే పరిణామ క్రమం మానవుడితోనే అంతం కాదు. క్రింద అపరార్థంలోని పదార్థ, ప్రాణిక, మానసిక భూమికలకూ పైన ఉన్న పరార్థంలోని సత్, చిత్, ఆనందాలకు మధ్య రెండింటికీ అనుసంధానంగా, వారధిగా ఉన్న మహస్సు లేక అతిచేతన లేక ఋతచేతన లేక సత్యచేతన, బుద్ధిగత మానవుని ఆకాంక్ష వలన మానసిక, ప్రాణిక మరియు పదార్థ భూమికలలోని కవతరించి అవి రూపాంతరం చెంది మానవుడు పరిపూర్ణమానవుడు లేక అతి మానవుడు (సూపర్‌మేన్) గా రూపాంతరం చెందగలడు. రూపాంతరం చెందిన మానవుడు పరిపూర్ణుడై యుంటాడు గనుక 'అమృతస్యపుత్రాః' అని వేదాల్లో దాగియున్న ఆకాంక్ష నెరవేరగలదనీ అప్పుడే భగవంతుని సృష్టికి పూర్ణత్వం సిద్ధించగలదనీ అదే భగవత్ సంకల్పమనీ శ్రీ అరవిందులు దర్శించి దాని సారాన్నే తన గ్రంథాలైన సావిత్రి, దివ్య జీవనము (లైఫ్ డివైన్), సింథసిస్ ఆఫ్ యోగ, గీతా వ్యాసములు మొదలగు గ్రంథాలలో పొందుపరచారు.

శ్రీ అరవిందుల పూర్ణయోగమంటే ఏమిటి, దానికీ జిల్లెళ్ళమూడి అమ్మ చెప్పిన దానికేమైనా సారూప్యత యున్నదా యన్న విషయాల జోలికి నేను పోవడం లేదు. అయితే శ్రీ అరవిందులు దర్శించిన ఆ అతి మానవుడు లేక దివ్య మానవుడు ఎలా వుంటాడు, అలాంటి మానవుడొచ్చిన తర్వాత పరిణామ క్రమము ఆగిపోతుందా లేక యింకా ముందుకు కొనసాగుతుందా యన్న సందేహాలు నాకు కలిగినవి. ఈ ప్రశ్నలకు అమ్మ నా కేదైనా సమాధానమిస్తే బాగుండుననుకున్నాను. ఇలా అనుకున్న రెండు మూడు రోజుల తర్వాత ఒక రోజు రాత్రి నేను అమ్మను తలచుకుంటూ నిద్రించగా తెల్లవారుజాము

సమయంలో నాకొక స్వప్నమొచ్చింది. దానిని నేను యథాతథంగా క్రింద వివరిస్తున్నాను.

"ఒక పాఠశాలకు దగ్గర్లోని ఆరుబయలు ప్రదేశంలో యుండిన ఒక చెట్టు దగ్గర దాని నీడలో దాదాపొక పదిమంది గుమిగూడియున్నారు. వారితోపాటు నేను కూడా యున్నాను. వారందరూ జిజ్ఞాసువులు, యోగ మార్గంలో పయనించేవారు. వారిలో ఒకరు మిగిలిన మా అందరకూ ఒక ప్రత్యేక వ్యక్తిగా గోచరించసాగాడు. ఆయన ఆజానుబాహువై ధవళ వస్త్రములతో ప్రకాశిస్తున్నాడు. దివ్య ప్రేమ, దివ్యానందములు కలగలిపి రూపుదాల్చిన వానివలె కనిపించాడు. ఆయన తన ప్రేమ దృక్కుల నందరివైపూ ప్రసరిస్తున్నాడు. ప్రకాశమానమైన దివ్యకాంతితో ప్రకాశిస్తున్నాడు. ఆయన సర్వజ్ఞుడు. ఆయనకు దూరదర్శన శ్రవణాదులు అత్యల్పాలు. అష్టసిద్ధులూ ఆయనకధీనమైనవి. ఆయన సంకల్ప మాత్రంచేత ఏ ఆకృతినైనా ధరించగలడు. ఉన్నట్లుండి ఆయన శరీరం పారదర్శకమైనది. ఆశ్చర్యకరంగా మేమందరమూ చూస్తుండగానే ఆయన తన శరీరాన్ని చాలా ఎత్తుగా పెంచారు. పారదర్శకతవల్ల ఆయన శరీరాన్ని ఏవస్తువూ అడ్డుకోలేదు. ఏ వస్తువైనా ఆయన శరీరం గుండా నిరాటంకంగా ప్రసరించగలుగుచున్నది. అలాగే ఆయన కూడా దేనిగుండానైనా ఏ ఆటంకం లేకుండా పయనించగలడు. ఆయన మాకు సమీపమందే గల పాఠశాల ఎత్తైన ప్రహారీ గోడను సంకల్పమాత్రంచేత దాటి పాఠశాల ఆట స్థలమందు ఆడుచుండిన పిల్లలను తన చేతుల్తో స్పృశిస్తూ వారిలో ఒకరిగా వారితో ఆడుకుంటున్నాడు. ఒకవైపు వారి ఆటలో తాను పాల్గొంటూ, మందహాసంతో అంతా తన లీలగా ఆనందాన్ని చెందుచున్నాడు. అన్నిటికీ అతీతంగానూ ఉన్నాడు. అంటే అన్నీ తానై అన్నిటికీ అతీతంగానూ ఉన్నాడు. క్షణంలో అంటే సంకల్పమాత్రం చేత ఇహ పరలోకాలన్న తేడా లేకుండా ఎక్కడికైనా ఎంతదూరమైనా పయనించగలడు. శాశ్వతుడాయన. తన రూపాన్ని ప్రకటించుకోనూ గలడు. అంతర్ధానమూ కాగలడు. "స్వప్నమింతటితో ఆగి పోయి నాకు మెలకువ వచ్చింది. కానీ నేను స్వప్నమును మరిచిపోకూడదనే ఉద్దేశ్యంతో కళ్ళుమూసుకొని యుండి స్వప్నము చివరి నుండి మొదటి వరకూ జ్ఞప్తికి తెచ్చుకొని నెమ్మదిగా కళ్ళు తెరిచాను.

ఈ స్వప్నాన్ని గురించి ఆజన్మ బ్రహ్మచారీ 1930-40 దశకం ప్రాంతంలో కాశీ విశ్వ విద్యాలయంలో అభ్యసించి ఎమ్.ఎ. పట్టభద్రులై ఎన్నో విద్యాలయాల్లో ఉపాధ్యాయులు / ఉపన్యాసకులుగా పనిచేసి, తదుపరి కృష్ణ భక్తులై గుడివాడ సమీపంలో తమ స్వగ్రామమైన శెరీ కలువపూడిలో కృష్ణమందిరాన్ని కట్టించి ఎందరికో గురువై తన ప్రసంగాల ద్వారా ఆధ్యాత్మిక మార్గదర్శియై, తర్వాతి కాలంలో శ్రీమతారవిందులను దర్శించి వారి పూర్ణ యోగం వైపు ఆకర్షితులై శ్రీమాతారవిందుల అనుయాయునిగా పేరు ప్రఖ్యాతులు గడించి, వారి గ్రంథాలనెన్నింటినో తెలుగులోనికి అనువదించి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శ్రీమాతారవిందుల వెలుగును ప్రసాదించిన యోగివర్యులైన శ్రీ చెలసాని నాగేశ్వరరావుగారికి వివరించి చెప్పగా వారు మందహాసం చేసి ప్రసన్నంగా నావైపు చూశారేతప్ప అతి మానవుని యొక్క లక్షణాలివే యని నాకు రూఢిగా చెప్పకపోయినా ఆయన మందహాసముతో కూడుకున్న వారి మౌనము నా ప్రశ్నకు ఔనన్న సమాధానమిచ్చినట్లైనది.

ఈ స్వప్నాన్ని గురించి శ్రీ మాతారవిందుల అనుయాయు లింకొకరిద్దరి దగ్గర వివరించి చెప్పినప్పుడు వారి సమాధానము కూడా సకారాత్మకంగా ఉండియున్నందువల్ల సంతృప్తి చెందాను. రాబోయే అతి మానవుని లక్షనాలిలా ఉండవచ్చని అమ్మ నా ప్రశ్నకు సమాధానంగా ఆ లక్షణాలను స్వప్నంలో కనిపింప జేసిందని నేను భావిస్తున్నాను.

ఒకసారి అతి మానవుడిని గురించి ఒక ఆశ్రమవాసి శ్రీమాతను ప్రశ్నించినప్పుడు పరిణామ క్రమంలో జంతువులకూ మానవునికీ ఎంత తేడా ఉంటుందో బాహ్య రూపంలో ఒకేలా ఉన్నప్పటికీ సాధారణ మానవునికీ అతి మానవునికీ అంత తేడా ఉంటుందని ఆమె సమాధానమిచ్చింది.

సాధారణ మానవులమైన మనలను సంస్కరించి మనలో దివ్య లక్షణాలను పాదుగొలిపి మనల్ని దివ్య మానవులుగా రూపుదిద్దుట కొరకై తన ప్రణాళికలో భాగంగానే జిల్లెళ్ళమూడి అమ్మ కూడా భౌతిక శరీరధారియై మన మధ్యకు వచ్చి అనంత కాలవాహినిలో కొంత సమయము మనతో గడిపి యుంటుందనుకుంటున్నాను.

40. ఒక క్రిమినల్ కేసు నుండి అమ్మ నన్ను కాపాడిన తీరు

1979, 1980 సంవత్సరముల నాటి విషయం. అప్పట్లో నేను చేసే నా ఉద్యోగంలో నా జీతభత్యాలు చాల తక్కువగా ఉండి నందువల్ల నాకు 1978లో వివాహమై, మా తల్లిదండ్రులకు పెద్ద కుమారునిగా నా తమ్ముల విద్యాభ్యాసానికై కొంత ఆర్థిక సహాయాన్ని చేయవలసి రావడంతో, అప్పటికింకా నా భార్యకు బ్యాంకు ఉద్యోగం రాలేదు గనుక నే నొక ప్రయివేటు పాఠశాలలో ట్యూషన్లు కూడా చెప్తుండేవాడిని. అయినా అది కూడా చాలక రియల్ ఎస్టేట్ వ్యాపారమేదైనా నా కున్న పరిధిలో చేస్తే బాగుంటుం దనుకొనేవాడిని.

1979లో నేను నా కుటుంబంతో గుంటూరులో కొరెటిపాడు గాంధీ బొమ్మకు సమీపంలో ఏటిగడ్డ చిన్నవెంకటరెడ్డిగారి పెంకుటింటి ఐదుపోర్షన్లలో ఒకదాంట్లో అద్దెకుండేవాడిని. చిన్న వెంకటరెడ్డి గారు వ్యవసాయం చేసేవారు. వారికి అంజిరెడ్డి, సంజీవరెడ్డి, హనుమారెడ్డి చిరంజీవిరెడ్డి మరియు ఆంజనేయరెడ్డి యని ఐదుగురు కుమారులుండేవారు. వారెవరూ పెద్ద చదువులు చదువుకున్నవారు కారు. అక్షరజ్ఞానం మాత్ర ముండేది. అప్పట్లో వారి వ్యవసాయ భూములకు ధరలు పెరగటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలుపెట్టారు. 1981లో ఆ వ్యాపారాన్ని విస్తృతపర్చుకోవాలనుకొనుకొని 'జయంతీనగర్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగు సొసైటీ' అనే పేరుతో ఒక హౌస్ బిల్డింగు సొసైటీని ఏర్పాటుచేసేటప్పుడు నేను ఎమ్.ఎ. వరకూ చదువుకున్న వాడినని వారింట్లోనే అద్దెకుంటున్న కారణంతో నన్ను ఆ సొసైటీకి అధ్యక్షులుగా ఉండమన్నారు. దీనికి మొదట్లో నేను సుముఖంగా లేకపోయినప్పటికీ, మేమద్దెకున్న పోర్షన్ ప్రక్క పోర్షన్‌లో అద్దెకుంటూ మా కుటుంబంతో ఎంతో సన్నిహితంగా ఉంటున్న కో-ఆపరేటివ్ డిపార్టుమెంటులో పనిచేస్తున్న నాదెండ్ల సీతారామయ్యగారనే ఆయన

ప్రోద్బలం వల్ల నైతేనేమి అంతకుముందే రియల్ ఎస్టేట్ వ్యాపారాన్నేదైనా చేసి కొంత డబ్బు సంపాదించాలనే కోరిక నాలో యుండియుండుటచే గాని వచ్చిన అవకాశాన్నెందుకు వదులుకోవాలనిపించి యేటిగడ్డవారి విన్నపానికి అంగీకరించాను. మరొక కారణ మేమిటంటే మా ఆఫీసులో నా స్నేహితులకు కొందరికి కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా తక్కువ ధరకే యిళ్ళ స్థలాలనిప్పించడానికి సహాయపడగలనని భావించాను. నేను అధ్యక్షుడిగా నామినేట్ చేయబడి యేటిగడ్డ చిరంజీవిరెడ్డి సెక్రటరీగా, మరో 5 మంది డైరెక్టర్లుగా ఆ సొసైటీ 1979 మార్చి నెలలో గుంటూరు కో ఆపరేటివ్ రిజిస్ట్రారుగారి సమక్షంలో ఏర్పడింది. పేరుకు మాత్రము చిరంజీవిరెడ్డి సెక్రటరీయైనా వీరి సోదరుడైన హనుమారెడ్డియే అన్నిపనులూ చూసేవాడు. అప్పట్లో సొసైటీ ఆఫీసు రింగురోడ్డులో ఉండేది.

సొసైటీ సభ్యులుగా మా ఆఫీసుకు చెందిన దాదాపు 25 మందితోపాటు మరొక వందమంది వరకూ చేరారు. యేటిగడ్డ హనుమారెడ్డికి బంధువైన కొరిటెపాడుకు చెందిన వంగల పకీరారెడ్డి గారికి చెందిన సీలింగులో ఉండిన భూముల్లో ఒకేచోట మెయిన్ రోడ్డును ఆనుకొని యుండిన 9 ఎకరాల భూమిని సొసైటీ పేర రిజిష్టరు చేయించుకొని తర్వాత సొసైటీ సభ్యులకు కేటాయించడానికి నిర్ణయము జరిగింది. ఈ భూమి గుంటూరులో జెకెసి కళాశాలకు సమీపంలో దామరపల్లె రోడ్డులో శ్రీనివాస కాలనీకి ఈశాన్య భాగాన ఉండి గృహ నిర్మాణాలకు అనువుగా ఉండినది. భూమి యజమానియైన పకీరారెడ్డి గారితో మాట్లాడి ముందుగానే లే అవుట్ ప్లాను గీయించి రోడ్లు, ప్లాట్లుగా విభజించుకొనుటకు అనుమతి తీసుకున్నారు. అలాగే సొసైటీ సభ్యుల నుండి డబ్బు వసూలైన తర్వాత ఆ డబ్బును వారికి చెల్లించి అగ్రిమెంటు వ్రాసుకోవడానికి కూడా అనుమతి తీసుకున్నారు. తర్వాత సభ్యులకు నోటీసులు పంపించి సర్వ సభ్య సమావేశములో ప్లాను లే అవుట్‌ను ఆమోదింప జేసి, అలాగే ప్లాట్ల ధరను కూడా ఆమోదింపజేశారు. 444 చ.గ.ల ప్లాట్లు, 300 చ.గ.ల పాట్లు అంటే ఎ మరియు బి కేటగిరీలనే రెండు రకాల ప్లాట్లను ఏర్పాటు గావించి ఒక్కొక్క చ॥గజమునకు 50/- రూపాయల

ధరను నిర్ణయించారు. దాదాపు యీ ధర ప్రకారం దాదాపు వంద మంది వరకూ అడ్వాన్సు డబ్బు చెల్లించిన తర్వాత జనరల్ బాడీమీటింగులో ప్లాట్ల కేటాయింపు జరిగింది. ప్లాట్ల కేటాయింపు తర్వాత సగం మందికి పైగా మొత్తం డబ్బు చెల్లించారు. ఆ డబ్బును యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జమ చేసేవారము. దాదాపు ఐదారు లక్షల డబ్బు వసూలైన తర్వాత ఒకరోజు వంగల పకీరారెడ్డి గారికి అడ్వాన్సుగా చెల్లించి అగ్రిమెంటు వ్రాయించడానికని చెప్పి బ్యాంకులో 3 లక్షల రూపాయలను విత్డ్రా చేశాము. సెక్రటరీ యైన చిరంజీవి రెడ్డి, వారి సోదరుడు హనుమారెడ్డి అగ్రిమెంటు వ్రాయించి తీసుకురావడానికి ఎక్కువ సమయము పడుతుంది గనుక నన్ను మా ఆఫీసు వద్ద దిగి మా ఆఫీసులో ఎదురు చూడమని చెప్పి నన్ను కారులో మా ఆఫీసు వద్ద దింపి పకీరారెడ్డిగారి వద్దకు వెళ్తున్నామని చెప్పి వెళ్ళారు. నేను వారిని నమ్ముటచే వారితోపాటు వెళ్లలేదు. ఆ రోజు సాయంత్రానికి నాకు అగ్రిమెంటు అయినట్లు పకీరారెడ్డిగారు సంతకాలు చేసినట్లున్న స్టాంపు కాగితాలను తెచ్చి యిచ్చారు. కానీ యివి ఫోర్జరీ చేసినవని నా దగ్గరకు డబ్బు ఎప్పుడు చెల్లించి అగ్రిమెంటు చేసుకుంటారని అడగడానికి వచ్చిన వంగల పకీరారెడ్డిగారు చెబితే గానీ తెలియలేదు. అప్పటికే ఒక నెల రోజులు గడిచి యున్నందువల్ల నాకు గుండె దిగజారినంత పనైంది. అయితే నేను అమ్మను ప్రార్థించగా అమ్మ నాకు యిచ్చిన ప్రేరణ ఏమిటంటే నేను ఉద్యోగస్థుడనైనందున తొందరపడి యేటిగడ్డ సోదరులతో గొడవపడినా, ఈ విషయం సొసైటీ సభ్యులకందరికీ తెలిసినా నా ఉద్యోగానికి సమస్య ఏర్పడగలదనీ, నేను తొందరపడకుండా తెలివిగా నెమ్మదిగా బయటపడాలని, పకీరారెడ్డిగారిని గూడా తొందరపడి యీ విషయాన్ని బహిర్గతం చేయొద్దనీ, వారికి డబ్బుముట్టిన తర్వాతనే ప్లాట్లను రిజిస్టరు చేయవచ్చనీ ప్రాధేయపడగా ఒప్పుకొని వెళ్లిపోయారు. అగ్రిమెంటు కోసమని డబ్బు డ్రా చేసిన రోజు జరిగిందేమిటంటే యేటి గడ్డ సోదరులు గుంటూరులో సంగడిగుంట ప్రాంతంలో వేరే భూమి 5 ఎకరాలు కొని ప్లాట్లు చేసి అమ్ముకొనుటకై తాత్కాలికంగా యీ డబ్బును వినియోగించుకొని అచ్చటి లాభాలతో

తిరిగివచ్చే డబ్బును తిరిగి సర్దుబాటు చేయవచ్చునే ఉద్దేశంతో నాకీ విషయాన్ని దాచి పోర్జరీ స్టాంపు కాగితాలను నాకిచ్చారు. సంగడి గుంటలో వారు కొన్న భూమి తిరిగి అమ్ముడుగాక నష్టపోయారు.

నా విషయానికొస్తే ప్లాట్ల కొరకు డబ్బు చెల్లించిన సభ్యుల నుండి ప్లాట్లు తమ పేరున వెంటనే రిజిష్టరు చేయించమని రోజు రోజుకూ నాపై ఒత్తిడి పెరగసాగింది. అప్పుడు నేను ప్రతిరోజూ, ఎప్పుడెవరిని ఎలా ఎదుర్కోవలసి వస్తుందోనని ఆందోళన చెందుతూ అమ్మను ప్రార్థించేవాడిని. అప్పుడు కొంత శాంతి లభించేది. అప్పట్లో సీలింగులో యున్న భూమిని రిజిష్టరు చేయించుకోవాలంటే ప్రభుత్వ పరమైన తాత్కాలిక సమస్యలు కొన్ని నా కోసమేనన్నట్లు ఉత్పన్నమైనవి. ఈ విషయాలను ఉటంకిస్తూ నాదగ్గరకు వచ్చే సొసైటీ సభ్యులకు సందర్భాన్ని బట్టి అమ్మ నాకు తోపింప జేసిన సమాధానాన్ని ధైర్యం కోల్పోకుండా శాంతంగా చెప్పేవాడిని. రిజిస్ట్రేషన్లు జరిపించుటలో జరుగుచున్న ఆలస్యానికి ఎంతో కోపంగా, ఆవేశంగా నన్నుడగడానికి వచ్చినవారు గూడా ఏదో మంత్రించినట్లు నెమ్మదించి నేను కలిగించిన విశ్వాసానికి శాంతంగా వెనుదిరిగి వెళ్లేవారు. అయితే నేను నా ప్రయత్నంగా నా ద్వారా ప్లాట్లకై డబ్బు కట్టియుండిన వారికి, ముఖ్యంగా మా ఆఫీసుకు చెందిన వారికి సమస్యను చెప్పి వారు కట్టిన డబ్బు బ్యాంకులో యింకా 2 లక్షల రూపాయలుండినందున వాపసు చేయడంగానీ, పకీరారెడ్డి గారికి స్వయంగా డబ్బులు చెల్లించి ప్లాట్లను రిజిష్టరు చేయించడంగానీ చేశాను. మిగిలిన వారిలో కొందరిని ఒప్పించి హనుమారెడ్డి సోదరుడైన అంజిరెడ్డిగారు వేరే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండడంవల్ల వారికి చెందిన ప్లాట్లను వేరే చోట్ల రిజిస్టరు చేయించడంగానీ, అత్యవసరమన్న కేసుల్లో డబ్బును వాపసు ఇప్పించడంగానీ జరిగింది. 1983లో ఆఖరుకు ఏడెనిమిది మంది మిగిలిపోయారు. అప్పటికి నేను సొసైటీ అధ్యక్షునిగా తప్పుకోగా యేటిగడ్డ హనుమారెడ్డి అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు.

1983లో దారా సత్యవతిగారనే మహిళ అప్పట్లో గుంటూరు

తెలుగుదేశం పార్టీ మహిళాధ్యక్షురాలిగా ఉండేవారు. వారు కట్టిన డబ్బు 27,000 రూపాయలు వాపసు యిప్పిస్తానంటే ఆమె ఒప్పుకొనక 50,000 రూపాయలివ్వాలని పట్టుబట్టి ఎంతో గొడవ చేసింది. నా ప్రమేయమేదీ సొసైటీ కార్యకలాపాల్లో లేదని నేను చెప్పినా వినిపించుకోకుండా నాకు తెలియకుండా మా డిపార్టుమెంటు ముఖ్యాలయమైన ఛీఫ్ జనరల్ మేనేజరు కార్యాలయము హైద్రాబాద్‌కు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదుపై మా డిపార్టుమెంటుకు చెందిన విజిలెన్సు శాఖవారు ఎంక్వయిరీ చేశారు. అప్పుడు నేను వారికి సమాధానంగా మా డిపార్టుమెంటుకు చెందిన ఉద్యోగులు చాలామంది ఆ సొసైటీలో సభ్యులుగా చేరినందువల్ల, వారి అభ్యర్థన మేరకు వారికి మేలు చేయాలనే ఉద్దేశ్యంతోనే తాత్కాలికంగా ఆ సొసైటీ అధ్యక్షునిగా నామినేట్ చేయబడ్డాననీ, అయితే సొసైటీ ఏర్పడిన ఒక సంవత్సరం తర్వాత జిల్లా కలెక్టరు గారు జరిపించిన సొసైటీ ఎన్నికల్లో నేను తప్పుకున్నాననీ, అప్పుడు ఎన్నికైన నూతన అధ్యక్షులు ఏటిగడ్డ హనుమారెడ్డి గారికి సొసైటీ అకౌంట్సు మొత్తము అప్పగించాననీ, ప్రస్తుతము ఆ సొసైటీ లావాదేవీలతో నా కెలాంటి సంబంధము లేదనీ, నాకెలాంటి లాభాపేక్ష అందులో లేదనీ, అంతేగాక అందరితోపాటు నేనుగూడా డిపార్టుమెంటు అనుమతి తీసుకొని ఒక ప్లాటు కొని యున్నాననీ వివరించి చెప్పాను. నా సమాధానానికి తృప్తి జెందిన విజిలెన్సు శాఖవారు నా కేసును మూసేశారు. మాములుగానైతే నేను ప్లాటు కొనడాని డిపార్ట్‌మెంటల్ అనుమతి కొరకు అప్లయి చేసి యుండే వాడిని కాను. కానీ అమ్మ ప్రేరణతో అలా చేసియుండినందున నేను విజిలెన్సు కేసు నుండి బయటపడ్డాను.

నాపైన పెట్టిన విజిలెన్సు కేసును కొట్టివేయడంతో దారా సత్యవతిగారు నాపై కక్షపెంచుకొని నాపైనా, యేటిగడ్డ హనుమారెడ్డి మరియు చిరంజీవి రెడ్డిలపైనా చీటింగ్ చేసినట్లుగా క్రిమినల్ కేసు పెట్టింది. ఈ విషయం నాకు మొదట తెలియదు. ఈ కేసు విషయంలో నన్ను అరెస్టు చేయడానికని గుంటూరు పట్టాభిపురం పోలీసు స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టరుగారు వచ్చినప్పుడు గానీ తెలియలేదు. నే నప్పుడు వారికి విషయమంతా వివరించి చెప్పి నా

ప్రమేయమేదీ లేదనీ, నేను మొదట సొసైటీకి అధ్యక్షులుగా ఉండి యున్నందున నన్నుకూడా అందులో యిరికించిందనీ చెప్పగా నేను ఉద్యోగినైనందున నన్ను ముందస్తు బెయిల్ తీసుకోమని సలహా ఇచ్చారు. అప్పుడు నేను వెంటనే ముందస్తు బెయిల్ తీసుకొని నా కేసు విషయాలు చూసుకోవడానికి నా మిత్రులు, క్రిమినల్ లాయర్లయిన శ్రీచాగంటి నరసింహారెడ్డిగారు మరియు శ్రీ అంజిరెడ్డిగార్లకు అప్పగించాను. తర్వాత నా కేయిబ్బందీ కలుగలేదు. అయితే కేసు విచారించడానికి కోర్టులో నాలుగైదు సంవత్సరాలు వాయిదాలు వేస్తూ వచ్చారు. కేసు హియరింగుకొచ్చేసరికి దారా సత్యవతిగారు తనకు సంభవించిన కుటుంబ మరియు ఆర్థిక యిబ్బందులవల్ల యేటిగడ్డ సోదరులతో రాజీకి వచ్చి 4 సంవత్సరాలు గడిచి యున్నప్పటికీ తాను డిమాండు చేసినట్లు 50 వేల రూపాయలు కాకుండా తను కట్టిన 27వేల రూపాయలను మాత్రమే అంటే నేను వాపసు ఇప్పిస్తానని చెప్పియుండిన డబ్బునే వాపసు తీసుకోగలిగింది. తన డబ్బు తనకు అందినదనీ, కేసుకూ, నాకూ ఎలాంటి సంబంధములేదనీ వ్రాతపూర్వకముగా ఆమె మా డిపార్టుమెంటుకు కూడా తెలియజేయడంతో నేనా కేసు నుండి పూర్తిగా బయటపడగలిగాను.

ఈ కేసులో అడుగడుగునా అమ్మ నా వెన్నంటి యుండి కాపాడిన తీరు మరపురానిది. ఈ కేసులో నేను కలిసిన ప్రతి యొక్క వ్యక్తీ, అమ్మ నాకిచ్చిన ప్రేరణతో నేనిచ్చిన సమాధానాలూ, నేను నేర్చుకున్న గుణపాఠాలూ లేక జీవిత సత్యాలూ యివన్నీ తలుచుకుంటే ఆశ్చర్యమనిపిస్తుంది. అమ్మ అనే దివ్య శక్తి నన్ను నడిపిస్తున్నదనిపిస్తుంది.



41. వర్షాన్ని ఆపిన అమ్మ

నేను గుంటూరులో 1974లో టెలికం డిపార్టుమెంటులో ఉద్యోగంలో చేరి 2001వ సంవత్సరంలో పదోన్నతిపై ఒంగోలుకు వెళ్ళేంత వరకూ దాదాపు 26 సంవత్సరములున్నాను. 1980 నుండి గుంటూరులో స్వంతంగా యిల్లు కట్టుకోవాలన్న సంకల్పం గలిగి యింటి స్థలాన్ని సేకరించాడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాను. 1985 వరకూ నేను ఏదోయొక స్థలాన్ని కొనడం గృహ నిర్మాణానికది వాస్తుపరంగా సరిగా లేక గానీ లేక వేరే కారణాల వల్లగాని దాని నమ్మడం యిలా దాదాపు ఐదారుసార్లు జరిగింది. 1985 జనవరిలో రింగురోడ్డులోని విద్యావిహార్‌కు సమీపంలో వికాస్‌నగర్ 5వ లైనులో రాధాకృష్ణమూర్తిగారను మధ్యవర్తి ద్వారా వారి బంధువులకే చెందిన 475 చ॥గజముల స్థలాన్ని చూశాను. తూర్పు, ఉత్తరాల్లో రోడ్లు యుండి వాస్తుపరంగా యిల్లు కట్టుకోవడానికి అనువైన స్థలంగా తోచడమేగాక, కడితే ఆస్థలంలోనే యిల్లు కట్టుకోవాలనిపించింది. మధ్యవర్తితో నేను స్థలము తీసుకోగలననీ అయితే అడ్వాన్సు చెల్లించడానికి బ్యాంకులో డబ్బు విత్‌డ్రా చేయడాని కారోజు సెలవు రోజైనందున మరుసటిరోజు డబ్బు చెల్లించి అగ్రిమెంటు కుదుర్చుకుంటాననీ చెప్పగా అతను సరేనన్నాడు. కానీ నేను మరురోజు అడ్వాన్సు చెల్లించడానికి వెళ్ళినప్పుడు నాకంటే ఒక్కొక్క చదరపు గజానికి 10 రూ.లు ఎక్కువ యిస్తానన్నాడని వేరే యింకొకరి దగ్గర అడ్వాన్సు తీసుకున్నాననీ, జరిగిన తప్పిదానికి తనను క్షమించమనీ, నాకు మరొక స్థలమిప్పిస్తాననీ చెప్పాడు. నే నతన్నింకేమీ అనలేకపోయాను. మనసులో నేను అమ్మను తలచుకొని 'ఆ స్థలము నాకు వ్రాసి పెట్టి యున్నదైతే ఎలాగైనా నాకే దక్కుతుంది' అనుకొని నిర్ణయాన్ని అమ్మకే వదిలిపెట్టి వెళ్ళిపోయాను. ఒక వారము రోజులు గడచిన పిమ్మట మధ్యవర్తియైన రాధాకృష్ణమూర్తి నా దగ్గరకు వచ్చి ఆ స్థలము కొరకై అడ్వాన్సు యిచ్చినవారు కొన్ని కారణాలవల్ల ఆ స్థలాన్ని తీసుకోవడం లేదనీ, అడ్వాన్సు కూడా వాపసు తీసుకున్నారనీ అందువల్ల ఆ స్థలాన్ని నేను ముందు మాట్లాడుకొని యుండిన

రేటు ప్రకారమే నాకివ్వడానికి ఏ అభ్యంతరమూ లేదని చెప్పడంతో నేనా స్థలాన్ని తీసుకోవడానికంగీరించాను. కేవలం అమ్మ సంకల్పంతోనే నాకాస్థలం దక్కుతున్నందుకు నేను నా హృదయమందే అమ్మకు కృతజ్ఞతలు చెప్పుకున్నాను. 475 చ.గ.ల ఆ స్థలములో ఉత్తర భాగమైన 245 చ.గలు నేనుంచుకొని మిగతా 230 చ.గ.ల స్థలాన్ని వేరొకతనికిచ్చి ఒక నెల రోజులలోపే మేము మొత్తముడబ్బు చెల్లించి రిజిష్టరు చేయించుకున్నాము.

1987 ఫిబ్రవరి నెలలో ఆ స్థలములో శంకుస్థాపన గావించి గృహ నిర్మాణ పనులు మొదలు పెట్టాము. స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, అరండల్‌పేట్, గుంటూరు బ్రాంచిలో నా భార్య పేరు మీద గృహ నిర్మాణానికై లోను కూడా మంజూరు చేయించుకొని పనులను కొనసాగించాము. అక్టోబరు నెలలో విజయదశమి రోజున యింటికి స్లాబు వేయుటకై ముహూర్తము నిర్ణయించబడింది. నేను అమ్మకు నివేదించి ప్రార్థించిన తర్వాత నిర్ణయించబడిన ముహూర్తమది. అక్టోబరు నెల రానే వచ్చింది విజయదశమి ముందు రోజు అంటే నవమి రోజుకల్లా యింటి పై కప్పు (స్లాబు) వేయడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకొని యున్నాము. అయితే ఆ రోజు వాతావరణంలో మార్పు వచ్చినది. బంగాళాఖాతంలో అల్పపీడనమేర్పడడంవల్ల రాగల 48 గంటల్లో విపరీతంగా వర్షాలు పడగలవనీ, 40 నుండి 50 కి.మీ. వేగంతో గాలులు వీయగలవనీ రేడియోల్లో, టీవీల్లో వాతావరణ హెచ్చరికలు జారీ యగుచుండినవి. నా స్నేహితులు, బంధువులు కొందరు భారీ వర్షము పడితే యింటి స్లాబు వేయడం కష్టం గనుక మరొక రోజుకు ముహూర్తాన్ని వాయిదా వేస్తే బాగుంటుందని నాకు సలహా యిచ్చారు. నేను అన్ని యేర్పాట్లూ పూర్తయి యున్నందున, మరురోజు ఉదయాన్నే స్లాబు వేసే ముహూర్తాన్ని అమ్మ ఆశీస్సులతోనే, ప్రేరణతోనే నిర్ణయించి యుండడం వల్ల ముహూర్తాన్ని వాయిదా వేయకుండా పూర్తిగా అమ్మ పైనే భారముంచి నిశ్చింతగా యుండిపోయాను. ఆరోజు రాత్రి నాకు ఏ ఆటంకం లేకుండా స్లాబు పని పూర్తయి పోయినట్లు స్వప్నమొచ్చింది. దీనితో నాకు ధైర్యమింకా పెరిగినది. విజయదశమి ఉదయం రోజున యథాలాపంగా రేడియోల్లో, టీవీలో

చాలాచోట్ల భారీవర్షాలు పడుచున్నట్లు వార్తలొచ్చాయి. గుంటూరులో కూడా నా స్థలమున్న చోట విపరీతంగా మబ్బులుపట్టి ఏ క్షణమైనా వర్షము రావొచ్చున్న సూచనలు కనిపిస్తున్నవి. అయినప్పటికీ నేను స్లాబు పని మొదలు పెట్టించాను. వర్షమొస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంటే టార్పాలిన్ పట్టాల్లాంటిని తెప్పించి పెట్టుకోవడంలాంటివి ఏమీ తీసుకోలేదు (అలాచేస్తే అమ్మపై నాకున్న విశ్వాసం సడలినట్లేనన్న భావనతో).

ఉదయం గం. 9.30 ని.లకు మొదలు పెట్టిన స్లాబు పని సాయంత్రం గం. 4.30 ని.ల వరకూ కొనసాగింది. మధ్య మధ్య సన్నని చినుకులు పడుతూ భారీ వర్షమొచ్చి పనికి విధ్వంసము కలిగిస్తుందేమోనన్నట్లు ముసురు గప్పి యున్నది. మా స్థలమున్న ప్రాంతంలో దప్ప మిగతా అన్నిచోట్లా విపరీతంగా వర్షము పడుతూయుండినది. మా యింటి స్లాబు పనిపూర్తై ఆఖరున మెట్ల స్లాబు కూడా పూర్తయిన తర్వాత ఒక గంట వరకూ సన్న సన్న చినుకులు పడి ఆ తర్వాత నెమ్మదిగా వర్షము యొక్క ఉధృతి పెరుగనారంభించింది. ఆరాత్రంగా విపరీతమైన వర్షము పడుతూనే యుండినది. ఒక వారము రోజుల వరకూ మధ్య మధ్యలో వర్షాలు పడుతూ నేను స్లాబును తడపాల్సినపని లేకుండా పోయింది. మొత్తానికి స్లాబు బాగా సెట్టయింది. నేను నా హృదయమందే అమ్మకు నా కృతజ్ఞతలు తెలియజేసుకున్నాను.

అమ్మ తన భౌతిక శరీరాన్నొదిలి ఆలయ ప్రవేశం చేసిన తర్వాత కూడా పంచభూతాలపై తన ఆధిపత్యాన్నెలా కలిగియున్నదో, అలాగే మన విశ్వాసాన్ని కాపాడి మనలనెలా నడిపిస్తున్నదో తెలియజేసే సంఘటన యిది.



42. అమ్మ అదృశ్యహస్తం

నా జీవితంలోని ప్రతి మలుపులో అమ్మ అదృశ్య దివ్యహస్తముండి నన్ను నడిపిస్తున్నదనడానికి రెండు మూడు ఉదాహరణల నిక్కడ ఉటంకిస్తున్నాను.

నేను 1993 నుండి మా కార్యాలయములో హిందీ సెక్షన్‌లో పని చేసేవాడిని. 1997 అక్టోబరునుండి డిసెంబరు వరకు హిందీ - ఆంగ్ల అనువాద ప్రశిక్షణకై బెంగుళూరునందున్న కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ ట్రాన్స్‌లేషన్ బ్యూరోకు నన్ను పంపించారు. నేను నా ఉద్యోగంలో ఉన్నతికై ఆ ట్రయినింగులో బాగా శ్రమించి బంగారు పతకాన్ని గానీ వెండి పతకాన్ని గానీ సాధించాలని ప్రయత్నించాను. ఆ బ్యాచ్‌లో విభిన్న ప్రాంతాల నుండి వచ్చిన విభిన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన 20 మంది యున్నారు. వారంతా నాకంటే ఎక్కువ అర్హతలు, అనుభవము కలిగి యున్న వారైనప్పటికీ అమ్మ కృప వల్ల నాకు సిల్వర్‌మెడల్ వచ్చింది. ఒకే ఒక్క మార్కుతో బంగారు పతకం చేజారింది. మానాన్నగారు హిందీ పండితునిగా కొంతకాలం పనిచేసి తర్వాత రాజకీయాల్లో చేరి మాగ్రామ సర్పంచిగా ఎన్నికై గ్రామ సేవలో యుండి యుండడంచే మానాన్నగారి హిందీ భాషాభిమానాన్ని గుర్తు చేసుకొని నేను కూడా మా డిపార్టుమెంటులో హిందీ విభాగములో పనిచేస్తూ పదోన్నతికై ప్రయత్నించాను. ఆ ప్రయత్నంలో భాగంగా నేను మొదట హిందీ అనువాకునిగా 1997 నుండి 2000వ సంవత్సరం వరకూ పని చేసిన తర్వాత 2001 జనవరిలో అసిస్టెంట్ డైరెక్టరు (రాజభాష)గా పదోన్నతి లభించింది.

నేను నా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించడంలో భాగంగా నేను మొదట 2001 జూలైలో ఒంగోలుకు బదిలీ అయ్యాను. అక్కడ నాలుగు సంవత్సరాలు పనిచేసిన తర్వాత నిజామాబాద్, నల్గొండ, కర్నూలులో మరొక ఐదు సంవత్సరాలు పని చేయవలసి వచ్చింది. గుంటూరులో ఎస్.బి.హెచ్. బ్యాంకులో పనిచేస్తుండిన నా భార్య మా కుమారుని ఇంజనీరింగు చదువు

నిమిత్తమై హైద్రాబాద్‌కు బదిలీ చేయించుకొని నన్ను కూడా హైద్రాబాద్‌కు బదిలీకై ప్రయత్నించమని చెప్పింది. నేను హైదరాబాద్‌కు నన్ను బదిలీ చేయమని 2002 నుండి ఎన్నిసార్లు ఎంత విన్నవించుకున్నా హైదరాబాద్‌లోని మా ముఖ్యాలయములో మా అడ్మినిస్ట్రేషన్ పట్టించుకోలేదు. దీనికి మరో కారణమేమిటంటే హైదరాబాద్‌లో రెండు పోస్టులే ఉండడం, ఆ పోస్టుల్లో హైదరాబాద్‌లోనే స్థిరపడిన స్త్రీలు పని చేస్తూ యితరులెవరినీ హైదరాబాద్‌కు బదిలీ చేయకుండా తమకున్న పలుకుబడితో పైరవీలు చేస్తుండడం. అలాంటి పరిస్థితుల్లో నాకు హైదరాబాద్‌కు బదిలీ కావడమన్నది అంభవం. నేను నా రిటైర్మెంటు పర్యంతమూ అంటే ఫిబ్రవరి 2011వరకూ యితర చోట్లనన్నా పని చేయాలి, లేకపోతే ఐచ్ఛికంగా రాజీనామానన్నా చేయాలి.

నేను 2004 నుండి 2008 వరకూ నల్గొండలో పనిచేసేటప్పుడు అచ్చటి నీరు పడక కొంత అనారోగ్యము కూడా కలిగినది. నేను పోస్టుకు రాజీనామా చేయడం నా కిష్టం లేదు. హైద్రాబాద్‌కు బదిలీ ఎలా వస్తుందని ఆలోచిస్తున్న సమయంలో అంటే 2007 జూన్ లేక జూలై నెలలో మేము పనిచేస్తున్న పోస్టులను పర్మనెంటు చేయుటకై పరీక్ష నిర్వహించడానికి అప్లికేషన్లు పెట్టుకోవడానికి సర్క్యులార్ వచ్చినది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుండి అప్లికేషన్లను తీసుకొని డిసెంబరు 16వ తేదీన హైదరాబాద్‌లో పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో మంచి అర్హత సాధిస్తే ఆ మెరిట్ లిస్ట్ ప్రకారము హైదరాబాద్‌కు బదిలీకై ప్రయత్నించడం సులువవుతుందని నేను అమ్మపై భారముంచి పరీక్షకు బాగా తయారై పరీక్ష వ్రాశాను. ఇక్కడ జరిగిన మరొక విషయాన్ని కూడా తెలియజేయాలి. పరీక్షకు రెండు వారాల ముందు నా కళ్ళకు కలక సోకి చదవడానికి యిబ్బందికరంగా యుండినది. అప్పుడు అమ్మ సంకల్పం వల్ల నాకు తోడ్పడడానికే యన్నట్లు హైదరాబాద్‌లోనే పని చేస్తున్న గాయత్రి గారనే అభ్యర్థి నాతో కలిసి చదివితే విషయాలు బాగా గుర్తుంటాయని చెప్పి మా యింటికి వచ్చేవారు. నాకు తెలిసిన విషయాలు ఆవిడకు నేను చెప్పేవాడిని. మిగతా విషయాలు ఆవిడ చదువుచుండగా నేను వినేవాడిని. ఈ విధంగా నేను చదువలేకపోయినా వినడం ద్వారా బాగా ఆకలింపు చేసుకొనేవాడిని.

2008 జూలై నెలలో ఫలితాలు వచ్చాయి. పరీక్ష వ్రాసిన 16 మందిలో 8 మంది ఉత్తీర్ణులు కాగా ఆ 8 మందిలో నేను ప్రథముడిగా రావడం నాకాశ్చర్యానందాలను కలుగజేసింది. ఇక మెరిట్ లిస్ట్ ప్రకారం నాకు హైద్రాబాద్‌కు పోస్టింగు యివ్వడం ఖాయమనుకున్నాను. 2008 జూలైలో ఫలితాలొచ్చినప్పటికీ కొందరి రాజకీయాల ఒత్తిడికి లొంగిన అడ్మినిస్ట్రేషన్ ఫిబ్రవరి 2009 వరకూ మాకు పోస్టింగు లివ్వకుండా ఆపారు. అప్పుడు యూనియన్ల జోక్యంతో గానీ పోస్టింగులు యివ్వలేదు. అయితే నన్నాశ్చర్యచకితుడను గావించిన విషయమేమిటంటే హైదరాబాద్‌లో రెండు పోస్టులుండగా ఒక పోస్టులో మెరిట్ లిస్టులో రెండవ స్థానంలోయున్న కె. మహేశ్‌గారనే వారిని నియమించి రెండవ పోస్టును ఖాళీగా అట్టిపెట్టి నాకు తిరుపతిలో పోస్టింగునిచ్చారు. అంతేగాక తిరుపతిలో రెండు వారాల్లోగా చేరకుంటే నా పోస్టింగును రద్దుపరుస్తామన్న ఆదేశమిచ్చారు. అమలులో ఉన్న నిబంధనల ప్రకారం రిటైరుమెంటుకు రెండు సంవత్సరాల ముందు ఎవరికైనా అడిగినచోటుకు బదిలీ చేయాలి. నా భార్య హైద్రాబాద్‌లోనే పనిచేస్తున్నందు వల్ల స్పౌజ్ కేస్‌గా పరిగణించి నాకు హైదరాబాద్‌కే పోస్టింగు యివ్వాలి. ఏడెనిమిది సంవత్సరాల నుండి నేను పెట్టుకున్న అభ్యర్థనలను దృష్టిలో పెట్టుకున్నా నన్ను హైద్రాబాద్‌లోనే పోస్టు చేయాలి. అన్నిటికీ మించి మెరిట్ లిస్టులో ప్రథమ స్థానం నాదే గనుక ఆప్షన్స్ అడిగితే నాకే హైదరాబాద్‌కు పోస్టింగ్ యివ్వవలసి వస్తుందని పోస్టింగ్ ఆర్డర్స్‌లో ఆప్షన్స్ అడుగకుండా నన్ను అన్యాయంగా తిరుపతికి పోస్టింగు చేయడం నేను సహించలేకపోయాను, హతాశుడనయ్యాను. మా యింట్లో వాలంటరీ రిటైర్‌మెంటు తీసుకొని హైదరాబాద్‌లో ఉండమన్నా నేను ఓటమినొప్పుకున్నట్లవుతుందని దానికిష్టపడలేదు. అడ్మినిస్ట్రేషన్‌కు తలయొగ్గకుండా తిరుపతిలో చేరకుండా అమ్మపై భారం వేసి నేననుకున్నది సాధించాలనుకున్నాను. మొదట యూనియన్ల ద్వారా ప్రయత్నించినా లాభం లేకపోయింది. అప్పుడు వారేమి సలహా యిచ్చారంటే రాజకీయంగా పలుకుబడి గలిగిన వ్యక్తులెవరితోనైనా చెప్పిస్తే ఫలితముంటుందని సలహా యిచ్చారు. అప్పుడు నేను 3.3.2009 న అప్పటి ముఖ్యమంత్రియైన వై.ఎస్.

రాజశేఖర్‌రెడ్డిగారితో చెప్పిద్దామని వారి పర్సనల్ సెక్రటరీగా యుండిన భాస్కర శర్మగారిని కలుద్దామని ముఖ్య మంత్రి కార్యాలయానికి వెళ్ళాను. నేను వెళ్లేటప్పుడు గుంటూరులో శ్రీ అరవింద కేంద్ర వ్యవస్థాపకులైన శ్రీ బసవరాజు హరికిషన్‌గారిని నాతోపాటు తీసుకువెళ్లాను. ముఖ్యమంత్రిగారి కార్యాలయానికి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకున్నాము. మేము వెళ్ళేటప్పటికి ముఖ్యమంత్రి గారు మీటింగులో ఉన్నారనీ, వారిని కలవాలంటే రెండు మూడు గంటల సమయం పడుతుందన్నారు. వెంటనే వెళ్లి అప్పుడు ఆర్థిక మంత్రిగా యుండిన కొణిజేటి రోశయ్యగారిని కలిస్తే నా పని సానుకూలము కాగలదన్న ప్రేరణను అమ్మ నాకు కలిగించింది. ఈ విషయాన్ని హరికిషన్‌రావు గారికి చెప్పి మేమిరువురము రోశయ్యగారి కార్యాలయానికి వెళ్లాము. మేము వెళ్లేదారిలో నా కేమనిపించిందంటే రోశయ్యగారు మానాన్నగారిని బాగా ఎరిగియున్నా ఆయనకు నన్ను పరిచయం చేయడానికి మాదాయాదియైన బెల్లంకొండ రంగనాయకులు కూడా నాతో పాటు వుంటే బాగుండుననుకున్నాను. ఆయన హైదరాబాద్‌లోనే యుంటున్నా అప్పటికప్పుడు ఆయనకు కబురు పంపి పిలిపించడం కష్టం గాబట్టి అది అయ్యే పనిగాదనుకున్నాను. ఐతే నేను, హరికిషన్‌రావుగారు రోశయ్యగారి కార్యాలయానికి చేకుకునేసరికి అదే సమయానికి మా అన్న రంగనాయకులు రోశయ్యగారినొకసారి కలిసి వెళ్దామని అక్కడి వచ్చి యుండడం నాకాశ్చర్యాన్ని కలుగజేసింది. అంటే అమ్మ యిచ్చిన ప్రేరణతో నేను రమ్మని కబురు చేయకుండానే కరెక్టుగా మేము వెళ్లే సమయానికే తను రావడం కేవలం యాదృచ్ఛికం గాదు. అప్పుడు ఒంటిగంట సమయం రోశయ్యగారు లేచి భోజనానికి వెళ్లబోతున్నారు. మమ్మల్ని చూసి ఆగిపోయి మమ్మల్ని తన గదిలోనికాహ్వానించారు. ఆయన గదిలో కెళ్లిన తర్వాత మా అన్నయ్య రోశయ్యగారికి నన్ను పరిచయం చేశారు. నాతో ఉన్న హరికిషన్‌రావుగారు కూడా రోశయ్యగారికి తెలిసియుండుటచే మేమొచ్చిన పని యేమిటని రోశయ్యగారు ప్రశ్నించారు. అప్పుడు నేను వారికి విషయాన్నంతా వివరించి చెప్పగా ఎవరైనా కేంద్రమంత్రితో చెప్పిస్తే బాగుంటుందేమోనన్నారు. అప్పుడు నేను వెంటనే వారితో వారు మా జనరల్

మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్) సుబ్బారావుగారితో మాట్లాడితే పని అయిపోతుందని, కాబట్టి వారితో ఒకసారి మాట్లాడవలసిందిగా కోరి సుబ్బారావుగారి ఫోను నంబరును వారికిచ్చాను. వెంటనే వారు సుబ్బారావుగారికి ఫోను చేసి 'నేను రోశయ్యను మాట్లాడుతున్నానన'గానే అవతలి నుండి సుబ్బారావుగారు సవినయంగా ఏమి కావాలని అడిగారు. అప్పుడు రోశయ్యగారు తనకో సహాయం చేయగలరా అని అడిగి హైద్రాబాద్‌లో నా పోస్టింగు విషయం మాట్లాడగా వెంటనే వారొప్పుకున్నారు. రోశయ్యగారు సుబ్బారావుగారికి ధన్యవాదాలు చెప్పి ఫోను పెట్టేసి, నాతో నన్ను వెంటనే వెళ్లి సుబ్బారావుగారిని కలవవలసిందిగా చెప్పారు. నేను వారికి కృతజ్ఞతలు చెప్పి నిష్క్రమిస్తుండగానే రోశయ్యగారు కూడా భోజనానికని వెళ్ళిపోయారు. అప్పటికి 1.30 సమయమయింది. సుబ్బారావుగారు కూడా భోజనానికి వెళ్లే సమయం గాబట్టి వారు కూడా ఆఫీసులో యుండరని చెప్పి మరురోజు ఉదయాన్నే నేను ఆఫీసుకు వెళ్లి వారిని కలిశాను. వెంటనే వారు మా సర్కిల్ కార్యాలయమైన అదే ఆఫీసునందు గల పోస్టులో నన్ను నియమిస్తూ ఆదేశాలను జారీచేశారు. ఆ ఆర్డరు కాపీనొకదానిని నేను స్వయంగా గుంటూరుకు తీసుకువెళ్లి అక్కడ రిలీవ్ అయి తిరిగివచ్చి హైద్రాబాద్‌లో మార్చి 8వ తేదీన నా పోస్టులో నేను జాయిన్ అయ్యాను. నా చిరకాల కోరిక అంటే హైద్రాబాద్‌కు బదిలీయన్నది ఈ విధంగా తీరింది. అమ్మ కృపతో మా సర్కిల్ కార్యాలయంలో పనిచేయాలనే నా ఆకాంక్ష కూడా నెరవేరింది.

ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కార్యాలయపు హిందీవిభాగం ఇన్‌ఛార్జ్‌గా రాష్ట్రంలోఉన్న అన్ని జిల్లాలలోని హిందీ అనుభాగాలను నియంత్రించే పోస్టును ఫిబ్రవరి 2011 వరకు అంటే రెండు సంవత్సరాల పాటు సమర్థవంతంగా నిర్వహించగలిగాను. 2011 జనవరిలో మా కార్యాలములో హిందీఅమలు పై జరిగిన పార్లమెంటరీ కమిటీ తనిఖీకి వచ్చినప్పుడు నా కృషిని వారెంతో మెచ్చుకొనడం నాకెంతో ఆనందాన్ని కలుగజేసింది. ఇదంతా చేయగలగడం కేవలం అమ్మ కృప, అమ్మలీల.

43. అడిగిన వరాలనిచ్చే అమ్మ

అడిగిన వరాలనిచ్చే అమ్మంటే మనమడిగినవన్నీ యిస్తుందనిగాదు. మనకేది మంచో, మనకేది యుక్తమో అది యిస్తుందని అర్థం. ఒక్కొక్కసారి ఏదైనా పొందిన తర్వాత కూడా అది అమ్మే ప్రసాదించిందని తర్వాత ఎప్పటికోగానీ మనకు తెలియదు. మనము నిస్వార్థంగా యితరుల గురించి ఏమి కోరినా లేక ప్రార్థించినా వాటిని తప్పక అమ్మ నెరవేరుస్తుంది. నాకు స్వానుభవమైన రెండు ఉదాహరణలిచ్చుట యిస్తాను.

తన పెద్ద కుమార్తెను నాకిచ్చి వివాహం జరిపించిన మా మామగారు ఎయిర్‌ఫోర్సులో మాస్టర్ వారెంట్ ఆఫీసర్‌గా రిటైర్ అయి తన కుటుంబంతో సికింద్రాబాద్ డిఫెన్సుకాలనీలో యిల్లు కట్టుకొని స్థిరపడ్డారు. ఆయనకిద్దరు కుమారులు, యిద్దరు కుమార్తెలు. తన రెండవ కుమార్తె(నా మరదలు) కు కూడా పెండ్లి చేయాలనీ, తను ఎయిర్‌ఫోర్స్‌లో దేశమంతా విభిన్న పట్టణాల్లో పనిచేయవలసి రావడం వల్ల బంధువులెవరితోనూ సరియైన పరిచయాలు లేవనీ, నన్ను తన పెద్ద కుమారునిగా భావిస్తున్నాననీ, కాబట్టి పెళ్ళి సంబంధాలు చూడడంలో సహకరించవలసిందిగా నన్నొక రోజు కోరారు. అప్పుడు నేను సరేనని ఆయనకు మాటయితే యిచ్చానుగానీ నేను మొదటి నుండీ రిజర్వ్‌డ్‌గా యుండి ఎవరితోనూ ఎక్కువ సంబంధాలు, పరిచయాలు పెంచుకున్నవాడిని గాను. క్యాజువల్‌గా ఏ పెండ్లిండ్లలోనో, యితర ఫంక్షన్లలోనో లేక మా స్వగ్రామము వెళ్ళినప్పుడో తటస్థపడిన బంధువులను మాత్రమే కలిసేవాడిని. నా మరదలు సౌమ్యస్వభావం గలిగినది. నా భార్యాపిల్లలు మామామగారింట్లో ఉన్నప్పుడు మా పిల్లలను చాలా శ్రద్ధగా చూసేది. అంటే వారి లాలన పాలన గావించేది. నా మనస్సులో తనపట్ల యుండిన కృతజ్ఞతాభావం చేత, మా మామయ్యకు నేనిచ్చిన వాగ్దానం కారణంగా నా మరదలికి ఏదైనా మంచి సంబంధము కుదరాలని ఆకాంక్షిస్తూ మార్గము చూపించమని హృదయపూర్వకంగా నేను అమ్మను ప్రార్థించాను. మా దూరపు

15)

బంధవు, గిద్దలూరు వాస్తవ్యులయిన జల్లిపల్లి రంగస్వామి గారు అప్పట్లో హైదరాబాద్‌లో ఆర్టీసి క్రాస్‌రోడ్సుకు దగ్గర్లో అశోక్‌నగర్‌నందు ఉండేవారు. వారు పోస్టల్ డిపార్టుమెంటులో పోస్టుమాస్టర్‌గా పనిచేసి రిటైరయియున్నారు. వారి కుమారుడైన రాజేంద్రప్రసాద్ ఆంధ్రాబ్యాంకులో క్లర్కుగా పనిచేస్తూ పదోన్నతి పరీక్ష ప్రాసై ఆఫీసరుగా నియమించబడడానికి సెలక్టు కాబడియున్నాడు. నాకీ విషయం రంగస్వామిగారి అన్నయ్య కుమారుడైన మరియు గుంటూరులో ఆర్‌ఎమ్ఎస్‌లో పనిచేయుచుండిన రంగనాయకులు గారి ద్వారా తెలిసింది. ఎందుకంటే నేను కూడా అప్పుడు గుంటూరులోనే పనిచేస్తూ వారు మాకు బంధువై యున్నందున వారింటికి అప్పుడప్పుడూ వెళ్ళి వస్తుండేవాడిని. నా మరదలుకీ సంబంధము చాలా బాగుంటుందనిపించి మామామగారికి చెప్పటానికి ముందే రంగస్వామిగారిని కలిసి నా మరదలు విషయమై చెప్పి నా మరదలును చూడటానికి రావడానికి వారి నొప్పించాను. తర్వాత మా మామగారితో మాట్లాడగా వారు కూడా సంతోషించి పెండ్లిచూపుల ఏర్పాట్లు గావించారు. ఇరువైపులా ఒకరినొకరు యిష్టపడడం పెండ్లి నిశ్చయం జరగడం తర్వాత త్వరలోనే పెండ్లి జరిగిపోవడం వెంటవెంటనే జరిగిపోయాయి. అమ్మ నా ప్రార్థనాలకించి నన్నొక నిమిత్తమాత్రునిగా జేసి జరిపించిన వివాహమది. ఆ జంట సుఖశాంతులతో, ఐశ్వర్యంతో, సత్సంతానంతో వర్ధిల్లుచున్నారు.

2001 జూలై నుండి ఒంగోలులో జనరల్ మేనేజర్ టెలికం కార్యాలయమునందు అసిస్టెంట్ డైరెక్టర్ (రాజభాష)గా పనిచేయుచున్నాను. 2002వ సంవత్సరంలో యు.పి.ఎస్.సి పరీక్షల్లో ఉత్తీర్ణులైన హిందీ ఇంగ్లీషు అనువాదకులు కొందరు మా డిపార్టుమెంటుకు కేటాయించబడగా వారిలో 11 మంది ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌కు కేటాయించబడ్డారు. ఆ 11 మందిలో మంచి మెరిట్ గలిగిన శ్రీమతి జమున యనే వివాహితను మా సర్కిల్ కార్యాలయము, హైదరాబాద్‌వారు నా దగ్గరకు నాకు సహాయకురాలిగా పనిచేయుటకై ఒంగోలుకు పంపిచారు. ఆ అమ్మాయి వయసు అప్పటికి దాదాపు 25 సంవత్సరములు. వారి స్వస్థలం చెన్నై ఆ అమ్మాయి భర్త

ఢిల్లీలో ఉద్యోగం చేసేవాడు. తన తల్లిదండ్రులు, అత్తమామలు కూడా ఢిల్లీలోనే యుండిరి. తనకీ ఉద్యోగము మొదటిసారి వచ్చినది కావున దూరమైనా వచ్చి చేరుతున్నానని చెప్పారు. ఆ అమ్మాయిని మా ఆఫీసులో చేర్పించడానికి ఆ అమ్మాయితోపాటు వచ్చిన తల్లిదండ్రులు నాతో తమ కూతురును నా కూతురువలె జాగ్రత్తగా చూసుకోవలసిందిగా నన్నభ్యర్థించారు. నేను సరేనని వారికి మాట యిచ్చి ధైర్యము చెప్పి వారిని ఢిల్లీకి పంపించాను. ఆ అమ్మాయి చాలా చురుకైనది. మంచి జ్ఞానము, గుణము గలిగినది. నేనేపని చెప్పినా మా ఆఫీసు నందు క్షణాల్లో చాలా సమర్థవంతంగా చేసేది. ఆ అమ్మాయికి కంప్యూటర్ జ్ఞానముండి యుండుటచే నా ఆఫీసుపని నాకుకూడా సులువైనది. అనువాదంలో నాకు తెలిసిన మెలకువలన్నీ ఆ అమ్మాయికి చెప్పేవాడిని. ఏఏ పుస్తకాలు, ఏఏ నిఘంటువు లవసరమో చెప్పి మార్గనిర్దేశం చేసేవాడిని. మా ఆఫీసులో తనకు కొత్తగావడం వల్ల, తనకు తెలుగు రాకపోవడం వల్ల మొదట్లో కొన్ని యిబ్బందులెదురైనా, తన యిబ్బందులనూ భయాలనూ నేను దూరం చేయడంతో నన్ను తన తండ్రికి వలెనే ఆరాధనా భావంతో చూసేది. తన కుటుంబానికి తాను దూరంగా యుండడంతో ఎంతో వ్యాకులత చెందేది. నాతో తన ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్తానని తన నిర్ణయాన్ని చెప్పినప్పుడు నేను తొందరపడి రాజీనామా చేయొద్దనీ, యిలాంటి మంచి కేంద్రప్రభుత్వ ఉద్యోగం రావడం బాగా పోటీయున్న యీ రోజుల్లో కష్టమనీ, తాను ఢిల్లీకి తన ఉద్యోగాన్ని మార్పించుకోవడానికి భగవంతుడేమైనా మార్గము చూపిస్తాడేమో వేచి చూద్దామనీ ఊరడిల్లజేసాను. అమ్మను గురించి చెప్పి అమ్మను ప్రార్థించవలసిందని తనకు చెప్పాను. తన రాజీనామా ప్రయత్నాన్ని విరమింపజేసాను. నేను బాగా ఆలోచించిన పిమ్మట ట్రాన్స్‌లేషన్‌లో ట్రయినింగు కొరకై ఆ అమ్మాయిని ఢిల్లీ పంపించవచ్చనిపించింది.

ఆంగ్ల హిందీ అనువాదకులుగా నియుక్తులైన వారెవరైనా ఏ డిపార్టుమెంటులో పనిచేస్తున్నా ఢిల్లీ, ముంబయి, కలకత్తా మరియు బెంగుళూరులలో యున్న కేంద్ర అనువాద శిక్షణా కేంద్రములలో

ఏదోయొకదానిలో తప్పనిసరిగా మూడు నెలలపాటు జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు నెలల్లో మొదటి తారీఖున మొదలయ్యే శిక్షణా శిబిరాలలో ఒక సెషన్‌లో శిక్షణ తీసుకోవాల్సి యుంటుంది. మామూలుగానైతే పనిచేస్తున్న కార్యాలయానికి ఏది దగ్గరైతే ఆ కేంద్రములో శిక్షణ తీసుకోవాలి. కాబట్టి ఆ అమ్మాయిని నేను బెంగుళూరుకు ట్రయినింగు నిమిత్తము పంపించాలి. ఖచ్చితంగా బెంగుళూరుకే ట్రయినింగుకు పంపించమని నాకే ఆదేశమూ వ్రాత పూర్వకముగా లేనందువల్ల ఏదైతే అది అవుతుంది, అవసరమైతే స్పష్టీకరణ యిచ్చుకోవచ్చని అమ్మపై భారం వేసి బెంగుళూరుకు కాకుండా ఢిల్లీకి జనవరి 2003లో మొదలయిన ట్రయినింగు సెషన్ కొరకు నేనా అమ్మాయిని డిసెంబరు 2002 ఆఖర్లో రిలీవ్ చేసి పంపించాను. పంపించేటప్పుడు తనను ఆ ట్రయినింగును బాగా ఉపయోగించుకోవాలనీ, నా దగ్గర శిక్షణ తీసుకున్నందువల్ల తనకు బంగారు పతకమో వెండి పతకమో సాధిస్తే సంతోషిస్తాననీ చెప్పాను. అలాగే తాను అక్కడ ఢిల్లీలో ట్రయినింగులో ఉన్నప్పుడే మా ఢిల్లీ ముఖ్యాలయానికి డెప్యూటేషన్‌పై ట్రాన్స్‌ఫర్ కొరకై ప్రయత్నించమనీ, అలాచేసి సఫలమైతే తనకింకే యిబ్బందీ యుండదనీ చెప్పి పంపించాను. అలా సఫలీకృతురాలు కావాలని ఆశీస్సులనొసగి పంపించాను. నేను చెప్పిన విధంగానే అమ్మ కృప వల్ల ఆ అమ్మాయి తన ట్రయినింగులో వెండి పతకాన్ని సాధించింది. అలాగే బి.ఎస్.ఎన్.ఎల్. డైరెక్టర్ జనరల్‌గారి కార్యాలయానికి డెప్యూటేషన్ పై బదిలీని కూడా సాధించి అక్కడ చేరి తర్వాత అక్కడే రెగ్యులర్ అయింది. ఈ విషయాలన్నీ నాకు ఫోనులో ఎప్పటికప్పుడు చెబుతుండేది. ఒంగోలులో రిలీవై అద్దె గదిలో ఉండిన తన సామాన్లను తీసుకెళ్ళడానికి మాత్ర మొకసారి ఒంగోలుకు వచ్చి వెళ్లింది. ఆ అమ్మాయి ఢిల్లీలో తాను తన కుటుంబంతో చాలా ఆనందంగా ఉన్నాననీ, తనకిప్పుడు యిద్దరు మగ సంతానమనీ ఒకటి రెండు సార్లు నాకు ఫోనుచేసి చెప్పి తన కృతజ్ఞతలు తెలియజేసింది. దైవాన్ని పరోక్షంగా అమ్మను నమ్మిన ఆ అమ్మాయికి, ఆ అమ్మాయి తల్లిదండ్రులకు నా ద్వారా మరియు ఢిల్లీలో యితరుల ద్వారా అందిన సహాయమంతా నేను నిమిత్తమాత్రంగా అమ్మ కృప వల్లనే నన్నది అక్షరసత్యం.

44. అమ్మే బ్రహ్మ, బ్రహ్మే అమ్మ

'జ్ఞానమనంతం బ్రహ్మ' అన్నారు పెద్దలు. జ్ఞానము అనంతమై యుండి అదే బ్రహ్మమై యున్నది. జ్ఞానమే రూపుదాల్చిన అమ్మ బ్రహ్మకాక మరెవరు? ఆద్యంతములు లేనిది, అంతా తానేయైనదీ, అన్నిటికీ ఆధారమైనదే బ్రహ్మ. అవిరళంగా జరిగే సృష్టి స్థితిలయాలకు మూలమైనదే బ్రహ్మ. బ్రహ్మకానిదేదీలేదు. సర్వంఖల్విదం బ్రహ్మ. 'అం ఆ'కు అమ్మ యిచ్చిన 'ఆద్యంతములు లేనిదీ అన్నిటికీ ఆధారమైనదీ' అన్న నిర్వచనం కూడా అదే గనుక 'అమ్మే బ్రహ్మ, బ్రహ్మే అమ్మ'యై యున్నది. ఒక సోదరుడు అమ్మ పాదాలను పూజిస్తూ 'ఇవి బ్రహ్మ కడిగిన పాదాలు గదా' అన్నప్పుడు అమ్మ అతనితో 'మీరు బ్రహ్మలు కాకపోతే గదా!' అన్నది. అంటే అమ్మ మనందరినీ బ్రహ్మముగా చూచేది అంటే మనలో తననుతానే చూచేదన్నమాట. 'మీరంతా నేనే, మీదంతా నేనే', 'అన్ని నేనులూ నేనైన నేను' అన్న అమ్మ వాక్యాల కర్థం కూడా తాను కానిదేమీ లేదనీ తానే సర్వత్రా సర్వంగా ఉన్నదనే గదా!

అమ్మ పాదాలనెవరైనా పూలతో పూజించేటప్పుడు ఒక్కొక్కసారి అమ్మ తనకుతానే తన పాదాలపై పూరేకులను వేస్తూ తన పాదాలను తనే పూజిస్తున్నదా యన్నట్లుండేది. ఆదృశ్యం ఎలాగుండేదంటే తన నుండి (దైవాన్నుండి) తాను వేరై మనతోపాటు తనుకూడా తన పాదాలకు పూజ చేస్తున్నదా యన్నట్లుండేది.

'మీరు కానిది నేనే మీ కాదు' అనేది అమ్మ. అంటే సర్వముతో తనకున్న తాదాత్మ్యత అసామాన్యం. ఇక్కడ తాదాత్మ్యత అనడం కన్నా సర్వమూ తానేయై యున్నదంటేనే బాగుంటుంది.

45. మనస్సే ఆధారం

మనస్సే అన్నిటికీ ఆధారమన్నది అమ్మ. నీకు తోచినట్లు చేయమని అమ్మ చెప్పిన దానికర్థం మనము మనస్సును ఆధారం చేసుకొని మనకు గలిగిన ప్రేరణలను బట్టి కార్యోన్ముక్తులమౌతాము. దేవుడైనా, దయ్యమైనా, పుణ్యమైనా, పాపమైనా, అలాగే మంచీ, చెడూ అన్నీ మన మనసును బట్టే ఉంటాయి. 'యద్భావం తద్భవతి' యని అందుకే అన్నారు. దేవుని పూనకాలూ, దయ్యం పట్టడాలూ, దృష్టి దోషం తగలడం లాంటి విషయాలు ఎంతవరకూ నిజమన్నది ఎవరికివారు తమ అనుభవాన్నిబట్టి, మానసిక స్థాయిని బట్టి ఒక నిర్ధారణకు వస్తుంటారు. నేను నా చిన్నతనంలో మా గ్రామంలో ప్రత్యక్షంగా చూచిన మూడు సంఘటనలను యిక్కడ వివరిస్తున్నాను.

నాకు పది సంవత్సరముల వయసప్పుడు నిరక్షరాస్యురాలైన లక్ష్మమ్మ యనే గేదెలు కాచుకొనే ఒకావిడకు ప్రతి శనివారం రోజు తిరుపతి వేంకటేశ్వరస్వామి ఒంటి మీదకొచ్చేవాడు. ఆరోజు ఆమె ఎంతో శుచిగా, నిరాహారిగా యుండేది. ఆ రోజు తమ తమ విభిన్న సమస్యలతో తన దగ్గరకొచ్చేవారి కామె వెంకటేశ్వరస్వామే స్వయంగా చెబుతున్నట్లు సమాధానాలు చెప్పడం గానీ లేక పరిష్కారాలు సూచించడంగానీ చేసేది. క్రితమెప్పుడో జరిగిన కొన్ని విషయాలనుటంకించడం, జరగబోయే కొన్ని సంఘటనలను సూచించడంగానీ జరిగేది. సాయంత్రం చీకటి పడగానే ఆమెను దేవుని ఊరేగించినట్లుగా గ్రామ వీధుల వెంట మేళతాళాలతో త్రిప్పేవారు. ఒక శనివారం రోజున ఆమె మా యింటి దగ్గరి నాలుగు వీధుల కూడలి దగ్గరకు రాగానే అందరితోపాటు నేను కూడా ఉత్సుకతతో వెళ్లి ఆమెను దర్శించాను. ఆమె నాలుగడుగుల రెండంగుళాల ఎత్తు అంటే పొట్టిగా యుండినది. ఆమె నల్లని మేను, తిరునామాలతో నుదురు గలిగి గంభీరవదనయై కళ్ళు తేజోవంతంగా యుండినవి. కొందరడిగిన ప్రశ్నలకు

వెనువెంటనే సూటిగా సమాధానాలు చెప్పింది. ఒకరిద్దరికి వారిని చూడగానే వారు అడుగకముందే వారి సమస్యలను తానే చెప్పి, ఇలా చెయ్యి అలా చెయ్యి' అని ఆదేశిస్తున్నట్లుగా సమాధానాలు చెప్పింది. నేలపై ఉన్న మట్టిని దీసి నిప్పుల్లో వేయగా సాంబ్రాణి వాసన వచ్చింది. మరలా నేలపై మట్టినే కొందరికి నోట్లో వేయగా అది కలకండవలె తియ్యగా నుండినది. నేను కూడా రుచి చూశాను. ఈ విషయంలో ఆమె ఏదో గారడీ చేసి యుంటుందని విమర్శించిన వారుకూడా యున్నారు. నాకైతే అలా అనిపించలేదు. ఎందుకంటే ఆమె నిరాడంబరి. వెంకటేశ్వరస్వామి పై అనన్య భక్తి గలిగి యుండేది. సామాన్యంగా ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేది గాదు. ఏమీ తెలియని అమాయకురాలివలె యుండేది. ఎవరి నుండీ డబ్బును దక్షిణగా స్వీకరించేది కాదు. తనకున్న దాంట్లోనే తృప్తిగా జీవించేది. వీటన్నిటినిబట్టి ఆమె ఎవరినీ మోసము చేయడం లేదని నాకనిపించింది. నిజంగానే ఆమె శరీరాన్ని వెంకటేశ్వరస్వామి పూనాడేమోననిపించింది. ఎందుకంటే శ్రీకృష్ణుని చైతన్యం శ్రీ చైతన్యుల వారిని ఆవహించినప్పుడాయన శ్రీకృష్ణుని వలెనే పాటలు పాడుచూ నాట్యం చేసేవాడనీ, అలాగే శ్రీరామకృష్ణపరమహంస ధ్యానమగ్నుడై ట్రాన్స్‌లోకి వెళ్ళినప్పుడు ఆనందంతో నాట్యం చేసేవాడనీ నేను చదివి యున్నాను.

నాకు పన్నెండు సంవత్సరముల వయసప్పుడు మా గ్రామంలో మా యింటికి సమీపంలో ఒక యింటిలో నివాసముంటున్న ప్రత్తి రంగయ్యే యనునాతడు ఒకరోజు పొలమునకు పని చేయుటకై తన భార్యయైన పెద్దక్కను తనతో పాటు తీసుకువెళ్లాడు. అతనొక త్రాగుబోతు, అతని భార్య చాలా మృదు స్వభావి. ఆమె పైన ఎలాంటి కక్ష పెంచుకున్నాడోగానీ ఆరోజు సాయంత్రమామెను పొలములో ఘోరంగా గడ్డపలుగుతో పొడిచి హత్య గావించి తన పొలములోనే పూడ్చి పెట్టి ఒక్కడే గ్రామానికి తిరిగివచ్చాడు. అతడు హత్య చేసిన విషయమారోజు ఎవరికీ తెలియదు. అయితే ఆ మరుసటి రోజు హత్యగావించిన పొలానికి దగ్గర్లోని మరొక పొలానికి పనికి వెళ్లిన నావయసబ్బాయి కచ్చుట పెద్దక్క దయ్యమై పట్టిందనీ,

ఆ అబ్బాయిని వారింటికి తీసుకొని వచ్చారనీ, ఆ అబ్బాయి అచ్చం పెద్దక్క మాట్లాడినట్లే మాట్లాడుచున్నాడనీ అందరూ చెప్పుకుంటుంటే విన్నాను. దయ్యం పట్టిందన్న వారెలా ఉంటారు, ఎలా ప్రవర్తిస్తారో తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో, ఉత్సుకతతో ఆ అబ్బాయిని చూడ్డానికని వారింటి దగ్గరకు వెళ్ళి కొద్దిగా దూరంగా నిలుచొని గమనిస్తూ యున్నాను. ఆ అబ్బాయి కూర్చున్న మంచానికి చుట్టూ ఆరేడు మంది నిలుచొని యున్నారు. ఆ అబ్బాయి వారితో అచ్చం పెద్దక్క మాట్లాడినట్లే ఆమె హావభావలనే ప్రకటిస్తూ మాట్లాడుచుండెను. ఆ అబ్బాయి నావహించిన పెద్దక్కను తన హత్య ఎలా జరిగిందో చెప్పమని ఒకరడిగిన ప్రశ్నకు సమాధానంగా తనను తన భర్త తన యింటి నుండి ఏ మిషతో పొలానికి తీసుకెళ్లిందీ, పొలానికి వెళ్లిన తర్వాత తను పనికి ఉపక్రమించగా ఉన్నట్లుండి తను వారిస్తున్నా తనను గడ్డపలుగుతో అతి దారుణంగా పొడిచి చంపిందీ, ఎవరికీ తెలియకూడదనే ఉద్దేశ్యంతో తన దేహాన్ని పొలంలో ఎక్కడ, ఎలా పాతిపెట్టిందీ పూస గుచ్చినట్లు తెలియజేసింది. దయ్యమైపట్టిన పెద్దక్క చెప్పిన తన హత్యోదంతం ఊరంతా ప్రాకి ఆఖరుకు పోలీసులకు తెలిసి పొలంలో ఆమె శవాన్ని వెలుపలికి తీసి పోస్టుమార్టంకు తీసుకువెళ్లడం, ప్రత్తి రంగయ్యను అరెస్టు చేసి తీసుకు వెళ్లడం జరిగిపోయాయి. ఆ అబ్బాయికి పట్టిన దయ్యాన్నొదిలించడానికి పకీరయ్య యనే మంత్రగాడిని పిలిపించగా ఆయన దయ్యాన్నొదిలించి ఆ అబ్బాయికి రక్షణగా రాగి కడియమొకటి చేతికి ధరింప జేసి వెళ్లాడు. దయ్యమొదిలిన తర్వాత ఆ అబ్బాయి చాలా నీరసంగా కనిపించాడు. తనకు పొలంలో దయ్యమెలా పట్టిందో చెప్పమని యితరులడుగగా తాను తమ పొలానికి ఒంటరిగా వెళ్తుండగా పెద్దక్క చంపబడిన పొలము గట్టు దగ్గర కెళ్లేటప్పటికి ఏదో అలికిడియైనట్లు శబ్దము రాగా అటువైపు చూడగా తాటి చెట్టంత ఎత్తుగా తనవైపే సుడిగాలొకటి వచ్చిందనీ తనను చుట్టుముడుతున్నప్పుడు చాలా భీతి చెందాననీ, తర్వాత ఒళ్ళు జలదరించినట్లై ఒంట్లోకేదో ప్రవేశించినట్లై తర్వాత తనకేమి జరిగిందో తెలియకుండా పోయిందని చెప్పాడు. దయ్యాన్నొదిలించిన తర్వాత తన

ఒంట్లోంచి ఏదో బరువును తీసివేసినట్లై ఒల్లు తేలిక పడిందని చెప్పాడు. పెద్దక్కను హత్య జేసిన రంగయ్యను కోర్టులో విచారించి నాలుగైదు నెలల తర్వాత 5 సంవత్సరముల జైలు శిక్ష వేశారు. జైలు శిక్ష పూర్తై విడుదల అయిన తర్వాత కొద్దిరోజులకే అకాలంలోనే మంచాన పడి సరిగా చూసే వారు లేక నరకయాతన ననుభవిస్తూ, పెద్దక్కనే కలువరిస్తూ ఆఖరుకు మరణించాడు. మా వూరబ్బాయికి నిజంగానే దయ్యం పట్టిందా లేక అది కేవలం అతని భ్రమా యని ప్రశ్నించుకుంటే అతనిచ్చిన వివరాలను బట్టి, అతని అనుభవాన్ని బట్టి నిజమేమోననిపించకమానదు. 'దయలేని మనసే దయ్యం' అన్న అమ్మ వాక్యం గుర్తుకొస్తుందిక్కడ.

మా ఊర్లో నా చిన్నప్పు డొకామెను ప్రత్యేకించి చెప్పుకొనేవారు. నాకామెపేరిప్పుడు జ్ఞాపకం లేదుగానీ ఆమె వస్తున్నదంటే ఆమె ముందు ఎవరేమి తినడానికైనా భయపడేవారు. ఆమె వచ్చేదానికి ముందు ఏమైనా తింటూ యుండి యుంటే వెంటనే ఆ తినే పదార్థాన్నామె కంటబడకుండా దాచుకొనేవారు. ఆమె దృష్టి చాలా చెడ్డదనీ, తినే పదార్థంపై ఆమె దృష్టి పడిందంటే అది తిన్నవారికది అరుగదనీ, కడుపునొప్పి రావడమో, వాంతులుగానీ, విరోచనాలుగానీ అవడమో పరిపాటియని చెప్పుకొనేవారు. మా నాన్నగారు కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొన్నవారు స్వాతంత్ర్య సమరయోధులు. ఆయన మూఢనమ్మకాలను, ఆచారాలను వ్యతిరేకించేవారు. పైన చెప్పిన స్త్రీని గురించి విన్న మానాన్నగారు దయ్యం పట్టడమన్నా, దృష్టి సోకడమన్నా అపోహయనీ, ఏదైనా జరిగిందంటే అది వారి భయం వల్ల మాత్రమే జరిగి యుంటుందనీ ఆ విషయాన్ని కొట్టివేసేవారు. అప్పుడప్పుడామె మా యింటికి మజ్జిగ పోయించుకోవడానికొచ్చేది. ఒకరోజామె మజ్జిగ కొరకు మా యింటికి మధ్యాహ్నం పూట ఒంటిగంట సమయంలో వచ్చింది. ఆ సమయంలో మా నాన్నగారు భోజనము చేయుచుండగా అప్రయత్నంగానే ఆమె గమనించింది. మా నాన్నగారు దీనిని పట్టించుకోలేదు. మా అమ్మ ఆమెకు మజ్జిగ పోసి పంపించింది. ఆమె వెళ్లిన తర్వాత మానాన్నగారు భోజనం ముగించారు.

కొద్దిసేపు గడిచిన తర్వాత మానాన్నగారికి ఏదో వికారం మొదలై మరొక అరగంటలో కడుపులో త్రిప్పినట్లై తిన్నదంతా వాంతి చేసుకున్నారు. ఆయనకు కూడా ఆశ్చర్యమనిపించింది. మరి అందరూ అనుకున్నట్లు ఆమె దృష్టికంత చెడు శక్తియుండేదా? సర్వశక్తిమయి అయిన అమ్మపాదాల నాశ్రయించిన మన కేవిధమైన గాలీ, దృష్టీ సోకదన్నది మాత్రము నిజము.

ఇక అవతార పురుషులు, మహాత్ముల దృష్టి ఎలా ఉంటుందో సంక్షిప్తంగా వివరిస్తాను. వారి దెప్పుడూ అనుగ్రహ దృష్టే, దివ్యదృష్టే, కరుణ, దివ్య ప్రేమ జాలువారే దృష్టి. ఎవరో ఒక సోదరుడు అమ్మతో తాను మద్రాసులో ఉన్నప్పుడు తననెలా చూడగలదని ప్రశ్నించినప్పుడు 'నీవు నా ఎదురుగా యున్నప్పుడెలా చూస్తున్నానో మద్రాసులో మౌంటురోడ్డులో నడుస్తున్నా లేక ఎక్కడఉన్నా అలాగే చూడగలను' అని అమ్మ సమాధానమిచ్చినట్లు విన్నాను. దీనిని బట్టి అమ్మ తన బిడ్డలమైన మనల్ని నిరంతరమూ చూస్తూనే యుంటుందన్నది మనకర్థమవుతుంది. చాలా మందికిది అనుభవమయ్యేయుంటుంది. అమ్మ తనకు నివేదించడానికి అన్న పూర్ణాలయము నుండి తీసుకునివచ్చిన అన్నమూ, కూరలను భౌతికంగా తీసుకోకుండా తన చూపుల్తోనే గ్రహించేది. ఒక్కొక్కసారి ఒకటి రెండు మెతుకులు నోట్లో వేసుకునేది. అమ్మ సంకల్ప మాత్రం చేతనే ఎదైనా చేయగలరు, ఎవర్కెడఉన్నా వారర్థించిన సహాయాన్నీ ఏ రూపంలోనైనా అందించగలదు, అన్నపూర్ణగా వారి క్షుద్బాధనూ హరించగలదు.

శ్రీమాతారవిందుల అనుయాయులైన శ్రీ చంపక్‌లాల్‌గారు 1990 దశకం వరకూ శ్రీ అరవిందాశ్రమంలో పాండిచ్చేరిలో ఉండేవారు. వీరిని గురించి, నాకు వారొసగిన దర్శనాన్ని గురించి తర్వాతి అధ్యాయంలో వివరిస్తాను. అయితే యిక్కడ సందర్భానుసారంగా ఒక చిన్న సంఘటనను వివరిస్తాను. ఒకసారి వారు తన స్వంత రాష్ట్రమయిన గుజరాత్‌కు కొంతమంది శ్రీమాతారవిందుల భక్తుల ఆహ్వానంపై ఒక పట్టణానికి వెళ్లారు. వీరు ఎప్పుడూ మౌనంగా యుండేవారు. నిరాడంబరులు. ఎంతో అవసరమైతేనే గానీ

మాట్లాడేవారుకారు. వీరి నాహ్వానించిన వారు తమ భవనంలో అన్ని సౌకర్యములు గల ఒక గదిలో ఉంచారు. ఉదయంపూట బ్రెడ్, పాలు ఉపాహారంగా తీసుకునేవారు. మధ్యాహ్నము కూడా మితాహారమే భోజనంగా స్వీకరించేవారు. రాత్రికి ఒక కప్పు పాలు మాత్రము తీసుకొనేవారు. ఒకరోజు రాత్రి 7 గం॥ల సమయంలో వీరి గదిలోని టేబుల్‌పై వీరు తీసుకొనేందుకు ఒక గాజు గ్లాసులో పాలుంచారు. వీరు దానిని గమనించారుగానీ దానిని భౌతికంగా గ్రహించలేదు. ఇరవై నిమిషాల తర్వాత పాలు పెట్టి నాయన వచ్చి వీరిని పాలు గ్రహించలేదేమని అడిగితే గ్రహించానన్నారు. పెట్టిన పాలు పెట్టినట్లే యున్నా ఆయనెలా గ్రహించగలిగారో తనకర్థం కాలేదు. దానిని తీసుకెళ్ళమని చంపక్‌లాల్‌గారు సంజ్ఞచేయగా వారు దానిని ఆ గది నుండి వెలుపలకు తీసుకొని వచ్చి యోగులు ఏవిధంగానైనా గ్రహించగలరనుకొని ఆ గ్లాసులోయున్న పాలను అక్కడున్న శ్రీమాతారవిందుల భక్తులంతా తలా కొంచెము ప్రసాదంగా స్వీకరించారు.



46. శ్రీ చంపక్‌లాల్‌గారి దర్శన, స్పర్శల ననుగ్రహించిన అమ్మ

1926లో పుదుచ్చేరిలో శ్రీమాత ఆధ్వర్యంలో శ్రీ అరవిందాశ్రమం ఏర్పాటుగావడానికి ముందు నుంచే అంటే 1910 ప్రాంతం నుండీ శ్రీ అరవిందులను దర్శిస్తూ వారిననుసరించిన శిష్యుల్లో ముఖ్యంగా చెప్పుకోదగినవారు రాజంగం, తిరుపతి, భితీష్, నొలినీదా, సత్యేన్, కనాయ్, బిజయ్, పురాణి, నాగరత్నం, పూనమ్‌చంద్, చంపాబేన్, శ్రీమతి/శ్రీ కోదండరామన్, మోని, అమృత, మన్‌మోహన్ మరియు చంపక్‌లాల్. ఎంపీ పండిట్, నిరోద్‌బరన్ లాంటివారెందరో తర్వాత శిష్యులైనారు. చంపక్‌లాల్‌గారు 10 సంవత్సరముల వయసప్పుడే శ్రీ అరవిందులవారిపట్ల ఆకరిష్తులై 1910లోనే పుదుచ్చేరికి వచ్చి శ్రీ అరవిందుల వారికి సేవచేస్తూ శ్రీరాములవారికి హనుమంతుడెట్లో ఆవిధంగా తన్నుతాను సంపూర్ణంగా శ్రీ అరవిందుల వారికి అర్పితమైనవారు. తన చిన్నప్పట్నుండీ శ్రీ అరవిందులవారి బట్టలుతకడం వారి యితర అవసరాల కనుగుణంగా సేవ చేసేవారు. ఆయన తనలో ఉన్న 'నేను' అనేది పూర్తిగా లేకుండా పూర్తిగా నిరహంకారిగా యుండాలని మొదటి నుండీ ఆకాంక్షించేవారు, ప్రయత్నించేవారు. 1020లో శ్రీమాత పునరాగమనం తర్వాత 1926లో కొద్దిమంది శ్రీ అరవిందుల శిష్యులతో శ్రీ అరవిందాశ్రమాన్నేర్పరచింది. శ్రీ మాతారవిందులిరువురికీ చంపక్‌లాల్‌గారెంతో ప్రీతిపాత్రులు. శ్రీమాతయైతే చంపక్‌లాల్‌గారికి తన బిడ్డలలో, శ్రీ అరవిందుల శిష్యులలో సింహం లాంటివాడని బిరుదునిచ్చింది.

శ్రీ చంపక్‌లాల్‌గారు 1970 తర్వాత శ్రీ అరవిందులుండిన గదికి పైన యున్న యొక గదిలో యుండేవారు. ఒరిస్సా రాష్ట్రంలో శ్రీ అరవింద కేంద్రాలు చాలా వెలిసినవి. వాటిల్లో ఒక కేంద్రంలో శ్రీ అరవిందుల అవశేషాలను స్థాపించుటకై చంపక్‌లాల్‌గారిని ఆహ్వానించగా 1978వ

సంవత్సరం జనవరి 7వ తేదీ రాత్రి మద్రాసులో ఫస్ట్ క్లాస్ భోగీలో రైల్లో ఎక్కారు. ఆ రైలు తెనాలి, విజయవాడల మీదుగా వెళ్తుంది కాబట్టి, మొట్టమొదటిసారి వారిని దర్శించాలనే ఆకాంక్షవల్ల అమ్మను ప్రార్థించుకొని 8వ తేదీ తెల్లవారుజామున నేను మరో యిద్దరు సోదరులతో గుంటూరులో బయలుదేరి తెనాలి రైల్వే స్టేషనుకు ఉదయం గం. 5.10 ని.లకు చేరుకున్నాను. రైలు పేరు జ్ఞాపకం లేదు గానీ వారుండిన రైలు తెనాలి స్టేషన్‌కు సరిగ్గా ఉదయం గం. 5.20 ని.లకు వచ్చింది. ప్లాటుఫారం రద్దీగా యుండడం వల్ల, రెండేరెండు నిమిషాలు తెనాలిలో రైలాగడం వల్ల వారు ప్రయాణిస్తున్న రైలు పెట్టెను చేరుకోలేకపోయాము. విజయవాడలో రైలు 10 నిమిషాలు ఆగుతుందని తెలిసి వారిని కలిసి దర్శించవచ్చుననుకొని మేము కూడా కదులుతున్న రైలు నెక్కాము. సరిగ్గా ఆ రైలు విజయవాడకు చేరుకొనేటప్పటికి ఉదయం 6 గంటలయింది. రెండు మూడు నిముషాల్లోనే మేము వారున్న రైలుపెట్టెను చేరుకొని వారివద్దకు వెళ్ళి మమ్ము మేము పరిచయం చేసుకొని వారిని దర్శించాము. వారి ప్రథమ దర్శనం నాకెంతో అనుభూతిని ప్రసాదించింది. వారి మేను బంగారు వన్నెతో మెరయుచుండినది. వారు ధవళ వస్త్రములతో యుండి ఆయన ముఖం ప్రశాంతతతోను, ప్రకాశంతోనూ వెలుగుచుండగా ఆయన దృక్కులు ప్రసన్నంగా ప్రేమజాలువారుస్తూ యుండినవి. నేనాయన పాదాలను స్పృశించాలనుకున్నాను. వారితో ఉన్నవారు వారు తమ పాదాలను స్పృశింపనీయరని చెప్పడంతో ఆ ప్రయత్నం మానుకొని నేను నా మనసునందే వారి పాదాలను స్పృశించాను. రెండుమూడు నిమిషాలు అక్కడ గడిపి మిగతా వారికి ఆ అవకాశాన్ని కలుగజేయుటకై మేము రైలు దిగవలసి వచ్చింది. మరొక ఐదు నిమిషాల్లో రైలు తూర్పు దిశగా సాగిపోయింది. ఆ అనుభూతి నాకిప్పటికీ తాజాగానే యున్నది నేను వారిని చూసినప్పుడు సాక్షాత్తు శ్రీ అరవిందులవారినే చూసిన అనుభవము కలిగింది. అయితే వారిని స్పృశించలేకపోయాననే కొరత నా లోలోతుల్లో మిగిలిపోయింది.

1980లో వారొకసారి హైదరాబాద్ లోని "ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ స్టడీస్" అనబడే శ్రీ అరవిందాశ్రమ పద్ధతిలో అంటే సమగ్ర విద్యా విధానంలో

నడుపబడే విద్యాలయాని కరుదెంచారు. ఈ విద్యాలయం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమీపంలో జామై ఉస్మానియా రైల్వే స్టేషనుకు తూర్పు వైపున యున్నది. నేనప్పుడు హైదరాబాద్‌లోనే యుండి యుండుటచే నేనచ్చటకు వెళ్లి రెండవసారి వారిని దర్శించాను.

మేము నిమిత్తమాత్రులముగా మాచే 1990లో గుంటూరులో నిర్మించబడిన శ్రీ అరవింద భవనంలో 1991లో శ్రీ అరవిందాశ్రమం నుండి శ్రీ అరవిందుల అవశేషాలను తీసుకొనివచ్చి స్థాపించడానికి శ్రీ అరవిందాశ్రమం వారు అనుమతించారు. శ్రీ అరవిందుల అవశేషాలను గుంటూరుకు తీసుకు రావడానికి నేను, శ్రీ నరసింహారావుగారు వెళ్లవలసి రావడం మేము చేసుకున్న అదృష్టమనడంకన్నా శ్రీమాతారవిందుల కృప మరియు అమ్మ ఆలకించిన నా ప్రార్థన యంటే బాగుంటుంది. మేమిరువురమూ శ్రీ అరవిందుల అవశేషాలను గ్రహించి తీసుకురావడానికని శ్రీ అరవిందాశ్రమం, పాండిచ్చేరి వెళ్లాము. ఆశ్రమంలో మధ్యాహ్నం భోజన సమయమయిన తర్వాత శ్రీ అరవిందుల సమాధి చెంత మేము కొద్దిసేపు ధ్యానము చేసుకున్న తర్వాత మా కొరకై పిలుపురాగా మమ్మల్ని పిలిచిన వారి వెంట బయలుదేరి వారితో శ్రీఅరవిందులవారి గదికి పైన యుండిన శ్రీ చంపక్‌లాల్‌గారి గదికి వెళ్లాము. శ్రీఅదరవిందులవారి అవశేషాలను గ్రహించాలనే మిషతో శ్రీ చంపక్‌లాల్‌గారిని మరొకసారి దర్శించగలిగే అవకాశాన్ని కలిగించినందులకు మనస్సులో అమ్మకు ప్రణామములర్పించాను. శ్రీ చంపక్‌లాల్‌గారి గది తలుపు తెరువబడింది. వారొక మంచంపై కూర్చొని తన ప్రక్కనే శ్రీఅరవిందుల అవశేషాలు భద్రపరచిన చిన్నబాక్సును ఒక చిన్న వస్త్రములో కట్టియుంచి పెట్టుకొనియున్నారు. మేము వెళ్లగానే మావైపు ప్రసన్న దృక్కులతో చూశారు. మేము వారికి నమస్కరించితిమి. ఇక శ్రీఅరవిందుల అవశేషాలనుంచిన బాక్సును మా చేతుల్లో పెట్టేటప్పుడు నా మనస్సులో దాగియున్న ఆయనను స్పృశించాలనే ఆకాంక్ష పెల్లుబికింది. నేను మనస్సులోనే అమ్మను ప్రార్థించాను. ఆయన ఆ పెట్టెను మా చేతుల్లో పెట్టేటప్పుడు నా రెండు

చేతుల వ్రేళ్ళు ఆయన చేతుల వ్రేళ్ళను స్పృశించాయి. నాకు పరమానందమయింది. ఆయన స్పర్శ చాలా మృదువుగా యుండి ఆయన చేతి వ్రేళ్ళ నుండి నాలోనికేదో విద్యుత్తు ప్రవహించినట్లయినది. నాకేదో కొత్త శక్తి వచ్చినట్లైనది. శ్రీఅరవిందులను భౌతికంగా నేను దర్శించి స్పృశించలేకపోయినా శ్రీఅరవిందులకు ప్రీతిపాత్రుడై ఆయనకు జీవిత పర్యంతమూ సేవ చేసిన శ్రీ చంపక్‌లాల్‌గారిని స్పృశించగలగడం అమ్మ మరియు శ్రీ మాతల అనుగ్రహంగా నేను భావిస్తున్నాను. ఆ రోజు సాయంత్రానికి మద్రాసు చేరుకొని మరురోజు ఉదయానికి మేము గుంటూరు చేరుకోగానే ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న ప్రాంతాల నుండి వచ్చి మా కొరకే ఎదురుచూస్తూ యుండిన వారంతా మేము తీసుకువచ్చిన అవశేషాలను మేళతాళాలతో ఊరేగింపుగా గుంటూరు జిల్లా పరిషత్ ఆవరణలోని శ్రీ అరవిందభవన్ వరకు తీసుకువెళ్లారు. ఆ రోజంతా వాటిని గుంటూరు ప్రజల సందర్శనార్థమై యుంచి మరురోజు ఉదయము 10 గంటలకు శ్రీఅరవింద భవనమునందు ప్రత్యేకంగా నిర్మించిన మందిరమందు యోగివర్యులు శ్రీ చెలసాని నాగేశ్వరరావుగారి స్వహస్తాలతో స్థాపించడం జరిగింది. ఆరోజంతా భవన్‌లో ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగినవి.

1995లోనో లేక 1996లోనో సరిగా జ్ఞాపకం లేదుగానీ నాకొక రోజు స్వప్నంలో శ్రీ చంపక్‌లాల్‌గారు పాండిచ్చేరి ఆశ్రమాన్నుండి తమ సొంత రాష్ట్రమయిన గుజరాత్‌కు వెళ్లినట్లూ, శ్రీఅరవిందాశ్రమానికి తిరిగి రాకుండా వారక్కడనే స్థిరపడి దివ్యమైన వెలుగులను ప్రపంచం నలుమూలలకూ వ్యాప్తిచేయుచున్నట్లూ కనబడినది. ఈ స్వప్న మొచ్చిన కొన్నాళ్ళకు నాకు తెలిసినదేమంటే నాకు స్వప్నములో కనిపించినట్లుగానే వారు గుజరాత్‌కు వెళ్లి తమ స్వగ్రామంలో పరమపదించినట్లూ వారి కక్కడే సమాధిని నిర్మించినట్లూ, ఎంతోమందిని వారు తన సమాధి నుండి కూడా ప్రభావితులను గావిస్తున్నట్లూ తెలిసినది. శ్రీఅరవిందులవారు చెప్పిన అతి మానస వెలుగులను నేనాయనయందు ప్రత్యక్షంగా చూడగలిగా ననిపిస్తుంటుంది నాకు.

47. మరణానుభూతి

1986వ సంవత్సరం ఆగస్టు నెలలో ఒకరోజు రాత్రి నాకో స్వప్నమొచ్చింది. అందులో మా గ్రామంలో మాయింటికి సమీపానఉన్న నాలుగువీధుల కూడలిలో నేను నడుస్తుండగా ఉన్నట్లుండి పడిపోయాను. ఒక్కనిమిషం నాకేమైందో నాకు తెలియలేదు. ఉన్నట్లుండి నేను నా శరీరాన్నుండి విడివడి నా శరీరానికి మూడు నాలుగడుగుల ఎత్తులో సూక్ష్మ శరీరంతో గాలిలో తేలుతూ యుండడం గమనించాను. నా భౌతిక శరీరమలాగే నేలపై కట్టెలా పడియున్నది. నా శరీరం చుట్టూ జనం మూగసాగారు. నేను చనిపోయానని వారనుకుంటూ ఆశ్చర్యపోతున్నారు. వారనుకునే మాటలూ, మనస్సుల్లోని భావాలూ నాకు తెలుస్తూనేయున్నా సూక్ష్మశరీరంలో యుండి నేను పిలిచే పిలుపులుగానీ, నేను మాట్లాడే మాటలుగానీ వారికి వినబడుట లేదు. నా సూక్ష్మశరీరం వారికగుపించుటలేదు. నా సూక్ష్మశరీరం క్షణంలో ఎంత దూరమైనా, ఎక్కడికైనా పోగల స్థితిలో యున్నది. అయితే నా మాటలుగానీ, నా భావాలుగానీ సామాన్యులెవరికీ అర్థం కావడం లేదనీ, ఆ పని చేయడం నాకు కూడా సాధ్యం కాదనీ అర్థం చేసుకున్నాను. అలాగే శరీరంలోఉన్న చైతన్యం లేక ఆత్మ శరీరాన్నొదిలి పెట్టడమే మరణమని భావిస్తారని నాకప్పుడర్థమయింది. మరణమన్నది నేనూహించి యుండిన దానివలె భయంకరమో లేక బాధాకరమో కాదని అనుభవపూర్వకముగా అర్థమయినది. ఉన్నట్లుండి నా సూక్ష్మశరీరం శవం వలె పడియున్న నా స్థూల శరీరంలోకి ప్రవేశించగా నేను లేచి కూర్చొని తర్వాత నిలబడ్డాను. నా సూక్ష్మ శరీరం నా స్థూల శరీరంలో ప్రవేశించేటప్పుడు ఏదో యొక చీకటి సొరంగం గుండా బలవంతంగా నా హృదయంలోకి ప్రవేశపెట్టబడిన అనుభూతి కలిగింది. చనిపోయాననుకున్న నేను లేచి నిలబడగానే అక్కడ గుమిగూడి యున్న వారంతా ఆశ్చర్యచకితులై నేను బ్రతికినందులకు ఆనందించారు.

పై స్వప్నానుభూతివల్ల 'నేను యీ శరీరంలో ఉన్నాను గానీ శరీరం మాత్రమే నేనుగాననీ; నేను నాదనుకొనే యీ శరీరం అశాశ్వతమనీ, ఈ శరీరంలో దాగియున్న చైతన్యజ్యోతి స్వరూపమే అసలైన నేను'అన్న సత్యం నాకు బోధపడింది. అయితే యీ సత్యం సర్వత్రా నా ఎరుకలోయుండి ఆ జ్యోతి స్వరూపమే నేనుగా యుండే తరుణమింకా రాలేదు. నేను చేస్తున్నాననుకునే ప్రయత్నమయితే ఆగదు. ఇక్కడ పెద్దల ద్వారా నేను విన్న మరొక విషయం మేమంటే భౌతిక శరీరాన్నొదిలి సూక్ష్మ శరీరంలో ప్రవేశించినట్లే, సూక్ష్మ శరీరాన్నొదిలి ఆత్మ కారణశరీరంలో ప్రవేశిస్తుందనీ, ఆ తదుపరి దాన్ని కూడా వదలి సంస్కారాలను బట్టి ఉన్నత లోకాలలో కొంత కాలం గడిపి చైత్య లోకంలో మరికొంత కాలం విశ్రాంతి తీసుకుని పరిణామక్రమంలో మరింత పురోగమించడానికై తనకనువైన గర్భం ద్వారా తిరిగి జన్మిస్తుందని.

అమ్మ 'మరుపే మరణం' అన్నది. ఆ మరుపన్నది దేనిని గురించి యని విశ్లేషిస్తే తన్ను తాను మరిస్తే లేక 'నేను' 'నేన'న్న ఎరుకను మరిస్తే లేక ఆద్యంతములు లేనిదీ, అన్నీ తానై అన్నిటికీ ఆధారమైయుండి మనలోనే యున్న 'అమ్మ'ను లేక 'దైవాన్ని' లేక 'నేను' ను మరిస్తే అదే మరణమన్నమాట. దీనినిబట్టి మనమెన్నిసార్లు ఆ ఎరుకను కోల్పోతున్నామో అన్నిసార్లూ మరణిస్తున్నట్లే. ఎరుక గలిగిన ప్రతిసారీ జన్మిస్తున్నట్లే. ఈ విధంగా మనకు నిరంతరం జననమరణాలున్నవి. అమ్మను మరచినప్పుడల్లా మరణిస్తున్నాం, అమ్మ ఎఱుకలో యున్నంత కాలం జీవిస్తున్నాం. జననమరణాలు అమ్మకయితే లేవు. ఎందుకంటే అమ్మ ఎల్లప్పుడూ సర్వముతో, విశ్వంతో ఏకాత్మభావన కలిగియున్నది గనుక.



48. శ్రాద్ధభోజనం

1987వ సంవత్సరం మే నెలలో ఆ నెలలోనే మా మామగారి సాంవత్సరీకం యుండడం వల్ల నాకొక సందేహమొచ్చింది. అదేమిటంటే 'ప్రతీ సంవత్సరం పితరులకు సాంవత్సరీకాలు లేక తద్దినాలు జరిపించడం ద్వారా, పుష్కరాల సమయాల్లో వారికి పిండ ప్రదానాలు చేయడం వల్ల, మహాలయామావాస్య రోజున పితరుల పేరున అన్నదానాది కార్యక్రమాలు జరపడంవల్ల నిజంగానే పితరుల ఆత్మలకు శాంతిని చేకూర్చగలమా? లేక యివన్నీ మూఢాచారాలా?' యన్నది. ఇలా సందేహమొచ్చిన మూడు నాలుగు రోజుల తర్వాత నాకొకరోజు రాత్రి స్వప్నంలో మా మామగారి సాంవత్సరీకం జరుగుచున్నట్లు, అన్నవితరణ సమయంలో రెండు మూడు వరుసల్లో చాలా మంది పితరులు ప్రస్తుతం జీవించియున్న బంధువులు, స్నేహితులతో కలిసి భోజనానికి కూర్చున్నారు. ఒక వరుసలో నేను మా మామగారి ప్రక్కన కూర్చొని యున్నాను. అందరిముందూ విస్తర్లు వేసి భోజన పదార్థాలన్నీ వడ్డించి యున్నారు. అందరూ తినడానికి సిద్ధమగుచుండిన సమయంలో నాకో సందేం కలిగింది. చనిపోయిన మా మామగారు తన శరీరంతో నా ప్రక్కనే కూర్చొని యున్నారు గదా మరి వారి శరీరం స్థూలంగా నా స్పర్శకు అందితే అప్పుడు నిజంగా వడ్డించిన పదార్థాలను వారు స్వీకరించగలరనే నిర్ధారణకు రావచ్చనే ఉద్దేశంతో నేను నావరుస నుండి లేచి మా మామగారి పాదాలను వందనపూర్వకంగా స్పృశించాను. అప్పుడాయన పాదాల స్పర్శ స్థూలంగా నా చేతులకు తగిలింది. అప్పుడు నేను వారు తప్పక వడ్డించి యుండిన పదార్థాలను తప్పక గ్రహించగలరనే నిర్ధారణకు వచ్చి నేనాయన ప్రక్కన యింతకు క్రితంలాగే కూర్చున్నాను. ఆ స్వప్నమంతటితో ఆగిపోయింది. ఈ స్వప్నాన్నిబట్టి ఆయన సాంవత్సరీకంరోజున ఆయనను తలచుకునే తలపులుగానీ, ఆయనకు జరిపే సంతర్పణలుగానీ ఆయనకు తప్పక చేరగలవనీ, ఆయన పేరున జరిపే దానధర్మాది కార్యక్రమాలుగానీ, ప్రార్థనలుగానీ ఆయన ఆత్మకెంతో సంతృప్తినివ్వగలవనీ ఒక నిర్ధారణకు

వచ్చాను. ఈ విషయంలో శాస్త్రాలేమి చెప్పుచున్నవో, అమ్మ ఏమి చెప్పిందో నాకు తెలియదు. కేవలం నా అనుభవం లేక అనుభూతిని యిక్కడ వ్రాయడం జరిగింది. శ్రాద్ధభోజనాన్ని గురించి నా జీవితంలో జరిగిన యొక సంఘటనను గురించి క్రింద వివరిస్తున్నాను.

ఏదో తెలియని సంకోచంవల్ల, భయంవల్ల సాధారణంగా నేను కర్మకాండలకుగానీ, శ్రాద్ధభోజనాలకు గానీ హాజరయ్యేవాడిని కాను. ఒకవేళ తప్పనిసరై వెళ్ళవలసి వచ్చినా అయిష్టంగానే పాల్గొనేవాడిని. 1990 ఏప్రిల్ మాసంలో ఒక రోజు నేను, శ్రీ నర్రా నరసింహారావుగారు ఇరువురమూ ప్రతీరోజులాగానే శ్రీ అరవింద భవన నిర్మాణార్థమై విరాళాలు సేకరించడానికి ఉదయం 10 గం॥ల ప్రాంతంలో బయలుదేరాము. గుంటూరు లాలాపేట ప్రాంతంలో, తర్వాత పూలకొట్ల దగ్గరి ప్రాంతంలో తిరుగుతూ వ్యాపారస్థులను కలిసి విరాళాలు సేకరిస్తున్నాము. బాగా ఎండగా యుండినది. మధ్యాహ్నం గం. 1.30ని.లయ్యే సరికి మాకు బాగా ఆకలిగా యుండినది. దప్పికగా కూడా యుండినది. అయినప్పటికీ బంగారు కొట్లు యున్న ప్రాంతం కూడా తిరిగి వెళ్లిపోదామనుకొని ఒక వీధిలోకి ప్రవేశించి కొన్ని యిళ్లుదాటాము. అక్కడ ఒక యింటి గుమ్మం దగ్గర ఎవరికోసమో నిరీక్షిస్తున్న వైశ్యులిద్దరు మా కొరకే ఎదురుచూస్తున్నారా యన్నట్లు మమ్మల్నాపి వారింటిలోకి ఆహ్వానించారు. మాకు అర్థం కాక మేమెవరయినదీ, మేమొచ్చిన పనినీ వారికి తెలిపాము. కానీ వారు ఆ రోజు వారి తండ్రి ఆబ్దికమనీ, యింట్లో పూజాదిక కార్యక్రమాలు పూర్తయి ముందుగా యిద్దరు సద్బ్రాహ్మణులకు భోజనం పెట్టి తాము భుజించాలని ఎదురుచూస్తున్నామనీ, తాము పిలిచినవారు రాలేదనీ, కాలాతీతమగుచుండుట వలన మమ్మల్నే సద్బ్రాహ్మణులుగా తలపోస్తున్నామనీ, భోక్తలుగా మమ్మల్ని విచ్చేయమనీ, అలాచేస్తే తామెంతో ఆనందించగలమనీ వేడుకున్నారు. నరసింహారావుగారు దీనిని తాను అమ్మ ఆదేశంగా భావిస్తున్నాననీ, అమ్మ పనిలోనే యున్న మనము అమ్మ ఆదేశంగానే దీనిని స్వీకరించి భోజనం చేసి వారి కోరికను మన్నిద్దామని చెప్పారు. నేను మనసునందే అమ్మను తలంచుకొని సకారాత్మక

ప్రేరణ కలుగడం వల్ల వారి కోరిక మేరకు ఆ వైశ్యుల తండ్రికి ఉన్నతగతులు ప్రాప్తించాలని ప్రార్థించి వారింట్లో భోజనం చేశాము. తృప్తి చెందిన ఆ వైశ్యసోదరులు మాకు తమ కృతజ్ఞతలను తెలియజేసి శ్రీఅరవింద సొసైటీకి కొంత విరాళాన్ని కూడా యిచ్చి పంపించారు. దైవ కార్యంలో పాల్గొనేటప్పుడు ఎప్పుడెలాంటి సన్నివేశాలెదురౌతాయో మనకు తెలియదు. ఆరోజు శ్రాద్ధ భోజనం చేయించడం ద్వారా సమయానికి మా క్షుద్బాధహరించేటట్లు చేయడం, వైశ్యుల అభీష్టాన్ని నెరవేర్చడం, శ్రీ అరవిందభవన నిర్మాణానికై విరాళాన్ని సేకరించడం అన్న మూడు కార్యాలొకేసారి జరగడమన్నది అమ్మ సంకల్పమేనని భావిస్తున్నాను.



49. బాధలు లేకపోతే బ్రతకడం అనవసరం

అప్పుడప్పుడూ ఎవరైనా తమ బాధల్ని అమ్మకు వివరించినప్పుడు అమ్మ వారితో 'బాధలు లేకపోతే బ్రతకడం అనవసరం' అనో 'బాధలే చైతన్యానికి మూలం' అనో అనడం మనం విని ఉంటాము. తన ఏకైక కుమారుడు చనిపోగా ఒక మహిళ బాధతో గౌతమబుద్ధుని దగ్గరకు వెళ్ళి తనకుమారుని ఎలాగైనా బ్రతికించమని వేడుకొనగా ఆ మహిళను ఏ దుఃఖములేని ఎవరి ఇంటినుండైనా ఒక పిడికెడు ఆవాలు తెస్తే బ్రతికిస్తానంటాడు. ఆ ప్రయత్నం చేసి విఫలమైన ఆ మహిళ గౌతమబుద్ధుని ఆంతర్యాన్ని, సత్యాన్ని గ్రహించగలుగుతుంది. 'బాధలు లేకపోతే బ్రతకడం అనవసరం' అన్న అమ్మ వాక్యంలో దాగియున్న సత్యమూ అదే. బాధలు లేని మనిషి యుండడు. కానీ వాటి నెదుర్కొనే దృక్పథంలో, విధానంలో తేడా యుంటుంది. అందుకనే అమ్మ 'నవ్వుతూ అనుభవించే వాడి దగ్గరకు ఏడుస్తూ అనుభవించేవాడు సలహాకొస్తాడు' అన్నది. శారీరక లేక మానసిక బాధల మూలాల్లోకి మనం వెళ్ళగలిగి పరిశీలిస్తే వాటికి కారణమేదో, వాటినెలా అధిగమించాలో మనకు బోధపడుతుంది. ఒక్కొక్కసారి బాధలు కూడా మనకు బ్రతుకుదారిలో పురోగమనానికి దారితీయగలవు. నీటిలోకి దూకకుండా ఎప్పుడూ ఒడ్డునే యుండే వాడెలా ఈత నేర్చుకోలేడో ఎప్పుడూ సుఖాల్లోనే యుండే వాడు దుఃఖాల నెదుర్కోలేడు. రాత్రీపగలూ, చీకటీ వెలుగూ ఎలా ఉంటాయో మనిషన్న ప్రతివానికీ సుఖదుఃఖాలు రెండూ ఉంటాయి. అమ్మ చెప్పేదేమంటే బాధల్ని కావాలని కోరుకోకూడదుగానీ, అవి ఎదురైనప్పుడు మాత్రము కలత చెందకుండా, క్రుంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కోమని ఈ విషయం ఒక్క వ్యక్తులకు మాత్రమే గాదు, సంస్థలకు కూడా వర్తిస్తుంది. ఉదాహరణకు మన విశ్వజననీ పరిషత్తునే తీసుకోకుంటే, ఎల్లప్పుడూ, ఏ యిబ్బందీ లేకుండానే అది నిర్వహింపబడుచున్నదా? ఒక్కొక్కసారి మనకు కలిగేబాధ మన జీవనసరళినే మార్చవచ్చు. కనుక మనమెల్లప్పుడూ సకారాత్మకంగానే ఆలోచించాలి. ఇక్కడ మరొక విషయమేమంటే అమ్మ

నా(శయించిన వారి బాధలను అమ్మ తొలగించనయినా తొలగించేది, లేక వారి అభ్యున్నతి కవి అవసరమనుకుంటే వాటిని భరించే శక్తినైనా అమ్మ వారికి (ప్రసాదించేది.

ఇక బాధలన్నవి మనకంటే ఎక్కువ అవతారపురుషులకూ, మహాత్ములకే ఎదురౌతాయి. శ్రీరామచంద్రుడు అంతెందుకు మనం ప్రత్యక్షంగా చూచిన అమ్మ పడిన లేక ఎదుర్కొన్న బాధలు, కష్టాలు మానవ మాత్రు లెవ్వరూ పడియుండరంటే అతిశయోక్తికాదు. అందుకే వారు మనకు ఆదర్శంగా నిలిచి మనకు మార్గదర్శకులౌతున్నారు. ఇక్కడ మరొక ఉదాహరణనిస్తే బాగుంటుందనుకుంటున్నాను.

స్వాతంత్ర్యసమరం జరిగేటప్పుడు 'వందేమాతరం', 'కర్మయోగి' వంటి పత్రికలను నడిపి భారతదేశపు అప్పటి యువతలో తమ ప్రాణాలనొడ్డియైనా భరతమాతకు స్వాతంత్ర్యాన్ని సముపార్జించాలనే ఆకాంక్షను, పోరాట దీక్షను రగిలించిన శ్రీ అరవిందులను ఒకసారి ఒక బాంబు కేసులో ఆలీపూర్ జైల్లో నిర్బంధించారు. అప్పుడు దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడే తనను జైల్లో బంధించడమేమిటని తన హృదయమందు కలతజెంది భగవంతుని ప్రశ్నిస్తాడు. అప్పుడాయనకు ఆజైలు నందే శ్రీకృష్ణుడు సాక్షాత్కరించి, భగవద్గీతను ప్రసాదించి భారతదేశానికి స్వాతంత్ర్యం తప్పక సిద్ధించగలదనీ, ఆ కార్యాన్ని నెరవేర్చడానికి ఇతరులను (మహాత్మాగాంధి, వల్లభాయ్‌పటేల్ లాంటివారు) ఎన్నుకున్నాననీ, అంతకంటే ముఖ్యమైన దైవకార్యాన్ని ఆయన (శ్రీఅరవిందులు) నెరవేర్చాల్సియుందనీ చెప్పి అంతర్ధానమౌతాడు. జైలు నుండి నిర్దోషిగా విడుదలైన వెంటనే భగవదాదేశం మేరకు శ్రీఅరవిందులు పాండిచ్చేరి వెళ్ళి మహాయోగిగా, మహర్షిగా మారడం, శ్రీమాత ఆధ్వర్యంలో శ్రీఅరవింద ఆశ్రమం స్థాపించడం, ఎందరో సాధకులకు పూర్ణయోగాన్ని ప్రసాదించడం, అపరవ్యాసుల వలె గీతావ్యాసములు, దివ్య జీవనం, యోగ సమన్వయం, సావిత్రి మహాకావ్యం లాంటి ఉద్గ్రంధాల నెన్నింటినో మానవాళి కందించడమేగాక మానవుడు దివ్యమానవుడుగా తీర్చిదిద్దబడడానికవసరమైన

పునాదిని నిర్మించారు. వీరికి శ్రీమాత చేయూతనిచ్చి ఆశ్రమాన్నెంతో అభివృద్ధిపరచడమేగాక ఈ భూమి పై జాతి, కుల, మత, దేశాలకతీతంగా అందరూ సమానంగా ఆధ్యాత్మికంగానూ భౌతికంగానూ ఎదిగి శ్రీ అరవిందులు దర్శించిన దివ్యమానవులుగా ఆవిర్భవించడానికనువైన ఒక నగరం ఉండాలని సంకల్పించి తదనుగుణంగా 1968లో అరోవిల్ నగరానికి శంకుస్థాపన గావించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో యునెస్కోద్వారా 123 దేశాల నుండి మట్టిని తీసుకువచ్చి ఆరోవిల్‌లో నిక్షిప్తం చేశారు. అరోవిల్, అచ్చటి శ్రీమాతృమందిర్ దినదినాభివృద్ధి గాంచుచున్నవి. చాలావరకు అక్కడ జరిగే కార్యక్రమాలే యిక్కడ మన జిల్లెళ్ళమూడిలోనూ అమ్మసంకల్పంతో జరుగుతూయుండడం ఆశ్చర్యకరం. మానవోన్నతికీ, విశ్వసౌభ్రాతృత్వానికీ తనవైన పద్ధతుల్లో శ్రీమాతగానీ, జిల్లెళ్ళ మూడి అమ్మగానీ వేసిన బీజాలు నెమ్మదిగా అంకురించి శాఖోపశాఖలుగా దినదినాభివృద్ధి గాంచుతూ యుండడం ముదావహం. మానవాళి శ్రేయస్సుకై వారు పడిన బాధలు, కష్టాలు మానవమాత్రులెవరు పడగలరు?



50. ఒక దొంగ స్వామీజీ నుండి అమ్మ నన్ను కాపాడిన తీరు

1989లో భీమవరంలో ఆంధ్రాబ్యాంకులో పని చేస్తున్న నా తమ్ముడు బెల్లంకొండ రాజశేఖర్ వికాస్‌నగర్, గుంటూరులో ఉన్న మా స్వగృహానికి వచ్చినప్పుడు తనతోపాటు కొద్దిమంది తన స్నేహితులనూ, విశ్వనాథం అనే పేరు గలిగి కాషాయపు సిల్కుబట్టలు ధరించిన ఒక దొంగ స్వామీజీనీ తీసుకువచ్చాడు. ఆ స్వామీజీ తను దత్తాత్రేయస్వామి అవతారాన్నని ఏవేవో మాయమాటలు చెప్పి, కొన్ని చిన్న చిన్న మ్యాజిక్కులతో తనవెంట యున్నవారిని నమ్మించియున్నాడు. నా తమ్ముడు కూడా తన స్నేహితుల్లాగే ఆయన్ని నమ్మియుండడం చేత వారంతా కలిసి శ్రీశైలం వెళ్లే మార్గమధ్యంలో గుంటూరుకు వచ్చి గుంటూరులో ఒకటి రెండు రోజులుండే ఉద్దేశ్యంతో ఎవరింటికి వెళ్లాలో తెలియని పరిస్థితుల్లో వారందరినీ మా తమ్ముడు మా యింటికి తీసుకువచ్చాడు. రెండ్రోజులు మాయింట్లో యున్నారు. నా తమ్ముని స్నేహితులు చెప్పిన మాటలను బట్టి ఆ స్వామీజీని నేను విశ్వసించకపోయినా మా తమ్ముడు తీసుకురావడం వల్ల ఆయనను ఆదరంగానే చూశాను. ఎవరో స్వామీజీ మాయింటికి వచ్చారన్నవార్త తెలిసి ఆదిపూడి మోహనరావుగారి అనుయాయులైన కొందరు శిరిడీసాయిబాబా భక్తులు ఆయనను చూడ్డానికి మాయింటికొచ్చారు. వారంతా ఆయన మాటల కాకర్షించబడి గుంటూరులో ఆయన ఎక్కడకు వెళ్లినా ఆయనను అనుసరించడం మొదలుపెట్టారు. మేము గుంటూరులో శ్రీ అరవింద కేంద్రాన్ని నిర్వహించడం తెలుసుకొని ఆయన తన ప్రచారమును గావించుకొనే ఉద్దేశ్యంతో ఒకరోజు అరవింద కేంద్ర భవనమునందు ఒక శాంతి యజ్ఞాన్ని నిర్వహిస్తున్నానని చెప్పి తన అనుయాయుల ద్వారా ప్రచారం గావించి యజ్ఞాన్ని నిర్వహించాడు. అచ్చటి హోమ గుండంలో శ్రీ దత్తుని పాదుకలు వెలిసాయని కొందరికి హోమ గుండంలోని బూడిదను పాదాల

ఆకృతిలో చూపించి నమ్మించి వారితో ఆ ప్రచారాన్ని గావించుకున్నాడు. శంకర్ విలాస్ హోటల్ గదిలో మరురోజు మీడియా వారిని కూడా పలిపించుకొని వారికి యింటర్వ్యూ యిచ్చాడు. అప్పుడతడు మోసపూరితంగా వ్యవహరిస్తున్నాడనిపించి నా హృదయంలో ఏదో అశాంతి మొదలయింది. అతని మాటలు, చేతల పట్ల నమ్మకం కుదరడం లేదు. కేవలం నా పరిచయస్తులను తనకు పావులుగా వినియోగించుకుంటున్నట్లు సందేహం కలిగింది. అయితే అంత సులువుగా అతను నన్ను వదలేటట్టు కనిపించలేదు. అంతట నేనొకరోజు అతనేమిటో నాకు తెలియజేసి నా సందేహాన్ని తీర్చి, నా సందేహము నిజమయితే అతనిని నాకు దూరం చేయవలసిందిగా అమ్మను ప్రార్థించాను. ఆ రోజు రాత్రి స్వప్నంలో ఒక ఆవరణలో పూజా కార్యక్రమమేదో అతడు నిర్వహిస్తున్నాడు. నేనతని ప్రక్కనే నిలబడి యున్నాను. అతను చేసే దానిలో నాకు చిత్తశుద్ధి కనిపించలేదు. అతను నా వైపు తిరిగి తన కధీనుడను కావాలని కోరాడు. అప్పుడు నేనతనితో తనలో సత్యమున్నచో నా కన్నుల్లోకి సూటిగా చూడమన్నాను. నేను అమ్మను మనసులో తలచుకొని అతని కన్నుల్లోకి సూటిగా చూస్తూ తనను కూడా చూడమన్నాను. కన్నులార్పకుండా చూసే నా చూపుల తీక్షణత, తేజస్సులను అతడు ఎక్కువసేపు భరించలేక తన ఓటమి నొప్పుకొన్నట్లు అక్కడి నుండి నిష్క్రమించాడు. స్వప్నమంతటితో ఆగిపోయింది. అంతే! ఆ స్వప్నమొచ్చినది మొదలు అతను తిరిగి మరెప్పుడూ నా దగ్గరకు రాలేదు. ఆదిపూడి మోహనరావుగారి అనుయాయులు, శిరిడీసాయి భక్తులకు నేను సూచించిన పిమ్మట వారతన్ని అనుసరించడం మానుకున్నారు. నా తమ్ముడు కూడా అతని దగ్గరకెళ్ళడం మానుకున్నాడు. తర్వాత కొన్నాళ్ళకు నాకు తెలిసిందేమిటంటే అతను తన అనుయాయుల అమ్మాయిలను శ్రీశైలం తీసుకువెళ్ళి వారితో అచ్చట అసభ్యంగా ప్రవర్తించాడనీ, అతని నైజమేమిటో బయటపడిందనీ, కొంతకాలం తర్వాత మద్రాసు వెళ్ళి రాజకీయ నాయకులు కొందరిని వంచించాడనీ, ఆఖరుకు జైలుపాలయ్యాడనీ. అమ్మ యీ విధంగా ఆ దొంగ స్వామీజీ నుండి నన్ను కాపాడింది.

51. అమ్మ తత్త్వము

సర్వసమ్మతమైనదే అమ్మ మతము, అమ్మ తత్త్వము, అక్షర సత్యమే సత్య తత్త్వమే. అమ్మ తత్త్వము. సర్వమతాలకు చెందిన సిద్ధాంతాలూ ఎక్కడో యొకచోట అమ్మతత్త్వంతో ఏకీభవించక మానవు. అమ్మ చెప్పిన అక్షర దీపాలు నిప్పులాంటి నిజాలుగా నిలకడమీదగానీ మనకు అనుభవానికి రావు. అందుకే అమ్మ 'అనుభవము శాస్త్రాన్నిస్తుంది. శాస్త్రము అనుభవాన్నివ్వదు' అన్నది.

గోచరమైనట్లు ఉంటూనే అగోచరంగా ఉండేదే అమ్మ తత్త్వము. మరుగే నా విధానమని అమ్మే అన్నది గదా! సగుణ, నిర్గుణ తత్త్వాలు రెండూ తానేయై, రెండింటికీ అతీతంగా కూడా యుండేదే అమ్మ తత్త్వము అదే ఆది తత్త్వము, ఆద్యంతరహిత తత్త్వము. అది కేవలము అనుభవైకవేద్యమే గానీ దాని నిదియదియని తర్క బుద్ధితో యోచించలేము. ఆ అనుభవమైనా అమ్మ తన అవ్యాజానుగ్రహము వల్ల ప్రసాదిస్తేనేగానీ కలుగదు. అది మరొక విధంగా సాధ్యపడదు. 'చేతలు చేతుల్లో లేవని' అమ్మ అన్నదాని కర్థమిదే.

అమ్మ తత్త్వము కృష్ణతత్త్వమా, దత్త తత్త్వమా, మరే తత్త్వము? అన్ని తత్త్వాలూ తానేయై అన్నిటినీ తనలోనే యిముడ్చుకున్న పూర్ణతత్త్వమే అమ్మ తత్త్వమంటే బాగుంటుంది. అందుకే అమ్మ తత్త్వాన్ని మరే తత్త్వంతో పోల్చలేము. మాతృతత్త్వమే అమ్మ తత్త్వము. అమ్మ తత్త్వమే మాతృ తత్త్వము. శ్రీలలితా సహస్ర నామాలన్నీ అమ్మ తత్త్వాన్ని తెలియజేసేవే. ఏ నామం చేసినా, ఏ రూపాన్ని కొలిచినా తనకే చెందుతుందని అమ్మే అన్నది గదా! దేశకాలమానాలకతీతమైన అమ్మ ఏ ఒక్క నామానికో, ఏ ఒక్క రూపానికో పరిమితమైనట్లు కనపడదు. ఒక్కొక్కసారి మనకు అవగతమైనట్లే యుండి అవగతము కాదు. హృదయమందేదో అమ్మను తెలుసుకున్న తృప్తీ, ఆనందమూ ఉన్నా మాటల్లో చెప్పమంటే చెప్పలేని స్థితి అమ్మదగ్గరకు వచ్చే సోదరీ సోదరుల కందరకూ అనుభవమే. అంతేగాక అదృశ్యంగా ఉండి అందర్నీ అన్నింటినీ నడిపించే దివ్యశక్తి స్వరూపిణిగా గోచరిస్తుంది. అందుకే

తోచినట్లు చేయండి, తోసింపజేసేవాడు వాడేగదా' అంటుంది అమ్మ యిక్కడ కూడా తనను తాను మరుగుపరచుకుంటూ.

సృష్టిస్థితిలయకారిణిగా, ఆద్యంతరహితగా, ఆది పరాశక్తిగా, సర్వమూ తానై సర్వానికీ అతీతమైన సచ్చిదానంద స్వరూపిణిగా ఉంటూ సర్వలోకాలనూ సృజిస్తూ, స్థిరీకరిస్తూ తనలోనే తిరిగి లయింప జేసుకొనే కాల స్వరూపిణిగా, సమస్త విశ్వాలనూ గోళాలుగా జేసి బంతులాడినట్లు క్రీడించే లీలా వినోదినిగా అమ్మ కనిపిస్తుంది. అందువల్లనే అమ్మ 'సృష్టి నాది అనాది' అని అన్న దనిపిస్తుంది. అమ్మ ఒకే సమయంలో వ్యక్తిగతచేతనగా, విశ్వగత చేతనగా మరియు విశ్వాతీత చేతనగా కూడా ఉంటుంది. సత్య లేక ఋత చేతనగా యుంటూ మానవుడు మాధవుడుగా మారే విశ్వ పరిణామక్రమంలో ఆధారభూతముగా ఉంటూ అన్నిటినీ, అందరినీ నడిపిస్తున్న దనిపిస్తుంది. అందువల్లనే అమ్మ అందరికీ సుగతేనని వాగ్దానం చేసింది అనసూయగా, రాజరాజేశ్వరిగా, పరాత్పరిగా, పరమేశ్వరిగా మనందరి హృదయాంతరంగిణియై మనల్ని ఉద్ధరిస్తున్నది. దుష్టశిక్షణ, శిష్టరక్షణకై అవతరించిన అవతారములవలె గాక దుష్టులనూ, శిష్టులనూ అందరినీ తన శిశువులను జేసి సన్మార్గవర్తనులై దివ్యోన్ముఖులగునట్లు శిక్షణనిస్తున్నట్లనిపిస్తుంది. అందరికీ దివ్య తత్త్వాన్ని, మాతృ తత్త్వాన్ని ఉగ్గుపాలుగా పోసి పోషిస్తున్నదనిపిస్తుంది. అంటే మానవత్వానికీ దివ్యత్వానికీ ఉన్న అడ్డుతెరను తొలగిస్తున్నట్లనిపిస్తున్నది. జగత్తునే తన ఒడిగా, ఊయలగా జేసి మానవులనే గాక పశు పక్ష్యాదులనూ, ఆఖరుకు క్రిమి కీటకాదులనూ, తన దివ్య ప్రేమతో లాలించి, పాలించి, క్రీడించి, ఉద్ధరించే - ఇంతకు ముందెవరూ, ఎప్పుడూ కనని మాతృ అవతారంగా అమ్మ అనిపిస్తున్నది. అందుకే మానవాళికెన్నో వరాలిచ్చిన అమ్మగా కాక మానవాళికి అమ్మే ఒక వరమని నాకనిపిస్తున్నది.

వివేకానందుల వారేమంటారంటే What we want is to see the man who is harmoniously developed great in heart, great in mind, great in deed. We want the man whose heart feels intensely the miseries and sorrows of the world. And we want the man who not only can feel but can find the meaning of

things, who delves deeply into the heart of nature and understanding. We want the man who will not even stop there but who wants to workout the feeling and meaning by actual deeds. Such a combination of head, heart, and hand is what we want. There are many teachers in this world, but you will find that most of them are one-sided. One sees the glorious midday sun of intellect and sees nothing else. Another hears the beautiful music of love and can hear nothing else. Another is immersed in activity and has neither time to feel nor to think. Why not have the giant who is equally active, equally knowing, equally loving? Is it impossible? Certainly not. This is the man of the future of whom there are only a few at present. The number of such has to increase until the whole world is humanised. ఇలాంటి లక్షణాలు గలిగి దేహధారణజేసి జిల్లెళ్ళమూడి అమ్మగా మన సమకాలీనురాలిగా మనమధ్యే తిరుగాడి భవిష్యత్తరాలకోసం పరిణామ క్రమంలో పురోభివృద్ధికై దిక్సూచిగా నిలచి మనల్ని నడిపించిన, యింకా నడిపిస్తున్న అమ్మ దివ్యచరణాలకు శతకోటి వందనాలు సమర్పిస్తున్నాను.

సమస్త ధర్మముల యందును, మతములందును, సిద్ధాంతములయందును స్వప్రకాశముతో వెలుగొందునదీ, ఆయా జీవుల అభీష్టములను బట్టి, అభిరుచులను బట్టి, వా రనుసరించు మార్గములను బట్టి భిన్న భిన్న తత్వములతో తోచునది అమ్మే. సర్వ స్వతంత్రమైనదీ, సాధ్యాసాధ్యములు లేనిదీ గనుక నిర్దిష్టమైన విధానమనునది లేనిదే అమ్మ. సమస్త దేవీ దేవతా స్వరూపములలోనూ అంతర్నిహితముగా జాజ్వల్యమానంగా ప్రకాశించునదీ, ఆయా స్వరూపముల ద్వారా పూజలను, స్తోత్రములను అందుకొని అందరినీ అనుగ్రహించేదీ అమ్మే. సాధకుని బహిర్యాగము ద్వారానైననూ, అంతర్యాగము ద్వారానైననూ అనుగ్రహించేది అమ్మే. వేదములో చెప్పబడిన సత్యజ్ఞానానంత బ్రహ్మ స్వరూపము అమ్మే. నాస్తికునకు దేవుడు లేడని ప్రబోధించునదీ, ఆస్తికునకు దేవుడున్నాడని

హెచ్చరిక చేయునదీ అమ్మే. సమస్త గురు స్వరూపమునూ, మాతృ స్వరూపమునూ, రూపాతీతయునూ అమ్మే. వినిర్మల భక్తితో తనను ఆరాధించే వారికి, సర్వభారములు తనపై వేసి సర్వస్య శరణాగతి పొందినవారి యోగక్షేమాలతోపాటు అందరినీ, అన్నిటినీ కనిపెట్టి యుండునది అమ్మే.

నిరాకారియైన అమ్మ నరాకారముదాల్చి మనముందుకు వచ్చుట నిర్గుణయైన అమ్మ సగుణగాతోచుట, పరిమితులు, అవధులులేని అమ్మ పరిమితులు, అవధులతో యున్నట్లు మనకనుభవమగుట ఎంతో వింతను గొలుపు విషయము. సర్వశక్తులూ అమ్మకధీనమై ఉన్నవి. ఈ అనంతకోటి బ్రహ్మాండములందలి ప్రతి అణువులోనూ ఉన్నది అమ్మే. అణువులను కలిపియుంచి సృష్టికి మూలమయ్యే సంకల్ప స్వరూపమూ, సర్వాన్నీ పోషించే స్థితి స్వరూపమూ, అణువణువునూ విడగొట్టి నూతన సృష్టిరచనకు రంగము సిద్ధము చేసే ప్రళయకాల లయ స్వరూపమూ అమ్మే. ఇది జ్ఞానమని, ఇది అజ్ఞానమని మనకు బోధచేయుచూ సర్వజీవులనూ అనేక విధముల మాయలలో పడద్రోసి వినోదించుచూ, ఆర్తితో పిలిచినప్పుడు సహస్రబాహువులతో మనల్ని ఆదుకొని సంరక్షించే అనాది తత్త్వమే అమ్మ. అన్ని జీవులలోనూ 'నేను' 'నేను' అని తోచుచున్న అసలుసిసలైన 'నేను' యే అమ్మ. అటువంటి అమ్మతో సర్వశక్తిమత్త్వము, సర్వజ్ఞత్వము, సర్వాంతర్యామిత్వము లేకున్న యెడల మనము ఆశ్చర్యపోవాలే గాని, అవి వ్యక్తమై అనుభవము నిచ్చుచున్నప్పుడు మనము ఆశ్చర్యపోవలసినది ఏమున్నది?

'పూర్వ తత్త్వవేత్తలకంటె జిల్లెళ్ళమూడి అమ్మ ప్రత్యేకత ఏమిటి?' అన్న శీర్షికతో "విశ్వజనని" మాస పత్రిక ఏప్రిల్ 2012 సంచికలో శ్రీ పీ. ఎస్. ఆర్ ఆంజనేయ ప్రసాద్ అన్నయ్యగారు వ్రాసిన సంపాదకీయ వ్యాసాన్ని చదివినచో అమ్మ తత్త్వము మనకు చాలా వరకు అవగతము కాగలదని భావిస్తున్నాను.

52. అమ్మకు నా ప్రార్థనలు

అమ్మా! 'అన్ని నేనులూ నేనైన నేను' అన్న నీవు నీవేనేనని నేనేనీవని, ఆ 'అన్ని నేనుల'లో నేనూ ఒకడినేనన్న ఎరుకను నాకెందుకు ప్రసాదించవు? నీ నిత్యస్మరణలో నీ సన్నిధిలో ఒక్కొక్కసారి శాంత్యానందములు మమ్మల్నావరించినప్పుడు నీవు మాకు తెలిసినట్లే ఉంటావు, అనుభూతమైనట్లే ఉంటావు. మళ్లీ అంతలోనే తెరవేస్తావు. 'మరుగే నా విధానము'ని నీవు ప్రకటించింది యిందుకేనా? ఏదియేమైనా నిరంతరమూ నీ ధ్యాసయందే, నీ చింతనయందే, నీ చేతనయందే మేము పురోగమించునట్లు, నీ దివ్యచరణాలనే అంటిపెట్టుకొని యుండునట్లు మమ్మల్ననుగ్రహించమ్మా!

ఒక్కొక్కసారి అకారణంగానే అనుగ్రహిస్తావు. చిన్న చిన్న ప్రయత్నాలకే పెద్ద పెద్ద ఫలితాలననుగ్రహిస్తావు. సాధ్యమైనదే సాధనయని నిరూపిస్తావు. మరొక్కొక్కసారి ఎంత ప్రయత్నించినా ఒక్క అడుగైనా ముందుకు పడినట్లుండదు, ఫలితమున్నట్లు కనబడదు. ఇక అసాధ్యమని తోస్తున్నప్పుడు "చేతలు చేతుల్లో లేవు" అంటావు. 'నీవనుకుంటేనే మేము నిన్ను తలవడమైనా, ఏదైనా చేయగలగడమైనా' అంటావు. కర్తృత్వము మాది కానప్పుడు, మేము ఉపకరణ మాత్రులమై యున్నప్పుడు ఆ ఎరుకను మా కెందుకు ప్రసాదించవు? మా అహంకారాన్ని, అజ్ఞానాన్ని ఎందుకు తొలగించవు? గట్టిగా ప్రశ్నిస్తే దేనికైనా తరుణ మంటావు. కానీ ఆ తరుణ మెప్పుడో అవగతము కానీయవు. అయితే 'అందరికీ సుగతే' నన్న అభయమిస్తావు. నీ కృప సదా మాపై ఉందంటావు. అందుకే అమ్మా! నీ అపార కృపా కటాక్షాల వల్ల విశ్వశాంతి నెలకొనునుగాక! నిరంతరమూ పురోగమించే నీ దివ్య ప్రేమ సామ్రాజ్యము పృథ్విపై నెలకొనునుగాక! మానవులంతా సర్వదుఃఖోప శమనులై, చైతన్యవంతులై దివ్యశాంత్యా నందములు పొంది దివ్య జీవనాన్ని జీవింతురుగాక!

దివ్యమూ, శాశ్వతమూ, ప్రభావవంతమూ, సత్య చైతన్య రూపవూనైయున్న అమ్మా! నీ దివ్య చరణాల చెంత వినమ్ర భక్తితో మోకరిల్లుచున్నాను. నన్ను నేనర్పించుకుంటున్నాను. నా సమర్పణ సమగ్రమూ, ప్రభావవంతమూనై యుండునట్లను గ్రహింపుము!

అమ్మా! ప్రతిదాని యందూ, ప్రతి యొక్కరి యందూ దాగియున్న నీ దివ్య ప్రేమ సౌందర్యములు ప్రకటితములై ఘనమైన జ్ఞానంగా రూపాంతరం చెందాలనీ, యీ పృథ్వీతలము ఆనందమయ శాంతిధామంగా రూపుదిద్దబడాలనీ ఆకాంక్షిస్తున్నాను. ప్రతియొక్కరూ నీ దివ్యప్రేరణచే దివ్యత్వం వైపుకే పయనింతురుగాక!

అమ్మా! చరాచరజగత్తూ, సర్వలోకాలూ నీ పాదాల చెంతే పరిభ్రమిస్తున్నట్లనిపిస్తున్నవి. దేవీ దేవతలంతా నీ పాదరజముగా తోస్తున్నారు. మేమంతా నీ వాడించే బొమ్మలవలె యున్నాము. ఇదంతా నీ దివ్యకేళిగా అనిపిస్తున్నది. అట్టి నీపాదాల చెంత మమ్ము మేమర్పించుకొను చున్నాము. మా సమర్పణ దృఢ విశ్వాసముతో కూడినదీ, ఏ దాపరికములూ లేనిదై, సమగ్రమైనదై, ఆనందకరమైనదై యుండేటట్లు అనుగ్రహించుము! నీ దివ్యకేళిలో ఎరుక గలిగినవారమై మా పాత్రలను మేము సమగ్రంగా పోషించగలిగేటట్లు అనుగ్రహించుము.

అమ్మా! అచల, నిరాకార, నిర్గుణ బ్రహ్మగా యుండే నీలో శాశ్వతంగా ఏకంకావాలనిగానీ, మోక్షాన్నో లేక ముక్తినో ప్రసాదించమని గానీ నేను నిన్ను కోరుకోవడం లేదు. అలాగే స్వర్గలోకప్రాప్తినో, శాశ్వతపరలోకవాసాన్నో నేను కోరుకోవడం లేదు. ఐతే జిల్లెళ్ళమూడిలో నిన్ను భౌతికంగా దర్శించినట్లుగానే భౌతిక, ప్రాణిక, మానసిక భూమికలన్నిటి యందూ, అంతటా, అందరి యందూ నిరంతరం నిన్నే దర్శించనీ. నా వ్యక్తిగత చేతనయందూ, విశ్వగతచేతనయందూ, విశ్వాతీత చేతన యందు సహితము సర్వానికాధారమై సర్వాన్నీ నడిపిస్తున్న నీతో ఏకత్వాన్ని భజించనీ. ఏకకాలంలో విశ్వాతీత స్థాయిలో నీ అచల ఏకత్వము లేక సత్యము లేక జ్ఞానము యొక్క

దివ్యానందాన్ని పొందుతూనే, అలాగే విశ్వగత స్థాయిలో జీవలందరి యందలి అనంతగుణముల, దృక్పథాల యందలి ప్రేమానందములతో నిన్ను సర్వదా భజిస్తూనే, వ్యక్తిగత స్థాయిలో వ్యక్తికి వ్యక్తికి మధ్య జనించే ప్రేమగా నీతో మానవ సంబంధాల్లో ప్రవేశించగలగనీ.

పరిపూర్ణ ఏకము, దివ్యప్రేమ, పరమజ్ఞాన స్వరూపవైన అమ్మా! నాలోని నేనన్నది అంతరించి కేవలం నీ ఉపకరణ మాత్రంగా నన్నుండి పోనీయమని, నేను మరింకేమీ కాకుండా నీవు మాత్రమే అయ్యేటట్లు, నీ దివ్య ప్రేమకు ఒక వాహికగా ఉండిపోయేటట్లు అనుగ్రహించమని వేడుకుంటున్నాను. నాచేతన నీచేతనతో ఒకటి కాగా ఎరుక గలిగిన యొక దివ్యోపకరణంగా నన్ను నీ సేవకే అంకితమొనర్చుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాను. అమ్మా! నీ దివ్య పరిపాలనా శక్తి వ్యక్తమై, నీ యీ శిశువు పూర్తిగా నీ సేవకే అంకితమై, నీవు సంకల్పించిన దివ్యకార్యము నెరవేరునట్లు అనుగ్రహింపుము.

ఏకైకసత్యము మరియు ప్రేమమూర్తివైన అమ్మా! నీతో, నీవు సంకల్పించిన దివ్య కార్యముతో తాదాత్మ్యత చెందడానికీ :, ఇక ఏమాత్రము పరిమిత వ్యక్తిత్వముగా ఉండకుండుటకూ :, ఏకబిందువు ద్వారా వ్యక్తమయ్యే నీ శక్తుల అనంతత్వంకావడానికీ :, అన్ని బంధములు, పరిమితుల నుండి స్వేచ్ఛను పొందడానికీ :, బంధకారకమయ్యే ఆలోచనా పరిధిని అధిగమించడానికీ :, ఏ పనిలోనైనా చిక్కుకొనక దాని వెలుపలి నుండే పనిచేయడానికీ :, ఏకత్వాన్ని, నీ దివ్యప్రేమ, జ్ఞానాలను భజిస్తూనే వ్యక్తులతో లేక వ్యక్తులకొరకు పని చేయడానికీ, నాలోని చీకట్లను సమూలంగా తొలగించి నన్ను నీ సేవకై, ఈ ప్రపంచంలో నీ దివ్యావతరణకై ఒక ఉపకరణంగా ఉపయోగించుకొనుటయేగాక ప్రతిదాని యందూ, ప్రతిచోటా నీ పరమ చైతన్యమే మేల్కొంచి పనిచేయునట్లనుగ్రహించుము.

క్షణక్షణమూ మారే ఆకృతుల నింకెంతమాత్రమూ చూడక కేవలం నీ శాశ్వత ఏకత్వాన్ని ప్రతిదానియందు, ప్రతిచోట దర్శించగలగనీ, నీ కోసం నిరంతమూ పరితపించే నా హృదయానికి జవాబుగా నా సమగ్రచేతనయందు నీతో ఏకత్వాన్ని భజించనీ, ఎందుకంటే నిజానికి నీవేనేను, నేనే నీవు గనుక.

ప్రేమమయి అమ్మా! నన్ను కేవలం నీ నిజమైన బిడ్డగా ప్రేమమూర్తిగా రూపొందనీ. ప్రతి యొక్కరి యందూ నీ దివ్య ప్రేమ మేల్కాంచి, శక్తివంతమై, విజయవంతమగును గాక!

మధుమయిమాతా! నీ అనంత ప్రేమపూరితమైన వెలుగులు భూమినంతా చుట్టుముట్టి, ప్రతి యొక్కరి హృదయంలోనూ ప్రవేశించి చీకట్లను పారద్రోలి, జీవితం పట్ల ఆశ, శాంతి, ప్రేమల నీ సందేశమే ప్రతి యొక్కరికీ వినబడనీ. తల్లిగా ప్రతియొక్కరి యందలి చీకటిని, కల్మషాన్ని తొలగించి, అన్ని బంధాలనూ తొలగించి నీ వైపే అడుగులు వేయునట్లు అనుగ్రహించుము. ఆ విధంగా యీ ధరణినే ఉద్ధరించుము.

అమ్మా! అల్పుడనైన నేను చేసే యీ ప్రార్థనలకు తగిన బలం లేదనీ, నా ఆకాంక్ష యింకా యింకా బలపడాలనీ నాకు తెలుసు. అలాగే యిప్పుడిప్పుడే తప్పటడుగుటువేసే పసి బాలుని వలె నన్ను చూచి నీవు మందహాసం చేస్తున్నావనీ తెలుసు. ఐతే నీవు నాకు ప్రసాదించిన దృఢమైన విశ్వాసమే నన్ను తప్పక విజయతీరాలకు చేర్చగలదని విశ్వసిస్తున్నాను.

అమ్మా! నీ దివ్య ప్రేమానందములే సర్వదా మా ద్వారా అభివ్యక్తీకరించబడనీ, నీ దివ్య శక్త్యవతరణం ద్వారా ప్రతిదీ రూపాంతం చెంది నీ ఇచ్ఛయే నెరవేర్చబడనీ. ఈ ప్రపంచం నుండి ఆకలిదప్పులు, నిరాశా, నిస్పృహలు, రోగబాధలూ శాశ్వతంగా కనుమరుగై ఇదొక ఆనంద దివ్యధామంగా వెలుగొందనీ. మానవులందరి యందూ దివ్య చేతనా స్థాయి పెరిగి, తరుగని దివ్య సంపదతో, సౌందర్య సమన్వయాలతో సమగ్ర జ్ఞానశక్తులతో నిరంతరమూ అభివృద్ధిపథాన పయనించనీ. 'అమృతస్య పుత్రాః' అన్న వేదవాక్కు నీ బిడ్డలమైన మాయందు నిరూపింపబడనీ.

అమ్మా! నీ దివ్య సూక్తులు బోధనలను సరిగా అర్థము చేసుకొని అనుసరించగలిగేటట్లు, మేము వాటి దివ్యమైన వెలుగులో నిరంతరమూ పురోగమించునట్లు, మేము దివ్యోపకరణములుగా మారి పృథ్వియందు నీ దివ్య సంకల్పాన్ని నెరవేర్చునట్లు అనుగ్రహించుము. మా ఆలోచనలు, మా

19)

మాటలు, మా చేతల వెనుక నీవే యుండి నడిపించడమేగాక జీవితంలో జరిగే ప్రతి సంఘటన, ప్రతి సన్నివేశం, ప్రతి మలుపునందు నీవే మార్గదర్శివై దివ్య పథాన మమ్ము నడిపించుము.

అమ్మా! నీ దివ్య శాసనం, దివ్య ప్రేరణల ఎరుక మాకు కలిగి దానినే ప్రతి విషయంలోనూ మేము అనుసరించెదము గాక! అప్రతిహతంగా నీ దివ్య ప్రేమ మా యందుండడమే గాక సర్వత్రా అది మా ద్వారా ప్రకటితమగు గాక! నీ దివ్య ప్రేమ సామ్రాజ్యంలో, బహుముఖమైన నీ దివ్య సృష్టిలో నీ బిడ్డలుగా మేము పాలుపంచుకొందుముగాక!

అమ్మా! మా కల్మషములు, అపరిపక్వతలు, కష్టాలు, బలహీనతలు మాకు తెలుసు. అలాగే మా అజ్ఞానము కూడా మాకు విదితమే. నీ కృపా కటాక్షాలవల్ల నీ చరణాల నాశ్రయించి నీ యందు పరిపూర్ణ విశ్వాసంతో, భక్తితో మేము మోకరిల్లుచున్నాము. మాయందు, మా ద్వారా నీ దివ్య కార్యమే నెరవేరునుగాక! మానవులందరూ ఆకలిదప్పులను, అరిషడ్వర్గములను జయింతురుగాక! సర్వత్రా శాంత్యానందములు నెలకొనునుగాక!

అమ్మా! జిల్లెళ్ళమూడి కేంద్రంగా నీ దివ్య ప్రేమయందే మేము జీవిస్తూ దానిని ప్రభావయుతంగా విశ్వమంతా వ్యాపింపజేసి దాని వెలుగులో, సంస్పర్శలో అందరూ బాధా విముక్తులై, నీయందే పూర్ణ, దృఢ శాంతి విశ్వాసాలను గలిగి చెదిరిపోని శాశ్వత ఆనందాన్ని పొందగలగాలనే మా ఆకాంక్ష నెరవేరున ట్లనుగ్రహించుము. మా యందు ప్రత్యణువూ నీ దివ్య శక్త్యానందపూరితమై నీవు సంకల్పించిన దివ్య కార్యాన్ని నెరవేర్చడానికి ఉద్యుక్తమైయుండునట్లను గ్రహించుము. నీ దివ్య చైతన్యంలో, ప్రకాశంలో నిరంతరాయంగా మేము సర్వదా పురోగమింతుముగాక! విశ్వమనే నీ ఒడిలోనే ఆనందంతో, కేరింతలతో క్రీడించే దివ్య శిశువులమై యుందుము గాక!

అమ్మా! ఇప్పటి వరకూ మానవాళి నుద్ధరించడానికి పుట్టిన తపస్వులనూ, మునులనూ, రాజర్షులనూ, బ్రహ్మర్షులనూ, విభూతులనూ అవధూతలనూ చూశాము. దుష్టశిక్షణ, శిష్టరక్షణకై, ధర్మ పరిరక్షణకై

అవతరించిన అవతారమూర్తులను చూశాము. ఐతే సర్వజీవులనూ తపస్వులనూ, మునులనూ, ఋషులనూ, విభూతులనూ, అవతారమూర్తులనూ, ఆఖరుకు దేవీ దేవతలను గూడా ఉద్ధరించడానికి వారినందరినీ తన దివ్యచరణాల చెంత పసి బిడ్డలుగా క్రీడింపజేసే మాతృ అవతారాన్ని / రూపాన్ని నిన్ను దప్ప మేము చూడలేదు, చూడబోము. అలాగే దుష్టులను రూపుమాపడంగాక వారిలోని దుష్టత్వాన్ని రూపుమాపే మాతృరూపాన్ని నిన్ను దప్ప మరెవరినీ మేము కనలేదు. మానవుల మనసు పొరల్లో, హృదయాలలో, అంతరంగాల్లో దాగియున్న కల్మషాన్ని కూకటి వేళ్ళతో సహా తొలగించి వారిని దివ్య ప్రేమమూర్తులుగా రూపాంతరమొందించిన దివ్య మాతృ స్వరూపాన్ని ఎవ్వరూ యిప్పటి వరకూ నిన్నుదప్ప చూచియుండలేదు. అపరిమితమైన దివ్య శక్తి స్వరూపవైన నీవు మానవులనుద్ధరించడానికి ఒక కాలపరిమితిలో మానవాకృతిని దాల్చిన సమయంలో సమకాలీనులుగా వసించగలగడం, నీ దివ్య చరణాల నాశ్రయించగలగడం కేవలం నీ అపార, అవ్యాజ, అకారణ కృపా కటాక్షాల వల్లనే, నీ సంకల్పం వల్లనే. మా విశ్వాసమెప్పుడూ చెదరక సంపూర్ణంగా మమ్ము మేము నీ దివ్య చరణాలకు అర్పించుకొను పర్యంతమూ మమ్ము కాపాడి రక్షించుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాము.



53. వచన కవితలు.

1. ఎవరీ అమ్మ?

అమ్మ! అమ్మ! అమ్మ!
ఎవరీ అమ్మ?
మన అమ్మ, అమ్మమ్మ
అమ్మలగన్నయమ్మ
అందరికీ అమ్మ, అలివేలుమంగమ్మ
అందరికీ అన్నమొసగెడు అన్నపూర్ణమ్మ
మనఅమ్మ, జిల్లెళ్ళమూడమ్మ!

ఆదిశక్తి అమ్మ
పార్వతి మన అమ్మ
పరమపావని అమ్మ
పసిబిడ్డల మనలబ్రోచు అమ్మ
మన అమ్మ జిల్లెళ్ళమూడమ్మ!

అన్నిటికీ అమ్మ
అందరికీ అమ్మ
అంతుబట్టని అమ్మ
మనల నాదరించెడి అమ్మ
మనఅమ్మ జిల్లెళ్ళమూడమ్మ!

అన్నీ తానైన అమ్మ
అన్నినేనులూ నేనైన నేనన్న అమ్మ
పరాత్పరి అమ్మ
ఆ పరమేశ్వరునకే అమ్మ
మన అమ్మ జిల్లెళ్ళమూడమ్మ!

ప్రేమహృదయ అమ్మ
పుడమికే అమ్మ
పిలిచిన పలికెడు అమ్మ
ప్రియముల నొసగెడు అమ్మ
ప్రియమైన అమ్మ
మనఅమ్మ జిల్లెళ్ళమూడమ్మ!

2. స్వగతం

చంచలమది నా మనసు
పరుగులు తీస్తున్నది నా వయసు
నా మనసు నేకాగ్ర మొనరించి
దయతో నిలుపుము నీ పాదద్వయంబుకడ
అమ్మ! భవాని! రాజరాజేశ్వరీ!
కామహారిణివట నాకు మోక్షము నొసగుము
భద్రకాళివట నాకు భద్రత నొసగుము

చిద్రూపిణివట నా చింతల బాపుము
మహేశ్వరివట నీ మహిమజూపి
అమ్మ! భవాని! రాజరాజేశ్వరీ!
అమ్మా! నే నాశా మోహ పీడితుండ
చపలచిత్తుడ ఛండాలుండ
నిక్కముగ నీబిడ్డనే యైన
దయగని నాపైన
అరిషడ్వర్గముల నరికట్టి
సమచిత్తుడను జేసి
నీ పాదద్వయంబు కడ
సర్వసమర్పణం బొనరిపంగ రావె

అమ్మ! భవాని! రాజరాజేశ్వరీ!
దుష్టచిత్తుడనేను
దుర్మార్గుడనేను
దురితములెన్నొ జేసితి లోగడ
దుర్గవై నా దురితముల బాపుమమ్మ
దుర్మార్గంబుల బారద్రోలుము
దుందుభులు మ్రోగించి దయతోడ
అమ్మ! భవాని! రాజరాజేశ్వరీ!

3.అమ్మా!

అతిమానసావతారిణివి అమ్మయై వెలసినావు
ఆద్యంతములులేని నీవు అన్నిటికీ ఆధారమైనావు
ఆనందమయివి నీవు చైతన్యమయివి
సత్యమయివినీవు పరమేశ్వరివి
ఆదిశంకరునకే అమ్మవు నీవు
అఖిల లోకాల నుద్ధరించెడి ఆదిపరాశక్తివి నీవు
నీదు చరణద్వయంబు శరణుజొచ్చితి సర్వసమర్పణం బొనర్పగ దలచితి
నాదు మనః ప్రాణశరీరంబుల రూపాంతరమొనరింపగ రావె
అర్కపురవాసివై అతిమానస వెలుగులనందిస్తున్న అమ్మ!
నా అమ్మ! జిల్లెల్లమూడమ్మ!

4. House of All

There is the House of All
There the sons of the Mother we are all
That is the place of hope for the despaired
That is the place of peace for the distrubed
It is there where one gets real manhood
It is there where we feel universal brotherhood

That is the place where we see Motherhood
That is the place where we feel Motherhood
That is the highest of the high we ever achieved
It is there where we lose our small selves
It is there where we feel oneness of our souls
It is there where individual soul unites with
the Universal Soul
And it becomes para Brahman
It is the place where 'Om' starts
And it is the place where everything lasts.

5. రావేలనమ్మా!

నాతప్పుల మన్నించి
నన్నేలుకొన రావేలనమ్మా!
నాఅంతరంగమందు అలరారు తల్లి
అనసూయమ్మా! నన్నాదుకొన రావేలనమ్మా!
అమ్మా! నీ నామ మెంతొ మధురమని మది తలచితి
నీ మహిమజూపి నన్నేలుకొన రావేలనమ్మా!
అమ్మా! రాజరాజేశ్వరి! కారుణ్యమూర్తి!
నీ బిడ్డను నను కాపాడ వేగరావేలనమ్మా!
అమ్మా! నీవే దిక్కని నీపదముల నాశ్రయించితిని
నను రక్షింపగ వేగమెకదలిరావేలనమ్మా!

6. నమ్మవే ఓమనసా!

నమ్మినయది సొమ్ము నమ్మని వారికది దుమ్ము
నమ్మినవారినది చేయదెన్నడూ వమ్ము
నమ్మకమువీడక కదలి రారమ్మా!

శ్రీఅనసూయ వీక్షణమాత్రమ్మున
శ్రీపదప్రాప్తి పొందగలమీ వసుధలోన
శ్రీహరివారె, శ్రీశివుడు వారె
శ్రీబ్రహ్మము వారె యని తలవవే మనసా!
మానవచేతన మనది
కలుషితమైయున్నదిప్పుడది
దివ్యచేతనగా రూపాంతరమొందగలదది
దివ్యమాత దరిజేరి సర్వసమర్పణ జేయగ మనసా!
దివ్యైశ్వర్యంబులొసగ దివ్యమాత యున్నదిచ్చట
దిక్కుతోచక అలమటించెదవేల మనసా?
అడుగిడిన నీ వొకయడుగు దివ్యమాతవైపు
పరుగునవచ్చు నిను రక్షింప శ్రీఅనసూయమాత
వెర్రితలపుల విడిచిపెట్టి
హృదయంబున సంశయంబునొదిలి
అమ్మదరిజేరిన నిజముగ
నీవు దివ్యబాలుడవు గావె నిక్కముగ మనసా!

7. జీవితాశయం

జీవితమది యెంతొ విలువైనది
ఏమిచేయుదు నేమి చేయుదునని
జీవితాంతంబున చింతించిన నేమి ప్రయోజనము
చేసిన కలుగు నెంతొమేలు అమ్మ(దైవ) చింతనిపుడె
మానవుడిచ్చెడిది నిలువదు
దేవుడిచ్చెడిది తరుగనిధనమని చెప్పెనొక మహనీయుడు
మానవుడిచ్చెడిది ధనమైన
దేవుడిచ్చెడిది తరుగని ఆత్మధనము

నమ్ముము అమ్మను దైవముగ
ఇవ్వగలదు ఐశ్వర్యంబెంతయొ
తరుగని ధనమది
తన్వయత్వమొందగ దివ్యానందంబునన్
మనకులేదె విశ్వాసమనుచు విచారింపనేల
కోరికలవీడి కోరుము విశ్వాసముకొరకై
పిలిచిన పలికెడు అమ్మ అన్నీ తానైన అమ్మ
పిలుపుతోడనె రాదె మన హృదయ పీఠమ్ముపైకి
వదలకుమెన్నడు పట్టినపట్టు
మర్కట కిశోరన్యాయమ్ముపోలె
వదలదెన్నడు అమ్మ మనను కడవరకు
మార్జాల కిశోర న్యాయమ్ముపోలె.
జాగు చేయకు మెచ్చుట జాగరూకూడవై
సంపదలలోన సంకటములలోన సంసార సంద్రమ్మున
వేచియున్న దచ్చట అమ్మ నీ కొరకై
దివ్యైశ్వర్యంబులొసగ దివ్యసదనంబులోన

8. మాఅమ్మ జిల్లెళ్ళమూడిఅమ్మ

ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డల
మురిపెంపుతోడ ముద్దులిడు అమ్మ
మా అమ్మ! జిల్లెళ్ళమూడి అమ్మ!
అందరి కడ్డులేనిది అంతులేనిది
అన్నిటికాధారమైనది అమ్మ
మాఅమ్మ! జిల్లెళ్ళమూడి అమ్మ!
మంచిచెడ్డలులేక మానవులకెల్ల
తన ఒడిలో చోటిచ్చి లాలించు అమ్మ
మాఅమ్మ! జిల్లెళ్ళమూడి అమ్మ!

చరాచరభేదమెరుగని అమ్మ
గుణభేదమేలేదను అమ్మ
మాఅమ్మ! జిల్లెళ్ళమూడి అమ్మ!
త్రిలోకజనని త్రిపురసుందరి
త్రిలోకములనేలెడు అమ్మ
మాఅమ్మ ! జిల్లెళ్ళమూడి అమ్మ!
అందఱినాదుకొను అనురాగమూర్తి
అడగకనే యిచ్చును సకల సంపదలను
మాఅమ్మ! జిల్లెళ్ళమూడి అమ్మ!
అమ్మలేని వారెవరూ లేరీ జగమున
అందరమ్మలనూ గన్నయమ్మ
మాఅమ్మ! జిల్లెళ్ళమూడి అమ్మ!
'సర్వసమ్మతమైనదే సూక్తి'యన్న అమ్మ
సూక్తినే నిర్వచించిన అమ్మ
మాఅమ్మ! జిల్లెళ్ళమూడి అమ్మ!
విశ్వజననిగాదు విశ్వమే జననియన్న అమ్మ!
జగన్నాటక సూత్రధారియైన అమ్మ
మాఅమ్మ! జిల్లెళ్ళమూడి అమ్మ!
'అన్నినేములూ నేనైన నేను' అన్న అమ్మ
అన్ని నేములలోనూ ఉన్న అమ్మ
మాఅమ్మ! జిల్లెళ్ళమూడి అమ్మ!
అవతారమూర్తులకే అమ్మయైన అమ్మ
ప్రేమ స్వరూపమే తానైన అమ్మ
మాఅమ్మ! జిల్లెళ్ళమూడిఅమ్మ!



రచయిత బెల్లంకొండ దినకర్, భార్య సరోజిని,
కొడుకు ప్రేమచంద్, కూతురు అర్చనలతో..



బెల్లంకొండ దినకర్

(B.Sc, M.A (Social work) &

Sahitya Ratna (Hindi)

పుట్టినతేది	:	07.06.1950
తండ్రి పేరు	:	కీ.శే .శ్రీ బెల్లం కొండ వెంకటరంగయ్య, హిందీ పండితులు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ప్రకాశం జిల్లాలో జిల్లాస్థాయి కమ్యూనిస్టు నాయకులు, తురిమెళ్ల గ్రామ మాజీ సర్పంచి.
తల్లి	:	శ్రీమతి యశోదమ్మ
వృత్తి	:	BSNL చీఫ్ జనరల్ మేనేజర్ కార్యాలయము, హైదరాబాద్ నందు సేవా నివృత్తులైన అసిస్టెంట్ డైకర్టర్ (రాజ భాష)
ప్రవృత్తి	:	పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాలు పంచుకోవడం, ప్రముఖుల సాహిత్య చర్చలకు హాజరు కావడం, తెలుగు మరియు హిందీ భాషాభివృద్ధికి తోడ్పడడం.
అనుబంధం	:	శ్రీ అరవింద కేంద్రము, గుంటూరు (దాదాపు 40 సంవత్సరములు) ప్రస్తుతం శ్రీ అరవింద కేంద్రము, ముషీరాబాద్, హైదరాబాద్
ఆకాంక్ష	:	అమ్మకు నిజమైన శిశువుగా రూపొందాలని, నిరంతరం జిల్లెళ్ళమూడికి వచ్చే సోదరీ సోదరులతో కాలాన్ని సద్వినియోగ పరచుకోవాలని.
ఇంటి అడ్రసు	:	Flat No : 201, Lakshmi vilas Apartment, Plot no : 512, Defence colony Sainikpuri (Post), Secunderabad - 500094